అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

www.navatelangana.com

సోమవారం 18-9-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 259

Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar

14 పేజీలు వెల : 6.50



ఆసియా చాంప్ భారత్


- ఫైనల్లో శ్రీలంకపై ఏకపక్ష విజయం
- 6 వికెట్లతో విజృంభించిన మహ్మద్ సిరాజ్

ఆటలు వివరాలు

వినాయక చవితి శుభాకాంక్షలు

పాఠకులు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు నవతెలంగాణ శుభాకాంక్షలు. పండుగ సందర్భంగా సోమవారం పత్రికకు సెలవు మంగళవారం సంచిక వెలువడదు. పునర్ దర్శనం బుధవారం

చీఫ్ జనరల్ మేనేజర్
నవతెలంగాణ



బీజేపీ బీఆర్ఎస్ ఎంఐఎం ఈ మూడూ ఒక్కటే..

ప్రతి సందర్భంలోనూ కమలానికి మద్దతుగా నిలిచిన గులాబీ

- పార్లమెంటులోనూ బీఆర్ఎస్ ఎంపీల వైఖరిని గమనించాను
- బీజేపీతో పోరాటానికి ప్రతి రాష్ట్రంలో ఎంఐఎం ఆటంకమే
- ప్రజల సొమ్మును దోచుకున్న కల్వకుంట్ల కుటుంబం
- హామీ ఇస్తే కచ్చితంగా అమలు చేసే పార్టీ కాంగ్రెస్ : కాంగ్రెస్ విజయభేరీ సభలో ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు బయటికే వేర్వేరు. లోపల అవి ఒక్కటే. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పోరాడుతున్నది ఒక్క బీఆర్ఎస్ తోనే కాదు. ఆ మూడు పార్టీలతో...' అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. మాటలకే ఈ పార్టీలు వేర్వేరని ఆయన విమర్శించారు. పార్లమెంటులో బీఆర్ఎస్ ఎంపీల వైఖరిని చూశానని వివరించారు. ప్రధాని మోడీ సైగ చేస్తే చాలు వెంటనే వారు బీజేపీకి మద్దతు ప్రకటిస్తుంటారని ఎద్దేవా చేశారు. గతంలో మోడీ సైగ చేయగానే రైతు వ్యతిరేక నల్ల చట్టాలకు, ...13లో





తుక్కుగూడ సభలో అభివాదం చేస్తున్న సోనియా గాంధీ, రాహుల్ ..

6 గ్యారంటీస్

మహాలక్ష్మి పథకం...

- మహిళలకు ప్రతీ నెలా రూ.2,500
- పేద మహిళలకు కేవలం రూ.500కే వంట గ్యాస్ సిలిండర్
- ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం

రైతు భరోసా...

- ప్రతిఏటా రైతులతో సహా కౌలు రైతుకు రూ.15 వేల ఆర్థిక సాయం
- వ్యవసాయ కూలీలు, భూమిలేని నిరుపేదలకు ఏడాదికి రూ.12 వేలు
- వరికి మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్

ఇందిరమ్మ ఇండ్ల పథకం

- ఇల్లు లేని వారికి ఇంటి స్థలంతో పాటు నిర్మాణానికి రూ.5 లక్షల సాయం
- తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం

గృహజ్యోతి పథకం

- పేదల ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్

చేయూత పథకం

- రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల ఆరోగ్య బీమా
- అర్హులైన వారికి నెలకు రూ.4 వేల పెంఛన్

యువ వికాసం

- కళాశాల విద్యార్థుల కోచింగ్ ఫీజు కోసం రూ.5 లక్షల వరకు సాయం

కమ్యూనిస్టులు చరిత్ర సృష్టికర్తలు

- తెలంగాణ సాయుధ పోరాట వారసత్వం వారిదే: డీ రాజా

వివరాలు 13లో

జాతీయ సమైక్యతకు ఆర్థిక సమస్యలే విఘాతం

- పేదరికం, నిరుద్యోగం, సాంఘిక వివక్షలు దురదృష్టకరం: సీఎం కేసీఆర్

వివరాలు 13లో

బీజేపీని గద్దె దించాలి

- ఇండియా కూటమి బలోపేతం, విస్తరణకు నిర్ణయం : సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో

5లో..

ఉప్పందించింది కేంద్రమే!

- ఈడీ, జీఎస్టీ ఇంటెలిజెన్స్, ఇన్‌కంట్యాక్స్ దర్యాప్తులే కీలకం
- వాటి ఆధారంగానే స్కిల్ స్కాం ప్రైమాఫేసీ
- సీఐడీ విచారణకు ఆదేశం... కడకు చంద్రబాబు అరెస్టు


(ఫైల్)



అమరావతి : స్కిల్ డెవలప్‌మెంట్‌లో స్కాం జరిగిందా లేదా, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అవినీతికి పాల్పడ్డారా లేదా అనే విషయాలపై వైసీపీ ప్రభుత్వం, టీడీపీల బహిరంగ వాదనల్లో కేంద్ర ప్రభుత్వ పాత్ర మరుగున పడుతోంది. 'స్కిల్' కుంభకోణానికి ఉప్పందించింది కేంద్ర దర్యాప్తు సంస్థలని చంద్రబాబు అరెస్టు సందర్భంగా కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో సీఐడీ స్పష్టం చేసింది. స్కాం జరిగిందనడానికి మూలం ఎప్పుడో 2018లో మహారాష్ట్రలో జీఎస్టీ, ఆదాయపన్నుశాఖ (ఐటీ), ఆ తర్వాతి కాలంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నిర్వహించిన విచారణలని సీఐడీ పేర్కొంది. ఆ నివేదికలే సీఐడీ దర్యాప్తునకు ప్రాథమిక ఆధారాలు. వాటిని బట్టే కేసు నమోదు చేసినట్టు విజయవాడ ఏసీబీ కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో తెలిపింది.

పూణెలో మూలాలు

స్కిల్ ప్రాజెక్టులో కీలకంగా ఉన్న డిజైన్‌టెక్ పూణె బేస్డ్ సంస్థ. ఎటువంటి వ్యాపార కార్యకలాపాలూ లేని సింగపూర్‌లో రిజిస్టరైన డొల్ల కంపెనీల పేరిట రూపొందించిన నకిలీ ఇన్వాయిస్‌లతో వస్తువులు, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌లను కొనుగోలు చేయడంపై 2017-18లోనే పూణెకు చెందిన డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ (డీజీజీఐ) దర్యాప్తు చేపట్టింది. ఆ వెంటనే పూణె ఇన్‌కంట్యాక్స్ యూనిట్ విచారణ చేసింది. ఏపీ ప్రభుత్వం, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా డిజైన్‌టెక్‌కు విడుదలైన రూ.371 కోట్లలో కనీసం రూ.241 కోట్లు దుర్వినియోగం అయినట్టు ప్రాథమికంగా నిర్ధారించాయి. షెల్ కంపెనీలు బోగస్ ఇన్వాయిస్‌లు ఇవ్వడం వలన ఇది చోటుచేసుకుంది. సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, కోర్స్‌వేర్, ఇతర వస్తువులు, సేవలు అందించకుండానే బ్యాంక్ ఖాతాలకు డబ్బు ట్రాన్స్‌ఫర్ అయింది. అక్కడి నుంచి హవాలా పద్ధతుల ద్వారా సొమ్ము బదిలీ చేశారని తొలుత కనుగొన్నది జీఎస్టీ ఇంటెలిజెన్స్, ఇన్‌కంట్యాక్స్ డిపార్టుమెంట్లే. ఇదంతా సరిగ్గా ఎన్డీఏ నుంచి, కేంద్ర ప్రభుత్వం నుంచి టీడీపీ వైదొలిగిన, వైదొలుగుతున్న సమయంలోనే చోటుచేసుకోవడం గమనార్హం.

ఐటీ నోటీస్‌తో కదలిక

ఈ సమాచారంతోనే వైసీపీ సర్కారు వచ్చాక అప్పటి ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి అజేయ కల్లం స్కిల్ స్కాంపై అంతర్గతంగా విచారణ జరిపించి, ప్రాథమిక సాక్ష్యాధారం ప్రైమాఫేసీ ఉందని, సీఐడీ దర్యాప్తునకు 2021 సెప్టెంబర్ 7న లేఖ రాశారు. అదే ఏడాది డిసెంబర్ 7న సీఐడీ ఎఫ్ఐఆర్ నమోదు చేసి, వెనువెంటనే 13.12.2021న స్కిల్ కార్పొరేషన్‌కు డైరెక్టరుగా పనిచేసిన గంటా సుబ్బారావును తొలి నిందితునిగా అరెస్టు చేసింది.

కాగా షెల్ కంపెనీలన్నీ సింగపూర్, ఇతర దేశాల బేస్డ్ కావడంతో మనీలాండరింగ్ జరిగిందంటూ ఈడీ 2022 మార్చి 20న ఇసిఐఆర్ నమోదు చేసి రంగంలోకి దిగింది. 4.3.2023న సీమెన్స్ ఇండియా మాజీ ఎమ్‌డి సౌమ్యాద్రి శేఖర్ బోస్, డిజైన్‌టెక్ ఎమ్‌డి వికాస్ వినాయక్ ఖన్వెల్కర్, ముకుల్‌చంద్ర అగర్వాల్, సురేష్ గోయల్‌ను ఈడీ అరెస్టు చేసింది. ఆ పూర్వరంగంలోనే 4.8.2023న హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ (24) ఇన్‌కంట్యాక్స్ అధికారి దొండపాటి వెంకట హరీష్ చంద్రబాబుకు నోటీస్ ఇచ్చారు. కేసులో 22వ నిందితునిగా ఉన్న యోగేష్ గుప్తా, మనోజ్ వాసుదేవ పరదేశి మధ్య ఆర్థిక లావాదేవీలు ఆ నోటీస్‌కు ఆధారం. ఏతావాతా చంద్రబాబు అరెస్ట్ వెనుక కేంద్ర దర్యాప్తు సంస్థలే కీలకంగా పని చేశాయని తెలుస్తోంది.

త్యాగధనుల స్ఫూర్తిని స్మరించుకుందాం

- గవర్నర్ డాక్టర్ తమిళి సై

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ప్రాంతం భారత యూనియన్‌లో విలీనమైన రోజు (సెప్టెంబరు 17) ఇక్కడి ప్రజలకు ఎంతో ప్రత్యేకమైందని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళి సై సౌందరరాజన్ అన్నారు. ఎందరో త్యాగధనుల పోరాట ఫలితంగానే నిజాం ఏలుబడిలో ఉన్న ప్రాంతాలు భారతదేశంలో కలిశాయని ఆమె గుర్తు చేశారు. జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా తమిళి సై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. నాటి త్యాగధనుల పోరాటాలను స్మరించుకోవాలనీ, వారి స్ఫూర్తితో ప్రజలంతా కలిసి మెలసి జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాజ్‌భవన్‌కు చెందిన ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

26న ఆర్టీసీ కార్మికుల చలో ఇందిరాపార్క్

- టీఎస్‌ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ పిలుపు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 26న చలో ఇందిరాపార్క్ ఆందోళనా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు టీఎస్‌ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ తెలిపింది. సంస్థను ప్రభుత్వంలో విలీనం చేసే కంటే ముందే అనేక సమస్యల్ని పరిష్కరించాల్సి ఉందనీ, వాటిపై ప్రభుత్వం, యాజమాన్యం దృష్టి పెట్టట్లేదని జేఏసీ ప్రతినిధులు చెప్పారు. ఆదివారంనాడిక్కడి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జేఏసీ సమావేశం చైర్మెన్ కే రాజిరెడ్డి అధ్యక్షతన జరిగింది. కన్వీనర్ వీఎస్ రావు, కో కన్వీనర్ కత్తుల యాదయ్య, నాయకులు పీ రవీందర్‌రెడ్డి, వినాయక రెడ్డి, ఏఎస్ రెడ్డి, కుఫిన్, బుద్ధవిశాల్, గంగాధర్, జీ రాములు, మోసిన్ తదితరులు పాల్గొన్నారు. విలీనం కంటే ముందే పరిష్కరించాల్సిన సమస్యలపై చర్చించారు. దానిలో భాగంగా 26వ తేదీ చలో ఇందిరాపార్క్ ఆందోళన నిర్వహించాలని నిర్ణయించారు. ఏడేండ్లుగా ఆర్టీసీ కార్మికులకు రావల్సిన రెండు వేతన సవరణలు జరగలేదని చెప్పారు. 7 సంవత్సరాల నుండి ఎదురు చూస్తున్న 2017 ఏప్రిల్ 1 నాటి మూల వేతనానికి 31.1 శాతం డిఏ కలిపి, 30 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలనీ, దానితో పాటే నాలుగేండ్ల బకాయిలు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2021 వేతన సవరణను ప్రభుత్వ ఉద్యోగులతో సమానం చేస్తూ మాస్టర్ పే స్కేల్ నిర్ణయించాలని కోరారు. 2013 వేతన సవరణ బకాయిల్లో 50శాతం బాండ్ల డబ్బులు ఇవ్వలేదనీ, వాటికి 8.75శాతం వడ్డీతో కలిపి చెల్లించాలని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న డిఏలు, వాటి బకాయిలు, సీసీఎస్‌కు ఇవ్వాల్సిన డబ్బు, ఎస్ఆర్‌బీటీ, ఎస్‌బీటీ బకాయిలు తక్షణం చెల్లించాలని కోరారు. రిటైర్ అయిన కార్మికులకు వెంటనే టెర్మినల్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కరించకుండా విలీనం ప్రక్రియ జరిగితే కార్మికులు ఆర్థికంగా చాలా నష్టపోతారని వివరించారు. వాటి సాధన కోసమే 26న చలో ఇందిరాపార్క్ ఆందోళన నిర్వహిస్తున్నామనీ, యూనియన్లకు అతీతంగా కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.



జాతీయ స్థాయిలో ప్రకటించవచ్చు కదా..?: మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విజయభేరి పేరిట కాంగ్రెస్ నిర్వహించిన బహిరంగ సభలో ఆ పార్టీ అమలుకు సాధ్యం కాని హామీలను ఇచ్చిందని రాష్ట్ర మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఒక జాతీయ పార్టీయా..? లేక ప్రాంతీయ పార్టీయా..? అంటూ ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. జాతీయ పార్టీ అయినప్పుడు ఒక్కో రాష్ట్రంలో ఒక్కో మాదిరిగా కాకుండా దేశం మొత్తానికి ఒకే రకమైన హామీలు, వాగ్దానాలను ప్రకటించవచ్చు కదా..? అని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలు... కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అమలవుతున్నాయా..? అని ఆయన ఈ సందర్భంగా నిలదీశారు.

కాంగ్రెస్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యం

- ఐదు రాష్ట్రాల్లో మాదే విజయం : 'సీడబ్ల్యూసీ'లో కాంగ్రెస్ నేతల ఉద్ఘాటన
- బీజేపీ, బీఆర్ఎస్ మోసకారి పార్టీలంటూ విమర్శ
- తెలంగాణ వనరులు లూటీ అవుతున్నాయని ఆందోళన
- ముగిసిన సీడబ్ల్యూసీ సమావేశం




నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యమని హైదరాబాద్‌లో నిర్వహించిన సీడబ్ల్యూసీ సమావేశం పేర్కొంది. త్వరలో జరగబోయే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతోపాటు వచ్చే ఏడాది నిర్వహించే పార్లమెంట్ ఎలక్షన్లలోనూ తమ పార్టీ గెలిచి తీరుతుందని ఆ సమావేశం ధీమా వ్యక్తం చేసింది. అందుకోసం ఎక్కడికక్కడ పటిష్ట ప్రణాళికలు, ముందస్తు వ్యూహంతో పార్టీ శ్రేణులను సమాయత్తం చేయాలని నిర్ణయించింది. బీజేపీ అవకాశవాద రాజకీయాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ కాంగ్రెస్ పాలసీని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలనీ, క్షేత్రస్థాయి కార్యకర్తలు,నాయకులతో కలిసి పనిచేయాలని సీడబ్ల్యూసీ... నాయకులు, కార్యకర్తలకు నిర్దేశించింది. త్వరలో ఎన్నికలు జరగబోయే తెలంగాణ, చత్తీస్‌ఘడ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మిజోరాం రాష్ట్రాల్లోని రాజకీయ పరిస్థితులపై సీడబ్ల్యూసీ సమావేశం రెండోరోజైన ఆదివారం చర్చించారు. తెలంగాణతోపాటు మిగిలిన నాలుగు రాష్ట్రాల ప్రజలు కాంగ్రెస్‌కు స్పష్టమైన మెజార్టీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయా రాష్ట్రాల నాయకులు పార్టీ కార్యాచరణను వివరించారు. తెలంగాణకు సంబంధించి సమావేశంలో ప్రధానంగా చర్చించారు.

మోసకారి విధానాలతో బీజేపీ, బీఆర్ఎస్‌లు తెలంగాణ సంపదను లూటీ చేశాయనీ, అందువల్ల ఇక్కడి ప్రజల ఆకాంక్ష ఇప్పటికీ నెరవేరలేదని సీడబ్ల్యూసీ అభిప్రాయపడింది. రాష్ట్రంలో కుటుంబ పాలన కొనసాగుతోందనీ, నిజాం తరహా పాలనతో కేసీఆర్ ప్రభుత్వం ప్రజల హక్కులను హరిస్తున్నదని పేర్కొంది. ఎన్నో రాజకీయ సవాళ్లను ఎదుర్కొని,తెలంగాణ ప్రజల డిమాండ్‌ను గౌరవించి కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక రాష్ట్రాన్ని ప్రకటించిందనీ సమావేశంలో పాల్గొన్న నాయకులు తెలిపారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఆ లక్ష్యం నెరవేరలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వాతావరణ పరిస్థితులతోపాటు ప్రభుత్వాల లోపభూయిష్ట బీమా పాలసీతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ధరణి పోర్టల్ వల్ల గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు పంపిణీ చేసిన భూములపై దళిత, గిరిజన, బలహీనవర్గాల వారు హక్కులు కోల్పోయారని సమావేశం పేర్కొంది. బీజేపీ విధానాలతో చిన్న వ్యాపారస్తులు నష్ట పోతున్నారని తెలిపింది. ప్రయివేటీకరణతో దేశంలో యువతకు ఉపాధి దొరకడం లేదనీ, నిరుద్యోగం ప్రధాన సమస్యగా మారిందని వివరించింది. కాంగ్రెస్‌తోనే తెలంగాణ సమ్మిళిత అభివృద్ధి సాధ్యమవుతుందని ఉద్ఘాటించింది. అందరినీ కలుపుకునిపోయే పరిపాలన కాంగ్రెస్‌కే సాధ్యమని సమావేశంలో తీర్మానించారు. అందువల్ల వచ్చే శాసనసభ ఎన్నికల్లో పార్టీని ఆదరించి, అక్కున చేర్చుకోవాలని రాష్ట్ర ప్రజానీకానికి కాంగ్రెస్ అగ్రనేతలు విజ్ఞప్తి చేశారు. రెండురోజులపాటు నిర్వహించిన సీడబ్ల్యూసీ సమావేశం జయప్రదంగా ముగిసిందని వారు ఈ సందర్భంగా ప్రకటించారు.

రాష్ట్రాన్ని దివాలా తీయించారు


- ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ధనిక రాష్ట్రమైన తెలంగాణను సీఎం కేసీఆర్ దివాళా తీయించారని ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇచ్చిందనీ, ఎస్సీ, ఎస్టీలకు ఎంతో చేసిందని తెలిపారు. ఆదివారం తుక్కుగూడలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన విజయభేరీ సభలో ఆయన ప్రసంగించారు. తమ ప్రయాసను పదేండ్ల బీఆర్ఎస్ పాలన నాశనం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీలకు వారి జనాభా ప్రకారం బీఆర్ఎస్ బడ్జెట్ కేటాయించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మడమే పనిగా పెట్టుకుందని దుయ్యబట్టారు. బడాబాబులు రూ. వేల కోట్ల ప్రజల సొమ్మును దోపిడీ చేసి విదేశాలకు పారిపోతుంటే చోద్యం చూస్తూ ఉండిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలిస్తాననీ, విదేశాల నుంచి నల్లధనం రప్పించి రూ.15 లక్షల చొప్పున ప్రజల అకౌంట్లో వేస్తామనీ హామీలిచ్చిన మోడీ సర్కార్ వారిని మోసం చేసిందని గుర్తుచేశారు.

మాట తప్పని సోనియమ్మ : రేవంత్ రెడ్డి



సోనియాగాంధీ అంటే మాట తప్పని, మడమ తిప్పని నేత అని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి కొనియాడారు. ఇచ్చిన మాట మేరకు తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రాష్ట్ర ప్రజల కోసం మరో ఆరు గ్యారంటీలను ఇచ్చారని తెలిపారు. ఒక తల్లిగా తెలంగాణ ప్రజల బాధను ఆమె అర్థం చేసుకున్నారని తెలిపారు.

నియంత పాలన అంతానికే....:కోమటిరెడ్డి వెంకటరెడ్డి

సెప్టెంబర్ 17 తెలంగాణ ఆత్మగౌరవ దినమని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 13 నెలల తర్వాత తెలంగాణకు స్వాతంత్ర్యం వచ్చిందని చెప్పారు. ఈ క్రమంలో సోనియాగాంధీ 2014లో మరోసారి తెలంగాణకు స్వాతంత్ర్యం ఇచ్చారన్నారు. రాష్ట్రంలో నియంత పాలనను అంతం చేసేందుకే సోనియాగాంధీ తెలంగాణకు వచ్చారని తెలిపారు. కాంగ్రెస్‌ను గెలిపించి దోపిడీ బీఆర్ఎస్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. విజయభేరి సభలో రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్ విందర్ సింగ్ తదితరులు మాట్లాడారు. నల్లగొండ ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి రాహుల్ గాంధీ హిందీ ప్రసంగాన్ని తెలుగులోకి అనువదించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మధుయాష్కీ మల్లి కార్జున ఖర్గే ప్రసంగాన్ని అనువదించారు.


మాట్లాడుతున్న తమ్మినేని


మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు


మాట్లాడుతున్న డీజీ

చరిత్రను వక్రీకరిస్తే ద్రోహులుగా మిగులుతారు

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

- మారుపేరుతో బీఆర్ఎస్ గందరగోళపరుస్తోంది : పోతినేని
- బీజేపీ వక్రీకరిస్తోంది : చెరుపల్లి
- త్యాగాల వారసులు కమ్యూనిస్టులే: జిల్లాల్లో సాయుధ పోరాట వార్షికోత్సవ ముగింపు సభల్లో సీపీఐ(ఎం) నేతలు




మాట్లాడుతున్న అబ్బాస్

నవతెలంగాణ - భద్రాచలం/విలేకరులు

వీర తెలంగాణ సాయుధ పోరాట వాస్తవ చరిత్రను వక్రీకరిస్తే చరిత్ర ద్రోహులుగా మిగులుతారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. చరిత్రను వక్రీకరిస్తూ మతకల్లోలాలు సృష్టించే శక్తులను వచ్చే ఎన్నికల్లో ఓడించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పిలుపునిచ్చారు. ఆదివారం వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో జరిగిన సభల్లో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం గోదావరి బ్రిడ్జి నుంచి అన్నపూర్ణ ఫంక్షన్ హాల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించి అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన సభలో తమ్మినేని వీరభద్రం మాట్లాడారు.

సెప్టెంబర్ 17 తెలంగాణ సాయుధ పోరాటం గురించి బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మాట్లాడుతున్నాయని, నిజంగా ప్రజలకు వాస్తవ చరిత్ర తెలియచేయాలనే ఉద్దేశం వారికుంటే తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర కమ్యూనిస్టుల త్యాగాల చరిత్ర అని ఒప్పుకునే దమ్ము ఆ పార్టీలకు ఉందా అని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో వీర తెలంగాణ సాయుధ పోరాట నిజమైన వారసులుగా వాస్తవ చరిత్రను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తల మీద ఉందని స్పష్టంచేశారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి నుంచి విముక్తి కోసం సాగిన మహత్తర తెలంగాణ సాయుధ పోరాటంలో 4000 మంది కమ్యూనిస్టు కార్యకర్తలు తమ ప్రాణాలర్పించి నిజాం గడీలను బద్దలు కొట్టి మూడువేల గ్రామాల్లో గ్రామ స్వరాజ్యాలను స్థాపించారని, 10 లక్షల ఎకరాల భూమి పంపిణీ చేశారని గుర్తుచేశారు. విమోచన దినం పేరుతో ముస్లిం రాజుకు వ్యతిరేకంగా హిందువులు పోరాడిన చరిత్రగా బీజేపీ మసిబూసి మారేడు కాయ చేస్తుందని విమర్శించారు. నాటి నిజాం పరిపాలనలో కులం, మతం అనే అంశాలకు తావు లేదని, భూమి, వెట్టి, మాతృభాషలో విద్య లాంటి అంశాల చుట్టే తెలంగాణ ప్రజలు పోరాటాలు చేశారని గుర్తుచేశారు. ఈ పోరాటంలో ప్రాణాలర్పించిన వారిలో హిందువులు, ముస్లింలు ఉన్నారని అలాగే ప్రజలను హింసించిన వారిలో కూడా ముస్లింలు, హిందువులు ఉన్నారని తెలిపారు. అలాగే, నిజాం నవాబు దాష్టీకానికి బలైన కమ్యూనిస్టు కార్యకర్తల కంటే నెహ్రూ, పటేల్ సైన్యం పంపించిన సైన్యం దాడిలో మరణించిన కమ్యూనిస్టు కార్యకర్తలే ఎక్కువమంది ఉన్నారని, అందుకే కాంగ్రెస్‌కు దీనిపై మాట్లాడే అర్హత లేదన్నారు. నిజంగా నెహ్రూ సైన్యంను.. నిజాం రాజును గద్దె దించడానికి పంపించినట్లయితే రాజభరణం పేరుతో నిజాం రాజుకు ఎందుకు ఊడిగం చేశారని ప్రశ్నించారు. పేద ప్రజలందరికీ భూమి దక్కేవరకు పోరాటాలు నిర్వహించడమే వీర తెలంగాణ సాయుధ పోరాట అమరవీరులకు ఇచ్చే ఘనమైన నివాళి అని తెలిపారు.

చరిత్రను వక్రీకరిస్తున్న బీఆర్ఎస్ : పోతినేని

జాతీయ సమైక్యతా దినోత్సవం పేరుతో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు జరుపుతున్న బీఆర్ఎస్ వీర తెలంగాణ వాస్తవ చరిత్ర ప్రజలకు తెలియజేయకుండా మారుపేరుతో ప్రజలను గందరగోళపరుస్తున్నారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ విమర్శించారు. తెలంగాణ ఏర్పడితే అధికారికంగా తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు జరుపుతానని ప్రగల్భాలు పలికిన కేసీఆర్ వీర తెలంగాణ అనే పేరు కూడా పలకడానికి భయపడుతూ జాతీయ సమైక్యత దినోత్సవం అనివీర తెలంగాణ సాయుధ పోరాటం మిగిల్చిన కర్తవ్యాలు ఇంకా మిగిలే ఉన్నాయని, అందులో ప్రధానమైన అంశం భూ పంపిణీ అని, భవిష్యత్‌లో భూమిలేని పేదల తరఫున భూ పోరాటాలు నిర్వహిస్తామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, సీనియర్ నాయకులు కాసాని ఐలయ్య, ఎలమంచి రవికుమార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏజే రమేష్, కొక్కెరపాటి పుల్లయ్య, ఎంబీ నర్సారెడ్డి, కె.బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

నిజమైన వారసులు కమ్యూనిస్టులు : చెరుపల్లి

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలో జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట దినోత్సవ సభకు సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు హాజరై మాట్లాడారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను బీజేపీ ప్రభుత్వం వక్రీకరిస్తున్నదన్నారు. నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని అన్నారు. సూర్యాపేట జిల్లాకేంద్రంలో నిర్వహించిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట దినోత్సవానికి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి హాజరై అమరవీరులకు నివాళులర్పించారు. సాయుధ రైతాంగ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని అన్నారు. మిర్యాలగూడ పట్టణకేంద్రంలో సాయుధపోరాట దినోత్సవం సభలో అఖిల భారత కిసాన్‌సభ జాతీయ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పించారు.

బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించండి :ఎండీ అబ్బాస్

జనగామ జిల్లా కేంద్రంలో జరిగిన సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ మాట్లాడుతూ.. సాయుధపోరాట స్ఫూర్తితో రాబోయే ఎన్నికల్లో బూర్జువ, భూస్వామ్య పార్టీలైన బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వారసులు కమ్యూనిస్టులేనని, కానీ బీజేపీ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించి దేశ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సభకు ముందు జనగామ బస్టాండ్ నుంచి నెహ్రూ పార్క్ మీదుగా కామాక్షి ఫంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

బీజేపీని గద్దె దించడమే లక్ష్యం : డీజీ

హైదరాబాద్‌లోని కాచిగూడ కృష్ణా నగర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన సభలో సీపీఐ(ఎం) కార్యదర్శివర్గ సభ్యులు డీజీ నర్సింగరావు పాల్గొని మాట్లాడారు. బ్రిటిషర్ల మోచేతు నీళ్లు తాగి ఏ సంబంధం లేని వాళ్ళు ఇప్పుడు సాయుధ పోరాటంలో పోరాడినట్టు నాటకాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశాడు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని గద్దె దింపే వరకు పార్టీ కార్యకర్తలు, ఉద్యమకారులు పోరాడాలని పిలుపునిచ్చారు.

ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టిస్తున్న బీజేపీ : టి.జ్యోతి


మాట్లాడుతున్న జ్యోతి

నిర్మల్‌లో నిర్వహించిన సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.జ్యోతి మాట్లాడుతూ.. ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రయత్నిస్తున్నదని, ఈ ప్రయత్నానికి వ్యతిరేకంగా ప్రజలంతా ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. 1946 జులై 4న దొడ్డి కొమరయ్య అమరత్వంతో మొదలైన తెలంగాణ సాయుధ పోరాటం 1951 సెప్టెంబర్17 వరకు సుదీర్ఘకాలం నైజాం నవాబుకు వ్యతిరేకంగా కమ్యూనిస్టుల నాయకత్వంలో జరిగిందన్నారు. నాటి తెలంగాణ రైతంగ సాయుధ పోరాటంలో బీజేపీ, సంఘ్ పరివార్ శక్తులకు ఎలాంటి పాత్ర లేదన్నారు. హైదరాబాద్ సంస్థానం విలీనం గురించి మాట్లాడుతున్న బీజేపీ నాయకులు దేశంలో అనేక ప్రాంతాల్లో ఉన్న ఇతర సంస్థానాల విలీనం గురించి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. జాతీయ ఉద్యమంలో బ్రిటిష్ వారి అడుగులకు మడుగులొత్తిన బీజేపీ నాయకులు నేడు దేశభక్తులమని గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. నైజాం ఫ్యూడల్ పాలనలో జమీందార్లు, జాగిర్దార్లు అనేక మంది హిందువులనే విషయం బీజేపీ నాయకులు గుర్తుంచుకోవాలని హితవు పలికారు. సభలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు యం. అడివయ్య, బుర్రి ప్రసాద్, జిల్లా కార్యదర్శి గౌతమ్ కృష్ణ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్, బి.సుజాత, జిల్లా కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సాయుధ పోరాటంపై వక్రీకరణలు..

- పోతినేని సుదర్శన్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సాయుధ రైతాంగ పోరాట చరిత్రను కొందరు వక్రీకరిస్తున్నారని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ తెలిపారు. ఆ సంఘం ఆధ్వర్యంలో ' తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం త్యాగాలు' అనే అంశంపై ఆదివారం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ అధ్యక్షతన వెబినార్ నిర్వహించారు. ఆ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ.. సాయుధ పోరాటాన్ని మత దృక్కోణం నుంచి చరిత్రను చూపించేందుకు మతతత్వ వాదులు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. సమాజం పురోగమిస్తున్న కొద్దీ మతమౌఢ్యం , అశాస్త్రీయ భావాలు బలహీనపడి ఆధునిక , పురోగామి భావాలు విస్తరించాలన్నారు. కానీ పాలకవర్గాలు తమ స్వార్ధ ప్రయోజనాల కోసం అశాస్త్రీయ భావాలు, మతమౌఢ్యాన్ని పెంచి పోషిస్తున్నారని వివరించారు. విమోచన దినం పేరుతో బీజేపీ ప్రచారం చేయడం అందులో భాగమేనన్నారు. నిజాం సర్కార్ వ్యతిరేక ఉద్యమంలో బీజేపీ కి ఎలాంటి పాత్రా లేదని చెప్పారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ, భూస్వామ్య పీడన నుంచి విముక్తి కోసం ఆనాడు ప్రజలు పోరాడారని వివరించారు.

ఘనంగా జాతీయ సమైక్యత దినోత్సవం

- జాతీయ పతాకాలను ఆవిష్కరించిన మంత్రులు, ప్రభుత్వ విప్‌లు



నవతెలంగాణ-విలేకరులు

సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనమైన రోజుగా అభివర్ణిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జాతీయ సమైక్యతా దినోత్సవం వేడుకలు ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పలు జిల్లాల్లో మంత్రులు, ప్రభుత్వ విప్‌లు పాల్గొని జాతీయ జెండాలు ఎగరవేశారు. రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. వికారాబాద్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన వేడుకల్లో పౌర సంబంధాలు, భూగర్భ గనుల శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి పాల్గొని పోలీసుల నుంచి మంత్రి గౌరవ వందనం స్వీకరించారు.

నల్లగొండలోని పరేడ్‌గ్రౌండ్‌లో శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ గ్రౌండ్‌లో విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి జెండాను ఆవిష్కరించారు. యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో ప్రభుత్వ విప్ గొంగిడి సునీతమహేందర్‌రెడ్డి జెండా ఎగురవేశారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గిరిజన, స్త్రీ - శిశుసంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు జాతీయ జెండా ఎగురవేసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం అమరవీరులకు నివాళులర్పించారు. జయశంకర్-భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షులు పల్లా రాజేశ్వర్ రెడ్డి జాతీయ జెండా ఎగురవేశారు. ములుగు జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ ఎం.ఎస్ ప్రభాకర్ రావు జాతీయ జెండా ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అంతాయిపలిలోని సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ సముదాయంలో మంత్రి మల్లారెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఆదిలాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, నిర్మల్‌లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ సుంకరి రాజు, మంచిర్యాలలో ప్రభుత్వ విప్ బాల్క సుమన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు.

సచివాలయంలో ఘనంగా జాతీయ సమైక్యతా దినోత్సవం

- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన సీఎస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారి ఆదివారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఐఏఎస్ అధికారులు, వివిధ విభాగాల ఉన్నతాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమాచార శాఖ కార్యాలయంలో...

తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని సమాచార, పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో స్పెషల్ కమిషనర్ అశోక్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థ చైర్మెన్ అనిల్ కూర్మాచలం, సమాచార శాఖ డైరెక్టర్ రాజమౌళి, అడిషనల్ డైరెక్టర్ నాగయ్య కాంబ్లీ, జాయింట్ డైరెక్టర్ జగన్, డిప్యూటీ డైరెక్టర్లు మధుసూదన్, వెంకటేశ్వర్లు, ప్రసాద్‌తోపాటు పలువురు సీనియర్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంసెట్ బైపీసీ తుదివిడత కౌన్సెలింగ్ ప్రారంభం

- 20 వరకు వెబ్‌ఆప్షన్ల నమోదు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి బీ ఫార్మసీ, ఫార్మా-డీ, బయోటెక్నాలజీ, ఫార్మాసూటికల్ ఇంజినీరింగ్, బయోమెడికల్ ఇంజినీరింగ్, బయో టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఎంసెట్ బైపీసీ విద్యార్థులకు నిర్వహిస్తున్న తుదివిడత కౌన్సెలింగ్ ప్రక్రియ ఆదివారం నుంచి ప్రారంభమైంది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎంసెట్ ప్రవేశాల కన్వీనర్ వాకాటి కరుణ ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రాసెసింగ్ ఫీజు, ధ్రువపత్రాల పరిశీలనకు 540 మంది స్లాట్ బుక్ చేసుకున్నారని తెలిపారు. ఈనెల 19న ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని పేర్కొన్నారు. ఆదివారం నుంచి ఈనెల 20 వరకు వెబ్‌ఆప్షన్లను నమోదు చేసేందుకు అవకాశముందని వివరించారు. ఈనెల 23న సీట్లు కేటాయిస్తామని తెలిపారు. ఇతర వివరాల కోసం https://tseamcetb.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

విహార యాత్రలో విషాదం..!

- మహారాష్ట్రలో రోడ్డు ప్రమాదం..
- నలుగురు ఆదిలాబాద్ జిల్లావాసులు మృతి
- మరో నలుగురికి తీవ్రగాయాలు

నవతెలంగాణ- తాంసి

మహారాష్ట్రలోని అమరావతి జిల్లా చిక్కల్‌ధరి అటవీ ప్రాంతంలో ఆదివారం ఉదయం తెల్లవారు జమున జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతిచెందారు. మరో నలుగురు బ్యాంకు ఉద్యోగులు తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా ఆదిలాబాద్ జిల్లాకు చెందినవారు. వివరాల్లోకి వెళితే.. జిల్లాలోని భీంపూర్ మండలం అర్లి(టి) గ్రామానికి చెందిన యువకుడు షేక్ సల్మాన్‌కు చెందిన ఎర్టీగా వాహనంలో ఇద్దరు బ్యాంకు ఉద్యోగులతో పాటు అర్లి గ్రామ సర్పంచ్ తనయుడితో కలిసి మొత్తం ఎనిమిది మంది మహారాష్ట్రలోని పర్యాటక ప్రాంతమైన చిక్కల్‌ధరికి శనివారం రాత్రి బయలుదేరారు. ఆదివారం తెల్లవారుజామున వీరు ప్రయాణిస్తున్న వాహనం చిక్కల్‌ధరికి సమీపంలోని హిల్ స్టేషన్ వద్ద అదుపుతప్పి రోడ్డుపై నుంచి 200 ఫీట్ల లోతులోని లోయలోకి దూసుకెళ్లింది. కాగా వాహనంలో ప్రయాణిస్తున్న ఎనిమిది మందిలో నలుగురు యువకులు ఘటనా స్థలంలోని మృతి చెందారు. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మృతి చెందినవారిలో వాహన యజమాని, డ్రైవర్ షేక్ సల్మాన్ (31), గ్రామ సర్పంచ్ కుమారుడు వైభవ్ (29), భీంపూర్ గ్రామీణ బ్యాంక్ క్యాషియర్ కోటేశ్వరరావు (27), కప్పర్ల తెలంగాణ గ్రామీణ బ్యాంక్ క్యాషియర్ శివకృష్ణ (31) ఉన్నారు. గాయపడిన వారిలో బ్యాంకు ఉద్యోగులు సుమన్, యోగేష్, హరీష్, శ్యామ్‌రాజ్ ఉన్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పోలీసులు స్థానికుల సాయంతో ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై చిక్కల్‌ధరి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా విహార యాత్ర కోసం వెళ్లిన యువకులు మృతిచెందడంతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.


(ఫైల్)

పటేల్ చొరవతోనే హైదరాబాద్ విలీనం

- విమోచన దినోత్సవ వేడుకల్లో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా
- షోయబుల్లాఖాన్, రాంజీ గోండు పేరిట పోస్టల్ కవర్ల విడుదల
- స్వశస్త్ర సీమాబల్ క్వార్టర్లకు వర్చువల్‌గా శంకుస్థాపన
- వికలాంగులకు బ్యాటరీ సైకిళ్ల పంపిణీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సర్దార్ వల్లభభాయ్ పటేల్ చొరవతోనే హైదరాబాద్ సంస్థానానికి విముక్తి లభించిందనీ, చుక్క రక్తం బొట్టు కారకుండా హైదరాబాద్ విలీనానికి నిజాం అంగీకరించేలా ఆయన మెడలు వంచారని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను నిర్వహించారు. మొదట అమిత్‌షా పరేడ్ గ్రౌండ్‌లో సైనిక అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. సాయుధ భద్రతా దళాల గౌరవవందనాన్ని స్వీకరించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. షోయబుల్లాఖాన్, రాంజీ గోండు పేరిట పోస్టల్ కవర్లను ఆవిష్కరించారు. నిజాం సంస్థానం పరిధిలోని తెలంగాణ, కళ్యాణ కర్నాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన సాంస్కృతిక కళారూపాల ప్రదర్శనలను తిలకించారు. వికలాంగులకు బ్యాటరీ సైకిళ్లను పంపిణీచేశారు. సాయుధ బలగాల కోసం 80 ఎకరాల స్థలంలో నిర్మించనున్న స్వశస్త్ర సీమా బల్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా అమిత్‌షా మాట్లాడుతూ.. దేశంలో విలీనానికి ముందు తెలంగాణ, కళ్యాణ కర్నాటక, మహారాష్ట్రలోని కొన్ని జిల్లాలు హైదరాబాద్ సంస్థానంలో ఉండేవని గుర్తుచేశారు. నిజాంకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో కీలక పాత్ర పోషించినవారికి నివాళులు అర్పిస్తున్నట్టు తెలిపారు. నిజాం రాజు సంస్థానాన్ని భారత్‌లో విలీనం చేసేందుకు పటేల్ చొరవ తీసుకున్నారనీ, పటేల్, మున్షీ కలిసి ఆపరేషన్ పోలో పేరిట నిజాం, రజాకార్ల మెడలు వంచారని చెప్పారు. హైదరాబాద్ విమోచనానికి 75 ఏండ్లు నిండాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అధికారికంగా వేడుకలు నిర్వహించేందుకు అనుమతి ఇచ్చిన మోడీకి కృతజ్ఞతలు తెలిపారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే గత ప్రభుత్వాలు విమోచన దినోత్సవాలను నిర్వహించలేదని విమర్శించారు. విమోచన దినోత్సవం చరిత్ర గురించి ఏమాత్రం పట్టింపు లేని వారిని ప్రజలు కూడా పట్టించుకోబోరని హెచ్చరించారు. హైదరాబాద్ సంస్థానంలో మన పూర్వీకులు చేసిన బలిదానాలను భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు. జీ-20 సదస్సు విజయవంతంగా నిర్వహించామనీ, దీని ద్వారా ప్రపంచ దేశాలకు భారత సంస్కృతి సంప్రదాయాలు తెలిశాయని చెప్పారు. జీ-20 ఇప్పుడు జీ-21గా మారిందన్నారు. జీ-20 నిర్వహణ, చంద్రయాన్ విజయవంతంతో మన దేశం విశ్వగురువు స్థానంలో నిలిచిందన్నారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ..అనేక వేల మంది ప్రాణత్యాగాల వల్ల నిజాం సంస్థాన ప్రజలకు విముక్తి కలిగిందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 13 నెలల తర్వాత మనకు స్వాతంత్ర్యం లభించిందని చెప్పారు. ఆ కాలంలో ఖాసీం రజ్వీ పేద ప్రజల మీద ఆకృత్యాలు, దౌర్జన్యాలకు పాల్పడ్డారన్నారు. రజాకార్ల ఆగడాలకు తట్టులేక గ్రామాల్లోని ప్రజలంతా ఒక్కటై తిరగబడి విజయం సాధించారన్నారు. 75 ఏండ్లుగా తెలంగాణ చరిత్రను రాజకీయ లబ్ది కోసం కొందరు తొక్కిపెట్టారని విమర్శించారు. కార్యక్రమంలో కేంద్ర హోం శాఖ కార్యదర్శి అజయ్ బాల్లీ, కేంద్ర సాంస్కృతిక శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, సాయుధ బలగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అటు విమోచన..ఇటు సమైక్యత



- నాటి వాడివేడి నేడు లేదు
- సెప్టెంబర్ 17 వేడుకల్లో చప్పగా అమిత్‌షా, కేసీఆర్ ప్రసంగాలు
- రాజకీయంగా పల్లెత్తు మాటకూడా అనుకోని వైనం
- బీజేపీ-బీఆర్ఎస్ మైత్రిలో భాగమేనంటున్న విశ్లేషకులు
- అమిత్‌షా సభలో ఓవైపు జనగణమన గీతం..మరోవైపు ఆర్ఎస్ఎస్ పాట
- సగం గీతం అయిపోయాక పాట ఆపిన వైనం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నిన్నటి మొన్నటిదాకా బీజేపీ అంటేనే ఒంటి కాలుపై లేచిన సీఎం కేసీఆర్...ఇటు బీఆర్ఎస్‌పై అగ్గిమీద గుగ్గిలం అయిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా మాటల్లో తేడా సెప్టెంబర్ 17 వేడుకల సందర్భంగా స్పష్టంగా కనిపించింది. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో విమోచన దినోత్సవం పేరిట, రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సమైక్యతా దినోత్సవం పేరిట నిర్వహించిన వేడుకల్లో వారిద్దరి ప్రసంగాలు చప్పగా సాగాయి. గత విమోచన దినోత్సవ వేడుకల్లో అమిత్‌షా కేసీఆర్‌ను, టీఆర్ఎస్ పార్టీని పొట్టుపొట్టుగా అర్సుకోగా..ఈ సారి ప్రసంగంలో ఆ వేడి ఎక్కడా కనిపించలేదు. పటేల్ జపం చేశారే తప్ప బీఆర్ఎస్‌పై ఒక్క రాజకీయ విమర్శ కూడా చేయలేదు. ఎంఐఎం, బీఆర్ఎస్ ఒక్కటే అని ఎప్పుడూ చెప్పే మాటా వినబడలేదు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సమైక్యతా దినోత్సవంలో కూడా బీజేపీని కేసీఆర్ పల్లెత్తు మాట అనలేదు. ఏడాది కాలంగా బీజేపీ మతతత్వ పార్టీ.. మత పిచ్చిగాళ్లు...ఆర్థికంగా దేశాన్ని దివాళా తీయిస్తున్నది.. అంటూ ఆగ్రహావేశాలు వ్యక్తం చేసిన విషయం విదితమే. ప్రస్తుతం ఇరువురి వైఖరిలో ఈ మార్పు రావడానికి బీజేపీ-బీఆర్ఎస్ మధ్య అంతర్గత మైత్రీలో భాగమేనంటూ పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. గత కొంతకాలంగా ఇదే విషయం జోరుగా చక్కర్లు కొడుతున్న విషయం విదితమే. తెలంగాణలో బీజేపీకి ఎలాగూ అవకాశం లేదు. తాజా రాజకీయ పరిణామాలతో బీఆర్ఎస్‌తో ఢీ అంటే ఢీ అనే స్థాయికి కాంగ్రెస్ పార్టీ చేరుకున్నది. బీజేపీకి ఉత్తరాది రాష్ట్రాల్లో గతం కంటే ఎంపీ సీట్లు తక్కువ వచ్చే అవకాశముండటం, కర్నాటకలో ఆ పార్టీ దారుణంగా ఓడిపోవడంతో లోక్‌సభలో చాలామేర సీట్లు తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రాంతీయ పార్టీలు ఎదిగినా సరేగానీ కాంగ్రెస్‌ను ఎక్కడా తిరిగి పుంజుకోనివ్వొద్దనే ఆలోచనకు బీజేపీ వచ్చినట్టు కనిపిస్తున్నది. ఆ పార్టీకి తెలంగాణలో ఎలాగూ అధికారంలోకి వచ్చే అవకాశం లేదు కాబట్టి బీఆర్ఎస్‌కు పరోక్షంగా లబ్ది చేకూర్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకుండా దెబ్బతీయటం, ఎంపీ సీట్లు ఎక్కువ గెలువనివ్వకుండా చేయడంలో భాగంగానే బీజేపీ ఈ వైఖరి తీసుకున్నట్టు జోరుగా ప్రచారం సాగుతున్నది. అందుకే అమిత్ షా ప్రసంగంలో కేసీఆర్‌ను పల్లెత్తు మాట కూడా అనలేదనే చర్చ నడుస్తున్నది.

జెండావిష్కరణలో ఓవైపు జనగనమణ ...మరోవైపు హిందూ సదా వత్సలే మాతృభూమి (బాక్స్ ఐటమ్)

తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకల్లో నిజాం వ్యతిరేక పోరాటానికి సంబంధంలేని ఆర్ఎస్ఎస్‌కు చెందిన పాటలు పాడటం పలు విమర్శలకు తావిచ్చింది. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో 'నమస్తే సదా వత్సలే మాతృభూమే...ప్రభోశక్తి మన హిందూ రాష్ట్రాంగ....', 'జయ జయహే భారతి..జగమంత కోరు నీ సంస్కృతి....ఆరాధన మంత్రం..అనాదిగా ఇది మనకు ప్రబోధం..పునాదిగా ప్రబవించిన వేదం..' అంటూ గాయకులు ఆర్ఎస్ఎస్ పాటలు పాడటం చర్చనీయాంశమైంది. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా జాతీయ పతకాన్ని ఆవిష్కరించిన తర్వాత అందరూ జాతీయ గీతాన్ని ఆలపిస్తుండగా..సింగర్లు మాత్రం 'నమస్తే సదా వత్సలే మాతృభూమే..ప్రభోశక్తి మన హిందూ రాష్ట్రాంగ..' అంటూ పాటడం విమర్శలకు తావిచ్చింది. ఇదేంటని కొందరు వారించగా..జాతీయ గీతం సగం పూర్తయిన తర్వాత ఆ పాటను ఆపేశారు. జాతీయ గీతం మొదలవ్వగానే అందరూ లేచి పాడటం నిజమైన దేశభక్తులు చేసే పని. ఆ ముసుగేసుకుని జాతీయ జెండావిష్కరణ సమయంలో ఈ పాట పాడటమే ఇప్పుడు బీజేపీ తీరుపై విమర్శలకు తావిస్తున్నది.

కుండ బద్దలు కొట్టరా!



ఎవడురా!
ఈనేలను
తన నెత్తుటితో తడిపినది.
ఎవడురా!
ఈ జాతిని
తన సత్తువతో జాగృతము చేసినది
గడీలను నేలమట్టం చేసి,
వెట్టినిమట్టి కరిపించినది ఎవడు
మత పిశాసపు కోరలు పీకి
మానవతాపతాకను ఎగరేసినది ఎవడు
బందగి పోరాట జిందగీలో ఇంధనం ఎవడు
ఐలమ్మ ధైర్యానికి అభయము ఎవడు
కొమురయ్య కొరమీసానికి పౌరుషం ఎవ్వడు
కమలమ్మ గాత్రానికి కరతాళము ఎవడు
ఎవడురా !
రొమ్ములు పిండిన దొరల గుండెలు
చీల్చిన ధీరుడు ఎవడురా!
మానము దోసిన దొంగల
ప్రాణము తీసిన వీరుడు
స్వరాజ్యం గొంతుగా,
మాటల తూటాలు పేల్చినది ఎవడు.
ఆరుట్ల అడుగులకు బాటలు వేసినది ఎవడు
రావి నారాయణ మేధస్సుకు
ఉషస్సులు ఊదినది ఎవడు.
భీమిరెడ్డి కార్యములకు కారణభూతుడు
ఎవడు - ఎవడురా!
మత భూతమును ఒక వైపున
దొరల దోపిడిని మరొకవైపున
ఒక్కపెట్టున తుదముట్టించ
తలపెట్టిన శూరుడు
ఎవడురా!
పేదరికమును ఒకవైపున
అసమానతలను మరొకవైపున
అంతముసేయగా
అరుణారుణ కాంతులు పంపిన సూర్యుడు
ఎవడురా- ఎవడురా!
ఎవడురా- విమోచన ఉద్యమకారుడు
ఎవడురా -విముక్తి పోరాట యోధుడు
గుండెలు బద్దలయ్యేలా,
నిజము కుండబద్దలు కొట్టరా
వీరతెలంగాణ బిడ్డవు
నీవు కదరా, సోదరా!

- డాక్టర్ చందా అప్పారావు

విశ్వగురువు మౌనం

భారత మాతాకీ జై
మన మణిపూర్ మంటల్లో కాలిపోనీయ్

భారత మాతాకీ జై జై
మన బిడ్డల్ని నగ్నంగా ఊరేగించనియ్

సైన్స్ పాఠాలు పీకేసి రాతియుగంవైపు సాగేవాళ్ళం
ఆటవికం మాకేమీ అసహజం అనిపించదు

ఒకేరోజు ఐదు వందేభారత్ రైళ్లకు
జెండా ఊపడమే ఇక్కడ హెడ్ లైన్స్

ఒక్క మహిళ మీద వంద మంది తెగబడే విషాదం
ఇక్కడ అసలు వార్తకాలేదు

తలకాయలు తెంపి తడికకు వెళ్ళాడదీస్తే
తలలూపే ఖాళీ బుర్రలకు ఇక్కడ కొదవలేదు

నాలుగు పాదాల మీద నడవాల్సిన నాలుగోస్తంభం
నడ్డివిరగ్గొట్టుకుని నపుంసక అవతారం ఎత్తింది

కన్నెర్ర చేయాల్సిన జాతీయ మహిళా కమిషన్
వ్యూహాత్మకంగా చెవుల్లో కమలంపూలు పెట్టుకుంది

ఆదేశాలిచ్చి ఈదేశంలో మంటల్ని ఆర్పాల్సినవారు
విదేశాలకు విహారంవెళ్లి అవార్డులు తెచ్చుకున్నారు

ఇక్కడి బండారం ప్రపంచానికి పొక్కకుండా
బూచి చూపెట్టి ఇంటర్నెట్ బందు పెట్టేసాము

ఆస్తుల్ని తగలబెట్టడం మా ఇష్టం
సామూహిక హత్యాచారం మా ఇంటిముచ్చట
నగ్నంగా ఊరేగించడం మా అంతర్గత వ్యవహారం

కళ్ళుచెవులు మూసుకున్న ఇక్కడి మీడియా
నోరుపడిపోతే పక్కదేశపోడు ప్రశ్నించకూడదు

విదేశాలకు మాత్రం స్వయంప్రకటిత విశ్వగురువై
శాంతి సందేశాలు చిలుక పలుకుల్లా వల్లెవేస్తాము

భారత్ మాతాకీ జై
మతం మంటల్లో దేశం కాలిపోనియ్

- పెనుగొండ బసవేశ్వర్ కరీంనగర్
9441159615

గుడ్ జోక్

చీమల బారులా ఒక వరుస క్రమంలో
వాళ్ళ మీద దాడులు జరుగుతాయి
మాన ప్రాణాలు బూడిద అవుతాయి
అధికార దాహ అతివాద నాయకులు
చూసీచూడనట్టు కళ్ళకు గంతలు కట్టుకొని
తెలిసీ తెలియనట్టు మౌనంగా
ప్రపంచయాత్రకు బయలుదేరుతారు

దేశంలో....
మంటల్లో కాలుతున్న బాధితులు గళమెత్తి
తమ జీవించే హక్కు కోసం వీధుల్లో నినదిస్తే
నిరంకుశ రాజదండం రాజద్రోహ చట్టాల వలను
వేసి బంధించి జైలులో వేసి హింసిస్తుంది.

ఈ దశాబ్దంలో అబద్ధం నిజం అయింది
నిజం అబద్ధమై నాలుగు గోడల మధ్య ఉండిపోయింది
దోషులు బాధితులవుతున్నారు
బాధితులు దోషులై
మానసికంగా శారీరకంగా హింసించబడుతున్నారు.

నిద్రాణమై ఉన్న ప్రాచీన కాలం నాటి ఉగ్రవాదం
వికృత రూపం ధరించి దేశాన్ని అతలాకుతలం
చేసి ప్రపంచ వ్యాప్తంగా పరువు తీస్తుంది
దేశభక్తి చాటున దేశద్రోహులు మహిళలను
రోబోట్స్లా మార్చి నడి వీధులలో నడిపిస్తున్నారు
ఇదేంటని అడిగితే
అతివాదులకు ఇదో గుడ్ జోక్ అవుతుంది
మానవత్వం లేని మనిషులకు ఇదే దేశభక్తి అవుతుంది


- సయ్యద్ ముజాహిద్ అలీ
7729929807

అతడు జీవిత 'జ్ఞానం చెక్కిన శిల్పం'

"Man is the measure of all things". అన్నింటికీ మనిషే కొలమానం. నేడు భౌతికంగా మనిషిచే సృష్టించబడిన ప్రతిదీ ఒకప్పుడు తను అంతర్గతంగా ఆలోచన లోనో, ఊహలోనో సందర్శించినదే. ఆత్మహత్య అన్న అంశాన్ని వదిలిపెడితే, మనిషి పుట్టుక - మరణాన్ని నిర్ణయించుకొనే అధికారం సహజంగా ఉండదు. ఇక మిగిలింది జీవితంలో తను చేసే ప్రయాణాన్ని, మార్గాన్ని ఎన్నుకొనే స్వేచ్ఛ మాత్రమే. వెళ్ళే మార్గాన్ని ప్రభావితం చేసే వాటిలో తను పెరిగిన వాతావరణం, పెంచిన కుటుంబం కీలకమైనవైతే, చేసే ప్రయాణాన్ని ప్రభావితం చేసేది తనకున్న సంకల్పం, పట్టుదలలు. వీటిని నమ్ముకొని, అమ్ములుగా చేసుకొని ఒక నిరుపేద వ్యక్తి వేలమంది జీవితాల్లో వెలుగులు నింపాడు. అతడే తిరుపతి పాణిగ్రాహి. 'జీరో నుంచి హీరో'గా ఎదిగిన అతడి విజయగాథను మెచ్చి యండమూరి వీరేంద్రనాథ్ 'జ్ఞానం చెక్కిన శిల్పం' జీవిత చరిత్రను రాశారు.

ఒకప్పటి తెలుగు ప్రాంతమైన పర్లాకిమిడిలో 1955 జులై 24న పురుషోత్తం-వినోదిని దంపతులకు జన్మించిన తిరుపతి పాణిగ్రాహి 'ప్రాథమికో' (ప్రైమరీ స్కూల్) దశ నుండే పేదరికం కుటుంబ భారన్ని మోపింది. సరిదిద్దడానికి, సూత్రప్రాయం చెయ్యడానికి ఉపాధ్యాయుడుండని ప్రపంచంలోకి తోసివెయ్యబడ్డాడు. 'జీవితాన్ని' భుజానికేసుకొని ఎంగిలి పళ్ళాలు, టేబుల్ బల్లలు శుభ్రపరిచే హోటల్ బాయ్‌గా జీవిత పోరాటాన్ని ప్రారంభించాడు. సహజంగా వచ్చిన పేదరికం కంటే ఒకప్పుడు బతికిన కుటుంబం ఎదుర్కొనే పేదరికంలో ఎక్కువ మానసిక సంఘర్షణ ఉంటుంది. సర్వర్‌గానే కాకుండా కిళ్ళీలు, పల్లీలు కూడా అమ్మాడు. కొంతకాలం తర్వాత తనే సొంతంగా చిన్న బడ్డీకొట్టు పెట్టడం, ఎదుగుతూ వస్తున్న తమ్ముళ్ళకు, చెల్లెలకు మంచి జీవితం కోసం ఇంకా ఏదో చెయ్యాలన్న తలంపుతో వ్యాపారం సొంతంగా చెయ్యడం మొదలుపెట్టాడు. 'పాతాళ గరుడ' అనే ఆయుర్వేద మూలిక సేకరణ కోసం అడవుల్లో క్రూరమృగాలతో సహజీవనం, 'కోణార్క్ సేమియా' తయారీ కేంద్రం, రేషన్ షాపుల డీలర్‌షిప్, వ్యాపారస్తుల తూనిక-కొలతలు చక్కబెట్టడం... వంటి వాటితో పాటు మరికొన్ని కాంట్రాక్టులు ప్రభుత్వం నుంచి తీసుకొంటూ ఆర్థికంగా నిలదొక్కుకొంటూ అంచెలంచెలుగా పాణిగ్రాహి ఎదుగుతూ వచ్చాడు.

సవాళ్ళతో జీవితం మొదలైనవారికి కంఫర్ట్ జోన్ నచ్చదు. పాణిగ్రాహి కూడా అలాగే ఆర్థికంగా ఒక రంగంలో రాణిస్తున్నా అక్కడే నిలబడిపోవాలన్న ఆలోచన ఎప్పుడూ లేదు. ముఖ్యంగా తను చదువుకోవలసిన సమయంలో ఏ కష్టాలు పడవలసి వచ్చిందో అవి ఇతరులకు రాకుండా చూడడంలో నా వంతుగా అన్నట్టు తల్లి వినోదిని పేర జూనియర్ కళాశాల, మెడికల్, నర్సింగ్ కాలేజ్‌లతో పాటు పలు ప్రాంతాల్లో ఆసుపత్రుల నిర్మాణం చేసి, సమాజానికి సాయపడ్డం మొదలుపెట్టారు. ముఖ్యంగా కోవిడ్ కాలంలో వీరు చేసిన సేవకు ఒడియ ప్రజలు, ప్రభుత్వం రుణపడిపోయింది. ఇవేవో ఇప్పటివారిలా వ్యాపారమే తొలి ధ్యేయంగా మొదలుపెట్టినవి కాదు. ప్రజలకు సేవచెయ్యాలనే తలంపుతో వారి ఆర్థికస్థితిని దృష్టిలో పెట్టుకొని తక్కువ మొత్తంలో వైద్య సేవలు అందిస్తున్న సంస్థలు.



'Read on History: nothing but Biography' బెంజమిన్ డిస్రేలీ సూక్తికి అద్దంపట్టేలా ఈ జీవిత చరిత్రలో కూడా కాల ప్రవాహం నడిచే 'చరిత్ర' ఉంది. 1960-2000 మధ్య నాటి తెలుగు-ఒరియా సరిహద్దు ప్రాంతాల జీవన విధానం, ఏజన్సీ జిల్లాల్లో ఉండే ఘర్షణ, 'అన్న'ల ప్రభావం, వారు నిర్వహించే ప్రజా కోర్టులు, అప్పట్లో ఉండే మద్యం సిండికేట్ పాలసీల కోసం పడే గొడవలు, దొంగ సారా కాంట్రాక్టుల్లో ఉండే గుండాగిరి, తూకపు రాళ్ళను అదేపనిగా అరగదీయడం, కొలతలలో ఉండే తరుగుదల మోసాలు, గిరిజన ప్రాంతాల్లో ఉండే బలమైన రాజకీయ ఆధిపత్యాలు... మొదలైన ఎన్నో కోణాల్ని పాణిగ్రాహి అనుభవాల రూపంలో గమనించవచ్చు.

మనిషిని అర్థం చేసుకొన్నవారికి వ్యాపారం చెయ్యడం, రాజకీయం చెయ్యడం సులువు. పని చెయ్యడంలో నుంచే పాఠాలు నేర్చుకున్న పాణిగ్రాహి వ్యాపారంతో పాటు రాజకీయాలపైన స్థూలమైన అవగాహన పెంచుకొన్నాడు. తొలినాళ్ళలో కమ్యూనిజం వైపు ఆ తర్వాత కాంగ్రెస్, బీజు జనతాదళ్‌లో కీలకమైన వ్యక్తిగా కూడా ఎదిగారు. రాజకీయం అందరి జీవితాల్ని ప్రభావితం చేస్తుంది. ముఖ్యంగా చిత్తశుద్ధితో ఎదుగుతున్న వారిపై మరీ ఎక్కువగా ప్రభావం చూపుతుంది. ఒక దశలో రాజకీయ ప్రత్యర్థుల వల్ల సర్వం కోల్పోయి 18 నెలల పాటు జైలు జీవితం కూడా గడిపాడు. ఎన్ని సవాళ్ళతో కూడిన సందర్భాలు ఎదురైనా మొక్కవోని దీక్షతో ముందుకు ఎలా సాగాలన్న విషయాన్ని ఈ తిరుపతి పాణిగ్రాహి జీవితం చెబుతుంది.

మనిషి ఎంత సంపాదిస్తూ పోతున్నా విలువలు, కుటుంబ జీవనం, నలుగురికి సాయం చెయ్యడం లేకుండా పోతే జీవితంలో సంతృప్తి ఉండదని పాణిగ్రాహి జీవితం చూస్తే అర్థమవుతుంది. సొంత అమ్మ-నాన్నలే బరువైపోయిన కాలంలో తమ్ముళ్ళు, చెల్లెళ్ళు వారి పిల్లలందరి ఆలనాపాలన చూస్తూ వస్తుండడం ఆప్యాయత అనుబంధాలకు ఆయన ఇచ్చే ప్రాధాన్యతను తెలియజేస్తుంది.

> "తొమ్మిదేళ్ల వయసులో అమ్మ అన్నం ముద్దలు పెడితే తినాలని ఉంటుంది. ఆ వయసులో భోజన హోటల్ కౌంటర్లో కూర్చొన్నాను. పదేళ్ల వయసులో అమ్మానాన్నలతో కలిసి సినిమా చూడాలని ఉంటుంది. హాలు బయట కూర్చుని కిళ్ళీలు కట్టాను. పదమూడేళ్ళ వయసులో అమ్మ, నాన్నల దగ్గర పడుకోవాలని ఉంటుంది. అడవిలో గిరిజన తండా గుడిసెల్లో పడుకున్నాను' (పుట: 130) - 'ఒకప్పుడు ఏడుగురు కుటుంబ సభ్యులం చాలా చిన్న ఇంట్లో సర్దుకుని ఉండేవారం. ఇప్పుడు ఏడు పడగ్గదుల ఇంట్లో ఉంటున్నాము. ఒకప్పుడు పది రూపాయలకు తడుముకున్నాము. ఇప్పుడు వెయ్యిమంది విద్యార్థులకు స్కాలర్షిప్ ఇస్తున్నాము. ఇది స్వాత్కోర్ష కాదు. హోటల్లో టేబుల్స్ తుడుచుకునేవాడు జీవితంతో చేసిన కదన కుతూహల కేళి (పుట: 128)"

"తొమ్మిదేళ్ల వయసులో అమ్మ అన్నం ముద్దలు పెడితే తినాలని ఉంటుంది. ఆ వయసులో భోజన హోటల్ కౌంటర్లో కూర్చొన్నాను. పదేళ్ల వయసులో అమ్మానాన్నలతో కలిసి సినిమా చూడాలని ఉంటుంది. హాలు బయట కూర్చుని కిళ్ళీలు కట్టాను. పదమూడేళ్ళ వయసులో అమ్మ నాన్నల దగ్గర పడుకోవాలని ఉంటుంది. అడవిలో గిరిజన తండా గుడిసెల్లో పడుకున్నాను' (పుట: 130) - 'ఒకప్పుడు ఏడుగురు కుటుంబ సభ్యులం చాలా చిన్న ఇంట్లో సర్దుకుని ఉండేవారం. ఇప్పుడు ఏడు పడగ్గదుల ఇంట్లో ఉంటున్నాము. ఒకప్పుడు పది రూపాయలకు తడుముకున్నాము. ఇప్పుడు వెయ్యిమంది విద్యార్థులకు స్కాలర్షిప్ ఇస్తున్నాము. ఇది స్వాత్కోర్ష కాదు. హోటల్లో టేబుల్స్ తుడుచుకునేవాడు జీవితంతో చేసిన కదన కుతూహల కేళి (పుట: 128)" పై రెండు పేరాలు చాలు పాఠకుడు 'చదవాలన్న' ఆసక్తి పడడానికి, 'ఎందుకు చదవాలి?' ప్రశ్నకు సమాధాన పడడానికి.

ఎవరికీ జీవితం ఎప్పుడూ ఒకేలా ఉండదు. ప్రకృతిలో ఋతువుల వల్ల వచ్చే మార్పుల మాదిరినే జీవితంలో కూడా ఎత్తుపల్లాలు, గెలుపోటములు ఉంటాయి. పాణిగ్రాహి జీవితంలో బాలారిష్టాలు, సవాళ్ళు, సంతోషాలకి తగ్గట్టు ఋతువులతో ఉపమానం చేస్తూ చెప్పిన తీరు పాఠక 'బిగువు'ను కలిగిస్తుంది. విలువైన ముడిసరుకు ఉన్నా సరైన పద్ధతుల్లో సరఫరా చేస్తేనే విజయవంతంగా వినియోగ దారుడికి చేరుతుంది. జీవితంలోని స్ఫూర్తిని పాఠక ప్రమాణాలతో అందించడంలో సిద్ధహస్తుడైన యండమూరి వీరేంద్రనాథ్ 'జ్ఞానం చెక్కిన శిల్పం' జీవిత చరిత్రకు రచయితగా విలువైన న్యాయమే చేశారు. అందుకు ఆయనకి, శ్రీశైలమూర్తికి (సహకార రచయిత) తిరుపతి పాణిగ్రాహితో పాటు పాఠకలోకం కూడా కృతజ్ఞతలు తెలుపుకోవలసివుంటుంది.

- మదన మోహన్ రెడ్డి బుగడూరు
9989894308

22న 'ఘర్షణ' ఆవిష్కరణ

డాక్టర్ కొండపల్లి నీహారిణి కథల సంపుటి 'ఘర్షణ' ఆవిష్కరణ సభ ఈ నెల 22 శుక్రవారం సాయంత్రం 6గం॥కు హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని దొడ్డి కొమరయ్య హాల్‌లో నిర్వహించనున్నారు. తెలంగాణ రచయితల సంఘం, పాలపిట్ట బుక్స్ సంయుక్త ఆధ్వర్యంలో, కందుకూరి శ్రీరాములు అధ్యక్షతన నందిని సిధారెడ్డి పుస్తకావిష్కరణ చేయనున్నారు. కార్యక్రమంలో మంత్రి శ్రీదేవి, తాటిపాముల మృత్యుంజయుడు, శీలా సుభద్రాదేవి, నెల్లుట్ల రమాదేవి, వాణి దేవులపల్లి, బెల్లంకొండ సంపత్ కుమార్ ప్రసంగిస్తారు.

24న కబోది చేపల కబుర్లు ఆవిష్కరణ

తెలుగు వెంకటేష్ నాలుగో కవితాసంపుటి కబోది చేపల కబుర్లు ఆవిష్కరణ సభ ఈ నెల 24 ఆదివారం సా.6 గంటలకు హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలోని షోయబ్ హాల్‌లో నిర్వహించనున్నారు. కవి సంగమం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమా నికి కె.శివారెడ్డి, ప్రసాదమూర్తి, సత్య శ్రీనివాస్, కవియాకూబ్, మెర్సీ మార్గరెట్ హాజరు కానున్నారు.

నాగయ్య పురస్కార ఫలితాలు

ప్రముఖ స్వాతంత్ర సమర యోధుడు యం.చిననాగయ్య స్మారక జాతీయ పురస్కారానికి వ్యాసాల విభాగంలో పి.తిరుపతి రావు (రాజాం), ఎల్.ఆర్.వెంకట రమణ (అనంత పురం), కవిత్వం విభాగంలో సోంపాక సీత (భద్రా చలం), టి.నీలిమ (హైదరాబాద్), బి.జయరావు (నెల్లూరు), కథల విభాగంలో ఎన్. అనురాధ (విజయవాడ), యం. సుగుణరావు (విశాఖ పట్నం), జె. సుబ్బారావు (నూజివీడు), బి.కళా గోపాల్ (నిజామాబాద్), జీవిత చరిత్రల విభాగంలో ఎస్.డి.వి.అజీజ్ (కర్నూలు)లు ఎంపికైనట్లు చిన నాగయ్య మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధి యం.రాం ప్రదీప్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విజేతలకు అక్టోబర్‌లో తిరువూరులో పురస్కారాలని అందజేస్తామని వెల్లడించారు.

చాటువులు చమత్కారాలు-సమాలోచన జాతీయ సదస్సు

సాహితీ వార్తలు

ఏ.వి. ఆర్ట్స్, సైన్స్ అండ్ కామర్స్ కళాశాల తెలుగు శాఖ, యాద శంకర మెమోరియల్ ఫౌండేషన్ హైదరాబాద్ సంయుక్త నిర్వహణలో 'చాటువులు-చమత్కారాలు -సమాలోచన' జాతీయ సదస్సు అక్టోబర్ చివరి వారంలో రెండు రోజులు నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు దేశంలోని విశ్వవిద్యాలయ తెలుగు శాఖల ఆచార్యులనూ, తెలుగు రాష్ట్రాల డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులనూ, పరిశోధక విద్యార్థులనూ, ఆసక్తి గల అందరి నుంచి పరిశోధన పత్రాలను కోరుతున్నాం. సంగ్రహ పత్రాలు సెప్టెంబర్ 30లోపు chatuvulu.chamatkaralu.2023@gmail.com పంపించవచ్చు. వివరాలకు 9347225379, 9849071105 నందు సంప్రదించగలరు.

'రాతి గుండెలో నీళ్లు'కు డా. వేదగిరి రాంబాబు కథానికా పురస్కారం

డా. వేదగిరి రాంబాబు కథానికా పురస్కారం 2023 కి గాను దొండపాటి కృష్ణ కథా సంపుటి 'రాతి గుండెలో నీళ్లు' ఎంపికైనట్లు సింహ ప్రసాద్ సాహిత్య సమితి నిర్వాహకులు పేర్కొన్నారు. అక్టోబర్ 14న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించే సభలో పురస్కారాన్ని అందించనున్నారు. వివరాలకు 9849061668 నంబరు నందు సంప్రదించవచ్చు.

వర్తమాన జీవితాల రూపచిత్రణ : 'కొత్త కథలు - 5'


వంశీ ఆర్ట్ థియేటర్స్, హైదరాబాద్ వారు గొల్లపూడి మారుతీ రావు స్మరణలో 'కొత్త కథలు-5', 2023 సంవత్సరానికి గాను 66 మంది రచయితల కథలతో సంకలనం తెచ్చారు. సంకలనకర్తలుగా డా. తెన్నేటి సుధాదేవి, జ్యోతి వలబోజు వ్యవహరించారు. ఇందులోని కథలను మూడు భాగాలుగా చేశారు. మొదటి భాగంలో 13 మంది రచయితల కథలు, రెండవ భాగంలో 38 మంది రచయిత్రుల కథలు, చివరి భాగంలో 15 మంది ప్రవాస రచయితలు, రచయిత్రులున్నారు. ఈ చివరి భాగంలో విదేశాలలోని వారే గాక మన దేశంలో, తెలుగేతర రాష్ట్రాలలో వుండే కథకుల రచనలు కూడా వున్నాయి. ఇవి కాకుండా గొల్లపూడి వారి కథ "ఆమె" ప్రత్యేక ఆకర్షణగా ప్రారంభంలో సింహద్వార ప్రవేశం చేయిస్తుంది. కథకులందరూ లబ్దప్రతిష్టులే. కాంట్రిబ్యూషన్‌లో మహిళలదే సింహభాగం. చేయి తిరిగిన రచయిత్రులు, రచయితల కథలు చూడగానే తెలుగు పాఠకులకు, సాహితీ కారులకు వంశీ వారి సంస్థ నుండి అందిన అద్భుతమైన కానుక అన్నభావన కలుగుతుంది.

గొల్లపూడి వారి కథ 'ఆమె' ఈ సంకలనంలోని కథలన్నింటికీ భిన్నంగా ఉంటుంది. కథలో ఒక వైచిత్రి, ఒక వైయుక్తికం, రసస్ఫూర్తి కలిగించే కవిత్వమయ వాక్యాలు - "యౌవనం పొలిమేరల్లో తలవంచుకు నడుస్తున్న తారుణ్యమూర్తిగా, ఎర్రని తాంబూలచర్వణంలో తామసాన్ని కలిగించే పెద్ద ముత్తయిదువ లాగ..." అంటూ సాగుతూ పాఠకుడిని ముందుకు లాక్కెళతాయి. ఉత్తరాది నుండి తెలుగు రాష్ట్రానికి బదిలీ అయి వచ్చిన తెలుగు జంట అనుభవం ఈ కథలో satirical గా దర్శనమవుతుంది. అద్దె ఇంట్లో ప్రతిరోజు కిటికీ దగ్గర కూర్చునే భర్త ప్రవర్తనలో భార్య మార్పును గమనిస్తుంది. ఫలితంగా భర్త మీద భార్యకు అనుమానం. అతను ఎవరో 'ఆమెను' ప్రతిరోజూ అదే సమయానికి చూస్తూ సమయం గడపడం, తమ దాంపత్యానికి దెబ్బ అనే సందేహం కలుగుతుంది. చివరికి ఆమె ఎవరో కాదు సంధ్య - సంధ్యాదేవి, సాయంకాలపు ప్రకృతి కన్య అని తెలుసుకుంటుంది. Suspense విడిపోతుంది. ఇద్దరి మధ్య అనురాగం కొత్తకాంతులను పూయిస్తుంది.

కథల్లో ప్రధానంగా కథా వస్తువు మహిళల సమస్యలు, చెదిరిపోతున్న వైవాహిక సంబంధాలు, కుటుంబ వ్యవస్థతో పాటు తరిగిపోతున్న మానవ సంబంధాల మధ్య ప్రేమ వ్యక్తమవుతోంది. అలాగే మానవీయ విలువల అవసరాన్ని నొక్కి చెపుతుంది. సమాజాన్ని మాత్రమే కాదు న్యాయ వ్యవస్థను, చట్టాలను కూడా తెలుసుకోవాల్సిన అవసరాన్ని రావులపాటి సీతారామరావు కథ చెపుతుంది. రాజా రామమోహనరావు, విహారి కథలు చదివితే కొత్తతరంలో భార్యాభర్తల మధ్య వుండే పరస్పర అవగాహన రాహిత్యం, వారి ప్రవర్తన కారణంగా సంబంధాలు ఏ విధంగా విడాకుల దాకా వెళ్తున్నాయి, వాటిని ఏ విధంగా పరిష్కారించుకోవాలి అన్న విషయాలు అభివ్యక్తమవుతాయి. యండమూరి కథ కొత్త ప్రశ్నను లేవనెత్తుతుంది. స్త్రీ, భర్త ఉండగా మరో పెళ్లి చేసుకుంటే ఏమవుతుంది? మగాడు భార్య ఉండగానే రెండో పెళ్లి చేసుకుంటున్నాడు. అది సమస్య కానప్పుడు స్త్రీ భర్త వుండగానే మరో పెళ్లి చేసుకుంటే తప్పేమిటి? అన్న కూతురు ప్రశ్నకు తండ్రి ఇచ్చే సమాధానం ఆలోచింపచేస్తుంది. కథలోని ప్రశ్నను కథ ద్వారా చెప్పించడంలో కొత్తదనం వుంది. రామచంద్రమౌళి తన కథలో మొబైల్‌ఫోన్ చేతికందడంతో యువతరం పోర్నోలకు అలవాటు పడి ఏ విధంగా చెడిపోతున్నారు, ముఖ్యంగా యువతులకు సమస్యలు సృష్టించే సాధనంగా తయారయ్యిందని యువత జాగ్రత్త పడాలన్న సందేశం ఇస్తుంది. డాక్టర్ల వృత్తిలోని ఉదాత్తత, ఔదార్యం, గొప్పదనాన్ని తెలుపుతూ కె.వి.కృష్ణకుమారి కథ, స్త్రీ ధిక్కార స్వరం ఆవశ్యకతను పోల్కంపల్లి శాంతాదేవి కథ, ఆర్థికపరమైన విషయాలు కుటుంబ వ్యవస్థలోని భద్రతా వలయాలను ఛిద్రం చేసి మనుషులను ఎలా ఒంటరిగా చేస్తున్నాయో తెలిపే మణి వడ్లమాని కథ పాఠకులను ఉద్వేగానికి లోను చేస్తాయి. టెక్సాస్, అమెరికా నుండి వంగూరి చిట్టెన్ రాజు 'అనుమానప్పిశాచి' కథ సరదాగా సాగుతూ నవ్వించినా ఇన్సూరెన్స్ కంపెనీ వారి గోల, వారి ప్రశ్నల పరంపర విసుగెత్తించడంతో పాటు ఎంతగా పీడిస్తాయో, 'అమెరికొలిజన్', 'అమెరికాంప్రిహెన్సివ్' లాంటి పదాల కన్ఫ్యూషన్‌తో కస్టమర్లను ఏ విధంగా అయోమయానికి గురిచేస్తాయో తెలుపుతుంది. ఈ రకమైన సమస్యలు అమెరికాలోనే కాదు వివిధ కార్పొరేట్ లాంటి వ్యాపార సంస్థలు మన దేశంలో, తెలుగు రాష్ట్రాలలో కూడా మొదలైంది. ఒంటి బరువు తగ్గించుకునే ప్రహసనంలో కొత్త తరం యువత ఆహారపు అలవాట్లను మార్చు కోవడం వింతగా ఉంటుంది. సాంప్రదాయపు పద్ధతులు వదిలి విదేశీ ఫ్లోరా లైఫ్ ప్లాన్ అనుసరిస్తే బరువు కాకుండా బ్యాంకు బాలన్స్ మాత్రమే తగ్గడం, నీరసం వచ్చి ఆరోగ్యంపై దాని ప్రభావం పడటం నవత తిరునగరి కథ ద్వారా తెలియజేసి యువతరానికి సందేశం ఇస్తుంది. జలంధర కథలో తల్లి విమల పడిన, పడుతున్న కష్టాలు చూసి ఆమె కూతుళ్లు సానుభూతి చూపుతూ తల్లి అమాయకత్వానికి జాలిపడతారు. పెద్దల మాటలు వింటూ తన కనీస సౌఖ్యాన్ని కూడా లెక్కచేయక కుటుంబం, సంసారం అని తన వారి కోసం ఆమె చేస్తున్న త్యాగాలను విమర్శిస్తారు. సమాధానమివ్వలేని ఆమె బలహీనతను ఎత్తిచూపే ప్రయత్నం చేస్తారు.



కూతుళ్ల తెలివిగలవాళ్ళు, చురుకైనవాళ్ళు, ఆధునికతను ఒంటబట్టించుకున్న వాళ్ళు, స్వతంత్ర భావాలు కలిగివున్నవాళ్ళు. చివరికి వారి అన్ని విశేషణాలు, ఆర్థిక స్వాతంత్ర్యం వారి వైవాహిక జీవితాలను భగ్నం చేసి ఒంటరిగా చేయడంతో తల్లి సాంప్రదాయిక విలువలు ఏ విధంగా మానవ సంబంధాలను పటిష్టంగా వుంచుతాయో తెలిసి వచ్చి తల్లి గొప్పదనాన్ని, త్యాగాన్ని గుర్తించడంతో కథ ఆర్ద్రంగా సాగి మనసును కలిచివేస్తుంది. అలాగే భువన చంద్ర, తురగా జయశ్యామల, ముక్తేవి భారతి, శారదా అశోకవర్ధన్, తిరునగరి దేవకీదేవి, స్వాతి జంగా ఇంకా ఇతర కథకుల కథలు వైవిధ్యంగా వుండి చదివిస్తాయి. ఇందులోని కథలన్నీ వైవిధ్యంగా, వస్తు విస్తృతితో ఉంటూ ప్రస్తుత సమాజాన్ని, వర్తమాన జీవితాలను చిత్రిక పడతాయి. వైవాహిక బంధాలలో పొడసూపుతున్న సమస్యలు, అవి విడాకుల వరకు పోవడం అనేది వర్తమానంలో వున్న ఒక సమస్య. ఈ సమస్యను కథకులు స్పష్టంగా చూపుతూ వాటి కారణాలను వెలుగులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. యువతరం జీవితాన్ని అవగాహనలోకి తెచ్చుకొని, ఒకరినొకరు అర్థం జేసుకుంటూ ప్రేమగా, స్నేహంగా సాగిపోవాలనే సందేశం కూడా వ్యక్తమవుతోంది. ఈ సందర్భంలో, వైవాహిక జీవితంలో దంపతులు ఏ విధంగా మసులుకోవాలో, ఎలా స్నేహంగా, ప్రేమగా ఉండాలో గొల్లపూడి వారి కథ 'ఆమె' మార్గ దర్శకంగా ఉంటుంది. గొల్లపూడి వారి "ఆమె" కు వందనాలు. కథకులకు అభినందనలు. నిడివిలోనూ చిన్నగా వుండి అనవసరపు కొనసాగింపులు, పొడిగింపులు లేకుండా కథలన్నీ పాఠకులను చదివిస్తూ ఎక్కడా విసుగెత్తించవు. కథల ఎన్నికలో సంకలనకర్తల శ్రమ, శ్రద్ధ స్పష్టంగా కనబడుతుంది. అందుకు వారిని ప్రశంసించక తప్పదు. గొల్లపూడి ఆత్మీయ స్పర్శను కిరణ్‌ప్రభ తమ వ్యాసం ద్వారా అందించారు. చక్కటి కథా సాహిత్యం వెలుగులోకి రావడానికి అన్ని విధాలుగా సహకరించిన కృతి స్వీకర్త డా.ఆళ్ళ శ్రీనివాసరెడ్డి, ప్రతి యేటా విలక్షణమైన సాహిత్యాన్ని అందిస్తూ సాహితీ సేవ చేస్తున్న వంశీ ఆర్ట్ థియేటర్స్, వ్యవస్థాపకులు వంశీ రామరాజు అభినందనీయులు.



- డా. రూప్‌కుమార్ డబ్బీకార్
99088 40186

నేటి నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

- దేశ చరిత్రలో ఇప్పటి వరకు ఏడుసార్లు
- చివరగా 2017లో మోడీ సర్కారు హయాంలోనే
- ప్రస్తుత ఐదు రోజుల సమావేశాలపై రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ



న్యూఢిల్లీ : నేటి నుంచి పార్లమెంటు ఐదు రోజుల ప్రత్యేక సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ ప్రత్యేక సమావేశాలపై ఆగస్టు 31న చేసిన ప్రకటన అందరిలోనూ ఆసక్తిని రేకెత్తిస్తున్నది. ఇంత హఠాత్తుగా పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఎందుకు? మోడీ సర్కారు ఏవైనా కీలక బిల్లులను ప్రవేశపెట్టనున్నదా? ఎలాంటి చర్చకు తావివ్వకుండా తాను అనుకున్న బిల్లులను చట్టాలుగా తీసుకురావాలనుకుంటున్నదా? ఈ ఏడాది ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, వచ్చే ఏడాది భారత్‌లో లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఇప్పుడు ఈ ఐదు రోజుల ప్రత్యేక సమావేశాలు కీలకం కానున్నాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

ఐదు రోజుల పాటు జరగనున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఏం జరుగుతుందనే ఊహాగానాలు, గందరగోళం మధ్య కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ ప్రధాని మోడీకి ఇప్పటికే లేఖ రాసిన విషయం తెలిసిందే. ప్రత్యేక సమావేశాలకు ఎలాంటి ఎజెండానూ జాబితా చేయలేదని లేఖలో ఆమె ఎత్తి చూపారు.

సాధారణంగా పార్లమెంటరీ సమావేశాల ప్రారంభానికి కొన్ని రోజుల ముందు అజెండాను ప్రతిపాదించడానికి, చర్చా అంశాలపై ఒక ఒప్పందానికి రావడానికి ప్రభుత్వం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించింది. 2017లో జీఎస్టీ బిల్లును ప్రవేశపెట్టిన తర్వాత ఒక్కసారి మాత్రమే లోక్‌సభలో విశ్వాస పరీక్షను నిర్వహించేందుకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అది 2008లో మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్న సమయం కావటం గమనార్హం. రాష్ట్రాలలో రాష్ట్రపతి నియమాలను పొడిగించేందుకు రెండుసార్లు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేశారు. కానీ ఎక్కువగా, జాతీయ ప్రాముఖ్యత కలిగిన అంశాల విషయంలో ప్రత్యేక సెషన్‌లు ఉపయోగించబడ్డాయి.

పార్లమెంటు ప్రత్యేక సెషన్ అంటే ఏమిటి

పార్లమెంటు సమావేశాలను నిర్వహించే అధికారాన్ని రాజ్యాంగం ప్రభుత్వానికి ఇచ్చింది. పార్లమెంటరీ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సెషన్‌ను పిలవాలనే నిర్ణయాన్ని తీసుకుంటుంది. పార్లమెంటు సభ్యులను (ఎంపీలు) రాష్ట్రపతి పేరుతో పిలిపిస్తారు. భారత రాజ్యాంగం పార్లమెంట్ యొక్క "ప్రత్యేక సెషన్" అనే పదాన్ని ప్రస్తావించలేదన్నది గుర్తించాల్సిన అంశం. ఆర్టికల్ 85(1)లోని నిబంధనల ప్రకారం ప్రభుత్వం ప్రత్యేక సెషన్‌గా పిలవబడేది కూడా అన్ని సెషన్‌ల కింద నిర్వహించబడుతుంది.

పార్లమెంటులో స్థిరమైన క్యాలెండర్ లేదు

భారత పార్లమెంటుకు ఇప్పటికీ నిర్ణీత సెషన్ షెడ్యూల్ లేదు. ఫిబ్రవరి 1 నుంచి మే 7 వరకు బడ్జెట్ సమావేశాలు, జులై 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు వర్షాకాల సమావేశాలు, నవంబర్ 5 నుంచి డిసెంబర్ 22 వరకు శీతాకాల సమావేశాలు నిర్వహించాలని 1955లో లోక్‌సభ కమిటీ ప్రతిపాదించింది. కానీ ఈ క్యాలెండర్ ఎప్పుడూ ఉపయోగించబడలేదు.

ప్రత్యేక సమావేశాలు ఎందుకు?

"ప్రత్యేక సెషన్" అనే పదబంధం రాజ్యాంగంలో ప్రత్యేకంగా ఉపయోగించబడలేదు. అయితే ఇది సాధారణంగా ముఖ్యమైన శాసన లేదా జాతీయ సంఘటనలను స్మరించుకోవడానికి పరిపాలన ద్వారా పిలువబడే సెషన్‌లతో ముడిపడి ఉంటుంది. ఇప్పటి వరకు ఏడు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరిగాయి.

ఏడు ప్రత్యేక సమావేశాలు ఇలా..

ఏడింటిలో, మూడు జాతీయ ప్రాముఖ్యత కలిగిన సంఘటనలు, రెండు తమిళనాడు, నాగాలాండ్ (1977), హర్యానా (1991)లో రాష్ట్రపతి పాలనపై ఉన్నాయి. మిగిలిన రెండింటిలో, 2008లో మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు విశ్వాస పరీక్షను నిర్వహించడానికి ఒక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. చివరగా 2017లో మోడీ సర్కారు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించింది.

బీజేపీని గద్దెదించండి

సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో పిలుపు

- ఇండియా ఫోరమ్ బలోపేతం, విస్తరణకు నిర్ణయం

న్యూఢిల్లీ : భారత రిపబ్లిక్, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకిక వ్యవస్థలు, ప్రజల ప్రాథమిక హక్కులు, పౌరహక్కుల పరిరక్షణ కోసం బీజేపీని గద్దె దించాలని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో పిలుపునిచ్చింది. శని, ఆది వారాల్లో న్యూఢిల్లీలో జరిగిన పొలిట్‌బ్యూరో సమావేశం కేంద్రంతో పాటు, వివిధ రాష్ట్రాల్లో కూడా బీజేపీని గద్దెనుంచి దించడం ద్వారానే వ్యవస్థల పరిరక్షణ సాధ్యమవుతుందని తెలిపింది. దీనికోసం ప్రతిపక్షాలు ఏర్పాటు చేసుకున్న ఇండియా ఫోరమ్‌ను బలోపేతం చేయడంతో పాటు, మరింత విస్తరించాలని పేర్కొంది. పాట్నా, బెంగళూరు, ముంబయిల్లో జరిగిన ఇండియా ఫోరమ్ సమావేశాల్లో సీపీఐ(ఎం) అనుసరించిన వైఖరికి పొలిట్‌బ్యూరో ఆమోదముద్ర వేసింది. ఇండియా ఫోరమ్‌ను విస్తరించడంలో భాగంగా వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలను నిర్వహించాల్సిఉందని తెలిపింది. భాగస్వామ్య పార్టీల నాయకులు చర్చించి అన్ని నిర్ణయాలు చేస్తారని, అయితే, వాటి అమలుకు ఆటంకం కలిగించేలా నిర్మాణ రూపాలు వుండరాదని పేర్కొంది.దేశవ్యాప్తంగా వరుస బహిరంగ సభలను నిర్వహించి, ప్రజలను చైతన్యవంతం చేయాలంది.

ఒకే దేశం.. ఒకే ఎన్నికపై

'ఇది మన రాజ్యాంగంలో పొందుపరిచిన పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, ఫెడరలిజంపై బహుముఖ దాడిని చేస్తుంది. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వాన ఎనిమిది మంది సభ్యులతో ఒక కమిటీని మోడీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. లోక్‌సభతో పాటు రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు ఎలా నిర్వహించాలన్న విషయమై ఈ కమిటీ సిఫార్సు చేస్తుంది. దీనికోసం రాజ్యాంగానికి అనేక ముఖ్యమైన సవరణలు చేయాల్సివస్తుంది. దాంతో పాటు ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వాల పదవీకాలం గణనీయంగా తగ్గిపోతుంది. భవిష్యత్తులో ఏదైనా రాష్ట్ర శాసనసభలో ప్రభుత్వం మెజార్టీని కోల్పోయినప్పుడు లోక్‌సభతో కలిసిఎన్నికలు నిర్వహించడానికి ఆ ప్రభుత్వ పదవీ కాలాన్ని పొడిగించాల్సివస్తుంది. ఇది చట్ట విరుద్ధం. ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకునే అవకాశం కల్పించకుండా కేంద్ర పాలన విధిస్తే అది ప్రజాస్వామ్య వ్యతిరేకమవుతుంది. అందువల్ల ఈ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు పేర్కొంది,

అదానీ అవినీతిపై ..

అదానీ గ్రూప్ తన కంపెనీల స్టాక్ ధరలను తారుమారు చేయడంపై తాజా సాక్ష్యాలు వెల్లడైన నేపథ్యంలో దీనిపై లోతైన విచారణ జరపాలని పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. ఈ విషయంలో సుప్రీంకోర్టు జోక్యాన్ని కోరింది. వార్తపత్రికల్లో వచ్చిన కథనాలు వినోద్ అదానీకి చెందిన ఇద్దరు సన్నిహితులు బెర్ముడాలో పెట్టుబడి నిధిని ఎలా సమీకరించారని ప్రశ్నించింది. అదానీ కంపెనీల్లో మిలియన్ డాలర్ల షేర్లను కొనుగోలు చేయడానికి షెల్ కంపెనీలను ఎలా ఏర్పాటు చేశారో వివిధ పత్రికలు వెల్లడించాయనీ పేర్కొంది. ఈ వ్యవహారంపై 2014 వరకు అనేక వివరాలు సేకరించిన సెబి మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విచారణను పక్కనపెట్టినట్లు వచ్చిన కథనాలను ప్రస్తావించింది.

ఈసీల నియామకంపై...

'ఎన్నికల కమిషనర్ల నియామకం, సంబంధిత అంశాలకు సంబంధించిన ముసాయిదా బిల్లును మోడీ సర్కారు ఇటీవల సర్క్యులేట్ చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్‌లను.. ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, భారత ప్రధాన న్యాయమూర్తి తో కూడిన ఎంపిక కమిటీ నియమించాలంటూ సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును ఈ బిల్లు తోసిపుచ్చింది. ఈ బిల్లును పార్లమెంటు ప్రత్యేక సెషన్‌లో ఆమోదించడం ద్వారా ప్రధాన న్యాయమూర్తి స్థానంలో ప్రధానమంత్రి నామినేట్ చేసే కేంద్ర క్యాబినెట్‌మంత్రితో భర్తీ చేయనున్నారు. ఇది ఎన్నికల కమిషన్‌పై ప్రభుత్వ ఆధిపత్యానికి దారితీస్తుంది. ఇది అప్రజాస్వామికమైనది. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలను నిర్వహించాలనే రాజ్యాంగ ఆదేశాన్ని బలహీనపరుస్తుంది" అని వివరించింది. ఈ బిల్లును రాజ్యసభలో వ్యతిరేకించి ఓడించాలని ఇండియా ఫోరమ్‌లోని అన్ని పార్టీలను కోరింది.

జమ్ముకాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిపై

జమ్మూకాశ్మీర్‌లోని అనంత్‌నాగ్‌లో ఇటీవల ఉగ్రవాద దాడిలో మరణించిన కల్నల్ మన్‌ప్రీత్‌సింగ్, మేజర్ అశిష్ దోన్‌చాక్, డిఎస్‌పి హుమాయున్ ముజుమల్ భట్‌కు పొలిట్‌బ్యూరో శ్రద్ధాంజలి ఘటించింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. కాశ్మీర్‌లో శాంతి, సాధారణ పరిస్థితులు నెలకొన్నాయన్న మోడీ ప్రభుత్వ వాదనల్లోని డొల్లతనాన్ని ఈ దాడి బహిర్గతం చేసిందని పేర్కొంది.

త్రిపురలో ప్రజాస్వామ్యం ఖూనీ

త్రిపురలో ప్రజాస్వామ్యం హత్యకు గురైందని పొలిట్‌బ్యూరో ఆందోళనను వ్యక్తం చేసింది. సెప్టెంబర్ 5న రెండు త్రిపుర అసెంబ్లీ నియోజకవర్గాలకు జరిగిన ఉప ఎన్నికల్లో అధికార బీజేపీ పూర్తిస్థాయిలో రిగ్గింగ్ చేసిందని తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు, చట్టాన్ని అమలు చేయాల్సిన వ్యవస్థలో ప్రత్యక్ష పర్యవేక్షణలో అసాధారణ స్థాయిలో భయోత్పాతాలను సృష్టించారని పేర్కొంది. ఈ ఎన్నికలను రద్దు చేసి, పటిష్ట చర్యల మధ్య తిరిగి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేసింది.

జీ-20 పై ....

జీ-20 సమ్మిట్ తర్వాత మోడీ తనను తాను 'గ్లోబల్ సౌత్' నాయకుడిగా చెప్పుకుంటున్నారని,అదే సమయంలో గ్లోబల్ సౌత్ దేశాలు క్యూబాలోని హవానాలో నిర్వహించిన సమ్మిట్‌కు హాజరు అవుతానని ప్రకటించిన భారత విదేశాంగ మంత్రి గైర్హాజరయ్యారని పేర్కొంది. ఈ చర్య ద్వారా భారత్ అమెరికాకు మరింత విధేయ భాగస్వామి అయిందని తెలిపింది. గ్లోబల్ సౌత్ దేశాల సమావేశాలకు కనీసం మంత్రిని కూడా పంపలేని ప్రభుత్వాధినేత గ్లోబల్ సౌత్ నాయకుడు ఎలా అవుతాడని పొలిట్‌బ్యూరో ప్రశ్నించింది.

మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదించాలి

అఖిలపక్ష భేటీలో ప్రతిపక్ష పార్టీలు

- నేటి నుంచి పార్లమెంట్ సమావేశాలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఐదు రోజుల పాటు జరిగే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదించాలని ప్రతిపక్ష రాజకీయ పార్టీలు డిమాండ్ చేశాయి. ఆదివారం నాడిక్కడ పార్లమెంట్‌లో లైబ్రరీ భవన్ లో కేంద్ర ప్రభుత్వం అఖిల పక్ష సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో మహిళ రిజర్వేషన్ బిల్లుపై మెజార్టీ రాజకీయ పార్టీలు బలంగా లేవనెత్తాయి. వివిధ పార్టీల నేతలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బిల్లును ప్రవేశపెట్టాలని, ఏకాభిప్రాయంతో ఆమోదం పొందించాలని కోరాయి.

సమావేశానంతరం కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ మహిళ రిజర్వేషన్ బిల్లు కోసం పార్టీల డిమాండ్‌పై తగిన సమయంలో తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. కాశ్మీర్‌లో ప్రాణత్యాగం చేసిన భద్రతా దళాల సిబ్బందికి అఖిలపక్ష సమావేశంలో నివాళు లుఅర్పించినట్టు మంత్రి తెలిపారు.

సీపీఐ(ఎం) ఎంపీ వి శివదాసన్ మాట్లాడుతూ కార్మికులు, రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. వారి సమస్యలపై చర్చించాలి. ఎన్‌టీసీ మిల్లు కార్మికులు జీతాలు లేకుండా అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యను విడిగా పరిగణించాలి. కొత్త పార్లమెంటు భవనంలో ఉపరాష్ట్రపతి జాతీయ జెండాను ఎగురవేసినట్టు ప్రకటన హిందీలో మాత్రమే అందుబాటులో ఉంది. భారతదేశ వైవిధ్యాన్ని పూర్తిగా తిరస్కరించే ఇలాంటి వైఖరిని సరిదిద్దాలని శివదాసన్ డిమాండ్ చేశారు. సమావేశానికి అధ్యక్షత వహించిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడుతూ.. హిందీ అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు.

మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌదరి మాట్లాడుతూ ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే మహిళ బిల్లు ఆమోదం పొందాలని అన్ని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయని అన్నారు. ఇది పార్లమెంటు సాధారణ సమావేశమని ప్రభుత్వం తమకు తెలియజేసిందని చౌదరి అన్నారు. "దాని ఉద్దేశం ఏమిటో ప్రభుత్వానికి మాత్రమే తెలుసు. ఇది ఏదైనా కొత్త ఎజెండాతో అందరినీ ఆశ్చర్యపరుస్తుంది" అని ఆయన అన్నారు, ధరల పెరుగుదల, నిరుద్యోగం, చైనాతో సరిహద్దులో పరిస్థితి వంటి అంశాలను సమావేశంలో తమ పార్టీ ప్రస్తావించిందని అన్నారు.

బీజేపీ మిత్రపక్షం, ఎన్సీపీ నేత ప్రఫుల్ పటేల్ మాట్లాడుతూ.. ఈ పార్లమెంట్ సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెడితే ఏకాభిప్రాయంతో ఆమోదం పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం గణేష్ చతుర్థి శుభ సందర్భంగా పార్లమెంట్ కొత్త భవనానికి మారనున్నట్లు పటేల్ తెలిపారు. కొత్త పార్లమెంట్ భవనం నుంచి కొత్త శకం ప్రారంభం కావాలని, మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని బీజేడీ నేత పినాకి మిశ్రా అన్నారు.

అఖిలపక్ష సమావేశంలో రక్షణ శాఖ మంత్రి, లోక్‌సభ ఉపనేత రాజ్ నాథ్ సింగ్, రాజ్యసభ నేత, కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూశ్ గోయల్, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, సహాయ మంత్రులు అర్జున్ రామ్ మేఘ్వాల్, వి. మురళీధరన్, మాజీ ప్రధాని హెచ్ డి దేవగౌడ (జేడీఎస్), ఫరూక్ అబ్దుల్లా (నేషనల్ కాన్ఫరెన్స్), వైకో (ఎండీఎంకే), అధిర్ రంజన్ చౌదరి, ప్రమోద్ తివారీ (కాంగ్రెస్), తిరుచ్చి శివ, కనిమొళి (డీఎంకే), డెరిక్ ఓబ్రెయిన్ (టీఎంసీ),

శివదాసన్ (సీపీఐ(ఎం), బినయ్ విశ్వం (సీపీఐ), వి. విజయసాయి రెడ్డి (వైసీపీ), కె. రామ్మోహన్ నాయుడు, గల్లా జయదేవ్, కనకమేడల రవీంద్ర కుమార్ (టీడీపీ), కె.కేశవరావు, నామా నాగేశ్వరరావు (బీఆర్ఎస్), ప్రఫుల్ పటేల్ (ఎన్సీపీ అజిత్ పవర్ వర్గం), వందన చౌహాన్ (ఎన్సీపీ శరద్ పవర్ వర్గం), రామ్ గోపాల్ యాదవ్, ఎస్టి హసన్ (ఎస్పీ), పినాకి మిశ్రా, సస్మిత్ పాత్ర (బీజేడీ), మనోజ్ ఝూ (ఆర్జేడీ), లలన్ సింగ్ (జేడీయూ), సంజయ్ సింగ్ (ఆప్), తంబిదొరై (అన్నాడీఎంకే)

ఇదే ఎజెండా

తొలిరోజు 75 ఏండ్ల పార్లమెంట్ చరిత్రపై చర్చ జరగనుంది. మంగళవారం కొత్త పార్లమెంటు భవనానికి సమావేశాలు మారనున్నాయి. దీనికి ముందు ఎంపీల గ్రూప్ ఫోటో సెషన్ ఉంటుంది. మంగళవారం గణేశ చతుర్థి ప్రత్యేక పూజల అనంతరం కొత్త పార్లమెంట్ భవనంలో ఉదయం 11 గంటలకు సభా కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. ఇచ్చిన అంశాల కంటే వేరే ఎజెండా లేదని అఖిలపక్ష సమావేశంలో ప్రభుత్వం ప్రకటించలేదు. కొత్త పార్లమెంటుకు వెళ్లడం, వివాదాస్పద ఎన్నికల కమిషన్ బిల్లుతో సహా ఐదు బిల్లులను పరిగణనలోకి తీసుకోవడం ఎజెండాగా ఉంది. అఖిలపక్ష సమావేశంలో సర్క్యులేట్ చేసిన బిల్లుల్లో ఎన్నికల సంఘం సభ్యులను నియమించే అధికారం కేంద్రానికి పూర్తిగా కల్పించే బిల్లును చేర్చలేదు. ఈ బిల్లును పరిగణనలోకి తీసుకోవడం లేదా అని ప్రతిపక్ష సభ్యులు ప్రశ్నించగా.. పరిశీలిస్తున్నామని బదులిచ్చారు. పోస్టాఫీసు బిల్లు, న్యాయవాదుల సవరణ బిల్లు, ప్రెస్ అండ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ పీరియాడికల్స్ బిల్లు వంటి బిల్లులను కూడా ప్రత్యేక సెషన్‌లో పరిశీలిస్తారు.

బీసీ, మహిళా బిల్లుల ఆమోదానికి ఒత్తిడి పెంచుతాం :నామా నాగేశ్వరరావు

బీసీ, మహిళా బిల్లుల ఆమోదానికి ఒత్తిడి పెంచుతామని బీఆర్ఎస్ లోక్‌సభ పక్షనేత నామా నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం జరిగిన అఖిల పక్ష సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నేతలు కె.కేశవరావు, నామా నాగేశ్వరరావు వివిధ అంశాలను లేవనెత్తారు. ఈ సందర్భంగా నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ సమావేశాలు సజావుగా జరిపేందుకు, అన్ని పార్టీల వారి సంపూర్ణ సహకారం కోరుతూ కేంద్ర ప్రభుత్వం ఈ సమావేశం నిర్వహించిందన్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు పార్లమెంట్ ఉభయ సభల్లో బీఆర్ఎస్ ఎంపీలు గళం ఎత్తుతారని అన్నారు.

ఓబీసీలు, మహిళలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లులు ఆమోదించేందుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకు వస్తామని తెలిపారు. ఈ మేరకు సీఎం కేసీఆర్ ఇప్పటికే ప్రధాని నరేంద్ర మోడీకి లేఖ కూడా రాశారని అన్నారు. బీసీలు, మహిళా హక్కుల సాధనకు, వారికి సమున్నత స్థానం కల్పించేందుకు బీఆర్ఎస్ తరపున పార్లమెంట్ లో పెద్ద ఎత్తున గళం వినిపిస్తామని స్పష్టం చేశారు. బీసీ, మహిళా రెండు బిల్లులు ఈ ప్రత్యేక సమావేశాల్లోనే ప్రవేశపెట్టి, ఆమోదించేలా పోరాడతామని చెప్పారు. మిగతా అన్ని సమస్యలపైనా కేంద్రాన్ని నిలదీస్తామని నామ అన్నారు. మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్లు బిల్లుపై తెలంగాణ మొట్ట మొదటి అసెంబ్లీ సమావేశాల్లోనే ఏకగ్రీవ తీర్మానం చేసి, కేంద్రానికి పంపినా ఇంతవరకు పట్టించుకోలేదన్నారు. రాజకీయాల్లో మహిళా భాగస్వామ్యాన్ని పెంచేందుకు, వారి హక్కులు కాపాడేందుకు బీఆర్ఎస్ కట్టుబడి ఉందని చెప్పారు.

చికిత్సకని వెళ్లే.. మృతదేహం అప్పగింత

- ఇదీ వరంగల్‌లోని సత్య ఆస్పత్రి నిర్వాకం
- ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన



నవతెలంగాణ - మట్టెవాడ

వరంగల్‌లోని సత్య ఆస్పత్రిలో దారుణం చోటు చేసుకుంది. మోకాలు శస్త్ర చికిత్స చేయించుకోవడం కోసం ఆపరేషన్ థియేటర్‌కు నవ్వుకుంటూ వెళ్లిన రోగి జీవం లేకుండా దేహం తిరిగి రావడంతో రోగి బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. షుగరు, బీపీ లాంటి ఎటువంటి అనారోగ్య సమస్యలు లేని వ్యక్తిని తీసుకెళ్లి చంపి చనిపోయిన దేహాన్ని అప్పగించడంతో భగ్గుమన్న బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ ఆధ్వర్యంలో మట్టెవాడ, ఇంతేజార్‌గంజ్, మిల్స్ కాలనీల సీఐలు భారీ సంఖ్యలో ఆస్పత్రికి చేరుకొని ఆందోళనకారులకు సర్ది చెప్పేందుకు యత్నించారు. ఈక్రమంలో పోలీసులతో బాధితులు వాగ్వాదానికి దిగి తమకు న్యాయం చేయాలని ఆస్పత్రిలో బైటాయించారు. ఈ ఘటనం ఆదివారం చోటుచేసుకుంది. మృతుని భార్య అరుణ, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం..

వరంగల్‌లోని శివనగర్ ప్రాంతానికి చెందిన సిలుసాని మధుకర్(45) ప్లంబర్ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత గురువారం శివనగర్‌లోని ఒక ఇంటి వద్ద ప్లంబర్ పని చేస్తున్న క్రమంలో వర్షం కారణంగా నేల తడిసిపోవడంతో కాలు జారి కిందపడగా మోకాలుకు బలమైన గాయమయింది. దాంతో అదే రోజు బంధువులు సత్య ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో ఆస్పత్రి సిబ్బంది అన్ని పరీక్షలు నిర్వహించి మోకాలు చిప్ప ఆపరేషన్ చేయాలని ఆరోగ్యశ్రీ కింద చేర్పించుకున్నారు. ఆదివారం శస్త్ర చికిత్స నిర్వహిస్తామని చెప్పి గుండె పరీక్ష కోసం హన్మకొండలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి శుక్రవారం తరలించారు. అన్ని చక్కగా ఉండటంతో ఆదివారం ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో ఆపరేషన్ థియేటర్‌లోకి మధుకర్‌తోపాటు మరో ముగ్గురు పేషంట్లను తీసుకెళ్లారు. ఆ ముగ్గురు ఆపరేషన్ చేసుకొని బయటకి వచ్చినప్పటికీ.. మధుకర్ 3 గంటలు గడిచినా బయటకి రాలేదు. దాంతో బంధువుల్లో ఆందోళన నెలకొన్నది. వైద్యులను ప్రశ్నించగా.. ఇంకా ఆపరేషన్ చేయలేదని ఒకసారి, సీరియస్‌గా ఉందని మరొకసారి.. పొంతన లేని సమాధానాలు చెప్పారు. అంతేకాక, వైద్యులు, సిబ్బంది, కిందికి పైకి తిరుగుతూ ఉండటంతో అనుమానం వచ్చిన బంధువులు వారిని నిలదీయగా.. స్వీపర్‌తో రోగి భార్యను లోపలికి పిలిపించుకున్నారు. ఆస్పత్రి యాజమాన్యం శస్త్ర చికిత్స చేస్తున్న క్రమంలో రోగికి గుండెపోటు వచ్చి చనిపోయాడని చావు కబురు చల్లగా చెప్పారు. దాంతో ఆగ్రహించిన బంధువులు ఆందోళనకు దిగారు. పెద్ద దిక్కును కోల్పోయిన తన కుటుంబాన్ని ఆదుకునేది ఎవరని, ఇంకా ఎదగని ఇద్దరి కుమారుల భవిష్యత్తు ఎవరు చూస్తారని భార్య కన్నీటి పర్యంతమైంది. ఆస్పత్రికి చేరుకున్న పోలీసులు న్యాయం చేస్తామని మృతుని బంధువులకు సర్ది చెప్పాలని చూసినా భీష్మించుకు కూర్చున్నారు. కాగా, ఈ విషయమై ఆస్పత్రి యజమాని బొచ్చు రాధాకృష్ణను వివరాలు కోరేందుకు ఫోన్ చేసినా స్పందించకపోవడం కొసమెరుపు.

కేసీఆర్ వల్లనే కృష్ణా జలాల్లో వాటా తగ్గింది

- విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తే ఏం పోయేది
- కేసీఆర్ కాసీం రజ్వీలాంటోడు...అమిత్‌షా అభినవ పటేల్ :

మీడియాతో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీఎం కేసీఆర్ తీరు వల్లనే కృష్ణా జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన వాటా తగ్గిందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తే ఏమి పోయేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆదివారం పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన విమోచన దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ నిజాం సమాధి వద్ద మోకరిల్లారని విమర్శించారు. కేసీఆర్ కాసీం రజ్వీ లాంటోడన్నారు. అమిత్‌షా అభినవ సర్దార్ వల్లభబాయి పటేల్ అని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వమే గతేడాది నుంచి ఉత్సవాలు నిర్వహిస్తున్నదన్నారు. కేసీఆర్ కంటే ముందే బీజేపీ ఒక్కఓటు రెండు రాష్ట్రాల తీర్మానం చేసిందన్నారు. చంద్రబాబు నాయుడు మంత్రి పదవి ఇవ్వకపోతే కేసీఆర్‌కు తెలంగాణ ఉద్యమం గుర్తొచ్చిందన్నారు. ఈఎస్ఐ, సహారా స్కామ్‌లలో ఇరికిన సీఎం కేసీఆర్‌ను మన్మోహన్ సింగ్ రాజీనామా చేయమనగానే మళ్లీ జై తెలంగాణ నినాదం ఎత్తుకున్నారని విమర్శించారు. తెలంగాణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టినప్పుడూ, ఓటి సమయంలోనూ ఆయన లేరని గుర్తుచేశారు. ఎంతో మంది ప్రాణ త్యాగాలు చేయడం వల్ల తెలంగాణ సిద్ధించిందన్నారు. మంత్రి పదవి కోసం తన కొడుకు పేరును కేటీఆర్ అని మార్చుకున్న చరిత్ర కేసీఆర్‌ది అని విమర్శించారు. కొడుకు కేటీఆర్, కూతురు కవితపైనా అనేక ఆరోపణలు, కేసులున్నాయన్నాని చెప్పారు.

నిజాం లొంగుబాటు... ప్రజలు సాధించిన విజయం

హైదరాబాద్‌కూ ఆగస్టు 15నే స్వాతంత్ర్యం

- సెప్టెంబర్ 17న ప్రజాస్వామ్యబద్ధంగా భారత్‌లో విలీనం
- ముస్లిం రాజును పతనం చేశామంటూ పటేల్ ప్రకటించలేదు
- ఎస్వీకే సభలో ప్రొఫెసర్ ఇనుకొండ తిరుమలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారతదేశంతోపాటు హైదరాబాద్ సంస్థానానికీ 1947, ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చిందని చరిత్ర అధ్యాపకులు, ఢిల్లీ విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ ఇనుకొండ తిరుమలి అన్నారు. అయితే 1948, సెప్టెంబర్ 17 వరకు ప్రజాస్వామ్యబద్ధంగా ప్రక్రియ సాగిందనీ, భారత్‌లో హైదరాబాద్‌ను నిజాం నవాబు విలీనం చేశారని చెప్పారు. ముస్లిం అయిన నిజాం రాజును పతనం చేశామంటూ అప్పటి కేంద్ర హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఎక్కడా ప్రకటించలేదని గుర్తు చేశారు. అయితే నల్లగొండ, వరంగల్ జిల్లాల్లోని ప్రజలు తిరుగుబాటు చేయకపోతే నిజాం లొంగేవారు కాదన్నారు. భారత సైన్యం, కమ్యూనిస్టుల పోరాటానికి మధ్య నిజాం నలిగిపోయారనీ, అందుకే విలీనం చేశారని వివరించారు. ఇది ప్రజలు సాధించిన ఘనవిజయమన్నారు. 'హైదరాబాద్ విలీనం-వాస్తవాలు'అనే అంశంపై సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో ప్రత్యక్ష సభను నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమలి మాట్లాడుతూ సెప్టెంబర్ 17 స్వాతంత్ర్యోద్యమం కాదన్నారు. పాకిస్తాన్, భారత్ రెండు రాజ్యాలుగా విభజించి బ్రిటీష్ వారు స్వాతంత్ర్యం ప్రకటించారని గుర్తు చేశారు. హైదరాబాద్ సంస్థానం స్వతంత్రంగా ఉందంటూ బ్రిటీష్ వారికి నిజాం లేఖ రాశారని అన్నారు. అయితే సంస్థానాలు స్వతంత్రంగా ఉండొద్దనీ, ఏదైనా రాజ్యంలో చేరాలంటూ బ్రిటీష్ వారు తిరిగి సమాధానమిచ్చారని చెప్పారు. ముస్లిం దేశం కాబట్టి పాకిస్తాన్‌లో చేరాలంటూ జిన్నా నిజాంను విజ్ఞప్తి చేశారని అన్నారు. తన రాజ్యంలో ఎక్కువ మంది ప్రజలు హిందువులు కాబట్టి భారత్‌లో చేరతానంటూ నిజాం చెప్పారన్నారు. అయితే నిజాం పాలనకు వ్యతిరేకంగా ప్రజలు తిరుగుబాటు చేశారని వివరించారు. ఇంకోవైపు రజాకార్లు ప్రజలపై దాడులు,



అకృత్యాలు చేశారని చెప్పారు. దీంతో అధికారమంతా రజాకార్ల చేతిలో ఉందంటూ నిజాం చెప్పడంతో భారత సైన్యం దిగిందని వివరించారు. 1948, సెప్టెంబర్ 17న నిజాం లొంగిపోయి హైదరాబాద్ సంస్థానాన్ని భారత్‌లో విలీనం చేసేందుకు అంగీకరించారని అన్నారు. ఆ తర్వాత నిజాంను రాజ్‌ప్రముఖ్‌గా నియమించారని చెప్పారు. ఆధిపత్యం నుంచి ప్రజాస్వామ్య తెలంగాణ ఏర్పాటు చేశారని వివరించారు.

కమ్యూనిస్టుల్లేకుంటే నిజాం లొంగేవారా? : పశ్యపద్మ

సామాన్యులు, రైతులు, మహిళలపై దాడులు, అకృత్యాలు జరిగాయని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ అన్నారు. జాగీర్దారీ, జమీందారీ, నిజాం పాలనకు వ్యతిరేకంగా ప్రజలు ఆయుధాలు పట్టి పోరాడారని గుర్తు చేశారు. కమ్యూనిస్టుల పోరాటం లేకుంటే నిజాం లొంగేవారా?అని ప్రశ్నించారు. ఇది ముస్లిం రాజుకు వ్యతిరేకంగా సాగిన పోరాటమంటూ బీజేపీ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. షేక్‌బందగీ, షోయబుల్లాఖాన్‌ను రజాకార్లు చంపారని గుర్తు చేశారు. ఇది హిందూ, ముస్లింల మధ్య గొడవ కాదనీ, పీడన, అణచివేత, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా సాగిందన్నారు. ఇది జాతీయ సమైక్యతా దినోత్సవం కాదని చెప్పారు. తెలంగాణ విలీన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా జరపాలని డిమాండ్ చేశారు. సాయుధ పోరాటంలో బీజేపీ, బీఆర్ఎస్‌కు ఎలాంటి పాత్ర లేదన్నారు. ఉద్యమ వారసులు కమ్యూనిస్టులేనని స్పష్టం చేశారు. సాయుధ పోరాట చరిత్ర వాస్తవాలను ప్రజలకు అందించేందుకు కమిటీ వేయాలని డిమాండ్ చేశారు.

విమోచన పేరుతో బీజేపీ రాజకీయం : నంద్యాల నర్సింహారెడ్డి

విమోచన పేరుతో బీజేపీ రాజకీయం చేస్తున్నదని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నంద్యాల నర్సింహారెడ్డి విమర్శించారు. చరిత్రను వక్రీకరించి రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నదని చెప్పారు. ముస్లిం రాజు నుంచి హిందువులకు విమోచన వచ్చిందంటున్న బీజేపీ, కాశ్మీర్‌లో హిందూ రాజు నుంచి ముస్లిం ప్రజలకు విమోచన వచ్చిందంటూ ఎందుకు చెప్పడం ప్రశ్నించారు. బీజేపీ ప్రమాదాన్ని ప్రజలంతా గుర్తించాలనీ, అవకాశవాద రాజకీయాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఇప్పుడు దేశం సమైక్యంగా లేదా?అని ప్రశ్నించారు. హిందూ, ముస్లింల ఓట్ల కోసమే బీఆర్ఎస్ జాతీయ సమైక్యత పేరుతో వేడుకలు నిర్వహిస్తున్నదని చెప్పారు. ఎస్వీకే ట్రస్టు సభ్యులు సి సాంబిరెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఎస్వీకే ప్రతినిధి జి బుచ్చిరెడ్డి, ఎం సోమయ్య, టీపీఎస్‌కే అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బలోపేతానికి ఐక్యంగా కృషి చేయాలి

- మహారాష్ట్ర ఇన్‌చార్జి కల్వకుంట్ల వంశీధర్ రావు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహారాష్ట్రలో బీఆర్ఎస్ పార్టీనీ బలోపేతం చేయటానికి ఐక్యంగా కృషి చేయాలని ఆ పార్టీ మహారాష్ట్ర ఇన్‌చార్జి కల్లకుంట్ల వంశీధర్ రావు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ కొంకణ విభాగం సమన్వయకర్త దిగంబర్ విశేసర్ సంస్మరణ సభను ముర్బాడ్ తాలుకా కుణిబి సమాజోన్నత మండలి హాలులో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వంశీధర్‌రావు మాట్లాడుతూ విశేసర్ గొప్ప దార్శనికుడనీ, ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయులుగా, ఎమ్మెల్యేగా గ్రామీణ ప్రాంత ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని గుర్తు చేశారు. విశేసర్ కుటుంబానికి పార్టీ బాసటగా ఉంటుందని ప్రకటించారు.

ఏంటిది?

- పార్టీని పక్కకు పెట్టి ఇమేజి కోసం పాకులాటా?
- ముగ్గురు మధ్యలో సఖ్యత లేకపోతే కష్టం
- అధికారంలోకి ఎలాగూ రాలేం.. కాంగ్రెస్ గెలిస్తే మనకే నష్టం
- గట్టిగా 15 నుంచి 20 స్థానాలపై దృష్టి పెట్టండి : కిషన్‌రెడ్డి, ఈటల, బండికి అమిత్‌షా క్లాస్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'అసలే ఎన్నికల కాలం..ఏంటిది? పార్టీ ప్రయోజనాలను పక్కనబెట్టి సొంత అజెండాలతో ముందుకు పోవడమేంటి? మీ ముగ్గురి మధ్య సఖ్యత ఎందుకు దెబ్బతింటోంది? అధికారంలోకి రాకపోయినా సరే గట్టిగా 15 నుంచి 20 స్థానాలు దక్కేలాగైనా దృష్టి పెట్టండి..అలాగైతేనే బీఆర్‌ఎస్‌ను గుప్పిట్లో పెట్టుకోగలం. లేకుంటే కష్టమే! కాంగ్రెస్ గెలిస్తే అంతిమంగా మనకే నష్టం..కలిసిపొండి..మంచి ఫలితాలు సాధించండి..మీకు ఏం చేయాలి? ఏ పదవి ఇవ్వాలి? అనేది పార్టీ చూసుకుంటుంది..'అంటూ రాష్ట్ర బీజేపీ కీలక నేతలు కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్, బండి సంజయ్‌లకు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా హితబోధ చేసినట్టు తెలిసింది. పార్టీని గాడిలో పెట్టాల్సిన కీలక నేతలే ఇలా గాడి తప్పడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో తలపెట్టిన తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకల్లో షా ఆదివారం పాల్గొన్నారు. అనంతరం జూబ్లీహిల్స్‌లోని సీఆర్పీఎఫ్ ఆఫీసర్ల అతిథిగృహంలో ఆ ముగ్గురితో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. కేవలం పార్టీ ప్రయోజనాలపై దృష్టిపెట్టాలని అమిత్ షా వారికి అల్టిమేటం జారీ చేసినట్టు తెలుస్తోంది. చేరికల కమిటీ చైర్మెన్‌గా ఉన్న ఈటలకు, పార్టీ అధ్యక్షులుగా ఉన్న కిషన్‌రెడ్డికి మధ్య చేరికల విషయంలో గ్యాప్ రావడంపైనా గుస్సా అయినట్టు సమాచారం. అదే సమయంలో ఈనెల 26 నుంచి బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో బండి, ఈటల, కిషన్‌రెడ్డిల నేతృత్వంలో మూడు ప్రాంతాల నుంచి మూడు బృందాలుగా తలపెట్టిన బస్సు యాత్రలకు కూడా ఆయన అడ్డుకట్ట వేసినట్టు తెలిసింది. వచ్చే లోక్‌సభ ఎన్నికలు బీజేపీకి చాలా కీలకం కానున్న నేపథ్యంలో కలిసికట్టుగా పార్టీని ముందుకు తీసుకెళ్లాలని దిశానిర్దేశనం చేసినట్టు తెలిసింది. ఉత్తరాదిలో బీజేపీకి క్రమేణా పట్టు తగ్గుతుండటంతో రానున్న కాలంలో ప్రాంతీయ పార్టీల పాత్ర కీలకం కానున్నది. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ అవసరం మనకుంటుందనీ, తెలంగాణలో బీజేపీ నేతలు కలిసికట్టుగా పనిచేయాలనీ, లేకుంటే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించినట్టు తెలిసింది. తెలంగాణలో కనీసం 15 నుంచి 20 ఎమ్మెల్యే స్థానాలే లక్ష్యంగా ఇప్పటి నుంచే పక్కా ప్రణాళిక రూపొందించుకుని ముందుకెళ్లాలనీ, బీఆర్‌ఎస్‌కు బీజేపీ అవసరం సృష్టించాలని ఆదేశించినట్టు తెలిసింది. ఇలాగైతేనే బీఆర్‌ఎస్ ఎంపీలు ఎన్‌డీఏ కూటమికి మద్దతిస్తారని కూడా స్పష్టం చేసినట్టు సమాచారం. ఏదేమైనా తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాకుండా చూడాలనీ, అందుకు రాష్ట్రంలోని నేతలంతా కలిసికట్టుగా పనిచేయాలని ఆదేశించారు. కాంగ్రెస్ బలం పెరిగితే అంతిమంగా మనకే నష్టమని అమిత్‌షా హెచ్చరించినట్టు తెలిసింది.

అంగన్‌వాడీల డిమాండ్లు పరిష్కరించకపోతే..

- ప్రభుత్వం పతనం తప్పదు : సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జే వెంకటేష్
- అక్రమ నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు : కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్‌వెస్లీ
- కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె



నవతెలంగాణ- విలేకరులు

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కారం చేయకపోతే ప్రభుత్వం పతనం తప్పదని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్ అన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ టీచర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్న సమ్మె దీక్షలు ఆదివారం కొనసాగాయి. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శిబిరాన్ని వెంకటేష్ సందర్శించి మాట్లాడారు. అంగన్‌వాడీ సమ్మెపై ప్రభుత్వం విధానం మారాలని, సమస్యలను పరిష్కారం చేసి సమ్మె విరమణకు చర్యలు తీసుకోవాలని లేకుంటే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా అమన్‌గల్‌లో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శిబిరాన్ని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు సందర్శించి వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆకలి మంటలతో చెలరేగే ఉద్యమాలను అక్రమ నిర్బంధాలతో ఆపలేరని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా అంగన్‌వాడీలు చేపడుతున్న నిరవధిక సమ్మె తమ సమస్యలు పరిష్కారం అయ్యేవరకూ కొనసాగుతుందని స్పష్టం చేశారు. కాగా, శనివారం ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా అక్రమంగా సీఐటీయూ నాయకులతో పాటు అంగన్‌వాడీ టీచర్లను, హెల్పర్లను పోలీసులు అరెస్టు చేసినందుకు నిరసనగా ఆమనగల్ పట్టణంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన ర్యాలీ నిర్వహించారు. యాచారంలో భారీ ర్యాలీ నిర్వహించి ముఖ్య కూడలిలో మానవహారం నిర్వహించారు. వికారాబాద్ జిల్లాలోని మోమిన్‌పేట, కొడంగల్‌లో మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. పరిగిలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. తాండూర్‌లో తాండూర్ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

మహేశ్ భగవత్‌కు స్మార్ట్ పోలీస్ అవార్డు

- ప్రదానం చేసిన ఎఫ్‌ఐసీసీ

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి : రాష్ట్ర సీఐడీ అదనపు డీజీ మహేశ్ భగవత్‌కు ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చాంబర్ ఆఫ్ కామర్స్ (ఎఫ్‌ఐసీసీ) స్మార్ట్ పోలీస్ అవార్డును ప్రదానం చేసింది. గతంలో రాచకొండ కమిషనర్‌గా పని చేసిన మహేశ్ భగవత్.. చౌటుప్పల్, బొమ్మలరామారం ప్రాంతాల్లోని ఇటుక బట్టీలలో పని చేస్తున్న 300కు పైగా పిల్లలను వెట్టిచాకిరి నుంచి రక్షించారు. అంతేగాక, ఒడిశా, మహారాష్ట్రకు చెందిన ఈ పిల్లలు వారి స్వంత కుటుంబాల చెంతకు చేరేవరకు తాత్కాలికంగా స్కూళ్లలో చేర్పించారు. వారి చదువులకు అవసరమైన నిధులను ఇటుక బట్టీల యాజమాన్యాల నుంచి సేకరించారు. అంతేగాక, ఆ బాలలకు ఒడిశా, మహారాష్ట్రల నుంచి టీచర్లను రప్పించి వారి స్వభాషలోనే చదువు సాగేలా చూశారు. ఇందుకు కొన్ని స్వచ్ఛంద సంస్థలు కూడా సహకరించాయి. అనంతరం, ఆ పిల్లలను ఒడిశా, మహారాష్ట్రలలోని వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. ఇందుకు గానూ, ఎఫ్‌ఐసీసీవారు ఏర్పాటు చేసిన బాలల సేఫ్టీ సెక్యూరిటీ అవార్డుల విభాగంలో మహేశ్ భగవత్ ఎంపికయ్యారు.

డెంగ్యూ పంజా

ఉమ్మడి మెదక్ జిల్లాలో సీజనల్ వ్యాధుల విజృంభన

- ఆగస్టులో 350 కేసులు.. ఈ నెలలో ఇప్పటికే 200 మంది
- పరిసరాల అపరిశుభ్రత.. దోమల వ్యాప్తి
- పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పర్యవేక్షణ గాలికి..
- ప్రయివేట్ ఆస్పత్రుల్లో దోపిడి
- సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహనలోపం



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

డెంగీ పంజా విసురుతోంది. వాతావరణ మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాల వల్ల వాతావరణంలో పెనుమార్పులొచ్చాయి. పరిసరాల అపరిశుభ్రత.. నీటి కాలుష్యం పట్ల పర్యవేక్షణ లోపించడంతో జ్వరం, జలుబు, కండ్ల కలక వంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కల్తీ ఆహారం తీసుకోవడం వల్ల బ్లడ్ ఇన్‌స్పెక్షన్‌తో పిల్లలు బాధపడుతున్నారు. కండ్ల కలకైతే నెల రోజుల పాటు పిల్లల్ని, పెద్దల్ని తల్లడిల్లేలా చేసింది. సీజనల్ వ్యాధులతో ప్రతి ఏటా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రజల్లో అవగహన కల్పించాల్సిన వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీలు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నాయి. జ్వరంతో ఆస్పత్రులకెళ్తే డెంగ్యూ పేరిట దోపిడీ చేస్తున్నారు. వారం రోజుల పాటు కురిసిన వర్షాల వల్ల వర్షపునీరు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెందాయి. వీధుల్లో, మురికి కాల్వల్లో చెత్తను తొలగించి శుభ్రం చేయడంలో పంచాయతీలు, మున్సిపాలిటీలు శ్రద్ధ చూపట్లేదన్న విమర్శ ఉంది. వృద్ధి చెందిన దోమలు కాటేయడం వల్ల డెంగ్యూ జ్వరాలు ప్రబలుతున్నాయి.

ప్రభుత్వ, ప్రయివేట్ ఆసుపత్రుల్లో జ్వరంతో బాధపడుతున్న వాళ్లు చేరుతున్నారు. రెండు మూడు రోజులైనా జ్వరం, ఒళ్లునొప్పులు తగ్గకపోయే సరికి ఆస్పత్రులకు వెళ్తున్నారు. దాంతో పరీక్షించిన వైద్యులు డెంగ్యూ పరీక్ష చేయిస్తున్నారు. డెంగ్యూ లక్షణాలు లేకపోయినా అనుమానంతో ఆస్పత్రుల్లో రోగుల్ని అడ్మిట్ చేసుకుని వైద్యం చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల రికార్డుల ప్రకారం ఈ నెల రెండు వారాల్లోనే సంగారెడ్డి జిల్లాలో 100 మంది వరకు డెంగ్యూ బారిన పడినట్టు చెబుతున్నారు. మెదక్, సిద్దిపేట జిల్లాల్లోనూ మరో వంద మంది వరకు ఆస్పత్రుల్లో చేరారు. ఇక ప్రయివేట్ క్లినిక్‌లు, ఆస్పత్రుల్లో డెంగ్యూకి వైద్యం చేయించుకుంటున్న వాళ్ల సంఖ్య లెక్కనేలేదు. ఈ నెలలో 200 వరకు డెంగ్యు కేసులు నమోదయ్యాయి. ఆగస్టులో సంగారెడ్డి జిల్లాలో 185 కేసులు, మెదక్‌లో 54, సిద్దిపేటలో 85 కేసుల వరకు నమోదయ్యాయి. పిల్లలు, పెద్దలనే తేడా లేకుండా డెంగ్యూ దోమ కాటుకు గురవుతున్నారు. పగటి పూట కుట్టే దోమ వల్ల వచ్చే డెంగీని ప్రాథమిక దశలో గుర్తించి వైద్యం చేయించుకుంటే ప్రమాదమేమీ ఉండదు. ఆలస్యం చేస్తేనే ప్లేట్‌లెట్స్ తగ్గి ప్రాణాప్రాయ పరిస్థితి ఏర్పడుతుందని వైద్యులు చెబుతున్నారు. ప్లేట్‌లేట్స్ తగ్గాయని, అవి పెరగాలంటే ఖరీదైన ఇంజక్షన్లు, మందులు వాడాలనే పేరుతో ప్రయివేట్ ఆస్పత్రుల్లో దోపిడికి పాల్పడుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్యులు సైతం తమ స్వంత ఆస్పత్రులు లేదంటే వారు పనిచేసే ప్రయివేట్ ఆస్పత్రులకు రోగుల్ని పంపుతున్నారు.

పరిసరాల పరిశుభ్రత పట్ల నిర్లక్ష్యం

దోమ కాటు వల్లనే డెంగ్యూ, మలేరియా లాంటి విషపు జ్వరాలు వ్యాపిస్తున్నాయి. దోమలు వృద్ధి చెందడానికి మురుగ నీరు నిల్వ ఉండటమే అనే అవగాహన ప్రజల్లో పెరగాల్సి ఉంది. సంగారెడ్డి, సదాశివపేట, నారాయణఖేడ్, జహీరాబాద్, అందోల్, అమీన్‌పూర్, బొల్లారం, తెల్లాపూర్, మెదక్, రామాయంపేట, నర్సాపూర్, తూప్రాన్, గజ్వేల్, చేర్యాల, సిద్దిపేట, దుబ్బాక, హుస్నాబాద్ వంటి మున్సిపాలిటీ పట్టణాల్లోనే కాకుండా మండల కేంద్రాల్లో వ్యాపారాలు విస్తరించాయి. ముఖ్యంగా వీధి వ్యాపారులు సాగుతున్నాయి. తాగి పడేసిన కొబ్బరి బొండాలు, టైర్లు, ప్లాస్టిక్ బాటిళ్ల, కవర్లు, పాత సమన్లు.. తదితరు వస్తువులను ఎక్కడపడితే అక్కడ పడేస్తుండటంతో వాటిల్లో వర్షపు నీరు చేరి నిల్వ ఉంటుంది. మురికి కాల్వల్ని కూడా రెగ్యులర్‌గా శుభ్రం చేయకపోవడం, నాలాలపై పై కప్పు ఉండటంతో వాటిని శుభ్రం చేయడమే వీలుకాకపోవడంతో దోమలు సంవృద్ధిగా వృద్ధి చెందుతున్నాయి. గ్రామ పంచాయతీల్లో మండల, మున్సిపల్, జిల్లా కేంద్రాల్లోనూ చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగిస్తున్న పరిస్థితి లేదు. రెండు మూడు రోజులు చెత్త పేరుకుపోతుంది. వర్షాలు పడిన వారం రోజుల పాటు ఎక్కడి చెత్త అక్కడే ఉండిపోయింది. వర్షపు నీటిపై దోమలు లార్వా పెట్టి తన సంతాన్ని వృద్ధి చేస్తున్నాయి. వీటిని అరికట్టేందుకు రెగ్యులర్‌గా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలి. మురికి కాల్వలు, నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో బ్లీచింగ్‌పౌడర్ చల్లడం, ఇతర రసాయనాలను స్ప్రే చేయడం ద్వారా దోమల్ని నియంత్రించాలన్న అవగాహనను ప్రజల్లో కల్పించే పని నామమాత్రంగా జరుగుతుంది.

ప్రజల్లో అవగహన కల్పిస్తున్నాం

సీజనల్ వ్యాధుల్ని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రతలు తీసుకోవాలనే విషయాల గురించి ప్రజల్లో అవగహన కల్పిస్తున్నాం. జ్వరంతో బాధపడే వాళ్లు ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి వైద్యం చేయించుకోవాలి. డెంగ్యు అయినంత మాత్రాన జనం భయపడాల్సిన పనిలేదు. వైద్యం అందుబాటులో ఉంది. పరిసరాల పరిశుభ్రత పట్ల కూడా వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీలతో కలిసి కరపత్రాలు, ఇతర రూపాల్లో ప్రచారం చేస్తున్నాం.

- డాక్టర్ గాయత్రిదేవి,
జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

తెలంగాణ సాయుధ పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తాం

- బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు సాయుధ పోరాటంతో సంబంధం లేదు
- కమ్యూనిస్టుల పోరాట ఫలితంగానే తెలంగాణకు విముక్తి :ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ గాదగోని రవి



నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ సాయుధ పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తామని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అన్నారు. ఆదివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్ బీయన్ హాల్‌లో ఎంసీపీఐ(యూ) గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి కామ్రేడ్ మైదంశెట్టి రమేష్ అధ్యక్షతన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాల ముగింపు సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో సాగిన పోరాటం మూలంగానే ప్రజలకు దోపిడీ, పీడనల నుంచి విముక్తి కలిగిందన్నారు. నిజాం పాలనలో భూములన్నీ దొరలు, జాగీర్దార్లు, జమీందార్ల చేతుల్లో ఉండేవని, వారికి వ్యతిరేకంగా భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో సాయుధ పోరాటం సాగించి పది లక్షల ఎకరాలను పేదలకు పంపిణీ చేశారని తెలిపారు. బీజేపీ వాస్తవ చరిత్రను వక్రీకరిస్తోందని విమర్శించారు. భీంరెడ్డి నర్సింహరెడ్డి, మద్దికాయల ఓంకార్, మద్దికాయల లక్ష్మక్క, బొమ్మగాని ధర్మభిక్షం, దేవులపల్లి వెంకటేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య, చిట్యాల ఐలమ్మ, దొడ్డి కొమరయ్య, మల్లు స్వరాజ్యం లాంటి కమ్యూనిస్టు యోధులు సాయుధ పోరాటానికి నాయకత్వం వహించారని గుర్తుచేశారు. ఎన్నికల్లో ఓట్ల కోసం హిందూ మతాన్ని రెచ్చగొట్టడం బీజేపీకి అలవాటుగా మారిందన్నారు. ప్రజలు అధిక ధరలు, నిరుద్యోగం, మద్దతు ధర, రాజ్యాంగ పరిరక్షణ, మహిళా రిజర్వేషన్లు, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలపై పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. అనంతరం అమరజీవి కామ్రేడ్ భీంరెడ్డి నరసింహరెడ్డి కూతురు రాజేశ్వరి మాట్లాడుతూ.. సాయుధ పోరాటానికి భీంరెడ్డి నరసింహరెడ్డి ఎంతో త్యాగం చేశారని, కమ్యూనిస్టు పార్టీలు అన్ని ఐక్యమై సాయుధ పోరాట స్ఫూర్తితో పోరాడాలని తెలిపారు. సభానంతరం ఓంకార్ భవన్ నుంచి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వరకు 'మతోన్మాదం నశించాలి.. దోపిడీ వ్యతిరేకంగా పోరాడాలి' అంటూ నినాదాలు చేస్తూ పార్టీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్, కుంభం సుకన్య, వి.తుకారాం నాయక్, రాష్ట్ర కమిటీ సభ్యులు తాండ్ర కళావతి, పి.భాగ్యమ్మ, ఏ.పుష్ప, గాదె మల్లేష్, యం.రమేశ్, టి.అనీల్ కుమార్, పి.మురళి, గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి వర్గ సభ్యులు ఇ.దశరథ్ నాయక్, యల్.రాజు, మేడ్చల్ జిల్లా కమిటీ సభ్యులు మార్టిన్, రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషనర్ స్థాయిని తగ్గిస్తారా ?



- సీనియర్ అధికారి హోదాకే పరిమితమా?
- మాజీ సీఈసీల ఆవేదన
- ప్రధానికి లేఖ రాయాలని నిర్ణయం

న్యూఢిల్లీ : ఎన్నికల కమిషనర్ల హోదాను సుప్రీంకోర్టు న్యాయమూర్తి స్థాయి నుండి ఓ సీనియర్ అధికారి స్థాయికి తగ్గిస్తూ ప్రభుత్వం తీసుకొస్తున్న బిల్లుపై మాజీ ఎన్నికల ప్రధానాధికారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన విధివిధానాలలో మార్పులు చేస్తూ రాబోయే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలలో బిల్లును ప్రతిపాదించాలని మోడీ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను, ఇతర కమిషనర్లను నియమించే విషయంలో ప్రభుత్వానికి విశేషాధికారాలు కట్టబెట్టడాన్ని గతంలో సుప్రీంకోర్టు తప్పుపట్టిన విషయం తెలిసిందే. అయితే దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పును నీరుకార్చేలా, కాలరాసేలా ప్రభుత్వం ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెడుతోంది. దీని ప్రకారం ముగ్గురు ఎన్నికల కమిషనర్ల సర్వీసు నిబంధనలను సుప్రీంకోర్టు న్యాయమూర్తి స్థాయి నుండి క్యాబినెట్ కార్యదర్శి స్థాయికి కుదించారు. ఇకపై వారికి క్యాబినెట్ కార్యదర్శి జీతభత్యాలే లభిస్తాయి.

కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై ఆవేదన వ్యక్తం చేసిన మాజీ ఎన్నికల ప్రధానాధికారులు ఈ విషయంలో ప్రధాని మోడీకి లేఖ రాయాలని నిర్ణయించారు. నూతన బిల్లు ఎన్నికల కమిషన్ స్థాయిని, దానిలోని అధికారుల స్థాయిని దిగజార్చిందని మాజీ సీఈసీ ఎస్‌వై ఖురేషీ తెలిపారు. ఎన్నికల కమిషనర్లకు ఓ సీనియర్ అధికారితో సమానంగా జీతభత్యాలు ఇస్తే ఆయన హోదా సహాయ మంత్రి స్థాయి కంటే తగ్గిపోతుందని చెప్పారు. దీనివల్ల వారు రాజకీయ నాయకులపై చర్య తీసుకోవడానికి వెనుకంజ వేస్తారని అన్నారు. అనేక దేశాలలో ఎన్నికల కమిషనర్లే న్యాయమూర్తులని గుర్తు చేశారు. ఎన్నికల కమిషనర్ల హోదా విషయంలో ఎలాంటి మార్పులు చేయవద్దని, దానిని ప్రస్తుతం ఉన్న విధంగానే కొనసాగించాలని సలహా ఇస్తూ ప్రధానికి లేఖ రాయాలని మాజీ సీఈసీలు నిర్ణయించారు. అయితే వీరి అభిప్రాయాలతో ప్రభుత్వం ఏకీభవించడం లేదు. ప్రొటోకాల్ జాబితాను సవరించాలని భావించడం లేదని, సీఈసీకి ప్రస్తుతమున్న హోదా, ప్రతిపత్తి కొనసాగుతాయని వివరించింది. వర్షాకాల సమావేశాల సందర్భంగా ప్రభుత్వం రాజ్యసభలో ఈ బిల్లును ప్రతిపాదించింది. దీని ప్రకారం... ప్రధాన ఎన్నికల అధికారి, ఇతర ఎన్నికల అధికారుల నియామక ప్రక్రియ నుండి భారత ప్రధాన న్యాయమూర్తిని తప్పించారు. నియామక కమిటీలో ప్రధాని, కేంద్ర మంత్రి, ప్రతిపక్ష నేత మాత్రమే సభ్యులుగా ఉంటారు. ఎన్నికల అధికారుల జీతాలు, ఇతర అలవెన్సులలో కూడా మార్పులు ప్రతిపాదించారు. ఈ బిల్లుపై ప్రతిపక్ష పార్టీలు మండిపడ్డాయి. ఇది రాజ్యాంగం, న్యాయ వ్యవస్థ, ప్రజల హక్కుల పైన జరిగిన దాడిగా అభివర్ణించాయి.

కేంద్రం విధానాలకు వ్యతిరేకంగా అక్టోబర్ 3న దేశవ్యాప్త 'బ్లాక్‌డే'

- ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి విజ్జూకృష్ణన్ పిలుపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ వచ్చేనెల మూడున దేశవ్యాప్తంగా 'బ్లాక్ డే' నిర్వహిస్తున్నట్టు అఖిల భారత రైతుసంఘం (ఏఐకేఎస్) ప్రధాన కార్యదర్శి విజ్జూకృష్ణన్ పిలుపునిచ్చారు. ఆదివారం కలకత్తాలో ఏఐకేఎస్ జాతీయ సమావేశాలను ఆ సంఘం జాతీయ అధ్యక్షులు అశోక్ ధావలే అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా విజ్జూ కృష్ణన్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. కనీస మద్దతు ధరల చట్టం, రుణ విమోచన చట్టం చేయలేదని చెప్పారు. విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించలేదని అన్నారు. నలుగురు రైతులు, విలేకరి మరణానికి కారణమైన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి ఆశిష్ కుమార్ మిశ్రాను మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. రైతాంగంపై అక్రమంగా బనాయించిన కేసులను ఉపసంహరించాలని కోరారు. ఈ అంశాలపై వచ్చేనెల మూడున దేశవ్యాప్తంగా బ్లాక్ డే నిర్వహించాలని ఆయన పిలుపు నిచ్చారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్ర కేంద్రాలు, జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేశంలోని అన్ని రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు, కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు.

నవంబర్ 27 నుంచి దేశవ్యాప్త నిరవధిక ధర్నాలు

నవంబర్ 26,27,28 తేదీల్లో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్ర కేంద్రాల్లో నిరవధిక ధర్నాలు నిర్వహించాలని విజ్జూకృష్ణన్ పిలుపునిచ్చారు. డిసెంబర్, జనవరిలో దేశవ్యాప్తంగా బస్సు యాత్రలు, జీపు యాత్రలు, పాదయాత్రలు, సైకిల్ మోటార్ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించి ప్రజా వ్యతిరేక మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలంటూ ప్రచారం చేపట్టాలని కోరారు. ఇందులో రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులతోపాటు ప్రజలందరూ భాగస్వాములు కావాలనీ, విద్యావంతులు, మేధావులు ఈ పోరాటానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

ఏఐకేఎస్ అఖిల భారత సహాయ కార్యదర్శి టి సాగర్ మాట్లాడుతూ తెలంగాణలో ఈ డిమాండ్లతోపాటు కౌలు రైతులకు 2011 చట్టం ప్రకారం రుణార్హత కార్డులివ్వాలనీ, అర్హులైన పోడు రైతులందరికీ 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం హక్కు పత్రాలివ్వాలనీ, పంటలు నష్టపోయిన రైతాంగానికి పరిహారం ఇవ్వడంతోపాటు రాష్ట్రంలో పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ అఖిల భారత ఉపాధ్యక్షులు హన్నన్ మొల్ల, కోశాధికారి కృష్ణప్రసాద్, నాయకులు విప్లవ్ మజుందార్, అమోల్ హల్దార్ తదితరులు పాల్గొన్నారు.

దేశంలో మూడో కూటమి ఏర్పాటుకు ఆస్కారం

- ఏఐ ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ



నవతెలంగాణ-మెహిదీపట్నం/సుల్తాన్‌బజార్

దేశంలో మూడో కూటమి ఏర్పాటుకు ఆస్కారం ఉందని, ఈ కూటమికి నాయకత్వం వహించాలని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోరుతున్నట్టు ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆదివారం జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా ఎంఐఎం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో తిరంగ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ ఆధ్వర్యంలో నాంపల్లిలోని యూసుఫియన్ దర్గా నుంచి మాసాబ్ ట్యాంక్ వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం మాసబ్ ట్యాంక్ ఈద్గా మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో అసదుద్దీన్ పాల్గొని మాట్లాడారు. ఇండియా కూటమిని తాను కేర్ చేయనన్నారు. దేశంలో రాజకీయ శూనర్యత ఉన్నదని, దాన్ని ఇండియా కూటమి భర్తీ చేయలేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇండియా కూటమిలో బీఎస్పీ అధినేత మాయావతి, తెలంగాణ సీఎం కేసీఆర్, మహారాష్ట్ర, ఈశాన్య రాష్ట్రాల్లోని ఎన్నో పార్టీలు భాగస్వాములు కాలేదని గుర్తు చేశారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా హైదరాబాద్ వచ్చి అబద్ధాలు మాట్లాడారన్నారు. ఆయనకు అసలు హైదరాబాద్ చరిత్ర తెలియదని విమర్శించారు. హైదరాబాద్ సంస్థానాన్ని దేశంలో సమైక్యం చేసే సమయంలో ఆర్‌ఎస్‌ఎస్, సంఘ్ పరివార్, బీజేపీలు ఎక్కడున్నాయని ప్రశ్నించారు. హైదరాబాద్‌ను కలపడానికి పోలీస్ చర్య జరిగిందని, పండిట్ సుందర్‌లాల్ ఇచ్చిన నివేదికలో ముస్లింలపై జరిగిన ఘటనలను వివరించారని తెలిపారు. రజాకార్ల ఏరివేత పేరుతో ముస్లింలపై జరిగిన దారుణాలు ఘటనలోని ఆ నివేదికలో ఉన్నాయన్నారు. తాము రజాకార్‌ల వారసులమని ఒకవైపు బీజేపీ, నిజాం వారసులమని మరోవైపు కాంగ్రెస్ విమర్శిస్తున్నదని అసహనం వ్యక్తం చేశారు. అది ఎంత మాత్రం నిజం కాదన్నారు. తమ పార్టీని కాసిం రిజ్వీ స్థాపించలేదని అబ్దుల్ వాహెబ్ ఓవైసీ స్థాపించారని గుర్తు చేశారు. దేశంలో బీజేపీ పని అయిపోయిందని, ప్రజలు బీజేపీకి బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఎంఐఎం పార్టీ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

ప్రధాని మోడీకి 73 ఏండ్లు

- జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్రపతి ముర్ము



న్యూఢిల్లీ: భారత ప్రధాని మోడీ 73వ సంవత్సరంలోకి అడుగుపెట్టారు. ఆయన పుట్టిన రోజు సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, కేంద్ర మంత్రులు, బీజేపీ నేతలు సహా పలువురు ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని జన్మదినం సందర్భంగా ఆదివారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు సేవా పక్షోత్సవాలను బీజేపీ నిర్వహిస్తోంది. "ప్రధాని మోడీకి పుట్టిన రోజు శుభాకాంక్షలు. ఆయన దూరదృష్టి, బలమైన నాయకత్వంతో ప్రతి రంగంలో దేశ అభివృద్ధికి మరింత కృషి చేయాలని కోరుకుంటున్నాను" అని రాష్ట్రపతి ముర్ము ట్వీట్ చేశారు. కేంద్రమంత్రులు అమిత్ షా ,రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఉత్తర ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ సహా పలువురు బీజేపీ నేతలు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రధాని మోడీకి శుభాకాంక్షలు చెబుతూ ట్వీట్ చేశారు.

పొగతో మోడీ చిత్రం..

దీపక్ బిస్వాల్ అనే కళాకారుడు దీపం నుంచి వచ్చే పొగతో మోడీ చిత్రాన్ని రూపొందించాడు. దీనిలో ప్రధాని చిత్రం వెనుక కోణ్యార్ చక్రాన్ని ఆకర్షణీయంగా చిత్రీకరించారు.

చేతివృత్తుల వారికోసం 13 వేలకోట్లతో 'పీఎం విశ్వకర్మ' పథకం

విశ్వకర్మ జయంతి సందర్భంగా చేతివృత్తుల వారి కోసం రూ.13 వేల కోట్లతో 'పీఎం విశ్వకర్మ' పథకానికి శ్రీకారం చుట్టారు. ఢిల్లీలో 73 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించిన అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్ యశోభూమి ని ప్రారంభించారు. "ద్వారకాలో యశోభూమి సమావేశ మందిరాన్ని అత్యాధునిక వసతులతో నిర్మించారు. ఈ మందిర ఫేజ్-2 ని ఆదివారం ప్రారంభించారు.

హైదరాబాద్‌లో పోటాపోటీ ర్యాలీలు



- జగన్‌కు మద్దతుగా ఐటి ఉద్యోగుల కార్ల ర్యాలీ
- చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టిడిపి అభిమానుల ఆందోళనలు

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు మద్దతుదారులు ఆదివారం పోటాపోటీగా ఆందోళనలు చేశారు. జగన్‌కు మద్దతుగా ఐటి ఉద్యోగులు కార్లతో ర్యాలీ చేపట్టగా, చంద్రబాబుకు మద్దతుగా నందమూరి సుహాసిని ఆందోళనలో పాల్గొన్నారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా హైదరాబాద్ మధురానగర్‌లో 'ఐయామ్ విత్ సిబిఎన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుహాసిని పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు మంచి విజన్ ఉన్న నాయకుడని, ఆయనను అరెస్టు చేయడం దారుణమన్నారు. ఇలాంటి అరెస్టులతో టిడిపిని ఆపలేరని, ఇంకా బలోపేతం అవుతామని చెప్పారు. ఇసిఐఎల్‌లో టిడిపి మద్దతుదారులు మౌనదీక్ష నిర్వహించారు. వనస్థలిపురంలో భారీ ర్యాలీ చేపట్టారు. ఎల్బీనగర్ బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, బిజెపి కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి తదితరులు టిడిపి అభిమానులకు సంఘీభావం తెలిపి ర్యాలీలో పాల్గొన్నారు. పనామా సర్కిల్ నుంచి ప్రారంభమైన ర్యాలీని పోలీసులు అడ్డుకోవడంతో పోలీసులు, ఆందోళనకారులకు మధ్య వాగ్వాదం జరిగింది.ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా హైదరాబాద్‌లోని ఐటి ఉద్యోగులు కీసర ఔటర్ రింగ్ రోడ్ నుంచి గచ్చిబౌలి వరకు కార్ల ర్యాలీ నిర్వహించారు. జై జగన్.. అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. స్కామ్ చేశారు కాబట్టే టిడిపి అధ్యక్షుడు చంద్రబాబు అరెస్ట్ అయ్యారని ఐటి ఉద్యోగులు అన్నారు. ఒఆర్ఆర్ కట్టింది.. ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ తెచ్చింది వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని, ఇక్కడ చంద్రబాబు చేసిన అభివృద్ధి ఏమీ లేదనీ తెలిపారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్, గచ్చిబౌలి వచ్చింది వైఎస్ఆర్ హయాంలోనేనని వారు పేర్కొన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఎల్బీనగర్ -మహేశ్వరం- చార్మినార్

సోమవారం | సెప్టెంబర్ 18, 2023 | www.navatelangana.com

ఎస్ఎస్సీ శ్రీ స్పోర్ట్స్ క్లబ్ ప్రారంభం



నవతెలంగాణ- నాగోల్

హైదరాబాద్, ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ఉప్పల్ భగాయత్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ఎస్ సీ శ్రీ స్పోర్ట్స్ క్లబ్ ను ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్కాజిగిరి ఏసీపీ నరేష్ రెడ్డి, ఐవీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస గుప్తలు హాజరై ప్రారంభించారు.

గణేష్ ఉత్సవాలకు మాజీ ఎమ్మెల్యే తీగలకు ఆహ్వానం



నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ గణనాథుని నవరాత్రి ఉత్సవాల సందర్భంగా...బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి వారు నిర్వహిస్తున్న గణేష్ ఉత్సవాలకు మహేశ్వరం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డిని ఆదివారం ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఆహ్వానించిన వారిలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు నిరంజన్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు రఘునందన చారి, కమిటీ సభ్యులు లక్ష్మారెడ్డి, ఎల్లారెడ్డి ఉన్నారు.

రక్తదానం మహాదానం : ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



నవతెలంగాణ - ఎల్బీనగర్

రక్తదానం మహాదానం అని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. లింగోజిగూడ డివిజన్ పరిధిలోని భాగ్యనగర్ కాలనీ కమ్యూనిటీ హాల్లో ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ వారు ఏర్పాటు చేసిన బ్లడ్ డొనేషన్ క్యాంపునకు మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాస రావుతో కలిసి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రక్తదానం ప్రాణదానంతో సమానం అన్నారు. ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని సూచించారు. కోవిడ్ కారణంగా రక్తదానం చేసే వారి సంఖ్య బాగా తగ్గిందన్నారు. దీనితో డిమాండ్ పెరిగింది అన్నారు. ఈ పరిస్థితి నుండి బయట పడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతుగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. దాదాపు 100 మంది ఈ రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు దేవాలయం కమిటీ ధర్మకర్తలు, లయన్స్ క్లబ్ సంస్థ సభ్యులు, కాలనీ అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్సతో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది

- వనస్థలిపురం సీఐ జలంధర్ రెడ్డి



నవతెలంగాణ-వనస్థలిపురం

మార్షల్ ఆర్ట్స్‌తో విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం, క్రమశిక్షణ పెరుగుతుందన్నారు. వనస్థలిపురం సీఐ జలంధర్ రెడ్డి అన్నారు. ఆదివారం సామ నగర్‌లోని వెల్ బిల్ట్ తైక్వాండో అకాడమీ కోచ్ అంకం రాజు ఆధ్వర్యంలో తైక్వాండో నేర్చుకుంటున్న విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ టెస్టును నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ జలంధర్ మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ వలన ఆత్మస్థైర్యం కూడా పెరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి మేడ్చల్ జిల్లా తైక్వాండో జనరల్ సెక్రటరీ డి.సుధీర్, ప్రముఖ న్యాయవాది ఎస్.వి. రమణ రావు పాల్గొన్నారు.

కరాటే విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత



నవతెలంగాణ-హయత్ నగర్

హయత్ నగర్ డివిజన్ పరిధిలోని సామ నగర్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే కలర్ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఆదివార కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాల్య దశ నుండే విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు.

ముఖ్యంగా ఆడపిల్లలు తమ ఆత్మ రక్షణ కోసం కరాటే, కుంఫు, కిక్ బాక్సింగ్ వంటివి నేర్చు కోవాలని కోరారు. నేటితరం పిల్లలకు మన తెలుగు సం స్కృతి, సాంప్రదాయాలు నేర్పించే బాధ్యత తల్లిదండ్రులదే అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ బండారి భాస్కర్, అకాడమీ నిర్వాహకులు సిద్ధార్థ యాదవ్, రాజు, బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి గోవింద చారి, నాయకులు ఎర్రవెలి సత్యనారాయణ, గంగాని శ్రీను, అరుణ్, డివిజన్ బీజేవైఎం అధ్యక్షులు ఎర్ర ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

వైశ్య గర్జనకు భరత్ కుమార్ గుప్తకు ఆహ్వానం



నవతెలంగాణ - చైతన్యపురి

అక్టోబర్ 1న సరూర్ నగర్ స్టేడియంలో జరగనున్న వైశ్య గర్జనకు అతిథిగా విచ్చేయాలని తెలంగాణ విజయ డైరీ కార్పొరేషన్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమ భరత్ కుమార్ గుప్తను ఆహ్వానించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో భరత్ కుమార్‌ను వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక చైర్మన్, వైశ్య గర్జన నిర్వాహక సారథి, తెలంగాణ ఉద్యమకారుడు బీఆర్ఎస్ రాష్ట్ర నేత డాక్టర్ కాచం సత్యనారాయణ గుప్త మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో దిల్‌సుఖ్ నగర్ షిరిడి సాయి సంస్థాన్ చైర్మన్ గుండా మల్లయ్య గుప్త, నంగునూరి రమేష్, నేలంటి మధు, బుక్కా ఈశ్వరయ్య, కోడుమూరు దయాకర్ ఉన్నారు.

- నాటి వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులే..
- కమ్యూనిస్టుల ప్రాధాన్యతను తగ్గించే ప్రచారానికి పూనుకుంటున్న బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు
- నాటి స్ఫూర్తితో నేటి ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి
- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు డి.కిషన్



రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో మతోన్మాదులకు బుద్ధి చెప్పాలి



నవతెలంగాణ-తుర్కయంజాల్

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో మతోన్మాదులకు బుద్ధి చెప్పాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు డి.కిషన్ అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను పురస్కరించుకొని సీపీఐ(ఎం) తుర్కయంజాల్ మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో తుర్కయంజాల్ అంబేద్కర్ చౌరస్తాలో ఆదివారం సీపీఐ(ఎం) పార్టీ జెండాను ఆవిష్కరించారు. తర్వాత నాగార్జునసాగర్ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు జె.ఆశీర్వాదం అధ్యక్షతన జరిగిన సభా కార్యక్రమంలో డి.కిషన్ పాల్గొని మాట్లాడారు. వీరోచిత తెలంగాణ రైతాంగ పోరాటంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల జాడేలేదని విమర్శించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం గురించి ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 17 చర్చనీయాంశంగా మారుతుందన్నారు. ముఖ్యంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు వక్రభాష్యాలు చెబుతూ చరిత్రను వక్రీకరిస్తున్నాయని మండిపడ్డారు. నాటి తెలంగాణ సాయుధ పోరాట వారసత్వం పుణికి పుచ్చుకున్న కమ్యూనిస్టుల ప్రాధాన్యతను తగ్గించే ప్రచారానికి పూనుకుంటున్నారని విమర్శించారు. ప్రజలను, యువతను తప్పుదారి పట్టిస్తూ.. చరిత్రను కనుమరుగు చేసేందుకు మతోన్మాద శక్తులు పూనుకుంటున్నాయని అన్నారు. తెలంగాణ విలీనమా? విమోచనా? విద్రోహమా? అనే చర్చ జరుగుతున్న నేపథ్యంలో నాటి పోరాటంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల పాత్ర ఏంటో చెప్పాలని ప్రశ్నించారు.

నిజానికి తెలంగాణ రైతాంగం పేద ప్రజలు భూస్వామ్య దోపిడీ నుండి జమీందారీ అణిచివేత నుండి విముక్తి కోరుకున్నారని, అందుకే వెట్టి చాకిరికి వ్యతిరేకంగా మొదలైన ఈ పోరాటం క్రమంగా భూ పోరాటంగా మారిందని గుర్తుచేశారు. కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో సామాన్య తెలంగాణ ప్రజలు సాగించిన విముక్తి పోరాటం అనే సత్యాన్ని కావాలనే బీజేపీ మతతత్వ శక్తులు విస్మరించే ప్రయత్నం చేస్తున్నాయని అన్నారు.

కమ్యూనిస్టుల నాయకత్వంలో వీరోచితంగా సాగిన నాటి వీర తెలంగాణ విప్లవ రైతాంగ సాయుధ పోరాటంలో.. దున్నే వానికి భూమి కావాలని నినదిస్తూ పది లక్షల ఎకరాల భూమిని సాధించుకోవడమే గాక 3వేల గ్రామాలలో గ్రామ రాజ్యాలను స్థాపించారని వివరించారు. ఈ క్రమంలో నైజాం దేశ్ముఖ్‌లు, దొరలు, జాగిర్దారుల చేతుల్లో నాలుగు వేల మందిపైగా ప్రజలు ప్రాణాలర్పించారని గుర్తుచేశారు. నాటి వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని.. ఆ పోరాట స్ఫూర్తితో నేటి పాలకవర్గాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పార్టీ నాయకులు యం.సత్యనారాయణ, యం.జే ప్రకాష్ కారత్, ఐ.భాస్కర్, కే.అరుణ్ కుమార్, బి.శంకరయ్య, కే.శారద, కే.పద్మ, ఎస్.యాదగిరి, మాధవరెడ్డి, యం.యాదయ్య, యం.సంజీవ, పి.మధు పి.అరవింద్, డి.ప్రేమాజీ, ఐ.కృష్ణ, యం.ఆంజనేయులు, బి.మల్లేష్, కే.వెంకటకృష్ణ, బి.రాములయ్య, టి.కృష్ణ కుమార్, బి.మాల్యాద్రి, బి.శ్రీనునాయక్, జాఫర్ భాయ్, మహేష్, రమేష్ గుజ్జుం జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సాయుధ పోరాట వారుసులు కమ్యూనిస్టులే..

సంతోష్ నగర్

వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా, దున్నేవారికే భూమి కోసం సాగిన వీరోచిత తెలంగాణ సాయుధ పోరాటం నడిపిన ఘన చరిత్ర కమ్యూనిస్టులదే అని, దీనికి మతరంగు వేయడానికి బీజేపీ చేసే ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) పిలుపునిచ్చింది. సీపీఐ(ఎం) జంగంమేట్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో జంగంమేట్ ఫలక్‌నూమ రైల్వే స్టేషన్ రోడ్డు వద్ద ఆదివారం సీపీఐ(ఎం) పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) పార్టీ జంగంమేట్ డివిజన్ కార్యదర్శి ఏ. కృష్ణ నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగం సాయుధ పోరాటం 1946-51 మధ్య సాగిన వీరోచిత తెలంగాణ సాయుధ పోరాటానికి ప్రపంచ స్థాయి పోరాటాలలో ఒకటిగా గుర్తింపు వచ్చిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) డివిజన్ నాయకులు శ్రీను, నవీన్, నాగేష్ , బజరంగ్ రవి, భాసింగ్ జానూ, లాలూ తదితరులు పాల్గొన్నారు.



ప్రతి దానికీ బీజేపీ కార్పొరేటర్ రాద్ధాంతం



- బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు మల్లా రెడ్డి

నవతెలంగాణ-హయత్ నగర్

ప్రతి దానికీ మన్సూరాబాద్ బీజేపీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి రాద్ధాంతం చేస్తూ వివాదం సృష్టిస్తున్నారని మన్సూరాబాద్ బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లా రెడ్డి ఆరోపించారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని జక్కిడి సత్తి రెడ్డి కాలనీలో ఉన్న ఆయన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కొన్ని కోట్ల రూపాయలతో ఆటో నగర్‌లో ఉన్న ఐలా ఇండస్ట్రీయల్‌లో స్థానిక కార్పొరేటర్ కోసం ఎమ్మెల్యే కొన్ని నిమిషాలు ఎదురు చూశారని..అయినా రాకపోవడంతో ఎమ్మెల్యే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని తెలిపారు. స్థానిక కార్పొరేటర్ అభివృద్ధికి సహకరించేది పోయి, ప్రతి దానికి విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. పచ్చ కామెర్లు వచ్చిన వాడికి ఊరంతా కామెర్లు అన్నట్లుగా అతని ప్రవర్తన ఉందన్నారు. ఎవరెన్ని విమర్శలు చేసినా అభివృద్ధిలో ఎల్బీనగర్ ఎమ్మెల్యేకు పోటీ లేరని, వచ్చే ఎన్నికల్లో అతనిదే గెలుపని, అడ్డుకునే వారే లేరని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సిద్ధగౌని జగదీష్ గౌడ్, ఇరిగి రమేష్, రవి, లింగ స్వామి, శంకరయ్య, జంగయ్య, మహేందర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ - ధూల్ పేట్

తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ సేట్విన్ ప్రధాన కార్యాలయంలో ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కే.వేణు గోపాలరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ వేణుగోపాల రావు మాట్లా డుతూ సంస్థ అభివృద్ధికి ఉద్యో గులు అంకితభావంతో పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిత్రా లేఔట్‌లో జాతీయ జెండా ఆవిష్కరణ..

చైతన్యపురి :

తెలంగాణ సమైక్యతా దినోత్సవం సందర్భంగా ఆర్కేపురం డివిజన్ చిత్రా లేఔట్‌లో ఆదివారం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సిద్దగోని వెంకటేష్ గౌడ్, నియోజకవర్గ ఆర్గనైసింగ్ సెక్రెటరీ దుబ్బాక శేఖర్, న్యాలకొండ శ్రీనివాస్ రెడ్డి, గొడుగు శ్రీనివాస్, వంగూరి యాదవ రెడ్డి, లింగస్వామి గౌడ్, మురళీధర్ రెడ్డి, మొహమ్మద్, వేణు, పొద్దుటూరి శ్రీనువాస్



గుప్త అల్లవుద్దీన్ పటేల్, మాధవి, బుజ్జిబాయ్, పదిరే శంకర్, రుకియా, కృష్ణా నాయక్, వెంకటేష్, శ్రీను పాల్గొన్నారు.

విజయభేరి సభను తరలిన నాయకులు



నవతెలంగాణ - ఎల్బీనగర్

తుక్కుగూడ విజయభేరి సభను విజయవంతం చేయాలని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి కోరారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆకాంక్షను నెరవేర్చిన సోనియా గాంధీ, భావి భారత ప్రధాని రాహుల్ గాంధీ, జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, ప్రియాంక గాంధీ, టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డితో పాటు జాతీయ నాయకత్వం పాల్గొనబోయే విజయభేరి సభకు మహేశ్వరం నియోజకవర్గం నుండి వేలాదిగా తరలివెళ్తున్న వాహనాలను దేప భాస్కర్ రెడ్డి ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. సభకు వెళ్తున్న వారిలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, విజయభేరి సభ కో ఆర్డినేటర్ నల్ల సుధాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

జన సమీకరణ కోసం బస్సును పంపుతున్న మల్‌రెడ్డి

తుక్కుగూడలో జరిగే విజయభేరి సభకు ఎల్బీనగర్ నియోజకవర్గం నుండి జన సమీకరణ కోసం వివిధ కాలనీలకు బస్సులను ఆదివారం ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మల్ రెడ్డి రాంరెడ్డి పంపారు. 25 వేల మంది సభకు తరలివెళ్తున్నట్లు రాంరెడ్డి తెలిపారు.



పర్యావరణాన్ని రక్షిద్దాం..మట్టి గణపతులను పూజిద్దాం



నవతెలంగాణ- సంతోష్ నగర్

యాకుత్ పురా నియోజకవర్గం ఇన్‌చార్జి సామ సుందర్ రెడ్డి, ఐఎస్‌సదన్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్న సురేందర్ రెడ్డిల ఆధ్వర్యంలో ఐఎస్‌సదన్ సీఐ మల్లేష్ ఆదివారం డివిజన్‌లోని ఎక్స్ రోడ్ వద్ద 'ఈకో ఫ్రెండ్లీ గణేష్' మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మట్టి వినాయకులను పూజించి.. పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎస్‌సదన్ డివిజన్ కాలనీవాసులు, నాయకులు, కార్యకర్తలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్త సమాజం ఆధ్వర్యంలో గణేష్ విగ్రహాల పంపిణీ



వనస్థలిపురం :

పర్యావరణ పరిరక్షణలో భాగంగా వినాయక చవితిని పురస్కరించుకొని ఎన్జీవోస్ కాలనీలో గవర్నమెంట్ లైబ్రరీ గ్రౌండ్ వద్ద ఆదివారం భక్త సమాజం ఆధ్వర్యంలో మట్టి గణేష్ ప్రతిమలను పంపిణీ చేశారు. అనంతరం పలువురు జీహెచ్ఎంసీ నేతృత్వంలో విగ్రహాలు అందజేసిన కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఆర్ కే మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వనస్థలిపురం :



వినాయక చవితిని పురస్కరించుకొని హయత్ నగర్ డివిజన్‌లోని శారదా నగర్ సంక్షేమ సంఘం భవనం ఎదుట ఆదివారం మట్టి వినాయక విగ్రహాలను కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శారదా నగర్ సంక్షేమ సంఘం కార్యదర్శి నరసింహారావు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిహితమే పండగల పరమార్థం



సంతోష్ నగర్ :

ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను పూజించి..పర్యావరణాన్ని పరిరక్షించాలని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అనితానాయక్ పిలుపునిచ్చారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఆదివారం వైస్ చైర్‌పర్సన్ భూమేష్ కార్యదర్శి ఉపేందర్ డైరెక్టర్లు, కమిటీ సభ్యులతో కలిసి అనితా నాయక్ గణపతి మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, కమిటీ సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను పూజించాలి

సంతోష్ నగర్ :

ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను పూజించాలని పోచమ్మ దేవాలయం ప్రతినిధి కొమిరెల్లి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం ఓల్డ్ మలక్‌పేట్ శ్రీ పోచమ్మ దేవాలయం చౌరస్తాలో మట్టి గణపతి ప్రతిమలను మహిళలకు, చిన్నారులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొమిరెల్లి మాట్లాడుతూ రోజురోజుకూ పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించి, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన విగ్రహాల వలన కాలుష్యం ఏర్పడి, పర్యావరణం దెబ్బతింటుందన్నారు. ఈ విషయాన్ని అందరూ దృష్టిలో పెట్టుకొని మట్టి గణపతులను ప్రతిష్టించుకొని పూజించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బాబు శ్రీనివాస్, గ్రేటర్ ఓబీసీ వైస్ ప్రెసిడెంట్ చౌక్ రవికుమార్ పటేల్, వేముల విజయకుమార్, రామకృష్ణ, మదన్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మట్టి గణపతి విగ్రహాల పంపిణీ



నవతెలంగాణ-కాప్రా

వినాయక చతుర్థి సందర్భంగా జీహెచ్ఎంసీ అందిస్తున్న మట్టి గణపతి విగ్రహాలను మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, వార్డు కార్యాలయ అధికారి షానవాజ్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి కలిసి పంపిణీ చేశారు. అనంతరం ప్రభుదాస్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల పర్యావరణం కలుషితమవుతుందని, దీని నివారణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బందితోపాటు సంక్షేమ సంఘ నాయకులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, మహిళలు, బాలలు తదితరులు పాల్గొన్నారు.

68వ వారం జ్ఞానమాల కార్యక్రమం



నవతెలంగాణ-కాప్రా

జమ్మిగడ్డ బి.జె.ఆర్ కాలనీలో జ్ఞానమాల టీం ఆధ్వర్యంలో 68వ వారం జ్ఞానమాల కార్యక్రమం సందర్భంగా మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు రజక రాష్ట్ర నాయకులు సకినాల రవి జ్ఞానమాల టీం రవి నాయక్, దయానంద్ పూల మాల వేస్తూ ప్రతి ఒక్కరు భారత రాజ్యాంగం చదవాలని సూచించారు. జ్ఞానమాల టీం ఆర్గనైజర్ తాడూరి గగన్ కుమార్, సభ్యులు చిన్నారావు, కాంతారావు, నాగేష్, మెకానిక్ కొండల్, గడ్డం శ్రీనివాస్, అన్వర్, జోషి, స్వామి, కనకరాజు, చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

వైద్యులకు ఏబీసీలు చాలా ముఖ్యం

- యాటిట్యూడ్, బిహేవియర్, కమ్యూనికేషన్ ఉండాల్సిందే
- ఎన్ని అద్భుతాలు చేసినా రోగులకు చెప్పడం అవసరం
- గవర్నర్ తమిళిసై సౌందరరాజన్
- కిమ్స్ ఆస్పత్రిలో నాట్స్ కోర్సు ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

వైద్యులకు ఏబీసీలు చాలా ముఖ్యం అని గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ అన్నారు. ద రాయల్ కాలేజీ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఎడిన్‌బరో వారు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మొట్టమొదటి నాన్ టెక్నికల్ స్కిల్స్ కోర్స్ (నాట్స్)ను గవర్నర్ ఆదివారం సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో ప్రారంభించారు. ఈ అద్భుతమైన ఒక్క రోజు కోర్సు తీసుకునేందుకు దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన దాదాపు 250 మందికి పైగా సర్జన్లు, సర్జికల్ ట్రైనీలను ఉద్దేశించి గవర్నర్ తమిళిసై మాట్లాడారు. ముందుగా ఏఎస్ఐ అంతర్జాతీయ వ్యవహారాల కన్వీనర్ డాక్టర్ రఘురామ్‌ను మనస్ఫూర్తిగా అభినందించారు. "కిమ్స్ ఆస్పత్రిలో సర్జన్లకు ఎంతో ఉపయుక్తమైన కంటిన్యువస్ మెడికల్ ఎడ్యుకేషన్ (సీఎంఈ) కార్యక్రమం ఉన్నాయి. కిమ్స్ చైర్మెన్ డాక్టర్ భాస్కరరావు అంటే నాకు ఎంతో ఆరాధనాభావం ఉంటుంది. కిమ్స్ లోగో కూడా చాలా సందేశాత్మకంగా ఉంటుంది. డాక్టర్ రఘురామ్ నిబద్ధత చాలా బాగుంటుంది. బ్రెస్ట్ కేన్సర్ అవగాహన గురించి ఒకసారి ఆయన నా వద్దకు వచ్చారు. రాజ్‌భవన్‌ను గులాబీ రంగు లైట్లతో వెలిగించాలని ఆయన కోరారు. ఒక డాక్టర్‌గా నేను అర్థం చేసుకుని, వెంటనే ఆ పని చేశాను. దేశంలో ఇలా గులాబీ రంగుతో అలంకరించిన ఏకైక రాజ్‌భవన్ మనదే. ఇది కేవలం క్యాన్సర్ అవగాహన కోసమే చేశాం. కేవలం సర్జన్లు మాత్రమే కాక.. థియేటర్లో ఉండే అందరికీ మనం చేసే అంశాలపై అవగాహన ఉండాలని, అందుకే ఈ కార్యక్రమం పెట్టామని డాక్టర్ భాస్కరరావు చెప్పారు. యాటిట్యూడ్, బిహేవియర్, కమ్యూనికేషన్.. ఏబీసీ.. ఈ మూడూ చాలా ముఖ్యం. గైనకాలజీతో పాటు ఫీటల్ థెరపీలో కూడా శిక్షణ పొందాను. దేశంలోనే ఆ శిక్షణ పొందిన రెండో డాక్టర్‌ని నేను. నాకు రెండు క్లినిక్‌లు ఉండేవి. 10 ఆస్పత్రులకు కన్సల్టెంట్‌గా వెళ్లేదాన్ని. రాత్రి ఒంటిగంటకు క్లినిక్ మూసేదాన్ని. కానీ రాజకీయాలపై ఆసక్తి ఉండటంతో ఫిజిషియన్ నుంచి పొలిటీషియన్ అయ్యాను. మనం సాంకేతికంగా చాలా అద్భుతాలు సష్టించినా, దాన్ని రోగికి సరిగా అర్థమయ్యేలా చెప్పలేకపోతే ప్రయోజనం ఉండదు. నా భర్త నెఫ్రాలజిస్టు. ఆయన రోగులతో చాలా వివరంగా మాట్లాడతారు. గవర్నర్‌గా నేను ప్రజల కోసం చేస్తాను. వాళ్ల సంతప్తి చెందకపోతే మనం చేసిన పనికి ఫలితం ఉండదు. కిమ్స్ ఆస్పత్రి ఎప్పుడూ వైద్య అవగాహన విషయంలో ముందంజలో ఉంటుంది. డాక్టర్ రఘురామ్‌ని, ఏఎస్ఐని కూడా ఈ విషయంలో చాలా అభినందించాలి. ఈ ప్రతిష్ఠాత్మక కోర్సును తెలంగాణలో నిర్వహించినందుకు మిస్ క్లేర్ మెక్ నాట్, యూకేకు చెందిన ఇతర అధ్యాపకులను అభినందిస్తున్నాను" అనిచెప్పారు.

కిమ్స్ ఆస్పత్రి చైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బి.భాస్కరరావు మాట్లాడుతూ "కిమ్స్ ఆస్పత్రిలోనే మొట్టమొదటి నాట్స్ పరిచయ కోర్సును నిర్వహించడం గర్వంగా ఉంది. కిమ్స్ ఆస్పత్రిని ఆర్‌సీఎస్ ఎడ్ ప్రపంచపటంలో ఉంచినందుకు డాక్టర్ రఘురామ్‌కు అభినందనలు, ధన్యవాదాలు. కిమ్స్ ఆస్పత్రిలో ఆయన ఆర్‌సీఎస్ ఎడ్ తరఫున దశాబ్ద కాలంగా కోర్సులు నిర్వహించారని, 2వేల మందికిపైగా సర్జన్లు యూకే వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఎఫ్ఆర్ సీఎస్, ఎంఆర్ సీఎస్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేందుకు ఆ కోర్సులు దోహదపడ్డాయి' అని అన్నారు. అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) అంతర్జాతీయ వ్యవహారాల కన్వీనర్ డాక్టర్ పి.రఘురామ్ మాట్లాడుతూ, "2020లో నేను ఏఎస్ఐ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో అత్యంత ఉపయోగకరమైన ఈ కోర్సును భారతదేశానికి తీసుకురావాలన్నది నా కల. కానీ కొవిడ్ మహమ్మారి ఆ కలను చెడగొట్టింది. నా సొంత ఊళ్లోనే తొలి కోర్సును నిర్వహిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. శస్త్రచికిత్స తర్వాత ఉత్తమ ఫలితాలు రావాలంటే, సాంకేతిక నైపుణ్యాలు మాత్రమే సరిపోవు. పేలవమైన కమ్యూనికేషన్ అనేది శస్త్రచికిత్స సమయంలో తప్పులకు కారణమయ్యే ఒక సాధారణ, కానీ చాలామంది విస్మరించే అంశం. రోగులను సరిగ్గా ఎంపిక చేయడంలో వైఫల్యం.. రోగనిరోధక యాంటీబయాటిక్ ఇవ్వడం మర్చిపోవడం.. సరైన సైట్‌ని మార్క్ చేయడంలో విఫలం కావడం.. ఇలాంటి సమస్యలన్నీ కూడా శస్త్రచికిత్స చేయడం లాగే చాలా ముఖ్యమైనవి. ఆపరేషన్ థియేటర్‌లో ఇలాంటి ముఖ్యమైన అంశాలన్నీ ఈ కోర్సులో కవర్ అవుతాయి. ఈ పరిచయ కోర్సుతో దేశంలో శస్త్రచికిత్స రంగానికి పెద్దపీట వేయాలన్న నా కల కొంతవరకు నెరవేరింది. భవిష్యత్‌లో హైదరాబాద్, ఢిల్లీ, కోల్‌కతా, ముంబైలలో నాట్స్ మాస్టర్ క్లాస్ నిర్వహించాలన్నది నా బలమైన కోరిక" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ అధ్యక్షుడు డాక్టర్ సంజయ్ జైన్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రొబల్ నియోగి, నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శివ మిశ్రా, ఏఎస్ఐ అకడమిక్ కౌన్సిల్ డైరెక్టర్ డాక్టర్ సంతోష్ జాన్ అబ్రహం, గౌరవ కోశాధికారి ఏఎస్ఐ డాక్టర్ భన్వర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పీర్జాదిగూడలో సమైక్యత ర్యాలీ

- పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి



నవతెలంగాణ-బోడుప్పల్

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మేయర్ జక్క వెంకట్ రెడ్డి, కమిషనర్ ఇస్లావత్ నమ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండియన్ స్వచ్ఛత లీగ్ 2.0 ర్యాలీ కార్యక్రమంలో మంత్రి చామకూర మల్లారెడ్డి పాల్గొని శ్రమదానం చేశారు.తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహం, అమరవీరుల స్థూపాలకు పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. అక్కడ నుండి ర్యాలీగా బయలుదేరి మూలం వద్దే వ్యర్థాల విభజన, వ్యర్థాల తొలగింపు, ఆరోగ్యం, పరిశుభ్రత తదితర అంశాలపై ప్లకార్డులతో కూడిన భారీ అవగాహన ర్యాలీ నిర్వహించి స్వచ్ఛ సంకల్పం పై నినాదాలు చేసారు. పీర్జాదిగూడ పెద్ద చెరువు (మినీ ట్యాంక్ బండ్) వరకు చీపురుతో రోడ్లు శుభ్రపరచడం, హరితహారంలో భాగంగా మొక్కలు నాటడంతో పాటు మాస్ శానిటేషన్ నిర్వహించి చెరువు పరిసరాలను శుభ్రపరచి. జాతీయ సమైక్యతకు చిహ్నంగా మానవహారం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...నగర పరిధిలో తడి, పొడి, హానికరక చెత్తను వేరుగా చేసి సేకరించడం.. తడి వ్యర్థాలను కంపోస్టుగా, బ్రికెట్స్ గా మార్చే చర్యలు చేపట్టడం, పొడి చెత్తను రీసైక్లింగ్ చేయుటకు డీఆర్‌సీసీ సెంటర్ ను సమీకత వ్యర్థ పదార్థాల శుద్ధీకరణ పార్క్ నందు ఏర్పాటు చేయడం ద్వారా 100 శాతం చెత్త నిర్వహణలో పీర్జాదిగూడ ముందుందని కొనియాడారు. మేయర్ మాట్లాడుతూ స్వచ్ఛభారత్, స్వచ్ఛ తెలంగాణ, స్వచ్ఛ పీర్జాదిగూడ విషయంలో, ప్రతీ ఒక్కరు సహకరించాలని, ముఖ్యమంత్రి కేసీఆర్ సత్సంకల్పం స్వచ్ఛ తెలంగాణ పరిపూర్ణంగా అమలు చేయడం కోసం ప్రతి ఒక్కరూ నడుం బిగించి, నగరాన్ని పరిశుభ్రంగా, పచ్చగా చేయడానికి అందరూ ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ గ్రంథాలయ చైర్మెన్ దర్గా దయాకర్ రెడ్డి, కార్పొరేటర్లు బోడిగే స్వాతి కష్ణ గౌడ్, కుర్ర శాలిని శ్రీకాంత్ గౌడ్, అలవాల సరిత దేవేందర్ గౌడ్, సుభాష్ నాయక్, బచ్చ రాజు,మద్ది యుగేందర్ రెడ్డి,అమర్ సింగ్, కౌడే పోచయ్య,నవీన్ రెడ్డి,మధు సూదన్ రెడ్డి, ఏంపల్ల అనంతరెడ్డి, దొంతిరి హరిశంకర్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు ఇర్ఫాన్, నాయకులు బండి సతీష్ గౌడ్, పెంటయ్య,జావీద్ ఖాన్,రఘువర్ధన్ రెడ్డి, ప్రభు మల్లం వెంకటేష్ గౌడ్, పట్టణ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగించుకోవాలి

- కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-ఉప్పల్

ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మధుర చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం కిమ్స్ సౌజన్యంతో మధుర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రామంతపూర్ డివిజన్‌లోని ఎస్పీ గ్రామర్ పాఠశాలలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా మధుర చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉప్పల్ నియోజకవర్గం లో అనేక రకాల ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. కంటిచూపు సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ట్రస్ట్ ద్వారా ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి, కండ్లద్దాలు, అవసరమైన వారికి శస్త్రచికిత్సలు, మందులను అందజేస్తున్నామన్నారు పేద ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరానికి ప్రతిసారి సహకారం ట్రస్ట్ సభ్యులకు కిమ్స్ హాస్పిటల్, సాధురం కంటి ఆస్పత్రి యాజమాన్యానికి, వైద్య బందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా హ్యూమన్ రైట్స్ అధ్యక్షులు మల్లేష్ కురుమ, ఉప్పల్ డివిజన్ మైనార్టీస్ చైర్మెన్ గజ్జల రాజు, స్కూల్ ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు, వసుంధర, మొహమ్మద్ రఫీక్, పలకల నరసింహారెడ్డి, శ్రీనివాస్ యాదవ్,సందీప్, కార్యదర్శి వంజరి సంతోష్, సోలమన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దుతాం

- జవహర్‌నగర్ మేయర్ మేకల కావ్య



నవతెలంగాణ-జవహర్‌నగర్

జవహర్‌నగర్‌ను పరిశుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దుతున్నామని,ప్లాస్టిక్ నిషేధాన్ని తగ్గించి స్వచ్ఛమైన నగరంలా మార్చుకుందామని మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. స్వచ్ఛభారత్ లీగ్ 2.0లో భాగంగా కార్పొరేషన్‌లో ఆదివారం కోళ్ళఫారం బస్టాప్ నుంచి ఫైరింగ్ కట్ట స్కూల్ వరకు ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మేయర్ కావ్య మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజానికి నాందిపలుకుతూ... ప్రజలంతా ఇంటి చుట్టు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ... శుభ్రతను పాటిస్తేనేరోగాలు దరిచేరవన్నారు. చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయరాదని, తడి, పొడి చెత్తను వేరుచేసి ఇంటికి వచ్చే ఆటోరిక్షాలోనే వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రామలింగం, కార్పొరేటర్లు మేక లలితాయాదవ్, పల్లపు రవి, బీఆర్ఎస్ స్థానిక అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కాప్రా

జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా కాప్రా మున్సిపల్ సర్కిల్ కార్యాలయంలో జాతీయ జెండాను ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాప్రా మున్సిపల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ముకుంద రెడ్డి, ఏ ఎం.హెచ్.ఓ డాక్టర్ స్వప్న రెడ్డి, సానిటేషన్ సూపర్వైజర్ నాగరాజు, కార్పొరేటర్ జేరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, పాజ్జూరి పావని మణిపాల్ రెడ్డి, గుండారపు శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు సుడుగు మహేందర్ రెడ్డి, కాసం మహిపాల్ రెడ్డి, డప్పు గిరిబాబు, ప్రధాన కార్యదర్శులు గిల్బర్ట్, కుమార స్వామి, సార అనిల్, నాయకులు బేతాళ బాలరాజు, మురళి పంతులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులను ప్రతిష్టిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

- కార్పొరేటర్ బన్నాల గీత



నవతెలంగాణ-ఉప్పల్

మట్టి వినాయకున్ని ప్రతిష్ఠించి పర్యావరణాన్ని పరిరక్షించాలని చిల్కానగర్ కార్పొరేటర్ గీత అన్నారు. వార్డు కార్యాలయంలో జీహెచ్ఎంసి ఆధ్వర్యంలో మట్టి వినాయకుల ను కార్పొరేటర్ పంపిణీ చేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ మట్టి గణపతులను ప్రోత్సహించాలని, పర్యావరణానికి నష్టం లేకుండా జాగ్రత్తలు తీసుకోవడం మనందరి బాధ్యతని అని అన్నారు. గతేడాది 500 మట్టి విగ్రహాలు పంపిణీ చేశామని ఈ సంవత్సరం 2500 మట్టి వినాయకులు పంపిణీకి సహకరించిన జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎదుల కొండల్ రెడ్డి, కోకొండ జగన్, ఎండీ మహమ్మద్, బింగి శ్రీనివాస్, ముద్దం శ్రీనివాస్ యాదవ్, రవీందర్ గౌడ్, రామానుజన్, బాణాల నారాయణరెడ్డి, బాలు,శ్యామ్ , కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఓంకార్ సింగ్ వికాస్, రాజు, శేఖర్ రెడ్డి, ముత్యం రెడ్డి, కమలాకర్, రాజమౌళి, శ్రీకాంత్, రుక్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో పెరియార్ రామస్వామి జయంతి



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో ప్రముఖ సంఘ సంస్కర్త పెరియార్ రామస్వామి 144వ జయంతి సందర్భంగా సంస్మరణ సభ కమలానగర్ ఆఫీసులో జరిగింది. స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్ష వహించారు.ట్రేడ్ యూనియన్ నాయకులు అశోక్ , సామాజిక ఉద్యమ నాయకులు కోమటి రవిలు పెరియార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోమటి రవి మాట్లాడుతూ పెరియార్ రామస్వామి అనేక సామాజిక ఉద్యమాలలో పాల్గొని సకల వివక్షలకు వ్యతిరేకంగా పోరాడారని చెప్పారు. బ్రాహ్మణిజం సనాతన ధర్మాలను దాని ఫలితంగా ప్రజలను చీలిక తెచ్చే విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించాలని చెప్పారు. కేరళ సంస్థానంలో శూద్రులకు బ్రాహ్మణ వీధిలో సంచారానికి నిషేధం విధించినప్పుడు దానికి వ్యతిరేకంగా పోరాడి జైళ్లకు వెళ్లారని చెప్పారు. ఆయన చేసిన పోరాటాలకు కాంగ్రెస్ పార్టీ జాతీయ ఉద్యమంలో మమేకం కావాలని కోరిందని.. ఆ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి వివక్షలకు వ్యతిరేకంగా కండిషన్స్ పెట్టి అందులో చేరారన్నారు. దానిలో అటువంటి ప్రయత్నం జరగని కారణాన ప్రత్యేక పార్టీని ఏర్పాటు చేసి ద్రవిడ ఉద్యమాన్ని అలాగే భారతీయతకు నిజమైన వారసత్వాన్ని ప్రచారం చేస్తూ జీవితాంతం కృషి చేశారని చెప్పారు. స్ఫూర్తి గ్రూపు నాయకులు శివన్నారాయణ, చంద్రశేఖర్, శారదలు ప్రసంగించారు. అనంతరం సభికులందరూ పెరియార్ రామస్వామి చిత్రపటానికి పూలను అర్పించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, గణేష్, లింగస్వామి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



దేశంలోనే తెలంగాణ నెంబర్ వన్

- బీఆర్ఎస్ ఉప్పల్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా మీర్ పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ తిరుమల నగర్ కాలనీ లో బీఆర్ఎస్ ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి జాతీయ జెండా ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త రాష్ట్రమైన తెలంగాణ దేశంలోనే అభివృద్ధిలో ముందున్నదన్నారు, సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ దేశంలోని నెంబర్ వన్‌గా నిలిచిందన్నారు, తెలంగాణ ప్రజలు జాతీయ సమైక్యతకు చిహ్నం అన్నారు. దేశ సమగ్రత సమైక్యతకు తెలంగాణ పాటుపడుతున్నదని తెలిపారు. కార్యక్రమంలో మీర్ పేట్ హెచ్‌బి కాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి, కొత్త రామరావు, బీఆర్ఎస్ నాయకులు జంపాల్ రెడ్డి,పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నెర్రం భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల పంపిణీ



నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్ మండే మార్కెట్ నేర్రం భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో మట్టి గణేష్ విగ్రహాలను పంపిణీ చేశారు. జోగినిపల్లి సంతోష్ కుమార్‌ను ఆదర్శంగా తీసుకొని ప్రకతి సంరక్షణలో భాగంగామట్టి గణేషులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యాదయ్య, లక్ష్మణ్, రవి కుమార్, థామస్, జీవన్ రెడ్డి, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

యూజీడి నిర్మాణానికి కార్పొరేటర్ శంకుస్థాపన



నవతెలంగాణ-సిటీబ్యూరో

చర్లపల్లి డివిజన్ శుభోదయ నగర్ విస్టా హెూమ్స్ పక్కన ఉన్న వీధిలో అండర్ గ్రౌండ్ డ్రయినేజీ నిర్మాణానికి స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ ఆదివారం శంకుస్థాపన చేశారు. గతంలో ఆ వీధిలో పర్యటిం చినప్పుడు తప్పకుండా వాటర్ పైప్ లైన్ , అండర్ గ్రౌండ్ డ్రయినేజీ నిర్మాణం పూర్తి చేస్తానని వారు హామీ ఇచ్చారు. అనుకున్నట్టే వీధిలో అన్ని ఇండ్ల నిర్మాణం పూర్తి అయిన వెంటనే వాటర్ పైప్ లైన్ పూర్తి చేసి యూజీడి పనులకు శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందని కార్పొరేటర్ అన్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు,వీధిలోని ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు బుచ్చన్న శ్రీకాంత్ రెడ్డి, మల్లేష్ వంశరాజ్, ఒంటెద్దు నరసింహ, రామకృష్ణ ,శ్రీను, ఉమా, లావణ్య, శ్రీదేవి, అరుణ, నాయకులు నాగిళ్ల బాల్ రెడ్డి, కనకరాజు గౌడ్, బత్తుల శ్రీకాంత్ యాదవ్, ధనంజయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

విశ్వకర్మ జాతి విశిష్టత ఎంతో గొప్పది

- విశ్వకర్మ జయంతి వేడుకలో మంత్రి మల్లారెడ్డి



నవతెలంగాణ-బోడుప్పల్

శ్రీవిరాట్ విశ్వకర్మ యజ్ఞం మహెూత్సవం సందర్భంగా ఉప్పల్ డిపో నుంచి బుద్ధానగర్ వరకు ఊరేగింపు కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలోని బుద్ధానగర్‌లో మేడ్చల్ జిల్లా విశ్వకర్మ,విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు అన్నోజు కష్ణచారి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ శ్రీ శ్రీ వేదమాత గాయత్రి సమేత విశ్వకర్మ యజ్ఞ మహెూత్సవము కార్యక్రమానికి మంత్రి చామకూర మల్లారెడ్డి,ఎమ్మెల్సీ సిరికొండ మధుసూధన చారి,మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ దర్గా దయాకర్ రెడ్డి, బీసీ కమిషన్ చైర్మెన్ వకులభారణం కష్ణ మోహన్ రావు,నగర మేయర్ జక్క వెంకట్ రెడ్డిలు ముఖ్య అతిదులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని యుగాలలో శ్రీవిరాట్ విశ్వకర్మ భగవాన్ సష్టికర్త అని, విశ్వబ్రాహ్మణులు శ్రీవిరాట్ విశ్వకర్మ భగవాన్ వారసులుగా గౌరవింపబడుతున్నారని, హస్తకళాకారులుగా వారికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభించిందని అన్నారు. విశ్వకర్మల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి కేసిఆర్ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా కేసిఆర్ కులవత్తుల వారికి ఆర్థిక చేయూతనందిస్తూ ఆయా వత్తులు అంతరించిపోకుండా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ప్రజాసంక్షేమం,అభివద్ధే లక్ష్యంగా కేసిఆర్ పాలన సాగిస్తున్నారని,ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతాలు చేస్తూ ప్రజలను అయోమయానికి గురి చేసేందుకు యత్నిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈరోజు దేశవ్యాప్తంగా విశ్వశ్రేయస్సు కోరి శ్రీవిరాట్ విశ్వకర్మ భగవాన్ యజ్ఞం నిర్వహించటం వారికి సమాజంపై ఉన్న మమకారం తెలియజేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పాశం రాజు యాదవ్,రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అంబర్‌పేట భార్గవి,జిల్లా మహిళా అధ్యక్షురాలు జోలపల్లి భారతి,విజయలక్ష్మి,వనపర్తి ఉమారాణి, జిల్లా ప్రధానకార్యదర్శి మద్దోజు రాజేశ్ చారి,జిల్లా కోశాదికారి దేవరకొండ పుల్లయ్య చారి,బుజ్జోజు శ్రీనివాస్ చారి, ఉపాధ్యక్షులు వడ్ల యాదయ్య చారి,ముమ్మడి యాదగిరి చారి,పోలోజు లక్ష్మణ చారి,జిల్లా సలహాదారులు ఉమ్మడోజు యాదగిరి చారిలు పాల్గొన్నారు.

అందుబాటు ధరల్లో ఇండ్ల స్థలాలు



- జీవీ బిల్డర్స్ అధినేత జ్యోతి వేలూరు

నవతెలంగాణ-ఉప్పల్

సామాన్య ప్రజలకు అందుబాటు ధరల్లో తమ వెంచర్లలో ఇండ్ల స్థలాలను అందిస్తూ, సేవా కార్యక్రమంలో ముందుకెళ్తున్నామని జేవీ బిల్డర్స్ అధినేత జ్యోతి వేలూరు వెల్లడించారు. ఆదివారం ఉప్పల్‌లోని లోటస్ హెూటల్లో ఏర్పాటు చేసిన సక్సెస్ మీట్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అన్నదాన కార్యక్రమాలతో పాటు పేద విద్యార్థులకు సహాయాన్ని అందిస్తున్నామన్నారు. ప్రజలందరికీ అందుబాటులో ఉండే విధంగా జేవీ హాస్పిటల్, జెవీ మార్ట్ ఏర్పాటు చేయనట్టు ఆమె తెలిపారు. తమ సంస్థ ద్వారా మూడు సంవత్సరాల కాలంలో 9 వెంచర్లను విజయవంతంగా పూర్తి చేసి సక్సెస్ మీట్‌ను నిర్వహించుకుంటున్నామని పేర్కొన్నారు. గ్రూపు ద్వారానే విజయాలు సాధించడం జరుగుతుందన్నారు. త్వరలోనే మరిన్ని ఇండ్ల స్థలాలను సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సలహాదారులు లక్ష్మీనారాయణ, డైరెక్టర్లు ఆనంద్ ,బాలరాజు గౌడ్, రాకేష్, నవీన్ ,సాయికుమార్, సంతోష్ కుమార్, సైదులు గౌడ్, నరసింహ గుప్తా, పన్నాలాల్, నరసింహ, ప్రతాప్ కుమార్, బసవరాజు, కృష్ణ గౌడ్, కస్టమర్లు పాల్గొన్నారు.

కట్ట మైసమ్మ ఆలయం వద్ద షెడ్డు ప్రారంభించిన అంజన్ రాజ్



నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని పూడూరు గ్రామ శ్రీ కట్ట మైసమ్మ ఆలయం వద్ద గ్రామస్తుడు, దాత డాక్టర్ కంభం వెంకట్ రాజ్ సహకారంతో భక్తుల సౌకర్యార్థం వీలుగా నిర్మించిన షెడ్డును వారి తనయుడు కంభం అంజన్ రాజ్ ఆదివారం గ్రామ పెద్దలతో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు వివిధ వేడుకలు జరుపుకోవడానికి ఈ షెడ్డు ఉపయోగపడుతుందన్నారు. గ్రామ అభివృద్ధికి తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. అనంతరం సర్పంచ్ బాబు యాదవ్,ఆలయ కమిటీ నిర్వాహకులు కంభం అంజన్ రాజ్‌కు శాలువా కప్పి సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బాబు యాదవ్, ఎంపీటీసీ నీరుడి రఘు,ఉప సర్పంచ్ మానేపల్లి వెంకటేష్, గ్రామ పెద్దలు ఆర్.మల్లారెడ్డి, పోచయ్యనక్క మల్లికార్జున్, గాదం రాములు, జీ.పరమేష్, లక్ష్మణ్, వార్డు సభ్యులు శేషి కుమార్, జనార్ధన్ యాదవ్, శ్రీకాంత్, మల్లెల కృష్ణ, నీరుడి దేవేందర్, ఆలయ కమిటీ సభ్యులు తుపాకుల కృష్ణ, చంద్రశేఖర్ రెడ్డి, కోలా వెంకటేష్, భూపాల్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ కాలనీలకు చెందిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు మరియు బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆదివారం ఎమ్మెల్యే కె.పి. వివేకానందని తన నివాసం వద్ద కార్యాలయంలో కలిసి పలు సమస్యలపై వినతి పత్రాలు, ఆహ్వాన పత్రికలు అందజేశారు. సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి: శంభీపూర్ క్రిష్ణ

నవతెలంగాణ-దుండిగల్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గ, బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణని నియోజకవర్గ పరిధిలోని ప్రజలు ఆదివారం శంభీపూర్‌లోని కార్యాలయంలో కలిశారు. పలు సమస్యలు గురించి వినతి పత్రాలు అందజేశారు. వారు వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎటువంటి సమస్యలు ఉన్నతన దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారంలో ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. అనంతరం పలువురు కాలనీ ప్రజలు రానున్న వినాయక నవరాత్రి ఉత్సవాలకు హజరవ్వాలని ఆహ్వాన పత్రికలు అందజేశారు.

అభివృద్ధి పథంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా

- రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి మల్లారెడ్డి
- కలెక్టరేట్‌లో జాతీయ పతాక ఆవిష్కరణ
- ఘనంగా జాతీయ సమైక్యతా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో మొదటి స్థానంలో ఉందని, ఈ విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారం ఎంతో ఉందని రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పన, ఫ్యాక్టరీలు, నైపుణ్యాభివృద్ధిశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. ఆదివారం తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని అంతాయిపల్లిలోని సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ సముదాయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమానికి ముందు మంత్రి జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్



కుమార్, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీసీపీ శబరీష్, జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియ, కలెక్టరేట్ ఏవో రామ్మోహన్‌రావు, ఆయా శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో విశ్వకర్మ జయంతి ఉత్సవాలు

సిటీబ్యూరో: అంతాయిపల్లిలోని సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ సముదాయంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో విరాట్ విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, ఫ్యాక్టరీలు, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి, జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ బీసీ సంక్షేమశాఖ ద్వారా చేతి కుల వత్తుల వారికి రూ.లక్ష ఆర్థిక సహాయం అందిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియ, బీసీ సంక్షేమశాఖ అధికారి కేసురాం, కలెక్టరేట్ ఏవో రాంమోహనరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కుల సంఘాల ప్రతినిధులు పాల్గొని విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేశారు.



తెలంగాణను విముక్తి చేసింది కమ్యూనిస్టులే



- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కీలుకానీ లక్ష్మణ్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

తెలంగాణను విముక్తి చేసింది కమ్యూనిస్టులే సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకానీ లక్ష్మణ్ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంలో రైతు బజార్ ముందు కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈనెల 10వ తారీఖు నుండి 17 వరకు పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సాయుధ పోరాట వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూమి, భుక్తి వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన సాయుధ పోరాటంలో 4వేల మంది నిజాం రజాకార్ల సైన్యానికి ఎదురెడ్డి పోరాడి తమ ప్రాణాలను అర్పించడం జరిగిందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం ప్రపంచ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడిందని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నేటి తరానికి ఆదర్శమన్నారు. ఆనాటి పోరాటానికి కులం లేదు, మతం లేదు ప్రజలందరూ కమ్యూనిస్టు నాయకత్వంలో ఎర్రజెండా ఒకపక్క, తుపాకీ మరోపక్క ఎత్తుకొని భూస్వాములను రజాకర్ కాసిం రజ్వీ సైన్యాన్ని తరిమికొట్టి , లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర మనదని తెలిపారు. అలాంటి చరిత్రను వక్రీకరిస్తూ బీజేపీ నాయకులు ముస్లిం రాజుకు వ్యతిరేకంగా మెజార్టీగా ఉన్న హిందువుల పోరాటంగా చిత్రీకరిస్తూ బీజేపీ చరిత్రను వక్రీకరించే ప్రయత్నం జరుగుతుందని పేర్కొన్నారు. అలాంటి ప్రయత్నాలను కమ్యూనిస్టులు చూస్తూ ఊరుకోరని సాయుధ పోరాటం గురించి మాట్లాడే అర్హత ఒక్క కమ్యూనిస్టులకు మాత్రమే ఉందని తెలిపారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని కమ్యూనిస్టులను లేకుండా చేయాలనే ఎత్తుగడలు ఎప్పటికీ నెరవేరవని, ప్రజలు ఉన్నంతకాలం , ప్రజలకు సమస్యలు ఉన్నంతకాలం కమ్యూనిస్టులు ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు ఈ.దేవదానం, ఆర్.స్వాతి, సంజీవరాజు, కరుణాకర్, మల్లారెడ్డి, ఆంజనేయులు, శ్రీనివాస్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'అక్రమంగా బోర్ వేస్తున్నా పట్టించుకోని అధికారులు'



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నెంబర్ 82 గతంలో ప్రభుత్వ భూమి కబ్జా చేయడంతో పలు ఫిర్యాదుల మేరకు అట్టి కబ్జాను నియంత్రించి పార్కుకు కేటాయించడం జరిగిందని సీపీఐ మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ అన్నారు. ఆ స్థలంలో మరల కబ్జా చేయడం కోసం అక్రమం గా బోరు వేయడం జరుగుతుందని అధికారులు స్థలాన్ని కాపాడాలన్నారు. ఆయన మాట్లాడుతూ బాచుపల్లి మండలంలోని కొంత స్థలం అప్పుడు కొంత మంది కబ్జా దారులు కబ్జా చేసే ప్రయత్నం చేసినప్పుడు సీపీఐ పార్టీగా అట్టి ప్రభుత్వ భూమి కాపాడాలని ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. ఆనాటి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వంశీ కృష్ణ ఆ కబ్జాదా రులను వెళ్లగోటి అందులో పార్క్ నిర్మాణం చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఇప్పుడు అదే ప్రభుత్వ భూమిలో మళ్ళీ కొంత మంది కబ్జా చేసే ప్రయత్నం చేయడం సిగ్గుచేటన్నారు. ఇందులో మున్సిపల్ అధికారుల, రెవెన్యూ అధికా రుల హస్తం వుందని స్థానిక ప్రజలే తెలియజేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా వెంటనే అట్టి ప్రభుత్వ భూమి కాపాడాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ప్రజలను కూడ గట్టి అట్టి నిర్మాణాలను అడ్డుకుంటామని హెచ్చరించారు.

ఆలయం ముందు షెడ్డు ప్రారంభించిన గోట్టిముక్కల వెంగళ్‌రావు



కూకట్‌పల్లి/బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం 121డివిజన్ కూకట్‌పల్లి సంగీత్ నగర్ కోమనిగడ్డ లో శ్రీ శ్రీ శ్రీ నల్ల పోచమ్మ దేవాలయం ప్రాంగణంలో షెడ్ నిర్మాణ ధాత కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టీపీసీసీ సభ్యులు గొట్టిముక్కల వెంగళ్ రావు షెడ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మ కర్త కొమ్ము సతయ్య, కొమ్ము బాబు, డివిజన్ అధ్యక్షులు మేకల రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవింద్ గౌడ్, మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి, గురుమూర్తి, బషీర్ భాయ్,ఆలయ కమిటీ మెంబెర్స్ శివశంకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట/దుండిగల్

తెలంగాణ రాష్ట్రంలోని విశ్వకర్మల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. ఆదివారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కొండపై వెలసిన శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో విశ్వకర్మ జయంతి ఉత్సవాలు కమిటీ సభ్యులు వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హజరై ఆలయంలో వీరబ్రహ్మేంద్ర స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన బైక్ ర్యాలీని జెండా ఊపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఈ ప్రాంత విశ్వకర్మల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు శ్రీనివాస్ చారి, బిక్షపతి చారి, మనోహర్ చారి, హనుమంతు చారి, బీఆర్ఎస్ నాయకులు భాస్కర్, విట్టల్ ముదిరాజ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్ శ్రీవిరాట విశ్వకర్మ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కేపీ వివేకనంద్..



నేరేడ్‌మేట్ వినాయక నగర్‌లో...

మట్టి వినాయకులను పూజించాలి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక విగ్రహాలనే నెలకొల్పుకొవాలని, పూజించాలని కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ అన్నారు. సూరారం 129 డివిజన్‌లో వినాయక చవితిని పురస్కరించుకొని డివిజన్ ప్రజలకు మట్టి విగ్రహాలను స్థానిక కార్పొరేటర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు, రంగులు, రసాయనాలతో చేసిన విగ్రహాలతో పర్యావరణానికి ముప్పు కలుగుతుందన్నారు. విగ్రహాల తయారీలో కృత్రిమ రంగులు, విషపదార్థాలు ఉపయోగించడం వల్ల వృక్ష, జంతు జీవనంపై ప్రభావం పడుతుందన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు స్థానిక నాయకురాలు హేమలత రెడ్డి , కలీం, స్థానికులు పాల్గొన్నారు.



జగద్గిరిగుట్టలో మట్టి వినాయకులతో రాజధాని పాఠశాల చైర్మెన్ యాద నరేంద్ర గుప్తా



జగద్గిరిగుట్ట మట్టి వినాయకుడికార్పొరేటర్ రావుల శేషగిరి



కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు..



జగద్గిరిగుట్ట జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు జిల్లా లక్ష్మీ నాథ్..



జగద్గిరిగుట్ట బీఆర్ఎస్ అధ్యక్షులు, ఆదర్శనగర్ హౌసింగ్ బిల్డింగ్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు ఏర్వ శంకరయ్య



కేపీహెచ్‌బీ మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు..

తుక్కుగూడ బహిరంగ సభకు వేల మందితో తరలి వెళ్లిన కొలను హనుమంత రెడ్డి



నవతెలంగాణ-దుండిగల్

హైద్రాబాద్‌లోని తుక్కుగూడలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభ విజయభేరికి తెలంగాణ నుంచి లక్షలాది మంది ప్రజలు, కార్యకర్తలు హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన భారీ బహిరంగ సభకు వివిధ జిల్లాల నుంచి జనప్రవాహం కదిలింది. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గం నుంచి వేలాది మంది ప్రజలు, పార్టీ కార్యకర్తలు పార్టీ నాయకులతో కలిసి బహిరంగ సభకు హాజరయ్యారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకులు, టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి ఆధ్వర్యంలో 7000 మంది ప్రజలు, కార్యకర్తలు దుండిగల్ మున్సిపాల్టీ గండిమైసమ్మ చౌరస్తా నుంచి భారీ ర్యాలీగా బయలుదేరి.. తుక్కుగూడలోని విజయభేరి సభలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ నాయకులు, బి బ్లాక్ అధ్యక్షులు, యువజన నాయకులు, మహిళా నాయకులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు, మైనార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేశారు.

అన్ని వర్గాల సమాభివృద్ధితో ఆదర్శవంతంగా నిలిచిన తెలంగాణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

అన్ని వర్గాల సమాభివృద్ధితో తెలంగాణ ఆదర్శవంతంగా నిలిచిందని టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ జి.రఘు మారెడ్డి అన్నారు. తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రధాన కార్యాలయంలో చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గౌరవరం రఘుమారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ వివిధ జాతుల, కులాల, మతాల ప్రజల మధ్య ఐకమత్యమే జాతీయ సమైక్యత అన్నారు. అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధిలో భాగస్వామ్యం చేసినప్పుడే సమైక్యత సాధ్యమన్నారు. సీఎం కేసీఆర్ దిశా నిర్దేశంలో రాష్ట్రం అన్ని రంగాల్లో విశేష ప్రతిభ కనబరుస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు టి.శ్రీనివాస్, మదన్‌మోహన్ రావు, జి.పర్వతం, ఎస్.స్వామిరెడ్డి, జి.గోపాల్, శ్యామ్ కుమార్, సీజీఎంలు మురళి కృష్ణ, ప్రభాకర్ రావు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మల్కాజిగిరి నియోజకవర్గము నుండి తుక్కుగుడా బహిరంగ సభకు జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ప్రజలు బయలుదేరి నారు. మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ నాయ కులు ఆదివారం నాడు గాంధీ పార్క్ నుండి మహేశ్వరం నియోజవర్గంలోని తుక్కుగూడ గ్రామంలో రాజీవ్ గాంధీ ప్రాంగణంలో పెద్ద ఎత్తున జరిగే విజయభేరి సభకు ముఖ్యఅతిథిగా సోనియా గాంధీ విచ్చేసి 6 గ్యారెంటీ స్కీములు ప్రవేశపెట్టనున్నరు. బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, మహ్మద్ అలీ, గుత్తి.రాంచందర్, సానాది శంకర్, వినోద్ యాదవ్, జీవన్ రెడ్డి, రెబ్బ వాసు శైలజ పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు బయలుదేరారు. నవతెలంగాణ-మల్కాజిగిరి

ఉచిత వైద్య శిబిరాలు పేద ప్రజలకు వరం

- కార్పొరేటర్ రావుల శేషగిరి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



ఉచిత వైద్య శిబిరాలు పేద ప్రజలకు వరమని గాజుల రామారం డివిజన్ కార్పొరేటర్, గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు రావుల శేషగిరి అన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం పరిధి బాలయ్యనగర్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆరోగ్య పరీక్షలు వేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల నివాసిత ప్రాంతంలో ఇటువంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. సాధారణ వివిధ విభాగాల వైద్యులచే సుమారు 200 మందికి పైగా వైద్య పరీక్షలు చేసుకున్నారు. అనంతరం వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నవాబ్ భాయి, నగేష్, రవికాంత్, సమ్మయ్య యాదవ్, సంధ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆటో కార్మికుల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా



- కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి

నవతెలంగాణ-బాలానగర్

స్వచ్ఛ్ ఆటో కార్మికులు వర్షాకాలమంలో తడవకు నుండా వారి ఆరోగ్యానికి తెలంగాణ ప్రభుత్వం భరోసానిస్తుందని, వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా రక్షణ కవచాలు అందిస్తున్నామని కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు కార్మికుల ఆరోగ్యస్థితిని సంబంధిత సూపర్ వైజర్లు అడిగి తెలుసుకోవాలని ఆదేశించినట్టు తెలిపారు. బాలానగర్ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న స్వచ్ఛ్ ఆటో కార్మికులకు ఆరోగ్య రక్షణ కోసం ఆదివారం జీహెచ్ఎంసీ సిబ్బందితో కలిసి రెయిన్ కోట్లను అందజేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ ఆపత్కాల సమయంలో తమ ప్రాణాలను ఫణంగా పెట్టి సేవచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఏంత చేసినా తక్కువేనన్నారు. వారి శ్రమకు వెలకట్టలేమని, వారి సేవలు నిరుపమానమైనవని కార్పొరేటర్ పేర్కొన్నారు. ప్రతి పారిశుధ్య కార్మికుడు వాటిని ఉపయోగించే మాదిరిగా అధికారులు అవగాహన కల్పించారన్నారు. అనంతరం కార్పొరేటర్ కార్యాలయం వద్ద పర్యావరణ పరిరక్షణలో భాగంగా జీహెచ్ఎంసీ సరఫరా చేస్తున్న మట్టి వినాయక ప్రతిమలను కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి స్థానికులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాజా, ప్రేమ్ కుమార్, శానిటేషన్ ఎస్ఆర్పీ నాగేశ్వర్ నాయక్, ఎస్ఎఫ్ఏ భోళాశంకర్, ప్రకాష్, నాగరాజ్ తోపాటు స్వచ్ఛ ఆటో కార్మికులు పాల్గొన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ విజయానికి నాంది

- టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం

నవతెలంగాణ-బాలానగర్



కూకట్‌పల్లి నియోజకవర్గం నుండి టీపీసీసీ అధికార ప్రతినిధి, పీసీసీ సభ్యులు డా. సత్యం శ్రీరంగం ఆధ్వర్యంలో తుక్కుగూడలో రాజీవ్ గాంధీ ప్రాంగణంలో నిర్వహించే విజయభేరి భారీ బహిరంగ సభకు భారీ ఎత్తున 2 వేలమంది జన సమీకరణతో కాంగ్రెస్ పార్టీ నాయకులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా డా. సత్యం శ్రీరంగం మాట్లాడుతూ నాడు 60 ఏండ్ల బానిసత్వానికి విముక్తి నేడు బీఆర్ఎస్ బీజేపీ ప్రభుత్వాల అవినీతి విద్వేష రాజకీయ పాలనపై సమరభేరి మోగించామన్నారు. లక్షలాది మందితో తుక్కగూడలో జరిగే విజయభేరీ భారీ బహిరంగ సభలో సోనియా గాంధీ తెలంగాణ సమాజానికి ఐదు గ్యారెంటీ పథకాల హామీ ప్రకటన చేయబోతు న్నారన్నారు. 2023-24 ఎన్నికల్లో ఈ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరేయాలని, కాంగ్రెస్‌ను ఎదుర్కొనేందుకు బీజే పీ, బీఆరెఎస్ కలిసి కుట్రలు చేస్తున్నాయన్నారు. బీఆం"ఎస్ పార్టీ ప్రజా వ్యతిరేక, కుటుంబ పాలనతో ప్రజలు విసుగు చెందారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికా రంలోకి వచ్చాక ఏకకాలంలో రూ. 2 లక్షల రైతుల రుణమాఫీ, నిరుద్యోగ యువతకు 2 లక్షల ఉద్యోగాలు, రూ. 500 కే వంట గ్యాస్, ఇండ్లు లేని నిరుపేదలకు ఇంటి నిర్మాణం కోసం రూ. 5 లక్షలు, రైతులు పండించిన పంటకు మద్ద తు ధర, విద్యార్థినీలకు ఎలక్ట్రిక్ స్కూటర్లు తదితర సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఏ బ్లాక్ అధ్యక్షులు పి.నాగిరెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, బాలాజీ నగర్ డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్ పుత్, అల్లాపూర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహ యాదవ్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు.



కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సెప్టెంబర్ 17 పురస్కరించుకుని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ,కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ జాతీయ జెండా ఆవిష్కరించి సమైక్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు.
నవతెలంగాణ-కూకట్‌పల్లి



అల్వాల్ సర్కిల్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఆదివారం జాతీయ సమైక్యత దినోత్సవం శుభ సందర్భాన్ని పురస్కరిం చుకొని డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి జెండా ఆవిష్కరణ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. మన దేశం భారతదేశం మనం భారతీయులం మనమందరం ఒకే జాతి కి చెందిన వాళ్ళమన్నా రు. ఎందరో త్యాగాల ఫలితంగా భారత దేశంలో ఆవిర్భవించిందన్నారు. ముఖ్యంగా దేశ భక్తులను, జాతీయ నాయకులను స్మరించుకోవాలన్నారు. భిన్న త్వంలో ఏకత్వం మన దేశ ప్రత్యేకత, దృష్టి సమైక్యతకు గొడ్డలి పెట్టు. సమైక్యతను కాపాడుటయే నేటితరం ప్రధాన కర్తవ్యమని తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఏ ఎమ్ హెచ్ ఓ మంజుల ఆర్ట్ కల్చర్ అధికారులు ప్రవీణ, స్వామి, నారా యణ రావు , ప్రభాకర్ సిబ్బంది పాల్గొన్నారు.
నవతెలంగాణ-నేరేడ్‌మెట్



తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్లో జరిగిన బహిరంగ సభకు హాజరైన కుత్బుల్లాపూర్ మండలం సీపీఐ నాయకులు.
నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
సోమవారం | సెప్టెంబర్ 18, 2023 | www.navatelangana.com

నిమ్స్‌లో జాతీయ సమైక్యతా దినోత్సవం



నవతెలంగాణ-సిటీబ్యూరో/బంజారాహిల్స్

పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రిలో ఆదివారం జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిం చారు. నిమ్స్ ఆస్పత్రి డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప జాతీయ జెం డాను ఎగురవేసి, అమరవీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరిం టెం డెంట్ నిమ్మ సత్యనారాయణ, డీన్ ప్రొ. లీజా రాజశేఖర్, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ ప్రొ.శాంతివీర్, ముఖ్యమంత్రి కార్యాలయం ఓఎస్‌డి ప్రొఫెసర్ డి.గం గాధర్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్లు డా.లక్ష్మీ భాస్కర్, డా.కేవీ కృష్ణారెడ్డి ,డా.ఉషా సీనియర్ వైద్యులు పారామెడికల్,నర్సింగ్, మినిస్టీరియల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



టీపీసీసీ ఆధ్వర్యంలో తుక్కుగూడ మహేశ్వరం నియో జకవర్గంలో నిర్వహి స్తున్న విజయభేరి సభకు ఆదివారం ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్ నియోజకవర్గ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి విజయ రెడ్డి ఆధ్వర్యంలో ఖైరతాబాద్ నియోజకవర్గం నుండి వేల సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు మహిళలు ఖైరతా బాద్ నెక్లెస్ రోడ్డోని ఇందిరా గాంధీ విగ్రహం నుండి భారీ కాన్వాయితో బయలుదేరి వెళ్లారు. విజయ రెడ్డి మాట్లా డుతూ కాంగ్రెస్ సభకు ఇంత భారీగా తరలివచ్చిన జన సందోహానికి ధన్యవాదాలు తెలియజేస్తూ వారిని క్షేమంగా తీసుకెళ్లి క్షేమంగా తీసుకురావడమే తన లక్ష్యమని తెలిపారు.

నవతెలంగాణ-బంజారాహిల్స్

శ్రీనివాసన్ మెమోరియల్ అవార్డ్ అందుకున్న చంద్రశేఖర్



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్, ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొ. పైడిమర్రి చంద్రశేఖర్ ప్రతిష్టాత్మక అవార్డ్‌కు ఎంపిక ఐయ్యారు. ఇనిస్టిట్యూట్స్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలి కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ వారు ప్రదానం చేసే ప్రొ.కె.శ్రీనివాసన్ మెమోరియల్ అవార్డ్ 2023 సం, అవార్డ్‌ను శనివారం పూణేలో ఆయన అవార్డు స్వీకరిం చారు. గత ఐదు సంవత్సరాలు బోధన పరిశోధన రంగా ల్లో అందిస్తున్న విశేష సేవాలకు గాను అవార్డ్‌కు ఎంపి కైనట్లు తెలిపారు.అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు ప్రొ.చంద్రశేఖర్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. పలువురు విద్యార్థులు సత్కరించారు.

హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ చరిత్ర సృష్టిస్తారు

- అజ్మీర్ షరీఫ్ దర్గాలో ఉద్యమ నేత శోభన్ రెడ్డి ప్రార్ధనలు
- ముఖ్యమంత్రి క్షేమంగా ఉండాలని "చాదర్" సమర్పణ



నవతెలంగాణ-ఓయూ

అన్నివర్గాల సంక్షేమ సారథి, భారత దేశ భవిష్యత్తు దిక్సూచి, తెలంగాణ ప్రజల కోసం తెలంగాణ కోసం నిత్యం శ్రమించే నాయకుడు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు, ఆయన కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో కల కాలం జీవించాలని బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు, (బీఆర్ఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డి ఆకాంక్షించారు. ప్రజల మద్దతు పుష్కలంగా ఉన్న బీఆర్ఎస్ పార్టీ మూడోసారి అధికారంలోకి వస్తుందని, హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ చరిత్ర సృష్టిస్తారని ధీమా వ్యక్తం చేశారు. రాజస్థాన్ లోని అజ్మీర్ షరీఫ్ దర్గాను శుక్రవారం సందర్శించిన ఆయన ముస్లిం మతపెద్దల సమక్షంలో దైవ ప్రార్ధనలు జరిపారు. ఈ కార్యక్రమంలో టీటీయూసీ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆండాలు శివకుమార్, కాజా పాషా, పవన్ కళ్యాణ్, ముజీబ్, ముజాహిద్, అలీ పలు కార్యకర్తలు పాల్గొన్నారు.

సాదం ఐలయ్య పరిశోధనకు భారతీయ పేటెంట్లు



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ డిపార్ట్మెంట్ ఆఫ్ కెమికల్ ఇంజినీ రింగ్‌లో దశాబ్ద కాలంగా పనిచేస్తున్న డా. సాదం ఐల య్య కు తాను చేసిన పరిశోధనలకు రెండు భారతీయ పే టెం ట్‌లు దక్కాయని ఓయూ ప్రెఫిసర్లు తెలిపారు. 1. పారి శ్రామిక వ్యర్థాల నుండి ఎసిటిక్ యాసిడ్ వెలికితీత / రికవరీ పద్ధతిపై పరిశోధనలు చేశారు. ఈ పరిశోధన లిక్విడ్-లిక్విడ్ ఎక్స్‌ట్ర ాక్షన్‌లో ఉప యోగించే ప్రాసెస్ ఇంటెన్సిఫికేషన్ టెక్నిక్‌ల ను ప్రత్యేకించి ఈ ఆవిష్కరణ లిక్విడ్-లిక్విడ్ వెలికితీత పద్ధతి, దాని సజ ల ద్రావణం అనగా రసాయన వ్యర్థాలు, పారిశ్రామిక వ్యర్థా లు నుండి ఎసిటిక్ యాసిడ్‌ను తిరిగి పొందే పద్ధతులకు సంబంధి ంచిందని ఆయన తెలిపారు. తన పీహెచ్డీ పరిశోధన నను టెక్నాలజీ కళాశాల సీనియర్ ప్రొ.వి.వి.బసవరావు, ఇండి యన్ ఇనిస్టిట్యూట్ కెమికల్ టెక్నాలజీ సీనియర్ శాస్త్రవేత్త డా. బి.సత్యవతి పర్య వేక్షణలో చేసినట్లు తెలిపారు. విద్యా ర్థులకు ఉపయోగ పడే అనేక సాంకేతిక కార్య క్రమాలు నిరంతరం నిర్వహిస్తున్న సమర్థవంతమైన వ్యక్తి ఐలయ్య. రెండు భారతీయ పేటెంట్ లు సాధించిన డా.సాదం ఐల య్యను తన గురువులు, కళాశాల ఆచార్య లు,పూర్వ విద్యా ర్థులు,స్నేహితులు, కుటుంభ సభ్యులు అభినందించారు.

యువ ఆర్థోపెడిక్ సర్జన్లకు అత్యాధునిక శస్త్ర చికిత్సపై అవగాహన

- ఆత్మనిర్భర్ రోబోట్' రూపకల్పనే లక్ష్యం
- ఆర్థోపెడిక్ స్కోపీ సమ్మిట్ నిర్వహణ



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

యువ ఆర్థోపెడిక్ సర్జన్లకు అత్యాధునిక శస్త్ర చికిత్సా పద్ధతులను బోధించడమే లక్ష్యంగా , అపోలో ఆస్పత్రి సికిం ద్రాబాద్, అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (ఏఐఎంఎస్ఆర్)తో కలిసి యువ ఆర్థోపెడిక్ సర్జ న్లకు అత్యాధునిక శస్త్ర చికిత్సపై అవగాహన కల్పించారు. ఆదివారం తెలంగాణ ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్ (టీవోఎస్ఏ), ట్విన్ సిటీస్ ఆర్థోపెడిక్ సొసైటీ (టీసీవోఎస్) ఆధ్వర్యంలో, జూబ్లీహిల్స్‌లోని అపోలో హెల్త్ సిటీలో గల అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (ఏఐఎంఎస్ఆర్)లో, 7వ ఆర్థోప్లాస్టీ ఆర్థోస్కోపీ సమ్మిట్ 2023 (ఏఏఎస్)ను నిర్వహించారు. ఈ సమ్మిట్‌కు తెలంగాణ నుంచి వంద మందికి పైగా ఆర్థోపెడిక్ సర్జన్లు, యువ ఆర్థో ప్రొఫెషనల్స్ హాజరయ్యారు. జాతీయ, స్థానిక అధ్యాపకులచే దాదాపు 50 ఆర్థోపెడిక్ విధానాలు, సాం కేతికతలు అందించబడినట్లు తెలిపారు. అపోలో ఆస్పత్రి (హైదరాబాద్) సీనియర్ ఆర్థో, జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, ఏఏఎస్ ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ ఎన్ సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఈ సమగ్ర బోధనా యువ ఆర్థోపెడిక్ సర్జన్లకు సరైన సూచనలు, శస్త్రచికిత్స సాంకేతికతలకు సంబంధించి జ్ఞానం, ప్రతిభను మెరుగుపరుచుకోవడంలో మార్గనిర్దేశం చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. కొన్నేళ్లుగా మా సదస్సుకు ప్రతినిధుల నుంచి అపారమైన ఆదరణ లభిస్తుందన్నారు. ఈ సమ్మిట్ టెక్నాలజీని ఉప యోగించి ఆర్థోపెడిక్ కేర్‌లో సరికొత్త హద్దులపై దృష్టి సారించిందన్నారు. ప్రధానంగా రోబోటిక్, ఏఐ ఆధారిత చికిత్సలు, శస్త్రచికిత్స కచ్చితత్వం, రోగి తొందరగా కోలు కోవడం, రోగులపై చికిత్సకు అయ్యే ఖర్చు భారాన్ని తగ్గిం చడంపై దృష్టి పెట్టామన్నారు. జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీలో రోబోటిక్ మోకాలి మార్పిడి, కచ్చితత్వం, మెరుగైన ఫలితాలను లక్ష్యంగా చేసుకున్నామని తెలిపారు.ఈ సెమి నార్ ఆర్థోపెడిక్ చికిత్సలో విప్లవాత్మకమైన సాంకేతికతలో అద్భుతమైన సామర్థ్యాన్ని చూపిందన్నారు. ఈ సందర్భంగా అపోలో హాస్పిటల్స్ సీనియర్ ఆర్థో, జాయింట్ రీప్లేస మెంట్ సర్జన్, ఏఏఎస్ కోర్సు డైరెక్టర్ డాక్టర్ మిథిన్ ఆచి మాట్లాడారు. ఈ సెమినార్లో అనేక మంది వక్తలు తమ విలువైన అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ కార్యక్ర మంలో కెమ్ హాస్పిటల్ (ముంబయి) ప్రొఫెసర్ ఎస్ఎస్ మొహంతి, మణిపాల్ హాస్పిటల్స్ (బెంగుళూరు) డాక్టర్ సునీల్ కిని, కేబీ బాబా హాస్పిటల్స్, రిలయన్స్ ఫౌండేషన్ హాస్పిటల్స్ (ముంబయి) డాక్టర్ స్వప్నిల్ కెనీ ఈ సమ్మిట్‌లో తాజా పద్ధతులపై చర్చించారు.

విత్తన గణేశ విగ్రహాల పంపిణీ

- పాల్గొన్న ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్ సిబ్బంది



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

నేడు జరిగే వినాయక చవితి సందర్భంగా ఫ్రీడమ్ హె ల్తీ కుకింగ్ ఆయిల్స్ మార్కెటీర్లు, రిఫైనర్స్ అయిన జెమినీ ఎడిబుల్స్ అండ్ ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్ (జీఈఎఫ్ ఇండియా), స్థిరమైన, పర్యావరణ అనుకూల పద్ధతులను ప్రోత్సహించే తమ ప్రయత్నాలలో భాగంగా, 10,000 పర్యావరణ అనుకూల సీడ్ గణేశ బాక్స్‌లను పంపిణీ చేసి నట్లు తెలిపారు. వాతావరణ మార్పుల ప్రతికూలతల గురించి ప్రజలు అవగాహన పెంపొందించుకుంటున్నారని, పర్యావరణ అనుకూల గణేశుడిని పూజించడం ద్వారా స్థిరమైన మతపరమైన వేడుకలను వేగంగా స్వీకరిస్తు న్నారన్నారు. ఈ విగ్రహాల నిమజ్జనం నీటి వనరులపై ఎటువంటి ప్రతికూల ప్రభావాన్ని చూపనందున, వీటిని పూజించటానికి అమిత ఆసక్తి కనబరుస్తున్నారు. దీన్ని ప్రోత్సహించడానికి ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్ హైదరాబాద్‌లో 7,000 పర్యావరణ అనుకూల సీడ్ గణేశ పెట్టెలను అండ్ బెంగళూరులో 3,000 పర్యావరణ అనుకూల సీడ్ గణేశ పెట్టెలను పంపిణీ చేస్తుందన్నారు. రెయిన్‌బో విస్టా (ఫేజ్ 1 అండ్ 2), మలేషియా టౌన్‌షిప్, అపర్ణ సరోవర్, ఎన్‌సిసి అర్బన్- మాదాపూర్, స్వాన్‌లేక్ అపార్ట్‌మెన్- మూసాపేట్, రిడ్జ్ టవర్స్-ఐడీపీఎల్, మై హోమ్ జువెల్, ఇండిస్ వన్ సిటీ - కెపిహెచ్ బి , శాటిలైట్ టౌన్‌షిప్-కొంపల్లి, సత్యనారాయణ ఎన్‌క్లేవ్- చందా నగర్ మొదలైనటువంటి అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్ లకు పర్యావరణ అనుకూలమైన విత్తన గణేశుడిని పంపిణీ చేయడానికి, చేతన్ పింపాల్‌ఖుటే, డిజిఎం మార్కెటింగ్, ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్‌లి బృందంతో కలిసి వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు.

ఎంఐఎం ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

ఎంఐఎంఐ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ పార్లమెంట్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పిలుపు మేరకు నాంపల్లి దర్గా వద్ద ఆదివారం జాతీయ సమైక్యత దినోత్సవం సంద ర్భం గా తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ ఆధ్వ ర్యంలో ఈద్ గాహ్ బిలాల్ హాకీ గ్రౌండ్ మసాబ్ ట్యాంక్ వరకు త్రిరంగ యాత్ర కొనసాగింది. ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వాలపై భారం మోపుతున్న కేంద్ర ప్రభుత్వం

- భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ (బీఆర్‌టీయూ) వ్యవస్థాపక అధ్యక్షులు జి. రాంబాబు యాదవ్



నవతెలంగాణ - ముషీరాబాద్

కేంద్ర ప్రభుత్వం పలు పథకాలను (స్కీం) ప్రవేశపెట్టి అమలు, నిర్వహణ బాధ్యతల నుంచి తప్పుకుంటూ రాష్ట్రాలపై భారం మోపు తోందని భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ (బీఆర్‌టీయూ) వ్యవ స్థాపక అధ్యక్షులు జి. రాంబాబు యాదవ్ తీవ్రంగా విమర్శించారు. పథకాలను ప్రవేశపెట్టే సమయంలో ఉన్నంత ఉత్సాహం పథ కాలను అమలు చేయడంలో కేంద్రం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంద న్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసి స్టెంట్ల ప్రతినిధుల రాష్ట్ర స్థాయి సభ బాగ్ లింగం పల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగింది. ఈ సభకు తెలంగాణ రాష్ట్ర ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం (బీఆర్‌టీయూ అను బం ధం) అధ్యక్షులు మేకల రవి అధ్యక్షత వహించగా, సంఘం గౌరవ అధ్యక్షులు,బీఆర్‌టీయూ వ్యవస్థాపక అధ్యక్షులు రాంబాబు యాద వ్,కనీసవేతనాలసలహా మండలి పి.నారాయణ ముఖ్య అతిథులు గా విచ్చేసి ప్రసంగించారు. రాంబాబు యాదవ్ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ లకు తక్షణమే వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించా లని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగానున్న ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలపై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి, కేంద్ర ప్రభుత్వం సరైనదృష్టి సారించడం లేదన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్య దర్శి సిద్ధి రాజు, కోశాధికారి కె. రవి, నాయ కులు టీ. చంద్రశేఖర్, వి. లింగా నాయక్, జి. కేశవులు, పి. యాద య్య, చెన్నప్ప,దయామణి, కృష్ణవేణి, స్వప్న పాల్గొన్నారు.

హెల్త్ సిటీ డైరెక్టర్ ప్రీతి భద్ర రెడ్డి ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-కంటోన్మెంట్

మల్లారెడ్డి హెల్త్ సిటీ డైరెక్టర్ డాక్టర ప్రీతిభద్రరెడ్డి పుట్టినరోజు సందర్భంగా టీఆర్ఎస్ సీనియర్ యువ నాయకుడు టింకు గౌడ్ ఆదివారం బోయినపల్లిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం యువ నాయకులు ఆర్ టీంకు గౌడ్ దినేష్, రవళిక డాక్టర్ ప్రీతి రెడ్డి ని పూల బొకే అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు.

కాంగ్రెస్ పార్టీతోనే బడుగు బలహీన వర్గాల అభివృద్ధి

- తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ



నవతెలంగాణ-బేగంపేట్

సనత్ నగర్ నియో జకవర్గం బేగంపేట డివి జన్ నుండి తుక్కుగూడలో నిర్వహించే విజయభేరి బహిరంగ సభకు తెలం గాణ ప్రతి కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ ఆధ్వర్యంలో ఐదు బస్సులలో భారీ సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు తుక్కుగూడకు వెళ్లారు. ర్యాలీని డాక్టర్ కోట నీలిమ జెండా ఊపి ప్రారం భించారు. ఈ సందర్భంగా డాక్టర్ కోట నీలిమా మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఒక అవకాశం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

పేద, మధ్య తరగతి ప్రజల మేలు కోసమే మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్

- బీఆర్ఎస్ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్

పేద, మధ్య తరగతి ప్రజల మేలు కోసమే ప్రభుత్వం మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌ను నిర్మిస్తున్నట్లు సనత్ నగర్ కార్పొరేటర్ కొలన్ లక్ష్మీ బాల్ రెడ్డి, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్‌లు అన్నారు. ఆదివారం సనత్ నగర్ లోని కైలాష్ నగర్ లో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కృషితో మంజూరైన 3.30 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న మల్టి పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను ప్రారంభించారు. అన్ని సౌకర్యాలతో నిర్మిస్తున్న ఫంక్షన్ హాల్ ను అతి తక్కువ అద్దెకు ఇవ్వడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో అమీర్ పేట మాజీ కార్పొరేటర్ నామన శేషకుమారి, కైలాష్ నగర్ అధ్యక్షులు భోగి బాలరాజ్, నాయకులు సురేష్ గౌడ్, సరాఫ్ సంతోష్, ఖలీల్, రాజేష్ ముదిరాజ్, జమీర్, పుష్పాలత, ఝాన్సీ, రుక్మిణి, పద్మ పాల్గొన్నారు.



జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్‌లో మేయర్ క్యాంప్ కార్యాలయంలో గద్వాల్ విజయలక్ష్మి జాతీయ జెండాను ఆవిష్కరి ంచారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బంజారా హిల్స్

విజయభేరికి తరలిన పార్టీ శ్రేణులు

- మధుకర్ యాదవ్



నవతెలంగాణ-బంజారాహిల్స్

చలో విజయ భేరి అంటూ తొక్కిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆది వారం కదంతొక్కారు. తుక్కుగూడ సభ కోసం ఖైరతాబాద్ టీపీసీసీ సెక్రెటరీ మధుకర్ యాదవ్ ఆధ్వ ర్యంలో ప్రత్యేక ర్యాలీ నిర్వహించి భారీగా హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ కార్య కర్తలు అభిమానులు విజయానికి శుభసూచికమని ఆయన తెలిపారు.

45 రోజుల యజ్ఞ ప్రచారార్థం సంకీర్తన ప్రారంభం



నవతెలంగాణ-బంజారాహిల్స్

తెలంగాణా విమోచన దినోత్సవాన్ని పురస్కరిం చు కొని ఇంద్రానగర్ శివాజీ విగ్రహ కూడలిలో తెలంగాణా అమర వీరులకు మేనేజింగ్ ట్రస్టీ,లతామా ఫౌండేషన్ మాధవి లత నివాళులు అర్పించి 45 రోజుల యజ్ఞ ప్రచా రార్థం సంకీర్తన ప్రారంభించారు. భార తదేశ సర్వతోముఖాభివృద్ధికై, భారతీయుల శ్రేయస్సు కాంక్షిస్తూ, ప్రపంచ శాంతి, సామరస్యాన్ని కాపాడడానిక, భాగ్యనగర పురోభివృద్ధిని కోరుకుంటూ సనాతన ధర్మ సాంప్రదా యలకు అనుగుణంగా 45 రోజుల పాటూ మహా యజ్ఞాన్ని ఆదివారం ఆమె పోషో మహానుడి సీతారాం శ్రీరామ దేవస్థానంలో ప్రారంభించారు. 15 అక్టోబర్ నుం డి కార్తిక పౌర్ణమి అయిన 27 నవంబర్ వరకూ నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, ఛైర్మన్, హనుమాన్ మందిర్ ఆలయ కమిటీ, గుఫా నగర్, యం చంద్ర శేఖర రెడ్డి, ఛైర్మన్, బం గారు మైసమ్మ నల్ల పోచమ్మ మందిరం, ఇంద్రా నగర్, యమన్ సింగ్,మాజీ అధ్యక్షులు, భజరంగ్ దళ్,సంయుక్త ఆంధ్ర ప్రదేశ్ లతో పాటూ స్థానికులైన నరేంద్ర గౌడ్, పలువురు లతామా ఫౌండేషన్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం



నవతెలంగాణ-బేగంపేట్

లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 320ఏ ఆధ్వ ర్యంలో ఆదివారం సికింద్రాబాద్ లయన్స్ భవన్‌లో ఉపా ధ్యాయులను ఘనంగా సత్కరించారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ 320ఏ కో ఆర్డినేటర్ జాజుల అంజయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిస్ట్రిక్ గవర్నర్ హరినారాయణ్ హాజరయ్యారు. ఆయన ఉపాధ్యాయులను సత్కరించడంతో పాటు వారి సేవలను కొనియాడారు. ఉపాధ్యాయ వృతి ఎంతో గౌరవప్రదమై నదని, దేశ ప్రగతికి వారు నిర్మాతలని కొనియాడారు. ఎలాంటి స్వార్థం లేకుం డా ప్రతి విద్యార్థిని ఉన్నత శిఖరాలకు చేర్చేందుకు ఉపాధ్యాయులు పడుతున్న కృషి అమోఘమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా డాక్టర్ కే సుధీర్‌రెడ్డి, అతిథిగా కోటేశ్వరరావు, డాక్టర్ మహేంద్ర కుమార్ రెడ్డి, ఎం జనార్థన్‌రెడ్డి ఎంవి చారి, ఈవెంట్ చైర్మన్ పఠాన్ ఉమ ర్ ఖాన్, కో చైర్మన్ ఎంవీఎస్ రంగయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు విద్యలో రాణించాలి.. సామాజిక సేవాలు చేయాలి

- ఐఎస్ఓ విద్యా సంస్థల డెరైక్టర్ డా.వినోద వెంకట్ స్వామి



నవతెలంగాణ-ఓయు:

విద్యార్థులు విద్యాలో రాణించాలని, సామాజిక సేవా ల్లో పాల్గొనాలని ఐఎస్ఓ విద్యా సంస్థల డెరైక్టర్ డా.వినోద వెంకట్ స్వామి, చైర్మన్ టి.వెంకట్ స్వామిలు అన్నారు. ఐఎస్ఓ విద్యా సంస్థల విద్యార్థుల ఫ్రెషర్స్ పార్టీని ఆది వారం తార్నాక లోని మర్రి కృష్ణ రెడ్డి ఫంక్షన్ హాల్లో నిర్వ హించారు. విద్యార్థులు క్రీడలు ,సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనాలని అప్పుడు ఆరోగ్యంతో పాటుగా ఫిట్‌గా ఉం టా రన్నారు. తమవిద్యాసంస్థల్లో విద్యాను అభ్యశిస్తున్న విద్యా ర్థులకు సౌకర్యాలు కల్పనకు పెద్దపీఠం వేస్తున్నట్టు చెప్పా రు. కళశాలఅసి స్టెంట్‌డెరైక్టర్‌రమ, డీన్ ప్రిన్సిపాల్ మనోహర్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రదీ ప, వైస్ ప్రిన్సిపాల్ రాజశ్రీ,దివ్య, అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ ప ద్మ, అధ్యాపకులు,విద్యార్థులు,ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంప్రదాయంగా ఓనం వేడుకలు

నవతెలంగాణ-కంటోన్మెంట్

మలయాళీ సేవ సమితి అధ్వర్యంలో ఆది వారం బోయినపల్లి ఎంఎంఆర్ గార్డెన్‌లో ఓనం వేడు కల ఘనం నిర్వహించారు. కార్యక్రమమంలో దీనిలో భాగంగా కేరళ సంప్రదాయ దుస్తువులు ధరించి మలయాళీలు సందడి చేశారు. కేరళ మలయాళీ సినీ నటి తార కళ్యాణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా మలయాళీ సేవ సమితి ప్రసిడెంట్ అజేయ కుమార్, కార్యదర్శి రాజేష్‌లు ఆమెకు ఘన స్వాగతం పలికారు.ముఖ్య అతిథి తార కళ్యాణి జ్యోతి ప్రజల్వనతో ఓనం వేడుకలు ప్రారంభం చేశారు అన ంతరం ఆమె మాట్లాడారు.మహిళలు పలు సాంస్కృ తిక కార్యకర్తలు నిర్వహించారు. బాగంగా కేరళ సంబంధిత స్టాల్‌లు మరింత ఆకట్టుకు న్నా యి. అసోసియేషన్ ప్రతినిధిలో చంద్రమోహన్, థామస్ జాన్సన్, రాజనారాయణ , థామస్, నాయర్ , రాజ కమల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం అందించే అవకాశాలను సద్వినియోగం చేసుకోండి

- వల్లాల శ్రీధర్

నవతెలంగాణ-బంజారాహిల్స్

ప్రభుత్వం అందించే అన్ని పథకాలను ప్రజలు సద్విని యోగం చేసుకోవడానికి రేషన్ షాపుల్లో ఏర్పాటుచేసిన కేవైసీ బయోమెట్రిక్ చేసుకోవాలని రేషన్ షాపుల డీలర్ అసోసియేషన్ హైదరబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ వల్లాల శ్రీధర్ నగర ప్రజలకు కోరారు.అనంతరం ఆయన మాట్లాడుతూ అనేక సమస్యలు ఎదుర్కొంటు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అన్నింటికీ కట్టుబడి లాభనష్టాలను బేరిసూ వేయకుండా ప్రభుత్వ మాటకు విలువనిస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్న రేషన్ షాపుల డీలర్ల కుటుంబ సభ్యులతో పాటు వారి పరిస్థితి కూడా దయనీయంగా ఉందని ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసి ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గత వారం నుండి ప్రారంభమై నగరంలోని అన్ని రేషన్ షాపుల్లో కేవైసీ కుటుంబ సభ్యులతో కలిసి సరికోవాలన్నారు. ఇప్పటికే చాలా రేషన్ షాపులు మూతపడ్డాయని దీనిని నడిపించల ేమని చాలామంది వెనకడుగు వేస్తున్నారు కరోనా సమయం లో అనేకమంది చనిపోయారని వారి కుటుంబాలను కూడా ఆదుకొని వాటిని పునః ప్రారంభం నుంచే ప్రక్రియ మొదలు పెట్టాలని ఆయన ప్రభుత్వానికి ఆవేదన వెలిబుచ్చారు.

ఘనంగా మోడీ జన్మదినోత్సవం



నవతెలంగాణ-హైదరాబాద్

నాగోల్ డివిజన్ పరిధిలోని ఇంద్రప్రస్థ కాలనీ మున్సిపల్ గ్రౌండ్‌లో బీజేపీ ఆధ్వర్యంలో భారత ప్రధాని నరేంద్రమోడీ జన్మదినోత్సవాలు ఘనంగా నిర్వహించినట్లు బీజేపీ నగర కార్యవర్గ సభ్యులు డాక్టర్ రాజ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ కీర్తిని ప్రపంచానికి చాటిన గొప్ప నాయకుడని, అగ్రదేశాలు, ఇస్లామిక్ దేశాలు సైతం జై మోడీ అనడం ప్రతి భారతీ యుడికి గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షతన లయ కాలంశెట్టి వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ నాయకులు రాము గౌడ్, చంద్రశేఖర్ ఆజాద్, నరేష్ గౌడ్, ప్రేమ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

జాతీయ జెండాను ఆవిష్కరించిన నీరుడి శ్రీరామ్

నవతెలంగాణ-మేడ్చల్



తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా పూడూరు గ్రామంలోని ముదిరాజ్ సంఘం వద్ద ఏర్పాటు చేసిన జాతీయ జెండాను సంఘం యూత్ ఉపాధ్యక్షుడు నీరుడి శ్రీరామ్ ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట అమరవీరులకు జోహార్లు అంటూ నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణకు 1948 సెప్టెంబర్ 17న స్వాతంత్య్రం వచ్చిందన్నారు. అప్పటి కేంద్ర హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ నాయకత్వంలోని కేంద్ర బలగాలు హైదరాబాద్ సంస్థానంలోని నిజం రాజు పై సైనిక చర్య ద్వారా భారతదేశంలో తెలంగాణను విలీనం చేయడం జరిగిందన్నారు. యూత్ ఉపాధ్యక్షుడు జీ.పరమేష్ ,సర్పంచ్ బాబు యాదవ్,ఎంపీటీసీ రఘు,వార్డు సభ్యులు శ్రీకాంత్,శేషి కుమార్, జనార్ధన్ యాదవ్,దేవేందర్,మాజీ వార్డు సభ్యులు తుపాకుల కష్ణ,కోలా వెంకటేష్ ,శేఖర్ రెడ్డి, మల్లికార్జున్,దేవేందర్,తిరుమణి రమేష్,సాదే రాజు,సాయి పాల్గొన్నారు.

నవతెలంగాణ
మనసు తెలుగు దినపత్రిక
11
హైదరాబాద్
HMDA
సోమవారం | సెప్టెంబర్ 18, 2023 | www.navatelangana.com

సీఎం కేసీఆర్‌ను కలిసిన మేడ్చల్ బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ- మేడ్చల్



పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని సీఎం కేసిఆర్ ప్రారంభించిన సందర్భంగా సమావేశంలో సీఎం కేసీఆర్‌ను మేడ్చల్ బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు మంత్రి మల్లారెడ్డితో పాటు మేడ్చల్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌ను పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి కాసేపు ముచ్చటించారు. కలసిన వారిలో డీసీఎంఎస్ వైస్ చైర్మెన్ మధుకర్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మెన్ భాస్కర్ యాదవ్,మాజీ చైర్మెన్ సత్యనారాయణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు మద్దుల శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

సాయుధ పోరాటంలో బిజేపీ పాత్ర ఎక్కడిది..?



- అన్ని వర్గాలను ఏకతాటిపైకి తీసుకువచ్చింది కమ్యూనిస్టులే
- చరిత్రను వక్రీకరిస్తూ మతతత్వాన్ని రెచ్చగొడుతున్న బీజేపీ
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీజీ నర్సింగ్‌రావు, నగర కార్యదర్శి ఎం శ్రీనివాస్

నవతెలంగాణ-అంబర్‌పేట

చరిత్రను వక్రీకరిస్తూ మతతత్వాన్ని రెచ్చగొడుతూ పబ్బం కడుకోవాలని బీజేపీ చూస్తోందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీజీ నర్సింగ్‌రావు, పార్టీ నగర కార్యదర్శి ఎం శ్రీనివాస్ అన్నారు. ఆదివారం హైదరాబాద్ కాచిగూడ కష్టా నగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాల ముగింపు సభ సీపీఐ(ఎం) నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం మహేందర్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సభకు హాజరైన డీజీ నర్సింగ్ రావు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టులు ప్రజలతో మమేకమై నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా అన్ని వర్గాలను ఏకతాటిపై తీసుకువచ్చి తెలంగాణకు విముక్తి లభించారన్నారు. అయితే బ్రిటిషర్ల మోచేతు నీళ్ల తాగి ఏ సంబంధం లేని వాళ్ళు ఇప్పుడు సాయుధ పోరాటంలో పోరాడినట్టు నాటకాలు ఆడుతున్నారన్నారు. 9 ఏండ్ల నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రజల సొమ్మును కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతూ ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతోందన్నారు. మేధావుల చరిత్రను వక్రీకరిస్తున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని గద్దె దింపే వరకు కార్యకర్తలు, ఉద్యమకారులు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నాగలక్ష్మి, దశరథ్, వెంకటేష్, రాజన్న, అంబర్ పేట జోన్ సభ్యులు రాములు, సుబ్బారావు షబానా సోమయ్య వరలక్ష్మీ యేసు, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.





న్యాయ సహాయం అందరికీ అందాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ప్రిన్సిపల్, సీనియర్ సివిల్ జడ్జి డి.కిరణ్‌కుమార్

నవతెలంగాణ-సిటీబ్యూరో

న్యాయ సహాయం అందరికీ అందేలా చూడటం తమ లక్ష్యం అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ప్రిన్సిపల్, సీనియర్ సివిల్ జడ్జి డి.కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోర్టు ఆవరణలో రెండు రోజులుగా కొనసాగుతున్న న్యాయ సహాయకుల శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. న్యాయ సహాయకులుగా నియమితులైన 30 మందికి జిల్లా సేవాధికార సంస్థ చైర్మెన్ బీఆర్ మధుసూదన్ చేతుల మీదుగా గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్ మానసారెడ్డి, న్యాయవాదులు సునీతారాజ్, నల్ల వెంకటరమణ, మంజూష, జలజ, మంజుల తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా జిల్లా బార్ అసోసియేషన్ కార్యదర్శి రాజు యాదవ్ మాట్లాడుతూ పిల్లల హక్కుల గురించి అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కె.విక్రమ్ వద్దుల హక్కుల గురించి వివరించారు. అనంతరం మనుషుల అక్రమ రవాణా అంశంపై నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు ఐసీడీఎస్ సభ్యులు సఖి కేంద్రాల సభ్యులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కమిషనర్ రోనాల్డ్ రోస్‌తో కలిసి మేయర్ గద్వాల్ లక్ష్మీ జెండా ఆవిష్కరించారు. ఉన్నత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.
నవతెలంగాణ-సిటీబ్యూరో





నిమ్స్ డైరెక్టర్ బీరప్పకు హెల్త్‌కేర్ అవార్డు

నవతెలంగాణ-సిటీబ్యూరో

పంజాగుట్ట నిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్ నగరి బీరప్పకు హెచ్ఎంటీవీ హెల్త్‌కేర్ అవార్డు లభించింది. 'టాప్ టెన్ పబ్లిక్ హెల్త్ సేవియర్స్ హైదరాబాద్' క్యాటగిరీలో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా బీరప్ప ఈ అవార్డును అందుకున్నారు.



'ఎంఎల్ఆర్ఐటీ' విద్యార్థులకు మొదటి బహుమతి

నవతెలంగాణ-సిటీబ్యూరో

సెప్టెంబర్ 17 సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థులు మొదటి బహుమతి పొందారు. సికింద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం వారు మూడు రోజులుగా నిర్వహించిన రంగస్థలం నాటకంలో 'ఎంఎల్ఆర్ఐటీ' విద్యార్థులకు మొదటి బహుమతి లభించింది. ఈ కార్యక్రమ ముగింపు ఉత్సవాలకు గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్, కేంద్ర పర్యాటక, సాంస్కృతిక, అభివృద్ధి శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై 'ఎంఎల్ఆర్ఐటీ' విద్యార్థులకు, కాలేజీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నాయిని ఉదయ్ రంజన్‌గౌడ్, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్ వేమూరి నితిన్‌కు బహుమతి అందజేశారు. వారి కళాశాల విద్యార్థులు బహుమతులు సాధించడం పట్ల కళాశాల కార్యదర్శి మర్రి రాజశేఖర్‌రెడ్డి, డైరెక్టర్ అను శ్రేయారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు.

డాక్టర్ రఘుపతిరెడ్డి మృతి

నవతెలంగాణ-అంబర్ పేట



రాజాబహుదూర్ వెంకట్రామరెడ్డి ఎడ్యుకేషన్ సొసైటీ మాజీ అధ్యక్షుడు, తిలక్ నగర్ హాస్పిటల్ ఎండీ, ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ ఎడ్ల రఘుపతిరెడ్డి కన్నుమూశారు. పెద్దకుమారుడు దీప్తి నందన్ రెడ్డి నివాసంలో ఆదివారం తెల్లవారు జామున బాత్రూంకు వెళ్లిన డాక్టర్ రఘుపతిరెడ్డి ప్రమాదవ శాత్తు జారి కిందపడిపోయాడు. అదే సమయంలో గుండెపోటు రావడంతో అపస్మరక స్థితికి చేరుకున్నారు. వెంటనే ఆయన కుమారుడు ఓ ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఆయన మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. రఘుపతిరెడ్డి భార్య రెండేండ్ల క్రితం మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్దకుమారుడు డాక్టర్ దీప్తినందన్‌రెడ్డి ప్రముఖ వైద్యుడు కాగా, చిన్నకుమారుడు దీపకరణ్ రెడ్డి బిల్డర్, కుమార్తె డాక్టర్ మహంతి అమెరికాలో పేరొందిన వైద్యురాలు. డాక్టర్ రఘుపతిరెడ్డి అంత్యక్రియలు మంగళవారం స్వగ్రామంలోని చంగిచర్లలో నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన తిలక్‌నగర్ హాస్పిటల్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సహాయం అందించారు. ఆయన మృతికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, నల్లకుంట కార్పొరేటర్ ఎస్. అమృత, రెడ్డి సొసైటీ ప్రతినిధులు తదితరులు సంతాపం తెలిపారు.

అవరోధాలను అధిగమించి ఎదిగిన అక్కినేని



- ప్రముఖ నటుడు, నిర్మాత మురళీ మోహన్

నవతెలంగాణ-కల్చరల్

పెద్దగా చదువుకొక పోయినా , తనను మించిన రూపవంతులు ఉన్నా కేవలం ఆత్మ స్థైర్యం పట్టుదల దీక్షతో అవరోధాలను అధిగమించి ఎదిగిన గొప్ప నటుడు అక్కినేని నాగేశ్వరరావు అని ప్రముఖ నటుడు నిర్మాత మురళీ మోహన్ కొనియాడారు. సినీ రంగంలో ఆయనకు జరిగిన సత్కారాలు పురస్కారాలు మరెవరికీ దక్కలేదని కేంద్ర ప్రభుత్వ పద్మ విభూషణ్ కూడా అందుకున్నారని వివరించారు. రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా నిర్వహణ లో అక్కినేని శత జయంతి వేడుకలు వైభవం గా నిర్వహించారు. ఈ సందర్భంగా గత మూడు సంవత్సరాలుగా కరో నా కారణంగా నిలిచిపోయిన వివిధ రంగ ప్రముఖుల పురస్కారాలతో పాటు 2023 అవార్డ్‌ను కూడా బహుకరణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా మురళి మోహన్ పాల్గొని మాట్లాడుతూ ఎన్ని అవార్డ్స్ వచ్చినా అక్కినేనికి రవీంద్ర భారతి వేదిక పట్ల అభిమానం ఎక్కువ అనీ అమెరికా నుంచి వచ్చి ఆ వేదిక పై ఆయన పేరిట పురస్కారాలు అందిస్తున్న ఏ. ఎఫ్. ఏ.వారు అభినందనీయులు అన్నారు. విదేశాలలో ఏండ్ల తరబడి ఉన్నా మన భాష సంస్కృతిని మరువని విదేసాంధ్రులను చూసి ఇక్కడి వారు అభిమాన పడాలనీ పేర్కొన్నారు. అధ్యక్షత వహించిన సంస్థ స్థాపకుడు ప్రసాద్ తోటకూర మాట్లాడుతూ అక్కినేని కేవలం నటుడు మాత్రమే కాదని ఆయన వ్యక్తిత్వం ఉన్నత మని ఆయన కార్య దీక్ష ఆదర్శనీయం అన్నారు. అక్కినేని పేరిట సంస్థను స్థాపించటానికి కారణం నేటి భవిష్యత్ తరాలు వారు అక్కినేని ని స్ఫూర్తిగా తీసుకొంటానికే అని పేర్కొన్నారు ఆయన వివిధ ప్రాంతాలకు చెందిన పలు విఖ్యాత పాత్రలను ధరించి జాతీయ సమైక్యత కు ప్రతీక గా నిలిచారని ప్రశంసించారు. కార్యదర్శి రవి కొండబొలు వ్యక్తిత్వ వికాస దర్పణం అక్కినేని అన్నారు. అధ్యక్షుడు మురళి వెన్నం మాట్లాడుతూ అక్కినేని 89 వ జన్మ దినం అమెరికాలో అపూర్వంగా నిర్వహించిన ఘట్టాలు వివరించారు. ఈ నెల 23న గుంటూరు లోనూ కార్యక్రమం చేస్తున్నామని తెలిపారు. అనంతరం అక్కినేని జీవిత సాఫల్య పురస్కారం తమిళనాడు పూర్వ గివర్నర్ రామ మోహన రావుకు అక్కినేని అంతర్జాతీయ విశిష్ట పురస్కారాలు దర్శకులు తమ్మారెడ్డి భరద్వాజ, రేలంగి నరసింహారావు, రేలంగి నరసింహారావు, ముప్పలనేని శివ, గాయని సిభారాజ్, గాయకుడు రామాచారి, రచయిత్రి కృష్ణ కుమారి, సినీ జర్నలిస్ట్ ఎస్.వీ.రామారావు,నటి రోజారమని, కళా సంస్థల అధిపతులు రసమయి రాము, వంశీ రామ రాజు జీ.వీ.ఆర్. వెంకట రెడ్డి, సంగం సంజయ్, వైద్యుడు గురువరెడ్డి. వేదిక పై అక్కినేని కుమార్తె నాగ సుశీల, నటులు సుమంత్, సుశాంత్ భక్త వర్చలాం పాల్గొన్నారు కార్యక్రమానికి తొలుత రామా చారి శారద బృందం పాడిన పాటలు శ్రితలనురసా నదం లో ముంచేయి.



వినాయక చవితి పండుగను పురస్కరించుకొని పర్యావరణ పరిరక్షణలో భాగంగా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో మల్లాపూర్ డివిజన్ వార్డు కార్యాలయంలో మట్టి వినాయకులను స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డ్ అధికారి రాజు గౌడ్ , స్థానిక నాయకులు, వివిధ కాలనీ వాసులు పాల్గొన్నారు. నవతెలంగాణ-కాప్రా



తిరుమలనగర్ కాలనీ అభివృద్ధికి పాటుపడతా..

- ఎక్స్టెన్షన్ జోన్ నుంచి రెసిడెన్షియల్ జోన్ గా మార్చిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు : బండారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-కాప్రా

మీర్ పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ తిరుమల నగర్ కాలనీ(ఎక్స్టెన్షన్)అభివృద్ధికి పాటుపడుతా అని బీఆర్ఎస్ ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఎక్స్టెషన్ జోన్ నుంచి రెసిడెన్షియల్ జోన్ గా మార్చిన సందర్భంగా బాణాసంచా కాల్చిన అనంతరం తిరుమల నగర్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక సంవత్సరాలుగా రెసిడెన్షియల్ జోన్ లేక ఇబ్బంది పడు తున్నారని.. ఆ కల నెరవేరింది అనివ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో మీర్ పేట్ హెచ్‌బీ కాలనీ కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ డివిజన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి , బీఆర్ఎస్ నాయకులు గుమ్మడి జంపాల్ రెడ్డి,కాలనీ ప్రెసిడెంట్ బాల రాజ్,చంద్ర శేకర్, మహేశ్వర రావు, లక్ష్మి నారాయణ, శ్యాం ప్రకాష్, ప్రసాద్, చిరంజీవి,ప్రసాద్, నర్సింహా, శుషీల్ కుమార్ పాల్గొన్నారు.

కుషాయిగూడలో ఉచిత వైద్యశిబిరం



నవతెలంగాణ-కాప్రా

కుషాయిగూడ శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం లయన్స్ క్లబ్ అఫ్ కాప్రా ఏఎస్ రావు నగర్, స్నేహపురి లయన్స్ క్లబ్ సంయుక్తం గా నిర్వహిం చారు. ఈ క్యాంపు ని లయన్స్ డిస్ట్రిక్ట్ 320-సి జిల్లా గవర్నర్ కె హరీష్ రెడ్డి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ సామాన్య ప్రజలకు, పేదలకు చేసే లయన్స్ సేవలను అభినందించారు, అతిధిగా పాల్గొన్న బీఎల్ఆర్ ట్రస్ట్ చైర్మెన్ బండారి లక్ష్మారెడ్డి ఉచితసేవా శిబిరం నిర్వాహకులను అభినందిం చారు. ఈ శిబిరం లో కంటి పరీక్షలను శ్రీ అనిల్ ప్లానెట్ ఆప్టికల్స్, జనరల్ పరీక్షలు డా. హన్సిక, ఎముకల పరీక్షలు డా. వివిఎస్ ఎన్ రాజు, దంత పరీక్షలు డా.మృణా ళిని నాయకత్వంలో ఆర్మీ డెంటల్ కాలేజీ డాక్టర్ల, రవికుమార్ నేతృత్వంలో సన్ సీడ్ హాస్పిటల్ వారు ఉచిత మందులు పంపిణీ చేశారు. ఇండి గ్లోబల్ ల్యాబ్ వారు కంపెనీ డైరెక్టర్ సుబ్బా రావు పర్యవేక్షణలో బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. క్యాంపు లో చుట్టుప్రక్కల కాలనీల ప్రజలు 300 మందికి పైగాపరీక్షలు చేయించుకున్నారు. ఈ క్యాంపు కో ఆర్డినేటర్ గా ఎం శ్రీదేవి వ్యవహరిం చారు. ఈ క్యాంపు లో బొంతు శ్రీదేవి, నీలం రెడ్డి, మహేష్, క్లబ్ ప్రెసిడెంట్ విజయకుమార్ కంతేటి, సెక్రటరీ సిహెచ్ వరప్రసాద్, కోశాధికారి చందన్ రాజు జిల్లా జీఎస్టీ కోఆర్డినేటర్ మండా సురేష్ కుమార్, ఆర్సీ శ్రీనివాస రెడ్డి, మనోజ్ కుమార్, రవికుమార్, గణేష్, రెడ్డి శ్రీనివాసరావ్, క్లబ్ సభ్యులతోపాటు ఆలయ పాలక మండలి చైర్మన్ శ్రీనివాస్, ఉద్యోగులు పాల్గొన్నారు.

విమోచన దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని గిర్మాపూర్ గ్రామంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో శివాజీ విగ్రహం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన ఆటల పోటీల్లో గెలిచినా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్వయం సేవకులు బుల్లి వెంకటేష్, రామారం జనార్ధన్ రెడ్డి,బండి విష్ణు గౌడ్,చెల్కల బాల్ రెడ్డి,చీర్ల సత్యనారాయణ,బొక్క అంజి రెడ్డి,వంగేటి రాజి రెడ్డి,వంగేటి హనుమంత్ రెడ్డి,బొక్క జనార్ధన్ రెడ్డి, వంగేటి బాబుల్ రెడ్డి,పి.రాజు,రాఘవ రెడ్డి,రాగం ఆనంద్,సర్దార్,బండి సాయి గౌడ్,బండి నిఖిల్ గౌడ్, మునీర్ తదితరులు పాల్గొన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని కండ్లకొయ్య గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ కౌన్సిలర్ హంస రాణికృష్ణ గౌడ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు సముద్రాల కష్ణ గౌడ్, అర్జున్ బాబు, ప్రభాకర్, మల్లేష్, రాకేష్,యాదగిరి,నవీన్,గిరి తదితరులు పాల్గొన్నారు. బీజేపీ గుండ్లపోచంపల్లి మున్సిపాల్టీ అధ్యక్షుడు ఉషిగారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో లక్ష్మీ నగర్, మున్సిపాలిటీ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి, కౌన్సిలర్ అమరం సరస్వతి,నాయకులు రవీందర్ గౌడ్,జైత్వాల కిషన్,మున్సిపల్ ప్రధాన కార్యదర్శి ముక్కిడిగాళ్ళ మహేష్,మలిగే అశోక్,కావేరి శ్రీధర్, బట్టికాడ విక్రమ్,సుంకు నవీన్ తదితరులు పాల్గొన్నారు



పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను ప్రతిష్టిద్దాం..

- మంత్రి సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ - మీర్ పేట్

పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను ప్రతిష్టించి పూజిద్దామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మీర్ పేట్ కార్పొరేషన్ 3వ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ సిరూర్ బాల్ రాజ్ ఆధ్వర్యంలో సీడ్ గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. మట్టి,సీడ్ గణనాథులతో పర్యావరణ పరిరక్షణకు దోహద పడుతుందన్నారు. . మట్టి గణప తులను పంపిణీ చేసిన బాల్ రాజ్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి, వివిధ కాలనీల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక అంశాల స్పందన మీరాబ్

నవతెలంగాణ-కల్చరల్

జర్నలిస్టులు కవితా రచన చేపడితే వారి వీక్షించి స్పందించిన అంశాలు సంఘటనలు మనస్సు కదిలిస్తాయని ఆంధ్రజ్యోతి దిన పత్రిక సంపాదకులు కె. శ్రీనివాస్ అన్నారు. రవీంద్ర భారతిలోని పైడి



జయరాజ్ మినీ థియేటర్ లో ఖాజా అఫ్రిది రచించి మిరాబ్ తెలుగు కవితా సంకలనాన్ని ముఖ్య అతిథి గా శ్రీనివాస్ పాల్గొని ఆవిష్కరించారు. అధ్యక్షత వహించిన ప్రముఖ కవి యాకూబ్ మీరాబ్ లోని ప్రతి కవితా మనుషులుగా బతుకుదాం అనే సందేశమే నన్నారు .భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ ప్రజల బాధ తన వేదనగా కవితలు అల్లేరని పేర్కొన్నారు. కవులు మెర్సీ మార్గరెట్ స్కైబాబ దర్శకుడు వేణు ఉడుముల,అన్వర్ పాల్గొనగా కవి ఖాజా తొలి సంపుటిని తన తల్లిదండ్రులకు అందించారు. సారంగి ఫౌండేషన్. నిర్వహణ లో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జరిగింది



అన్నమయ్య కళా సమితి ద్వితీయ వార్షికోత్సవం శ్రీ త్యాగరాయ గాన సభ ప్రధాన వేదిక పై శని వారం అన్నమయ్య కీర్తనలు గోష్టి గానం తో ఆరంభమైంది. సంగీత గురువు సుమలత నలభై మంది శిష్య బృందం తో నలభై నిమిషాలలో నలభై అన్నమయ్య కీర్తనలు నలభై రాగాలలో గానం చేసి గోల్డెన్ స్టార్ రికార్డ్ లో నమోదు కెక్కారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న సివిల్ సర్వీస్ విశ్రాంత ఉన్నతాధికారి ముక్తే స్వర రావు మాట్లాడుతూ అన్నమయ్య కీర్తనలు లో భక్తి, శృంగారం, సామాజిక చింతన, వైరాగ్యం అన్ని రసాలు కలసి ఉంటాయన్నారు. సాహిత్యం ఎక్కువగా సంగీతం తక్కువగా ఉండటం వల్ల ప్రతి వారూ నేర్చుకునే వీలు వుంటుందన్నారు. ముఖ్య అతిథిగాప్రముఖ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్ మాట్లాడుతూ గురువు సుమలత స్వరం లయ బద్ధం గా వుందని ఆమెను శిష్యులు అనుసరించి కార్యక్రమాన్ని రక్తి కట్టించారని అభినందించారు. గోల్డెన్ స్టార్ స్థాపకుడు బింగి నరేంద్ర గౌడ్ సుమలత బృందం గాన గోష్టి రికార్డ్ నమోదు యోగ్యతా ఫలకం ను అందజేశారు. నవతెలంగాణ-కల్చరల్

అక్టోబర్ 1న పెరిక కుల ఉచిత వధూవరుల వివాహ పరిచయ వేదిక

- వేదిక కన్వీనర్ సుంకరి ఆనంద్

నవతెలంగాణ-హిమాయత్ నగర్

అక్టోబర్ 1వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 1:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు 24వ ప్రపంచ పెరిక కుల ఉచిత వధూవరుల వివాహ పరిచయ వేదికను హైదరాబాద్, దిల్ సుక్ నగర్ లోని కొత్తపేట పండ్ల మార్కెట్ ఎదురుగా ఉన్న శ్రీ సాయి గార్డెన్ లో నిర్వహించనున్నట్లు వివాహ పరిచయ వేదిక కన్వీనర్ సుంకరి ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రపంచ నలుమూలల నుంచి పెరిక కులస్తులు తమ పిల్లల పెళ్లి సంబంధాల కోసం రావాలని కోరారు.మరిన్ని వివరాల కోసం ఫోన్ నెంబర్: 9963013666 సంప్రదించవలసిందిగా ఆయన కోరారు.

దక్షిణ భారతదేశాన్ని చైతన్యపరిచిన మహనీయులు పెరియర్ రామస్వామి నాయకర్ : బోరెల్లి సురేష్

నవతెలంగాణ-ఓయూ

దక్షిణ భారతదేశంలో మూఢనమ్మకాలకు, సనాతన ధర్మానికి వ్యతిరేకంగా దక్షిణ రాష్ట్రాలపై ఉత్తరాది రాష్ట్రాల పెత్తనాన్ని వ్యతిరేకిస్తూ హిందీ వ్యతిరేక ఉద్యమాన్ని ద్రవిడ నేలపై నడిపిన ద్రవిడ బహుజన సిద్ధాంతకర్త పెరియర్ రామస్వామి నాయకర్ అని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్ అన్నారు. ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ వేదికగా బీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పెరియర్ 145వ, జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "దక్షిణ భారతదేశ మొత్తాన్ని సైన్సు వైపు నడిపి విజ్ఞాన బాటలు వేసిన మహాయోధులు రామస్వామి నాయకర్ అని, సనాతన ధర్మం, ముమ్మాటికి అస మాతలకు పునాది అని అలాంటి సనాతన ధర్మాన్ని భారతదేశంలో నివారించడమే పెరియర్‌కు ఇచ్చే ఘనమైన నివాళి అని అన్నారు.

సెప్టెంబర్ 17 విమోచన, విలీనం కాదు.. విద్రోహ దినమే

- యావత్ తెలంగాణ ప్రజానీకానికి ద్రోహం జరిగింది 17వ తేదీనే
- సీపీఐ(ఎం.ఎల్) ప్రజాపంథా రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కె. జి రాంచందర్



నవతెలంగాణ-ముషీరాబాద్

సెప్టెంబర్ 17న విమోచన, విలీనం కాదని, విద్రోహ దినమేనని, యావత్ తెలంగాణ ప్రజానీకానికి ద్రోహం జరిగిందని సీపీఐ (ఎం.ఎల్) ప్రజాపంథా రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కె. జి రాంచందర్ అన్నారు. సెప్టెంబర్ 17 విద్రోహమా విలీనమ వియోచన దినమ అనే అంశంపై ఆదివారం విద్యానగర్ మార్క్స్ భవన్ లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరై మాట్లాడుతూ నిజాం రాజు, దేశ్ ముఖ్ లు, భూ స్వాముల పాలన కింద పేదలు నలిగిపోయారన్నారు కమ్యూనిస్టుల నాయకత్వాన పేదలు పోరాడి సాధించుకున్న భూములు, మళ్లీ భూస్వాముల పాలైందని తెలిపారు .పటేల్ సైన్యం నిజాం నవాబుపై కాకుండా కమ్యూనిస్టులపై దాడులు చేశారన్నారు. విమోచన, విలీనం కాదని, విద్రోహమేనని అన్నారు. అనంతరం జాతీయ పరిస్థితులు అంశంపై సి.పి.ఐ (ఎం.ఎల్) ప్రజాపంథా గ్రేటర్ హైదరాబాద్ ఎం. హన్మేష్, పనివిధానంపై పార్టీ సెక్రటేరియట్ సభ్యులు ఎస్.ఎల్ పద్మ బోధించారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.ఎస్ ప్రదీప్, నల్లన్న, రవి కుమార్, వరలక్ష్మి, లింగం గౌడ్, నారాయణ, అనిల్, దేవమని, పాల్గొన్నారు.

మట్టి గణపతి విగ్రహాలనే ప్రతిష్టిద్దాం

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట

మట్టి గణపతి విగ్రహాలనే ప్రతిష్టిద్దాం, పర్యావరణాన్ని కాపాడుదాం అని అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. ఆదివారం ఓల్డ్ నల్లకుంటలో హైదరాబాద్ జిందాబాద్, నల్లకుంట సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన మట్టి గణపతి విగ్రహాల ఉచిత పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఒపి విగ్రహాల తయారీలో ప్లాస్టిక్ పాదరసం, సీసం, క్రోమియం,వార్నిస్ లాంటి అనేక విష రసాయనాలు ఉంటాయని, వీటివల్ల అనేక రోగాలకు కారణం అవుతాయని అన్నారు. మట్టి గణేష్ లనే ప్రతిష్టించాలని, పర్యావ రణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ జిందాబాద్ పర్యావరణాన్ని కాపాడడానికి మట్టి విగ్రహాల పంపిణీ చేయడం అభినందనీయం అని అన్నారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ జిందాబాద్ ప్రధాన కార్యదర్శి వీరయ్య అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో హైకోర్టు బార్ కౌన్సిల్ మెంబర్ కొండారెడ్డి , నల్ల కుంట సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు మోహన్ రావు, ప్రధాన కార్యదర్శి మోహన్ నాయుడు, నాయకులు శంకరం, రాజీవ్, రిటైర్డ్ సితఃరామకృష్ణారావు, కృష్ణ బాబు, డాక్టర్ అమర్నాథ్, శ్రీనివాసరావు, రితేష్, కిరణ్, సుకుమార్ పాల్గొన్నారు.

వినాయక చవితి పండుగను అత్యంత ఘనంగా జరుపుకోవాలి



- మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-ముషీరాబాద్

వినాయక చవితి పండుగను భక్తిశ్రద్దలతో అత్యంత ఘనంగా జరుపుకోవాలని రాంనగర్ మాజీ కార్పొరేటర్ వి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నేత శ్రీను ఆధ్వర్యంలో వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ఆదివారం రాంనగర్ ఈ సేవ సెంటర్ వద్ద వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పర్యావరణహితం కోసం ప్రతి ఒక్కరు మట్టి విగ్రహాలను ప్రతిష్టించాలని కోరారు. రసాయన విగ్రహాల వలన వాయు, జల కాలుష్యం సంభవిస్తుందన్నారు. రసాయన రంగులు వాడ మాని సహజసిద్ధమైన రంగులతో తయారుచేసిన వినాయక ప్రతిమలను ప్రతిష్టి ంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రేశం మల్లేష్, కల్వ గోపి, సిరిగిరి శ్యామ్, టక్కర్ శ్రీనివాస్, సత్యనారాయణ, అరుణ్, హరీష్, విశాల్, రవి యాదవ్ సిద్ధిక్ నరేందర్, తదితరు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పెరియర్ రామస్వామి జయంతి వేడుకలు



- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ

నవతెలంగాణ-ముషీరాబాద్

గడిచిన తొమ్మిదిన్నర సంవత్సరాల ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో బీసీ బహు జన వ్యతిరేకి అని స్పష్టమైందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ అన్నారు. విద్యానగర్ బీసీ భవన్‌లో ఆదివారం పెరియర్ రామస్వామి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎర్ర సత్యనారాయణ మాట్లాడుతూ. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల ముందు మరోసారి అమాయకులుగా భావించి బీసీ మహిళల రిజర్వేషన్ 33 శాతం మంది మోసపూరిత ప్రస్తావన తీసుకువచ్చారన్నారు. 50 శాతం బీసీ రాజకీయ రిజర్వే షన్లు పట్ల ఏమాత్రం నిజాయితీ ఉన్న 27 సంవత్సరాలుగా అమలులో ఉన్న 33శాతం రిజర్వేషన్లను 18శాతం ఎందుకు కుదించారని ప్రశ్నించారు. కేంద్రం ఇస్తుందో లేదో తెలియని కచ్చితంగా ఇవ్వదని భావించి 50 శాతం బీసీ రిజర్వేషన్ ప్రతిపాదన తీసుకు వచ్చి తన చేతిలో ఉన్న దగ్గర రిజర్వేషన్లను కుదించారని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లు 100శాతం అగ్రకులకే ఉపయోగపడుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, దీపికా బిల్లా, రాజేందర్, సుధాకర్, శివ, రాకేష్ దత్త పాల్గొన్నారు.

తెలంగాణ ఇచ్చిన ఘనత సోనియాగాంధీదే

- హెూప్ చైర్మెన్ కె.ఉపేందర్‌రెడ్డి



జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో టీ-హెూప్ స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ ఉపేందర్ రెడ్డి ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. హెూటల్ తాజ్ కృష్ణలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి, ఎఐసీసీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జి మాణిక్ రావు ఠాక్రే, మాజీ ఎంపీ అజారుద్దీన్‌లు కాంగ్రెస్ పార్టీ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించినట్లు తెలిపారు. ఇందిరానగర్‌లోని ఉపేందర్ రెడ్డి కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ, తాను టీ.హెూప్ సంస్థచైర్మన్‌గా ఉండి ఎన్నో సేవా కార్యక్రమాలు అందిస్తున్నట్లు నియోజకవర్గంలోఈ సంస్థ ద్వారా ఆర్థిక సహాయం పొందిన 25 వేల కుటుంబాలు జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో అన్ని డివిజన్లో ఉన్నారని, వారి అందరితో సంప్రదించి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకోవాలని పార్టీలో చేరానని, ఎప్పటికీ కాంగ్రెస్ పార్టీతోనే ఉంటానని, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా ఎవరికి అవకాశం వచ్చినా వారికి అండగా ఉండి, తప్పకుండా జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామన్నారు. త్వరలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో కాంగ్రెస్ కండువాతో కాంగ్రెస్ అభ్యర్థిగా పాద యాత్ర నిర్వహిస్తానని, త్వరలో నియోజకవర్గంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి అనేకమందిని పార్టీలోనికి ఆహ్వానిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షులు అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి , మాజీ మంత్రి షబ్బీర్‌అలీ, మాజీ మంత్రిదుద్దిల శ్రీధర్ బాబు, అజారుద్దీన్ కుమారుడు అసద్, జూబ్లీహిల్స్ నాయకులు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా కృషి

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్
- మంచినీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన



నవతెలంగాణ-అంబర్ పేట

శాశ్వత త్రాగునీటి సమస్య పరిష్కారం దిశగా కృషి చేస్తున్నానని అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. ఆదివారం అంబర్ పేట డివిజన్ పరిధిలోని బాపు నగర్‌లో సుమారుగా 6.50 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా వేయనున్న మంచినీటి పైప్ లైన్ పనులకు అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అంబర్ పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబర్ పేట డివిజన్ లో ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామని ప్రజల అవసరాల మేరకు ఇంకా అవసరమైన చోటా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తామని,బాపు నగర్ లో అనేక చోట్ల నూతన డ్రైనేజ్ మంచినీటి పైప్ లైన్ లు నిర్మించామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ యాదగిరి రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్,బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు లింగారావు, రంగు సతీష్ గౌడ్, దయాకర్ యాదవ్, మహేష్ ముదిరాజ్, పాల్గొన్నారు.

తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవం









నవతెలంగాణ-అంబర్‌పేట

తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని బీఆర్ఎస్ పార్టీ అంబర్‌పేట నియోజకవర్గం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి సిక్స్ నెంబర్ పార్టీ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఉద్యమ నాయకులతో సీనియర్ నాయకులతో కార్యాకర్తలు మహిళా నాయకురాలతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ తెలంగాణ రాచరికం నుంచి ప్రజాస్వామ్యంలోకి ఎదిగిన సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ బంగారు తెలంగాణ దిశగా సంక్షేమ పథకాలతో ముందుకు వెళుతున్నారన్నారు. ఈ కార్యక్రమం లో ఉద్యమ నాయకులు జీవన్ గౌడ్, బీవీ రమణ, రాష్ట్ర మహిళా సీనియర్ నాయకురాలు విజితరెడ్డి, జనార్దన్, శంకర్ గంగపుత్ర, రాహుల్, బాబాగౌస్ పాషా, దిలీప్‌కుమార్ నేత, ప్రకాష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మెహిదీపట్నం

షేక్ పేటలోని నారాయణమ్మ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో తెలంగాణ విమోచన ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి సతీమణి కావ్య కిషన్ రెడ్డి ముఖ్యఅతిథిగా, స్వర్గీయ మల్లు స్వరాజ్యం కూతురు ప్రముఖ సాంఘిక కార్యకర్త పాడూరి కరుణ గౌరవ అతిథిగా పాల్గొని ఈ వేడుకను ప్రారంభించారు. ఈ సందర్భంగా కావ్యరెడ్డి కరుణలు మాట్లాడుతూ నిజాంకు వ్యతిరేకంగా జరిగిన అప్పటి సాయుధ పోరాటంలో మహిళల పాత్ర ఎంతో ముఖ్యమైందని అన్నారు. మహిళలు ఆయుధాలు చేతబట్టి రజాకారులకు, నిజాంకు వ్యతిరేకంగా జరిపిన పోరాటం ఎప్పటికీ మరువలేమన్నారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినిలు తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే బతుకమ్మ, బోనాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ శ్రీవిద్య రెడ్డి, ప్రిన్సిపల్ రమేష్ రెడ్డి, అధ్యాపక బృందం, విద్యార్థినిలు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సుల్తాన్ బజార్

కోఠి డీఎం హెచ్ఎస్ ప్రాంగణంలో ఆదివారం తెలంగాణ జాతీయ సమైక్యత దినో త్సవం సందర్భంగా జెండా ఎగరవేస్తున్న డైరెక్టర్ ఆఫ్ హెల్త్ (డీహెచ్) డాక్టర్ శ్రీనివా సరావు, డి ఎం ఈ డాక్టర్ రమేష్ రెడ్డి, వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్. టీఎన్జీవో యూనిట్ అధ్యక్షుడు ప్రభాకర్, హరి,ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

నవ తెలంగాణ-అంబర్ పేట

17 సెప్టెంబర్ తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని పురస్కరిం చుకొని సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జాతీయ హెూం శాఖ మంత్రి అమిత్ షా ముఖ్యఅతిథిగా ఏర్పాటు చేసిన వేడుకలకు అంబర్ పేట డివిజన్ అధ్యక్షులు దాసోజు నాగభూషణం చారి ఆధ్వర్యంలో బీజేపీ నేతలు గంధమాల ఆనంద్ గౌడ్ బిక్షపతి, యశ్వంత్, కృష్ణ ముదిరాజ్, యాదగిరి, హారతి, పత్తి అనిల్ కుమార్,మైలారం రాజు, నవీన్ రెడ్డి,వెంకట్ స్వామి గౌడ్,శ్రీకాంత్,భాస్కర్ గౌడ్, తిరుపతి గుప్తా ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

మోడీ సర్కార్‌ను నేలమట్టం చేయాలి

ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఆనాడు నిరంకుశ నిజాం సర్కార్‌ను నేలమట్టం చేసినట్లే నేటి ఫాసిస్ట్ మోడీ సర్కార్ ను నేలమట్టం చేయాలని ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ పిలుపునిచ్చారు. నిజాం, రజాకార్ల అరాచాకలకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు వీరోచితంగా పోరాడినట్టు, నేడు ఆర్ఎస్ఎస్, బీజేపీ అరాచాకలకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడవలసిన అవసరముందని ఆయన తెలిపారు.భారత్ లో హైదరా బాద్ రాష్ట్రం విలీన దినోత్సవం సందర్భంగా ఆదివారం హిమాయత్ నగర్, లిబర్టీలోని ఆప్ రాష్ట్ర కార్యాలయం వద్ద డాక్టర్ దిడ్డి సుధాకర్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా, బానిస సంకెళ్ల విముక్తే లక్ష్యంగా ఆనాడు తెలంగాణ వ్యాప్తంగా సామాన్యులే ముందుడి పోరాడా రని గుర్తు చేశారు. ఐక్యమత్యంతో కలిసి ఉన్న తెలంగాణ ప్రజల మధ్యలో అల్లర్లు సృష్టించడానికి బీజేపీ నాయకులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.దోపిడీ వర్గాలైన బీఆర్ఎస్, బీజేపీలు చీకటి ఒప్పందం చేసుకొని ప్రజల ముందుకొస్తున్నాయని, ఈ దోపిడీ వర్గాల నుంచి ప్రజలను రక్షించడమే లక్ష్యంగా ఉద్యమించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆప్ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము గౌడ్, ఎండి.మజీద్, డా.హరిచరణ్, అధికార ప్రతినిధులు పరీక్షణ్, ప్రవీణ్ యాదవ్, ఆప్ మహిళా విభాగం అధ్యక్షురాలు హేమ జిల్లోజు, వికలాంగుల కమిటీ చైర్మన్ దర్శనం రమేష్, నేతలు జావేద్, టి.రాకేష్ సింగ్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్య దినోత్సవం నిర్వహించిన రాజశేఖర్ రెడ్డి

నవ తెలంగాణ-కంటోన్మెంట్

బీఆర్ఎస్ మల్కాజ్‌గిరి పార్లమెంటరీ కంటోన్మెంట్ ఇన్‌చార్జి రాజశేఖర్ రెడ్డి ఆదివారం బోయినపల్లిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జాతీయ సమైక్యత దినో త్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక, ఉద్యమ కారులతో కలిసి తెలంగాణా తల్లి చిత్రపటానికి పూలమాలలు వేశారు.ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుల గౌరీశంకర్ జక్కుల మహేశ్వరరెడ్డి, మాజీ సభ్యులు పాండుయాదవ్, నళినీ కిరణ్, అనితా ప్రభాకర్, ఉద్యమ కారుడు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మధుకర్ జన్మదిన వేడుకలు

నవ తెలంగాణ-కంటోన్మెంట్



కంటోన్మెంట్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ముప్పిడి మధుకర్ జన్మదిన వేడు కను ఘనంగా నిర్వహించారు. ఆదివారం మల్కాజిగిరి పార్లమెంటరీ కంటోన్మెంట్ బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి రాజశేఖర్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం నాడు ఘనంగా మధుకర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బోర్డు మాజీ సభ్యులు వారితో పాటు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భారీ సంఖ్యలో టిఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు

విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో విరాట్ విశ్వకర్మ పూజలు


నవతెలంగాణ-ముషీరాబాద్



విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో విరాట్ విశ్వకర్మ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కే.రవిచారిలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయ కులు ముఠా జై సింహ, మచ్చకూర్తి ప్రభాకర్, సంఘం నాయకులు పులిగిల్ల శ్రీధర్ చారి, బీబీనగర్ రవి చారి, ఇంద్రోజి రాజేష్ చారి, పులిగిల్ల అభిషేక్, మునుగంటి వసంత్, మల్యాల కృష్ణ చారి, నారోజు విశ్వ రూప చారి, చిలు ముల అనంత చారి, బోనాల రాజు చారి, ఎదులపురం విద్యాసాగర్, కొల్లోజు శ్రీకాంత్ చారి, భూంపల్లి కిరణ్ చారి తదితరులు పాల్గొన్నారు.

వైశ్య యూత్ ఫోర్స్ లోగో ఆవిష్కరణ

నవతెలంగాణ-అంబర్‌పేట



వైశ్య జాతి వైభవాన్ని పునరుద్ధరించడంలో, ఉన్నత శిఖరాలకు చేర్చడంలో యువత పాత్ర కీలకమని వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ కాచం సత్యనారాయణ గుప్త అన్నారు. కాచిగూడలోని వైశ్య హాస్టల్ లో వైశ్య యూత్ ఫోర్స్ లోగో ను ఆవిష్క రించారు. ఈ సందర్భంగా కాచం సత్యనారాయణ గుప్త మాట్లాడుతూ వైశ్య యువతను బలోపేతం చేయటంతో పాటు వారి భవిష్యత్తుకు దిశా నిర్దేశం చేయడమే వైశ్య యూత్ ఫోర్స్ లక్ష్యమని స్పష్టం చేశారు. త్వరలోనే వైశ్య యూత్ ఫోర్స్ ఆవిర్భావ సభ ఏర్పాటు చేయనున్నట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నేలంటి మధు, కాచం సాయి, సముద్రాల నిఖిల్,దివ్వెల వెంకటేశ్వర్లు, కాచం అభిషేక్, తేలుకుంట వైష్ణవి, బున్న నవ్య శ్రీ, చీకటిమల్ల రవళిక , బండారు భార్గవి, వాసా నిఖిల్, భార్గవ్, పాల్గొన్నారు.

'లోక్ దళ్ పార్టీ కార్యాలయంలో సమైక్యతా దినోత్సవం

నవతెలంగాణ-హిమాయత్ నగర్

తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం హిమా యత్‌నగర్‌లోని భారత లోక్ దళ్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ జాతీయ కార్యదర్శి పుల్లూరి వెంకట రాజేశ్వరరావు జాతీయ జెండాను ఎగురవేశారు.ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఎందరో మహాను భావులు పోరాటాలు చేశారని, ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఉద్యమించారని, వారి త్యాగాలు మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయ కులు రాజేష్, ఆంజనేయులు, స్వామి, మల్లేష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

'రజకుల విషయంలో రాజకీయ పార్టీలు అభిప్రాయాలు తెలపాలి

- రజక అభివృద్ధి సంస్థ ఉద్యోగుల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీమల శంకర్

నవతెలంగాణ-హిమాయత్ నగర్



తెలుగు రాష్ట్రాలలో విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాలలో ఎంతో వెనుకబడి దుర్భర దారిద్ర్య జీవితాన్ని గడుపుతున్న లక్షలాది మంది రజకులను ఎస్సీ జాబితాలో చేర్చేందుకు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, వైఎస్ఆర్సిపి, టిడిపి, జనసేన పార్టీలు తమ అభిప్రాయాలను వెంటనే తెలియజేయాలని రజక అభివృద్ధి సంస్థ ఉద్యోగుల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీమల శంకర్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రజకు లను ఎస్సీ జాబి తాలో చేర్చుతామని హామీ ఇచ్చే పార్టీకే తమ మద్దతు ఉం టుందని, మిగతా పార్టీలను చిత్తు, చిత్తుగా ఓడిస్తామని ఆయన హెచ్చరిం చారు. ప్రభుత్వాలకు, ప్రధాన మం త్రులకు, ముఖ్య మంత్రులకు, ఇతర అధికారులకు ఎన్నో సార్లు వినతి పత్రాలు అందజేసిన పట్టించుకోలే దన్నారు. ఇప్పటికైనా న్యాయం చేయా లని ఆయన డిమాండ్ చేశారు.

ఉచిత ఎరువులు పంపిణీ మాట ప్రభుత్వం నిలబెట్టుకోవాలి

- జస్టిస్ బి. చంద్రకుమార్, రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి



నవతెలంగాణ - ముషీరాబాద్

రైతులకు ఉచిత ఎరువులు పంపిణీ చేస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం తమ మాటను నిలబెట్టుకోవాలని జస్టిస్ బి. చంద్రకుమార్, రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి అన్నారు. తెలంగాణ రైతు సంక్షేమ సమితి అధ్యక్షులు ఇంద్రసేన అధ్యక్షతన ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రైతు సంక్షేమ సమితి నాలుగవ వార్షికోత్సవ సభ జరిగింది. ఈ సభకు జస్టిస్ చంద్రకుమార్, రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరు మురళి, ప్రొఫెసర్ వినాయక రెడ్డి, నయనాల గోవర్ధన్, సోగర బేగం హాజరై మాట్లాడుతూ.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సమస్యను విస్మరిస్తున్నారన్నారు. వ్యవసాయ ఖర్చులు పెరిగిపోయినా కనీస మద్దతు ధర శాస్త్రీయంగా నిర్ణయిం చడం లేదు. మార్కెట్ దోపిడిని అరికట్టడం లేదు. మార్కెట్ లో ప్రభుత్వమే ప్రవేశించి పంటలకు సరైన ధర ఇచ్చి కొనగోలు చేసినప్పుడే రైతు ఆదాయం పెరుగుతుందని తెలిపారు.రైతుల రుణమాఫీ డబ్బులు ఒకేసారి చెల్లించి వడ్డీ భారం వారిమీద పడకుండా చూడాలి అని కోరారు.. విత్తనాలలో, ఎరువులలో కల్తీ లను అరికట్టాలన్నారు.ఉచిత ఎరువులు పంపిణీ చేస్తామన్న ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలి అని తెలిపారు.అనావృష్టి, అతివృష్టి వల్ల దెబ్బతిన్న రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి. ఆదివాసీలు, దళితులు, భూమి లేని పేదలు సాగుచేస్తున్న ప్రభుత్వ ఫారెస్టు భూముల పై వారి హక్కులు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో రైతు సదస్సు నిర్వహణ కమిటీ అధ్యక్షులు రఘునాథ్,సూర్య కిరణ్, పాల్గొన్నారు.

91 పెట్టుబడి ప్రాజెక్టులకు ఆమోదం తెలిపిన కర్ణాటక ప్రభుత్వం'

నవతెలంగాణ-హిమాయత్ నగర్

రాష్ట్ర స్థాయి సింగిల్ విండో క్లియరెన్స్ కమిటీ (ఎస్-ఎల్ఎస్ డబ్ల్యూసీసీ) రాష్ట్రంలో 18,146 మందికి ఉపాధి కల్పించే సామర్థ్యం కలిగిన రూ.7,659.52 కోట్ల విలువైన 91 పారిశ్రామిక పెట్టుబడి ప్రతిపాదనలను ఆమోదించినట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది.భారీ, మధ్యతరహా పరిశ్రమలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి శాఖ మంత్రి ఎంబి.పాటిల్ నేతృత్వంలోని ఎస్ఎల్ఎస్ డబ్ల్యూసీసీ కమిటీ రూ.50కోట్ల కంటే ఎక్కువ పెట్టుబడితో కూడిన 26 ప్రాజెక్టులను ఆమోదించింది.ఇవి మొత్తం రూ.5,750.73 కోట్లు పెట్టుబడి పెట్టనున్నాయి.అంతేగాక ఇవి 13,742 ఉద్యోగాలను సృష్టించగల సామర్థ్యాన్ని సైతం కలిగి ఉన్నాయి. ప్రముఖ పెట్టుబడిదారులలో మారుతి సుజుకి ఇండియా, ఏక్యూస్ కన్స్యూమర్,సౌత్‌వెస్ట్‌మైనింగ్,టాటా సెమీకండక్టర్, క్రిప్టాన్ (ఇండియా) సొల్యూషన్స్ ప్రైవేట్ లి మి టెడ్ ఉన్నాయి.మొత్తం 91ప్రతిపాదనల్లో దాదాపు 57 పెట్టుబడి ప్రాజెక్టులు రూ.15 కోట్ల నుంచి రూ.50 కోట్ల మ ధ్య ఉంటాయి.ఇవి మొత్తం రూ.1,144.94 కోట్లు పెట్టు బడి పెట్టి కర్ణాటకలో 4,404 మందికి ఉపాధి కల్పించే అవ కాశం ఉంది.అదనంగా రూ.763.85 కోట్ల పెట్టుబడి పెట్ట నున్న మరోఎనిమిదిప్రాజెక్టులకు కమిటీఆమోదం తెలిపింది.వాణిజ్య, పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి డాక్టర్ ఎస్.సెల్వ కుమార్,ఇండస్ట్రియల్‌డెవలప్‌మెంట్ కమిషనర్ గుంజన్ కృష్ణ, కార్మిక శాఖ కార్యదర్శి మహ్మద్ మొహసిన్, కెఐఎడిబి సీఈవో డాక్టర్‌ఎం.మహేష్,ఐటి,బిటిశాఖడైరెక్టర్ దర్శన్, కర్ణాటక ఉద్యోగ్ మిత్రమేనేజింగ్ డైరెక్టర్ బసవరాజు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన

- తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం మద్దతు

నవతెలంగాణ- సిటీబ్యూరో

హైదరాబాద్ జిల్లాలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్ట్‌కు చెందిన 8 విభాగాల్లోని 200 మంది ఉద్యోగులు గడిచిన వారం రోజులుగా తమను రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేస్తూ రిలే నిరాహార దీక్షలు పుట్టిన విషయం తెలిసిందే. ఆదివారం ఈ దీక్షా శిబిరానికి తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాజా భాను చంద్రప్రకాష్, ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, ఎంఏ మొయిద్, లక్ష్మణ్ సింగ్, డిటిఎఫ్ యూనియన్ నాయకులు రేణుక శశికళ సత్యవతి విచ్చేసి తమ మద్దతు ప్రకటించారు. సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు కోరారు.కార్యక్రమంలో ఎస్ఎస్ ఏ ఉద్యోగుల హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు రాధారెడ్డి, సిహెచ్ రామకృష్ణ, ఉపాధ్యక్షులు ఎస్.కే పాష, ఎం మోహన్. వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకన్న, సరిత, ప్రవీణ్ నవనీత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చక్కటి ఆర్థిక ప్రణాళికతో...

జీవితంలో ప్రతి దశలోనూ ఆర్థిక ప్రణాళిక అవసరం. లేదంటే సమయానికి చేతిలో డబ్బు లేక ఇబ్బంది పడాల్సి వస్తుంది. ప్రసూతి సెలవు తీసుకునే ఆరు నెలల కాలమూ ఇందుకు మినహాయింపు కాదు. అయితే ఈ సమయంలో ఎలాగూ జీతం మొత్తం చేతికి అందుతుంది కదా అన్న ఉద్దేశంతో కొందరు డబ్బు ఖర్చు చేసే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటారు. పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేసే వారికి ప్రసూతి సెలవుల సదుపాయం కూడా లేక ఇబ్బందులు ఎదుర్కొంటుంటారు. మరి ఈ తిప్పలేవీ లేకుండా అటు ప్రసూతి సెలవుల్ని, ఇటు అమ్మతనాన్ని ఆస్వాదించాలంటే ముందు నుంచే చక్కటి ఆర్థిక ప్రణాళిక సిద్ధం చేసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు. అందుకోసం ఏం చేయాలో చూద్దాం...

ప్రసూతి సెలవుల్లో వేతనం లభించినా, ఇక ఆ తర్వాత కచ్చితంగా తిరిగి ఉద్యోగంలో చేరాల్సి ఉంటుంది. అయితే పాపాయి బాధ్యత రీత్యా ఆపై ఉద్యోగం కొనసాగించడం కుదరచ్చు కుదరకపోవచ్చు. బుజ్జాయిని చూసుకునే వారు ఎవరూ లేకపోతే కచ్చితంగా తల్లే ఇంట్లో ఉండాల్సి వస్తుంది. అలాంటప్పుడు సెలవును పొడిగించుకునే అవకాశం మీ సంస్థ అందిస్తుందో, లేదో ముందుగానో తెలుసుకోండి. ఒక వేళ పొడిగించినా, పొడిగించకపోయినా ఈ సమయంలో వేతనం మాత్రం సంస్థలు చెల్లించవు. కాబట్టి ఈ సమయంలో ఆర్థికంగా కాస్త ఇబ్బందులు ఎదురుకావచ్చు. అలా జరగకుండా ఉండాలంటే గర్భం ధరించినప్పట్నుంచే కొంత డబ్బు వెనకేసుకోవాలి. ప్రసూతి సెలవు సమయంలో అందే వేతనంలో నుంచీ పొదుపును కొనసాగించాలి. దీనివల్ల మీరు పొడిగించుకున్న సెలవుల్లోనూ ఆర్థిక భరోసా ఉంటుంది. అలాగే మీ పేరు మీద ఉన్న రుణాలు, ఇతరత్రా ఖర్చులకు ఈ పొదుపు వల్ల ఆటంకం కలగకుండా జాగ్రత్తపడచ్చు. దీంతో పాటు మీకు వీలుంటే, సంస్థ అంగీకరిస్తే ఇంటి నుంచి పని చేసినా సరిపోతుంది. ఆ సదుపాయం లేకపోతే తక్కువ సమయం కేటాయించేలా పార్ట్‌టైమ్ ఉద్యోగాలు కూడా వెతుక్కోవచ్చు.





పిల్లలకు ప్రత్యేక పాలసీ

అత్యవసర సమయాల్లో ఆపద్బాంధవిలా ఉపయోగపడుతుంది బీమా. అందులోనూ ఆరోగ్య బీమా పథకం ఎంతో అక్కరకొస్తుంది. వివిధ సంస్థలు తమ ఉద్యోగులకు ఇలాంటి బీమా పాలసీ సౌలభ్యాలు అందిస్తుంటాయి. ఒకవేళ మీరు అందులో భాగమైతే మీ పాలసీ ద్వారా మీరు ఏయే ప్రయోజనాలు పొందుతారో ముందే అడిగి తెలుసుకోండి. ముఖ్యంగా మీ పాలసీలో మెటర్నిటీ బెనిఫిట్ ఉందో, లేదో కనుక్కోండి. లేకపోతే గనుక ప్రసూతి ప్రయోజనాలు అందించే మరో పాలసీ బయట తీసుకోండి. దీనివల్ల ప్రసవ సమయంలో చాలా వరకు ఖర్చులు కలిసొస్తాయి. ఇలా మీకే కాదు డెలివరీ తర్వాత మీ చిన్నారికీ ఆరోగ్య పరంగా పలు అవసరాలు రావచ్చు. వాటిని దృష్టిలో పెట్టుకొని బుజ్జాయిని మీ పాలసీలో చేర్చుకోవడం, అది కుదరకపోతే వారి పేరు మీద విడిగా పాలసీ తీసుకోవడం వంటి ప్రత్యామ్నాయ మార్గాల్ని అన్వేషించాలి. తద్వారా డబ్బులకు ఇబ్బంది పడాల్సిన అవసరం ఉండదు.

అవసరాల కోసం...

బిడ్డకు జన్మనివ్వడం మహిళలకు పునర్జన్మ లాంటిదంటారు. కాబట్టి కొంతమందిలో ప్రసవానంతర సమస్యలు ఎదురుకావొచ్చు. వాటి కోసం మరిన్ని డబ్బులు ఖర్చు పెట్టాల్సి రావచ్చు. ఇక పాపాయి విషయంలో డైపర్లు, పాలపొడి, పాల డబ్బా, బేబీ కేర్ కిట్, వైప్స్ ఇలా బోలెడన్ని అవసరాలుంటాయి. వాటన్నింటికీ అదనంగా డబ్బు కావాల్సి వస్తుంది. ఇలాంటప్పుడు ఇబ్బంది పడకుండా ఉండేందుకు బేబీ కోసం ప్లాన్ చేసుకున్నప్పట్నుంచే కొంత మొత్తం పక్కన పెట్టడం అలవాటుగా మార్చుకోవాలి.

వెనకడుగు వేయకండి

కొంతమంది మహిళలు ప్రసవం తర్వాత పిల్లల బాధ్యత రీత్యా తమ ఉద్యోగాలకు స్వస్తి పలుకుతారు. అయితే డెలివరీ తర్వాత కాస్త ఆలస్యమైనా సరే మహిళలు తమ రెండో ఇన్నింగ్స్ ప్రారంభించడమే అన్ని విధాలా మంచిదని సలహా ఇస్తున్నారు నిపుణులు. పిల్లలు స్కూలుకెళ్లే వయసొచ్చాక ఇటు వారి బాధ్యతలు నిర్వర్తిస్తూనే అటు ఉద్యోగంలో చేరడం వల్ల ఆర్థికంగా ఇబ్బందులు ఎదురుకావు. ఎందుకంటే పిల్లలు ఎదిగే కొద్దీ చాలా అవసరాలుంటాయి. ఖర్చులుం టాయి. చేతినిండా డబ్బుంటే ఏ అవసరా నికైనా సులభంగా వాడుకోవచ్చు. అలాగే మీకు జీతం పెరిగే కొద్దీ వాళ్ల పేరు మీద చేసే పొదుపునూ పెంచుతూ పోవచ్చు. కెరీర్‌లో ఇంత గ్యాప్ వచ్చింది? తిరిగి ఉద్యోగం సంపాదించడం ఎలా? అని వెనకడుగు వేయకండి. ఎందుకంటే ఇలాంటి మహిళల కోసమే కొన్ని సంస్థలు పని చేస్తున్నాయి. వారికి కావాల్సిన నైపుణ్యాలు నేర్పుతూ తిరిగి వారు రెండో ఇన్నింగ్స్ ప్రారంభించేందుకు కావల్సిన కెరీర్ మార్గాల్ని చూపిస్తున్నాయి.

మట్టి వినాయకుడే ముద్దు...

గణేష్ చతుర్థి అనగానే పూజలు నిర్వహించుకునే ప్రతి ఇంట్లో విగ్రహం తప్పనిసరిగా పెట్టుకుంటారు. ఈ విగ్రహాలను మార్కెట్‌లో అమ్మే వాటిని ఉపయోగించడం సర్వసాధారణం.. ఇందులో వింతేముంది? మార్కెట్‌లో అందుబాటులో ఉండేవాటినే కదా ఉపయోగిస్తారు. కొత్తగా ఏముంది చెప్పడానికి అనుకుంటున్నారా? ఆ విగ్రహం తయారు చేసేది ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో.. విగ్రహాలన్నీ అలాగే తయారు చేస్తారు కదా అని చాలా మంది అనుకుంటారు. కానీ అసలు సమస్య దానితోనే ఉంది. అసలు దీనిని ఎక్కడ వాడవచ్చు; ఎక్కడ ఎందుకు వాడకూడదో తెలుసుకుందాం...



ప్లాస్టర్ ఆఫ్ పారిస్ కొంత మేర ఉపయోగకరమైనదే. అయితే గణేష్ విగ్రహాల్లో ఉపయోగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ పర్యావరణానికి హితం కాదు. ఎందుకంటే ఈ విగ్రహాన్ని ఇండ్లలో అలాగే ఉంచేయరు. పూజలు పూర్తయ్యాక నిమజ్జనం చేస్తారు. అలా నిమజ్జనం చేసే విగ్రహాలు నీటిలో కరగవు. పైగా ఆ నీటిని వేడిగా మారుస్తుంది. ఆ నీరు పరిసర ప్రాంతాలను కలుషితం చేస్తుంది. తద్వారా పరిసరాలు కలుషితం అవుతాయి.

శరీర వ్యవస్థపై... : ఇందులోని భారీ మూలకాలు శరీరంలోనికి పోయి మూత్రపిండాలు, విసర్జక వ్యవస్థ దెబ్బతింటుంది. మెదడు కూడా దెబ్బతింటుంది. కొన్ని సందర్భాలలో కోమాలోకి పోయే ప్రమాదం ఉంది. అనీమియా, రక్తహీనత, జీర్ణవ్యవస్థపై ప్రభావం పడి డయేరియా, విరేచ నాలు వంటి సమ స్యలు వస్తాయి. నీటి ద్వారా కూడా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ శరీరంలోనికి పోయి కీళ్ళ నొప్పులు, నరాల సమస్యలు వస్తుం టాయి. దీని వల్ల 60-70 ఏండ్లకు వచ్చే సమస్యలు 30-40 ఏండ్లకే వస్తాయి. కలుషిత నీటి వల్ల చేపలు, రొయ్యలు వంటి జలచరాలపై ప్రభావం పడు తుంది. వాటిని ఆహారంగా తీసుకునే మనం వ్యాధుల బారిన పడుతున్నాము.

ఎలా తయారవుతుంది ? : జిప్సం (రసాయన నామం - కాల్షియం సల్ఫేట్ డైహైడ్రేట్) ని 120-180 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకూ వేడి చేసి ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తయారు చేస్తారు.

ఎంత వరకు లాభం : ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వల్ల లాభాలున్నా, అవి కొద్దిపాటివే. ఇండ్లలో అంతర్గతంగా గోడలకి వేసే పూతలో దీన్ని వాడతారు. అది మంటలని వ్యాపించకుండా చూస్తుంది. ఇక వైద్య రంగం విషయా నికొస్తే.. ఎముకలు విరిగినపుడు వేసే పిండికట్లలో వాడతారు. తాత్కాలిక నిర్మాణాల్లో (ఉదా : సినిమా సెట్టింగుల్లో) దీన్ని వాడతారు. అంతేకాదు, దీన్ని వాడడం వల్ల చర్మ సంబంధమైన వ్యాధులు వచ్చే అవకాశాలున్నాయి. ఎవరికి వారు మేం ఒక్కళ్ళం పెట్టడం వల్లనే నష్టం కలుగుతుందా అంటూ విగ్రహాలను ఉపయోగిస్తున్నారు. ఈ ఆలోచన నుంచి ఇకనైనా బయటకొద్దాం..

ప్రజల్లో చైతన్యం : గత కొన్నేళ్లుగా "ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు వద్దు, మట్టి గణపతిని పూజిద్దాం" లాంటి చైతన్యం ప్రజల్లో తీసుకొస్తున్నారు. కొందరు మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నారు కూడా. అయినప్పటికీ మట్టి విగ్రహాల వినియోగం చాలా తక్కువగానే ఉంటుంది. ప్రజల్లో పూర్తి స్థాయి అవగాహన రాలేదు. అందుకే పర్యావరణ కాలుష్యం ఇంతలా పెరిగి పోతోంది. ముందుముందు దీనితో సమస్యలు ఇంకా ఎక్కువగానే రానున్నాయి.

ఇప్పటికైనా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వినియోగం తగ్గించి కొంతమేరైనా పర్యావరణాన్ని కాపాడుకుందాం...!

బీజేపీ బీఆర్ఎస్ ఎంఐఎం ఈ మూడూ ఒక్కటే..



(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో, జీఎస్టీ బిల్లుకు..ఇలా ప్రతి సందర్భంలోనూ బీఆర్ఎస్ పార్టీ మద్దతునిచ్చిందని గుర్తుచేశారు. ఎంఐఎం కూడా అంతేనని విమర్శించారు. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో బీజేపీపై కాంగ్రెస్ పోరాడుతుంటే మధ్యలో ఎంఐఎం ఆ పోరాటానికి అడ్డుపడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.


ఆదివారం రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విజయభేరీ సభను నిర్వహించారు. ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, సీడబ్ల్యూసీ సభ్యులు, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నేతలు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ , ఎంఐఎంలపై విరుచుకుపడ్డారు. ఆయా పార్టీల విధానాలను నిశితంగా విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ సభ ఏర్పాటు చేస్తుంటే ఆ మూడు పార్టీలు అడ్డుకోవాలని ప్రయత్నించి విఫలమయ్యాయని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ను ఎలా ఆపాలనే అంశంపై మళ్లీ ఆ మూడు పార్టీలు చర్చించుకుంటాయని దుయ్యబట్టారు. దేశంలో ప్రతి ప్రతిపక్ష నాయకునిపై మోడీ సర్కారు ఈడీ, సీబీఐ, ఐటీ తదితర కేసులను పెట్టించిందన్నారు. అదే సీఎం కేసీఆర్ పైన గానీ, ఎంఐఎం నాయకులపై గానీ ఎలాంటి కేసుల్లేవని గుర్తుచేశారు. మోడీ తన మద్దతుదారులపై కేసులు పెట్టించరు. అందుకే అవినీతి రికార్డులను బద్దలు కొట్టినా సరే.... సీఎం కేసీఆర్ పైన గానీ, ఎంఐఎం నేతలపైన గానీ ఎలాంటి కేసుల్లేవని......కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ. లక్ష కోట్లు, ధరణి పోర్టల్ స్కాంలో ప్రజల భూములు లాక్కోవడం, దళితుల భూములు లాక్కోవడం వంటి అనేక అవినీతి ఉదాహరణలున్నా పీఎం మోడీ సీఎం కేసీఆర్ పై చర్యలు తీసుకోలేదని గుర్తుచేశారు.రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం వంద రోజుల్లో దిగిపోవడం ఖాయమని స్పష్టం చేశారు. ఈసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బీజేపీ, ఎంఐఎం పార్టీలు కూడా కాపాడలేవని రాహుల్ హెచ్చరించారు.

కాంగ్రెస్ పార్టీ హామీ ఇస్తే ఆ హామీని కచ్చితంగా నిలబెట్టుకుంటుందని రాహుల్ ఈ సందర్భంగా తెలిపారు. సోనియాగాంధీ మాటిస్తే ఏ పరిస్థితిలోనైనా దాన్ని నెరవేరుస్తారని అన్నారు. ఇచ్చిన మాట మేరకు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చామని గుర్తుచేశారు. అదే విధంగా రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను నెరవేస్తుందని హామీనిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తొలిరోజే మంత్రివర్గ సమావేశంలో ఆరు గ్యారంటీలను ఆమోదిస్తుందని వివరించారు. తమ పార్టీ పని తీరు ఎలా ఉందో పొరుగున ఉన్న కర్ణాటక రాష్ట్రంలో ఎవరిని అడిగినా చెబుతారని అన్నారు. మోడీ.. ఆదానీ లాభాల కోసమే పని చేస్తారనీ, అదే విషయాన్ని పార్లమంటులో తాను ప్రస్తావిస్తే తన సభ్యత్వాన్ని రద్దు చేశారని వాపోయారు. మోడీకి, సీఎం కేసీఆర్ కు మధ్య భాగస్వామ్యముందని విమర్శించారు. రాష్ట్ర ప్రజల డబ్బులను కేసీఆర్ కుటుంబం పంచుకుంటున్నదని విమర్శించారు. తాము రాష్ట్రం ఇచ్చింది కేవలం కేసీఆర్ కుటుంబం లబ్ది పొందేందుకు కాదని స్పష్టం చేశారు. దళితులు, గిరిజనులు, బలహీనవర్గాలు, చిన్న వ్యాపారులు, రైతులు, మహిళలు, యువత జీవితాలను మెరుగుపరిచేందుకే తెలంగాణ ఇచ్చామన్నారు. తొమ్మిదేండ్ల బీఆర్ఎస్ పాలనలో దోపిడీకి గురైన ప్రజల డబ్బును తిరిగి వారికిప్పిస్తామని రాహుల్ గాంధీ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్ పార్టీ పై బాధ్యత ఉందని ఆయన తెలిపారు. తిరిగి ఈ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తామని అన్నారు. బీజేపీ విద్వేషం, హింస మార్కెట్ ను పెంచుతున్నదనీ, అందుకే తాము ప్రేమ దుకాణాన్ని తెరిచామని రాహుల్ వెల్లడించారు.

కమ్యూనిస్టులు చరిత్ర సృష్టికర్తలు

- మోడీ హయాంలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం
- రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ఖూనీ
- 'ఇండియా' కూటమితో బీజేపీలో గుబులు : సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డీ రాజా



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

భారతదేశ చరిత్ర సృష్టికర్తలు కమ్యూనిస్టులే...అదే వారి గుర్తింపు అని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డీ రాజా అన్నారు. చరిత్రను అబద్దాలతో వక్రీకరిస్తూ, తిరగరాయాలని చూస్తే ప్రజలు సహించబోరని హెచ్చరించారు. తెలంగాణ సాయుధ పోరాట వారసత్వం కమ్యూనిస్టులదేనని స్పష్టం చేశారు. దేశ స్వాతంత్ర్య పోరాటం సహా దేనితోనూ సంబంధం లేని బీజేపీ, బీఆర్ఎస్ సహా అనేక పార్టీలు రకరకాల పేర్లతో సాయుధ పోరాట ఉత్సవాలను నిర్వహిస్తున్నాయని ఎద్దేవా చేశారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో 4,500 మంది బలిదానాలు చేస్తేనే, హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం అయ్యిందని గుర్తుచేశారు. సీపీఐ రాష్ట్ర సమితి అధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభ ఆదివారంనాడిక్కడి నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగింది. దీనికాయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారత స్వాతంత్రోద్యమం, తెలంగాణ సాయుధ పోరాటాల్లో జనసంఘ్, ఆర్ఎస్ఎస్, సంఘ్‌పరివార్ శక్తుల పాత్ర ఏంటని ప్రశ్నించారు. వారికి అసలు వాటితో ఎలాంటి సంబంధం లేదని తేల్చిచెప్పారు. ప్రధాని నరేంద్ర మోడీ హయాంలో అంబేద్కర్ రాసిన రాజ్యాంగం, ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతున్నాయని విమర్శించారు. కమ్యూనిస్టులు ప్రజల ఐక్యతను కోరితే... బీజేపీ, మోడీషాలు మతం పేరుతో వారిమధ్య విభజన తెచ్చే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. జీ-20 సమావేశాల తర్వాత ప్రధాని మోడీ అంతర్జాతీయంగా బలమైన నాయకుడిగా మారారని సంఘ్‌పరివార్ ప్రచారం చేస్తున్నదనీ, కానీ ఆ సమావేశాల తర్వాత భారతదేశ రూపాయి విలువ మరింత దిగజారిందని గుర్తుచేశారు. దేశ ఆర్థిక వ్యవస్థ పతనావస్థలో ఉందనీ, ఎన్నికల టైంలో ప్రధాని ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా అమలు కాలేదని గుర్తుచేశారు. అదానీ, అంబానీ, కార్పొరేట్ల ఆస్తులు పెరిగాయే తప్ప, సామాన్య ప్రజల జీవన ప్రమాణాలు మరింత దిగజారాయని వివరించారు. దేశంలో స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం కనుచూపు మేరలో లేవనీ, మహిళలు, దళితులు, ఆదివాసీలకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో పౌరయుద్ధం ప్రజల మధ్య జరుగుతున్నదనీ, అక్కడి డబుల్ ఇంజిన్ సర్కారు వాటిని నియంత్రించడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. గవర్నర్ల వ్యవస్థతో ప్రతిపక్షపార్టీల ప్రభుత్వాలపై పెత్తనం చేస్తున్నారని అన్నారు. దేశంలోని పరిస్థితులకు రాజకీయ ప్రత్యామ్నాయంగా 'దేశ్ కో బచావ్-బీజేపీ హఠావ్' నినాదంతో 'ఇండియా' కూటమి ఏర్పడితే, దాన్ని చూసి భయపడి, చివరకు దేశం పేరునే మార్చే ప్రయత్నం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' అంటూ ప్రజల్ని తప్పుతోవ పట్టిస్తున్నారనీ, ఎన్నికల ఖర్చు తగ్గుతుందని అబద్ధ ప్రచారం చేస్తున్నారని చెప్పారు. వాస్తవానికి మోడీ సర్కార్ హయాంలో జరిగిన రూ.7.5 లక్షల కోట్ల అవినీతిని 'కాగ్' ఎత్తిచూపిందని గుర్తుచేశారు. ఇలాంటి కుంభకోణాల ముందు ఎన్నికల ఖర్చు పెద్దదేం కాదన్నారు. ఎలక్టోరల్ బాండ్ల రూపంలో కార్పొరేట్ల నుంచి భారీగా డబ్బు దండుకొని, దేశంలోనే అత్యంత సంపన్న పార్టీగా బీజేపీ ఎదిగిందని చెప్పారు. ఎన్నికల సంస్కరణలపై అప్పటి కేంద్రమంత్రి, కమ్యూనిస్టు నాయకుడు ఇంద్రజిత్‌గుప్తా నేతృత్వంలోని కమిటీ అనేక సిఫార్సులు చేసిందనీ, దానిపై చర్చించేందుకు ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం సిద్ధంగా లేవన్నారు. తెలంగాణలో మతోన్మాద బీజేపీకి తావుండకూడదనే తాము పోరాటం చేస్తున్నామనీ, కమ్యూనిస్టులు ఎప్పుడూ ప్రజల పక్షాన ఉంటారే తప్ప, వారికి ఎలాంటి వ్యక్తిగత లాభాపేక్ష ఉండదని స్పష్టం చేశారు. దేశంలో బీజేపీని సమూలంగా నిర్మూలించాలనీ, దానికోసం త్వరలో జరిగే ఎన్నికల్లో ప్రజలు 'ఓటు' అనే ఆయుధాన్ని సంధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగం, ధరలు పెరిగి ప్రజలు నానా అవస్థలు పడుతుంటే, వారి దృష్టిని మళ్ళించేందుకు 'ఇండియా' పేరును 'భారత్'గా మార్పు చేస్తున్నట్టు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. 1947లో ఇండియా పేరును పెట్టుకోవడానికి వీల్లేదని మహ్మద్ అలీ జిన్నా బ్రిటీషర్లకు సూచించారనీ, ఇప్పుడు అదే పని ప్రధాని నరేంద్రమోడీ చేస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్ ఎవరితో కలవకుండా, వచ్చే ఎన్నికల్లో ఎవరికీ మెజారిటీ రాకుంటే బీజేపీకి మద్దతిచ్చి, కేంద్ర మంత్రివర్గంలో చేరాలని తాపత్రయపడుతున్నదని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు అరెస్టుకు అక్కడి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి బీజేపీ సహకారం ఉన్నదని చెప్పారు. బీజేపీని ఓడిస్తేనే భారత సమైక్యత పరిరక్షింపబడుతుందని అన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ మాట్లాడుతూ విలీన దినోత్సవాన్ని అదే పేరుతో అధికారికంగా నిర్వహించలేని పిరికి ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్నదని బీఆర్ఎస్‌ను ఉద్దేశించి అన్నారు. సీఎం కేసీఆర్ బీజేపీకి వ్యతిరేకం అంటూనే ఆపార్టీ వ్యతిరేక ఓటు చీలకుండా కాపాడుతున్నారనీ, ఎంఐఎం కూడా ఆ తానులోని ముక్కే అని విమర్శించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కేంద్రానికి బానిసగా మారాడనీ, అందుకే లిక్కర్ స్కాంలో కవిత అరెస్టు ఆగిపోయిందని చెప్పారు. కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షత వహించారు. అనంతరం సురవరం సుధాకరరెడ్డి, తెలంగాణ సాయుధ పోరాట యోధులు డీ నారాయణరావు, కవి జయరాజ్‌ను సన్మానించారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, జాతీయ సమితి సభ్యులు శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకటరెడ్డి, పశ్యపద్మ, ఎమ్ బాలమల్లేష్, ఎమ్ బాలనర్సింహా, వీఎస్ బోస్ తదితరులు పాల్గొన్నారు. సభ ప్రారంభానికి ముందు సాయుధ పోరాట అమరుల స్థూపానికి నివాళులర్పించారు.

జాతీయ సమైక్యతకు ఆర్థిక సమస్యలే విఘాతం

- వీటిని పారదోలేందుకు కృషి చేస్తున్నాం
- సెప్టెంబర్ 17 తెలంగాణకు ఒక ప్రత్యేకమైన రోజు
- ఆ నాటి త్యాగధనుల స్ఫూర్తిని స్మరించుకుందాం : జాతీయ సమైఖ్యతా దినోత్సవంలో సీఎం కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జాతీయ సమైఖ్యతకు విఘాతం కలిగించే అంశాల్లో అత్యంత కీలకమైనవి ఆర్థిక సమస్యలేనని రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం హైదరాబాద్‌లోని నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో జాతీయ సమైక్యతా దినోత్సవ వేడుకలను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో సీఎం కేసీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గన్‌పార్క్ వద్ద గల అమరవీరుల స్థూపానికి ముఖ్యమంత్రి నివాళులర్పించారు. తర్వాత పబ్లిక్ గార్డెన్స్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. సీఎస్ శాంతకుమారి స్వాగతం పలికిన అనంతరం సీఎం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం కేసీఆర్ మాట్లాడుతూ 76ఏండ్ల స్వాతంత్ర్యం తర్వాత కూడా పేదరికం, నిరుద్యోగం, సాంఘిక వివక్షతలు దేశాన్ని పట్టి పీడిస్తున్నాయనీ, ఇది అత్యంత దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రుగ్మతలను పారద్రోలేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తున్నదని చెప్పారు. తలసరి ఆదాయంలో తెలంగాణ నెంబర్ వన్‌గా ఉందనీ, తమ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలు దేశంలోని పలు రాష్ట్రాలకు స్ఫూర్తిగా నిలిచాయని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17కు ఒక ప్రత్యేకత ఉందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రాజుల పాలనలో ఉన్న సంస్థానాలను భారత యూనియన్‌లో కలిపే ప్రక్రియను నాటి ప్రభుత్వం చేపట్టిందని గుర్తు చేశారు. తెలంగాణ నేలపై పలు సందర్భాల్లో అనేక పోరాటాలు జరిగాయన్నారు. అనేక మంది పోరాట యోధులు ప్రాణాలను తృణప్రాయంగా భావించి.. గుండెలు ఎదురొడ్డి నిలిచారనీ, ఆనాటి ప్రజా పోరాటాలు, త్యాగాలు జాతి తలపుల్లో నిత్యం ప్రకాశిస్తాయని చెప్పారు. దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, కుమురంభీం, రావి నారాయణరెడ్డి లాంటి ఎందరో యోధుల త్యాగాల ఫలితంగా మనం నేడు స్వేచ్ఛా వాయువులను పీల్చగలుగుతున్నామని వివరించారు. ఆ సందర్భంగా అనేక మంది ప్రాణాలర్పించారనీ, ఆ త్యాగధనుల స్ఫూర్తిని స్మరించుకోవాలన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో వ్యవసాయానికి ఎంతో లబ్ది చేకూరిందనీ, ఉమ్మడి రాష్ట్ర పాలకులు ఆ పథకాన్ని పట్టించుకోలేదని చెప్పారు. పాలమూరు జిల్లాలో కరవును తరిమికొట్టామనీ, ఇప్పుడు పాలమూరు సస్యశ్యామలమవుతోందన్నారు. ఖమ్మంలో సీతారామ ప్రాజెక్టును నిర్మిస్తున్నామని, వరంగల్ జిల్లాకు కూడా అదనంగా సాగునీటిని అందిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణలో 85 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని, త్వరలో కోటి 25 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి జిల్లాకు మెడికల్ కాలేజీ ఇచ్చామని, ఏటా 10 వేల మంది డాక్టర్లను తయారు చేస్తున్నామన్నారు. అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలో 44 లక్షల మందికి పెన్షన్లు ఇస్తున్నామనీ, లబ్దిదారుల వయోపరిమితిని 57 ఏండ్లకు తగ్గించామని సీఎం గుర్తు చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా దళితబంధు పథకంతో ఆయా వర్గాల కుటుంబాల్లో వెలుగులు నింపామని చెప్పారు. ఆదివాసీలకు పోడుభూముల పట్టాలు ఇచ్చామని తెలిపారు. వృత్తి పనులపై ఆధారపడి జీవిస్తున్న బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రోత్సాహకాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఐటీ రంగంలో తెలంగాణ దేశంలోనే మేటిగా ఎదిగిందని వివరించారు. హైదరాబాద్ నగరం ఓ మినీ ఇండియాగా వర్ధిల్లుతోందని కేసీఆర్ వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో డీజీపీ అంజనీకుమార్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎంపీ సంతోశ్‌కుమార్, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





నయా స్వింగ్‌స్టర్ : మహ్మద్ సిరాజ్ (6/21)

సూపర్ హైదరాబాదీ

మియాభాయ్ మెరుపుల్. టెస్టు బౌలర్‌గా జాతీయ జట్టులోకి వచ్చిన హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్‌కు వైట్‌బాల్ ఫార్మాట్‌లో పెద్దగా చెప్పుకోదగిన గణాంకాలు లేవు. అయినా, ఇటీవల కాలంలో కండ్లుచెదిరే బౌలింగ్‌తో మెరుస్తున్న మహ్మద్ సిరాజ్ అదరగొడుతున్నాడు. స్వదేశంలో వన్డే వరల్డ్‌కప్ ముంగిట, మహ్మద్ సిరాజ్ చిరస్మరణీయ ప్రదర్శన చేశాడు. ఆసియా కప్ ఫైనల్ చరిత్రలోనే అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలతో పాటు కెరీర్ అత్యుత్తమ ప్రదర్శన రాబట్టాడు. వర్షంతో 40 నిమిషాలు ఆలస్యంగా ఆరంభమైన 50 ఓవర్ల మ్యాచ్.. మహ్మద్ సిరాజ్ సింహనాదంతో 50 పరుగుల మ్యాచ్‌గా మార్చివేశాడు.

తొమ్మిది రోజుల వ్యవధిలో ఆరు మ్యాచులు జరిగిన పిచ్‌పై మహ్మద్ సిరాజ్ రాబట్టిన స్వింగ్ అమోఘం. మ్యాచ్ ఆరంభానికి ముందు పడిన కాసిన్ని చిరు జల్లులను గొప్పగా సద్వినియోగం చేసుకున్న సిరాజ్..తన తొలి ఓవర్ నుంచే గణనీయ స్వింగ్ సాధించాడు. తను సంధించిన రెండో ఓవర్లో సిరాజ్ ఏకంగా సంచలనమే సృష్టించాడు. ఒకే ఓవర్లో ఏకంగా నలుగురు బ్యాటర్లను పెవిలియన్‌కు చేర్చాడు. వన్డే క్రికెట్ చరిత్రలోనే ఇది నాల్గో సందర్భం. గతంలో బంగ్లాదేశ్‌పై చమిందా వాస్ (2003), న్యూజిలాండ్‌పై మహ్మద్ షమి (2009), వెస్టిండీస్‌పై ఆదిల్ రషీద్ (2019) ఒకే ఓవర్లో నాలుగు వికెట్లు పడగొట్టగా.. ఇప్పుడు మహ్మద్ సిరాజ్ ఆ జాబితాలోకి చేరాడు. కచ్చితమైన లెంగ్త్, లైన్‌తో బంతులు సంధించిన మహ్మద్ సిరాజ్.. అంచనాలకు మించి స్వింగ్ రాబట్టాడు. దీంతో సిరాజ్ స్వింగ్‌ను శ్రీలంక బ్యాటర్లు అర్థం చేసుకోలేకపోయారు. తొలి వికెట్‌కు రవీంద్ర జడేజా ఫీల్డింగ్ అద్భుతంతో సొంతం చేసుకున్న సిరాజ్.. ఆ తర్వాత ఐదు వికెట్లను సైతం అలవోకగా అందుకున్నాడు.

సిరాజ్ బంతులను ఆడేందుకు శ్రీలంక బ్యాటర్లు ఆపసోపాలు పడ్డారు. ఇన్ స్వింగ్, అవుట్ స్వింగ్‌తో నిప్పులు చెరిగిన సిరాజ్ శ్రీలంక ఇన్నింగ్స్‌ను కకావికలం చేశాడు. పది బంతుల వ్యవధిలోనే ఐదు వికెట్లు పడగొట్టిన మహ్మద్ సిరాజ్ ఏడు ఓవర్లలో 21 పరుగులకు ఆరు వికెట్లు పడగొట్టి కెరీర్‌లో అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు నమోదు చేశాడు. 2022 నుంచి వన్డేల్లో పవర్‌ప్లేలో 32 వికెట్లు పడగొట్టిన మహ్మద్ సిరాజ్.. ఈ సమయంలో కొత్త బంతితో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా కొనసాగుతున్నాడు. స్వదేశంలో వన్డే వరల్డ్‌కప్ టైటిల్ వేటకు సిద్ధమవుతున్న టీమ్ ఇండియాకు కొత్త బంతితో మహ్మద్ సిరాజ్ సంచలన ప్రదర్శనలు సరికొత్త ఉత్సాహం అందిస్తున్నాయి.

మియాభాయ్ మిన్నంటే ప్రదర్శన. హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్ (6/21) కొలంబోలో ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ప్రేమదాస పిచ్‌పై కండ్లుచెదిరే స్వింగ్ రాబట్టిన సిరాజ్ ఒకే ఓవర్లో నాలుగు వికెట్లతో శ్రీలంక టాప్ ఆర్డర్‌ను కకావికలం చేయటంతో పాటు పది బంతుల వ్యవధిలో ఐదు వికెట్లు పడగొట్టి డిఫెండింగ్ చాంపియన్‌ను దిక్కుతోచని స్థితిలోకి తీసుకెళ్లాడు. హార్దిక్ పాండ్య (3/3), బుమ్రా (1/23) సైతం నిప్పులు చెరగగా.. శ్రీలంక 50 పరుగులకే కుప్పకూలింది. అతి స్వల్ప లక్ష్యాన్ని అలవోకగా ఛేదించిన టీమ్ ఇండియా రికార్డు స్థాయిలో ఎనిమిదో సారి ఆసియా కప్ చాంపియన్స్‌గా నిలిచింది.



ఆసియాలో అష్టపది : రికార్డు ఎనిమిదో ఆసియా కప్ టైటిల్‌తో టీమ్ ఇండియా క్రికెటర్లు

సిరాజ్ సింహనాదం

- మహ్మద్ సిరాజ్ వికెట్ల సిక్సర్
- 50 పరుగులకు కుప్పకూలిన శ్రీలంక

ఆసియా కప్ చాంపియన్‌గా భారత్

నవతెలంగాణ-కొలంబో

భారత్ అష్టపది. రికార్డు స్థాయిలో ఎనిమిదో సారి ఆసియా కప్ విజేతగా అవతరించింది టీమ్ ఇండియా. ఆదివారం కొలంబోలోని ఆర్.ప్రేమదాస స్టేడియంలో జరిగిన ఆసియా కప్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ శ్రీలంకపై 10 వికెట్ల తేడాతో అత్యంత ఏకపక్ష విజయం సాధించింది. 51 పరుగుల అతి స్వల్ప లక్ష్యాన్ని 6.1 ఓవర్లలోనే ఛేదించిన టీమ్ ఇండియా..మరో 263 బంతులు మిగిలి ఉండగానే ఎనిమిదో ఆసియా కప్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. యువ ఓపెనర్లు శుభ్‌మన్ గిల్ (27 నాటౌట్, 19 బంతుల్లో 6 ఫోర్లు), ఇషాన్ కిషన్ (23 నాటౌట్, 18 బంతుల్లో 3 ఫోర్లు) అజేయ భాగస్వామ్యంతో శ్రీలంకపై చెలరేగారు. అంతకుముందు, తొలుత బ్యాటింగ్ చేసిన డిఫెండింగ్ చాంపియన్ శ్రీలంకపై మహ్మద్ సిరాజ్ (6/21) విరుచుకుపడ్డాడు. పది బంతుల వ్యవధిలో ఐదు వికెట్లు పడగొట్టిన సిరాజ్‌కు హార్దిక్ పాండ్య, బుమ్రా తోడటంతో శ్రీలంక 15.2 ఓవర్లలో 50 పరుగులకే కుప్పకూలింది. శ్రీలంక బ్యాటర్లలో కుశాల్ మెండిస్ (17), దుశాన్ హేమంత (13 నాటౌట్) రెండెంకల స్కోరు అందుకున్నారు. ఆరు వికెట్ల మొనగాడు మహ్మద్ సిరాజ్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

ఓపెనర్లే ఊదేశారు : 51 పరుగుల అతి స్వల్ప లక్ష్యాన్ని ఓపెనర్లే ఊదేశారు. కెప్టెన్ రోహిత్ శర్మ స్థానంలో ఓపెనర్‌గా వచ్చిన ఇషాన్ కిషన్.. శుభ్‌మన్ గిల్ తోడుగా పవర్‌ప్లేలో పవర్‌ఫుల్‌గా ఆడాడు. వికెట్‌కు ఇరువైపులా గిల్, కిషన్‌లు బౌండరీలు బాదటంతో శ్రీలంక చేష్టలుడిగింది. గిల్ ఆరు బౌండరీలతో దండెత్తగా.. ఇషాన్ కిషన్ సైతం మూడు బౌండరీలతో విరుచుకుపడ్డాడు. యువ ఓపెనర్ల ధనాధన్‌తో 6.1 ఓవర్లలో టీమ్ ఇండియా లాంఛనం ముగించింది. 10 వికెట్ల తేడాతో అత్యంత ఏకపక్ష విజయం నమోదు చేసింది.

సిరాజ్ విశ్వరూపం : టాస్ నెగ్గిన శ్రీలంక తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఫైనల్లో బంతితో వేట షురూ చేసిన టీమ్ ఇండియా.. ఇన్నింగ్స్ ఆరంభ ఓవర్లోనే బ్రేక్ సాధించింది. పేస్ దళపతి బుమ్రా ఇన్నింగ్స్ మూడో బంతికే ఓపెనర్ కుశాల్ పెరీరా (0)ను సాగనంపాడు. బుమ్రా బంతి అవుట్‌సైడ్ ఎడ్జ్ కావటంతో పెరీరా వికెట్ కీపర్‌కు చిక్కాడు. బుమ్రా వికెట్ల పతనానికి దారి చూపగా.. మహ్మద్ సిరాజ్ అసలు సంగతి చూసుకున్నాడు. తన రెండో ఓవర్లోనే సిరాజ్ అసమాన ప్రదర్శన చేశాడు. ఇన్నింగ్స్ నాల్గో ఓవర్లో ఏకంగా నాలుగు వికెట్లు పడగొట్టాడు. నిశాంక (2), సమరవిక్రమ (0), చరిత్ అసలంక (0), ధనంజయ డిసిల్వ (4)లు సిరాజ్‌కు స్వింగ్‌కు దాసోహం అయిపోయారు. సిరాజ్ దెబ్బకు శ్రీలంక నాలుగు ఓవర్లలో 12 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది. తన తర్వాతి ఓవర్లో శ్రీలంక కెప్టెన్ దసున్ శనక (0)ను సైతం వెనక్కి పంపిన సిరాజ్.. శ్రీలంకను నిస్సహాయ స్థితిలోకి నెట్టాడు. టాప్ ఆర్డర్‌లో కుశాల్ మెండిస్ (17), లోయర్ ఆర్డర్‌లో హేమంత (13 నాటౌట్) రెండెంకల స్కోరుతో శ్రీలంక 50 పరుగుల మార్క్ తాకింది. హార్దిక్ పాండ్య సైతం స్వింగ్ రాబట్టి.. శ్రీలంక లోయర్ ఆర్డర్ ఖేల్ ఖతం చేశాడు. దునిత్ వెల్లలాగే (8), ప్రమోద్ మధుశన్ (1), మతీశ పతిరణ (0)లు హార్దిక్ పాండ్య బంతికి వికెట్లు కోల్పోయారు. 92 బంతుల్లో 50 పరుగులు చేసిన శ్రీలంక.. భారత్‌తో వన్డేల్లో అత్యల్ప స్కోరుకు కుప్పకూలింది.



శభాష్ సిరాజ్ : ఆరు వికెట్లు పడగొట్టిన మహ్మద్ సిరాజ్‌కు సహచరుల అభినందనలు

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్ : నిశాంక (సి) జడేజా (బి) సిరాజ్ 2, కుశాల్ పెరీరా (సి) రాహుల్ (బి) బుమ్రా 0, కుశాల్ మెండిస్ (బి) సిరాజ్ 17, సమరవిక్రమ (ఎల్బీ) సిరాజ్ 0, చరిత్ అసలంక (సి) కిషన్ (బి) సిరాజ్ 0, ధనంజయ డిసిల్వ (సి) రాహుల్ (బి) సిరాజ్ 4, దుసున్ శనక (బి) సిరాజ్ 0, దునిత్ వెల్లలాగే (సి) రాహుల్ (బి) పాండ్య 8, హేమంత నాటౌట్ 13, ప్రమోద్ మధుశన్ (సి) కోహ్లి (బి) పాండ్య 1, మతీశ పతిరణ (సి) కిషన్ (బి) పాండ్య 0, ఎక్స్‌ట్రాలు :5, **మొత్తం : (15.2 ఓవర్లలో ఆలౌట్) 50.**

వికెట్ల పతనం : 1-1, 2-8, 3-8, 4-8, 5-12, 6-12, 7-33, 8-40, 9-50, 10-50.

బౌలింగ్ : జశ్‌ప్రీత్ బుమ్రా 5-1-23-1, మహ్మద్ సిరాజ్ 7-1-21-6, హార్దిక్ పాండ్య 2.2-0-3-3, కుల్దీప్ యాదవ్ 1-0-1-0.

భారత్ ఇన్నింగ్స్ : ఇషాన్ కిషన్ నాటౌట్ 23, శుభ్‌మన్ గిల్ నాటౌట్ 27, ఎక్స్‌ట్రాలు :1, **మొత్తం : (6.1 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) 51.**

బౌలింగ్ : ప్రమోద్ మధుశన్ 2-0-21-0, మతీశ పతిరణ 2-0-21-0, దునిత్ వెల్లలాగే 2-0-7-0, చరిత్ అసలంక 0.1-0-1-0.

డైమండ్‌లో సిల్వర్!

- నీరజ్ చోప్రాకు రెండో స్థానం
- జాకుబ్‌కు పసిడి పతకం

డైమండ్ లీగ్ ఫైనల్స్



యూజీన్ (అమెరికా) : భారత గోల్డెన్ బాయ్, ప్రపంచ చాంపియన్, ఒలింపిక్ విజేత నీరజ్ చోప్రా డైమండ్ లీగ్‌లో సిల్వర్‌తో సరిపెట్టుకున్నాడు. యూజీన్‌లో శనివారం (భారత కాలమానం ప్రకారం అర్ధ రాత్రి తర్వాత) జరిగిన ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్ ఫైనల్లో జావెలిన్ త్రో సూపర్‌స్టార్ ఇటీవల కాలంలో తొలిసారి అగ్రస్థానానికి దిగువన నిలిచాడు. మెన్స్ జావెలిన్ త్రోలో పసిడి ఫేవరేట్‌గా బరిలోకి దిగిన నీరజ్ చోప్రా.. ఈ సీజన్‌లోనే అత్యంత నిరాశజనక ప్రదర్శన చేశాడు!. 2022 డైమండ్ లీగ్ ఫైనల్లో 88.44 మీటర్ల త్రోతో కిరీటం దక్కించుకున్న నీరజ్ చోప్రా..ఈ ఏడాది రెండో స్థానంలో సరిపెట్టుకున్నాడు. 83.80 మీటర్ల దూరమే ఈటను విసిరిన నీరజ్ చోప్రా.. చెక్ రిపబ్లిక్ అథ్లెట్ జాకుబ్ వడ్లేచ్‌కు టైటిల్ కోల్పోయాడు. ఈటను 84.24 మీటర్ల దూరం విసిరిన చెక్ రిపబ్లిక్ అథ్లెట్.. బంగారు బల్లెం వీరుడు నీరజ్ చోప్రాపై తొలిసారి పైచేయి సాధించాడు.

జావెలిన్ త్రో ఫైనల్లో నీరజ్ చోప్రా తొలి ప్రయత్నంలో విఫలమయ్యాడు. ఫౌల్‌తో తొలి ప్రయత్నం అవకాశం చేజార్చుకున్నాడు. రెండో ప్రయత్నంలో ఫైనల్లో తన ఉత్తమ ప్రదర్శన చేశాడు. బల్లెం 83.80 మీటర్లు విసిరాడు. ఆ తర్వాత వరుసగా 81.37 మీటర్లు, 80.74 మీటర్లు, 80.90 మీటర్లు ఈటను విసిరాడు. కానీ ఏ ప్రయత్నంలోనూ చెక్ రిపబ్లిక్ అథ్లెట్ జాకుబ్‌ను అధిగమించలేకపోయాడు. ఇదే సమయంలో మూడో స్థానంలో నిలిచిన ఫిన్లాండ్ అథ్లెట్ ఒలీవర్ హెలాండర్ సైతం నీరజ్ చోప్రాపై ఒత్తిడి పెంచాడు. 83.74 మీటర్లతో మూడో స్థానంలో నిలిచిన ఒలీవర్.. నీరజ్ చోప్రాకు కేవలం ఆరు సెంటీమీటర్ల దూరంలోనే నిలిచాడు. డైమండ్ లీగ్ ఫైనల్స్‌లో రెండో స్థానంలో నిలిచిన నీరజ్ చోప్రా.. సెప్టెంబర్ 23 నుంచి ఆరంభం కానున్న ఆసియా క్రీడల్లో పసిడి ఫేవరేట్‌గా బరిలోకి దిగనున్నాడు.

మొరాకోపై భారత్ గెలుపు

- విజయంతో రోహన్ బోపన్న వీడ్కోలు

లక్నో : డెవిస్ కప్‌కు రోహన్ బోపన్న ఘనంగా వీడ్కోలు పలికాడు. డెవిస్ కప్ వరల్డ్ గ్రూప్ 11 టైలో మొరాకోపై టీమ్ ఇండియా 3-1తో ఘన విజయం సాధించింది. యూకీ బాంబ్రితో కలిసి డబుల్స్‌లో బరిలోకి దిగిన వెటరన్ ఆటగాడు రోహన్ బోపన్న..6-2, 6-1తో వరుస సెట్లలో విజయం సాధించాడు. రివర్స్ సింగిల్స్ మ్యాచ్‌లో సుమిత్ నాగల్ మెరిశాడు. రివర్స్ రబ్బర్‌ను 6-3, 6-3తో అలవోకగా గెలుపొందిన సుమిత్ నాగల్ భారత్ విజయానికి బాటలు వేశాడు. ఈ విజయంతో వచ్చే ఏడాది డెవిస్ కప్ వరల్డ్ గ్రూప్ 1 ప్లే ఆఫ్స్‌కు భారత్ అర్హత సాధించింది.



నవచిత్రం

రీ రిలీజ్‌లోనూ విజయం ఖాయం



రవికృష్ణ, సోనియా అగర్వాల్

నిర్మాత ఎ.ఎం.రత్నం నిర్మాణంలో డైరెక్టర్ సెల్వ రాఘవన్ వెండితెరపై ఆవిష్కరించిన ఆల్ టైమ్ కల్ట్ క్లాసిక్ '7/జీ బృందావన్ కాలనీ'. రవికృష్ణ, సోనియా అగర్వాల్ జంటగా నటించిన ఈ చిత్రం సంచలన విజయం సాధించి ప్రేక్షకుల మనసులో నిలిచిపోయింది. ఇప్పుడు ఈ సినిమా మరోసారి ప్రేక్షకులను అలరించనుంది. నిర్మాతలు ఉదయ్, యతి ఏయు సినిమాస్, విపై ఎంటర్‌టైన్‌మెంట్స్ ద్వారా ఈనెల 22న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా రీరిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా రీరిలీజ్ ట్రైలర్‌ని మేకర్స్ లాంచ్ చేశారు.

ఈ సందర్భంగా ఎ.ఎం.రత్నం మాట్లాడుతూ,'నేను చేసిన ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో '7/జీ బృందావన్ కాలనీ' కల్ట్ మూవీ. ఈ సినిమాకి చాలా మంచి పేరు వచ్చింది. తెలుగు, తమిళం రెండూ భాషల్లో పెద్ద విజయం సాధించింది. ఇదొక పొయిటిక్ సినిమా. ఉదయ, యతి చాలా శ్రద్ధ తీసుకొని ఈ సినిమాని రీ రిలీజ్ చేస్తున్నారు. రీరిలీజ్‌లో కూడా ఈ సినిమా పెద్ద సక్సెస్ అవుతుందని నమ్మకం ఉంది. రవితో మళ్ళీ రీఎంట్రీలా '7/జీ బృందావన్ కాలనీ' పార్ట్2ని వచ్చే నెల నుంచి మొదలుపెడుతున్నాం. దీనికికూడా సెల్వరాఘవనే దర్శకత్వం వహిస్తారు. స్క్రిప్ట్ అద్భుతంగా వచ్చింది' అని అన్నారు.

సమయం చేసిన సాయం

నాని నటిస్తున్న నయా క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'హాయ్ నాన్న'. ఫస్ట్ సింగిల్ 'సమయమా..' ప్రోమోతో అలరించిన మేకర్స్ తాజాగా ఈ పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. 'సమ యమా..' పాట మనసుని ఆకట్టుకునే మోడ్రన్ టచ్ ఉన్న బ్యూటీఫుల్ సాంగ్. అనంత శ్రీరామ్ లిరిక్స్, హేషమ్ అబ్దుల్ వహాబ్ ఆర్కెస్ట్రేషన్, బేస్ ట్రాక్ గిటార్ బీట్స్ ఎక్స్ ట్రార్డినరీగా ఉన్నాయి. ట్యూన్, ప్రొగ్రషన్ కట్టిపడేస్తున్నాయి. నాని, మృణాల్ ఠాకూర్ అద్భుతమైన కెమిస్ట్రీతో విజువల్స్ మరింత ఆకర్షణీయంగా ఉన్నాయి. నూతన దర్శకుడు శౌర్యువ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని వైర ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై మోహన్ చెరుకూరి, డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాలో బేబీ కియారా ఖన్నా కీలక పాత్ర పోషిస్తోంది. డిసెంబర్ 21న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.



నాని

మౌత్‌టాక్ వల్లే ఈ బ్లాక్‌బస్టర్ సాధ్యమైంది



నవీన్ పొలిశెట్టి, అనుష్క శెట్టి జంటగా నటించిన చిత్రం 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి'. ఈ సినిమా రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు యూఎస్‌లోనూ మంచి వసూళ్ల సాధిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర బ్లాక్‌బస్టర్ సెలబ్రేషన్స్ హైదరాబాద్‌లో ఘనంగా జరిగాయి.

ఈ సందర్భంగా డైరెక్టర్ మహేశ్ బాబు.పి. మాట్లా డుతూ, 'సినిమా బాగుందనే మౌత్ టాక్‌తో మా సినిమాకు ఇంత పెద్ద సక్సెస్ ఇచ్చిన ఆడియెన్స్‌కు థ్యాంక్స్. నాకు వచ్చిన ఐడియాను నవీన్, యూవీ, అనుష్క నమ్మకుంటే ఈ సినిమా రూపొంది, ఇంత సక్సెస్ అయ్యేది కాదు' అని తెలిపారు.


'అనేక ఇబ్బందుల మధ్య మాకు ఇంత పెద్ద హిట్ ఇచ్చిన తెలుగు ప్రేక్షకులకు థ్యాంక్స్. మంచి సినిమా అనే వర్డ్ ఆఫ్ మౌత్‌తోనే ఇది సాధ్యమైంది. అనుష్కతో కలిసి నటించడం హ్యాపీ ఎక్స్‌పీరియన్స్. ఇవాళ మా పెయిర్ మధ్య కెమిస్ట్రీ బాగుందని, మంచి లవ్ స్టోరీ చూపించారని ప్రశంసలు వస్తున్నాయి. చిరంజీవి సినిమా హిట్ అవుతుందని చెప్పారు. ఆయన చెప్పినట్లే రిజల్ట్ వచ్చింది' అని హీరో నవీన్ పోలిశెట్టి అన్నారు.

డైరెక్టర్ బుచ్చిబాబు మాట్లాడుతూ,'యూవీ సంస్థకు హిట్ రావడం సంతోషంగా ఉంది. నవీన్ ఇంకా ఇలాంటి మరెన్నో హిట్ మూవీస్ చేయాలని కోరుకుంటున్నా' అని చెప్పారు.

"జాతి రత్నాలు' సినిమా టైమ్‌లో నాకు డైరెక్టర్ మహేశ్ ఈ కథ చెప్పాడు. అప్పటి నుంచి ఈ స్టోరీ మీద వర్క్ చేస్తూనే ఉన్నాడు. నవీన్ కామెడీ మాత్రమే చేస్తాడని అనుకుంటారు కానీ ఈ సినిమాలో ఎమోషనల్ కంటెంట్ కూడా అంతే బాగా చేయ గలిగాడు' అని డైరెక్టర్ అనుదీప్ కేవీ అన్నారు.

డైరెక్టర్ నాగ్ అశ్విన్ మాట్లాడుతూ, 'కామెడీ మాత్రమే నవీన్ స్ట్రెంత్ అనుకుంటాం. కానీ అతను యాక్షన్, విలన్, కామెడీ, ఎమోషన్ ఏదైనా చేయ గలడు. అలాంటి వర్సటైల్ రోల్స్ మరిన్ని చేయాలని కోరుకుంటున్నా. ఈ సినిమాలో ఎమోషన్ సీన్స్‌తో కొన్నిసార్లు ఏడిపించాడు. నవీన్‌ను చూస్తుంటే గర్వంగా ఉంటుంది. ఈ సినిమాని ఫ్యామిలీతో చూశా. అందరం ఎంజాయ్ చేశాం' అని అన్నారు. 'ఒక కొత్త పాయింట్‌తో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చేయడం మాములు విషయం కాదు. ఇదొక మంచి మూవీ. ఆదరిస్తున్న ప్రేక్షకులందరికీ థ్యాంక్స్' అని డైరెక్టర్ మారుతి అన్నారు.

ఇక అన్ని జాతర్లలోనూ ఈ పాటే..



దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల తెరకెక్కిస్తున్న రూరల్ న్యూ ఏజ్ పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ 'పెదకాపు-1'. ఇంటెన్స్ , గ్రిప్పింగ్ ట్రైలర్ సినిమాపై అంచనాలని పెంచింది. ఫస్ట్ సింగిల్- రొమాంటిక్ మెలోడీ సంచలనంగా మారింది. మ్యూజికల్ ప్రమోషన్‌లలో భాగంగా మేకర్స్ సెకెండ్ సింగిల్- జాతర పాటని విడుదల చేశారు. 'మిక్కీ జె మేయర్ స్వరపరిచిన పాట భారీ డ్రమ్ సౌండ్‌లతో సంప్రదాయ బీట్స్‌తో ఆకట్టుకుంది. టెంపుల్ బ్యాక్‌డ్రాప్‌లో, సంప్రదాయ దుస్తులలో ఉన్న వ్యక్తులతో జాతర వాతావరణం నిండుగా కనిపించింది. అనురాగ్ కులకర్ణి తన పవర్ ఫుల్ వాయిస్‌తో మరింత ఉత్సాహాన్ని నింపాడు. సాయి చరణ్, హైమత్ కోరస్ అదనపు ఎనర్జీ జోడించింది. కళ్యాణచక్రవర్తి త్రిపురనేని అద్భుతమైన సాహిత్యంతో అమ్మవారి పరాక్రమాన్ని వర్ణించారు.రాజు సుందరం కొరియోగ్రఫీ విజువల్స్‌కు మరింత అందం జోడించింది. విరాట్ కర్ణ కొన్ని వండర్ ఫుల్ డ్యాన్స్ మూమెంట్స్ చేశారు. పాటలో ఇంటెన్స్‌గా కనిపించాడు. ఈ పాట ఇన్‌స్టంట్‌గా హిట్ అయ్యింది. అంతేకాదు ఇకపై అన్ని జాతర ఉత్సవాల్లో ప్లే అవుతుంది. ఈనెల 29న ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది' అని చిత్ర యూనిట్ తెలిపింది.

ఆద్యంతం వైవిధ్య భరితం



మిలియన్ల మంది ఫాలోవర్లను కలిగిన పాపులర్ యూట్యూబర్, ఫిలాంత్రోపిస్ట్ హర్ష సాయి పాన్ ఇండియా స్థాయిలో రూపొందు తున్న చిత్రంతో బిగ్ స్క్రీన్‌లోకి అడుగు పెడుతున్నారు. హర్ష సాయి స్వయంగా రచన, దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని శ్రీ పిక్చర్స్ బ్యానర్‌పై మిత్ర నిర్మించారు.

ఈ సినిమాలో మిత్ర హీరోయిన్‌గా కూడా నటిస్తున్నారు. కల్వకుంట్ల వంశీధర్‌రావు సమర్పిస్తున్న ఈ చిత్రానికి పడవల బాలచంద్ర సహ నిర్మాత.

ఆదివారం చిత్ర యూనిట్ నిర్వహించిన గ్రాండ్ ఈవెంట్‌లో టీజర్ ద్వారా సినిమా టైటిల్‌ను అనౌన్స్ చేశారు మేకర్స్. పాన్ ఇండియా స్థాయిలో భారీగా రూపొందుతున్న ఈ చిత్రానికి 'మెగా' అనే పవర్ ఫుల్ టైటిల్ పెట్టారు. లో డాన్ అనేది ట్యాగ్‌లైన్. ఈ సందర్భంగా నిర్మాత మిత్ర మాట్లాడుతూ, 'చిన్న ఆలోచనగా మొదలైన ఈ ప్రాజెక్ట్ చాలా భారీస్థాయిలోకి వెళ్ళింది. చాలా మంచి టెక్నికల్ టీం పని చేస్తోంది. మీ రియల్ హీరో హర్ష సాయిని రీల్ హీరోగా ప్రెజెంట్ చేయడం శ్రీ పిక్చర్స్‌కు దక్కిన అదృష్టం. ఈ సినిమాతో అతను మీ మనసుల్ని గెలుచుకోవాలని కోరుకుంటున్నాను' అని చెప్పారు. హీరో, దర్శకుడు హర్ష సాయి మాట్లాడుతూ, 'టైటిల్, టీజర్ మీ అందరికీ నచ్చిందని ఆశిస్తున్నాను. మంచి టెక్నికల్ టీంతో ఈ సినిమా చేస్తున్నాం. కార్తీక్ పళని సినిమాటోగ్రఫీ, అంజి మాస్టర్ ఫైట్స్ అద్భుతంగా ఉంటాయి' అని తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

వేదిక

నవతెలంగాణ
www.navatelangana.com

ఉదయనిధి స్టాలిన్‌లు ఊరికోకరు కావాలి...

ఈ మధ్య కాలంలో తమిళనాడు ముఖ్యమంత్రి కుమారుడు యువజన, క్రీడలశాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మంపై చేసిన వ్యాఖ్యలపై చర్చ జరుగుతోంది. ఈ వ్యాఖ్యలకు ప్రతీకగా స్వాములు, బీజేపీ నాయకులు అతని తలను తెస్తే కోట్ల రూపాయల నజరానా అని ప్రకటించారు. అతను అలా అనాల్సిన సందర్భం ఎందుకొచ్చింది? దాని నేపథ్యమేంటనేది తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. సనాతన పూర్వపరాలు ఒకసారి పరిశీలనచేస్తే అది భారతీయ పురాతన ధర్మమని, చాలా పవిత్రమైందని, అది ప్రపంచంలో గొప్ప పేరుగాంచిందని, కొంతమంది విశ్వాసుల నమ్మకం. సనాతన ధర్మం అనేది నాలుగు వర్ణాలపై ఏర్పడింది. అవి ముఖ్యంగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర. బ్రాహ్మణులు బ్రహ్మ తలకాయ నుండి పుట్టారని, వీరు దేవుని కంటే గొప్పవారని, దేవునికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటారని, అలాగే క్షత్రియులు రాజ్యాన్ని రక్షించడానికి కాపలాదారులని వీరు బహువులలో నుండి పుట్టారని, వైశ్యులు బ్రహ్మ తొడలలో నుండి పుట్టారని వీరు వర్తక, వ్యాపారం చేస్తారని చివరగా శూద్రజాతి వారు వీరు బ్రహ్మ పాదాల నుండి పుట్టారని వీరు పై మూడు కులాల వారికి సేవచేయలని సనాతన ధర్మం చెబుతోంది. ఇందులో భాగంగానే మనువు రాసిన మనుస్మృతి నాలుగు వర్ణ ధర్మాలను గైడ్ చేస్తూ ఎవరు ఏ పని చేయాలని ఆ పని విభాగాలను సూచిస్తుంది. పై మూడు వర్ణాలను ఉన్నతంగా తీర్చిదిద్ది నాలుగో వర్ణం కాడికి రాగానే తన అసలు రంగు బయటపెట్టింది. ఈ శూద్ర జాతిలో పంచములు అని కూడా విభజన చేసింది. ప్రస్తుతం మన దేశంలో నూటికి ఎనభైశాతంగా ఉన్న ప్రజలు బీసీ, ఎస్సీ, ఎస్టీలందరూ అందరూ శూద్ర జాతి వారే. సనాతన ధర్మం అనేది నిచ్చెనమెట్ల కుల వ్యవస్థలో భాగమైందని అందులో ఉండే మెజార్టీ ప్రజలను జంతువుల కంటే హీనంగా చూస్తారని ఉదయనిధి స్టాలిన్ అభిప్రాయం కావచ్చు.


ఉదయకుమార్
9553460621

శూద్ర జాతి ప్రజలను గుళ్లలోకి రానియక పోవడం, శ్లోకాలు చదివితే నాలుకలు తెగ్గోయడం, శ్లోకాలు వింటే చెవులల్లో సీసాలు పోసి చంపడం, మెడలో గంట కట్టి వీరు వస్తున్నప్పుడు ఆ గంట శబ్దం వినబడే క్రమంలో పై వర్ణంలో వాళ్ల ఇండ్లల్లోకి వెళ్లడం శుద్రజాతి వారి గాలి తగిలితే మైల పడుతుందని సనాతన ధర్మం చెబుతున్నది. ముందట లొట్టి, వెనుక కమ్మగట్టడం అత్యంత నీచమైన వృత్తులను చేయించడం, ఈ శుద్రజాతి వారందరినీ ఊరికి అవతల ఉంచడం, వీరితో పాటు స్త్రీలను అత్యంత అవమానకరమైన రీతిలో వంటకు, ఇంటికి పిల్లల ఉత్పత్తి సరుకుగానే తమ స్వేచ్ఛను, స్వాతంత్ర్యాన్ని నిర్బంధించి వారు భర్తకు సేవకురాలుగానే ఉండాలనివారి వల్ల ఈ సమాజం చెడిపోతుందని ఆ ధర్మం చెబుతోంది. వారు చంచల స్వభావులనీ, నీచ మనస్తత్వం కలిగిన వాళ్ళని, అధిక కామోద్రేకంతో ఉంటారని వారిపై ఒక వికృతమైన రాతలు రాసి స్త్రీలను మానసిక ఎదుగుదల లేకుండా అత్యంత దుర్భర పరిస్థితిలోకి నెట్టిన సందర్భాలు మనుధర్మ శాస్త్రంలో ఎన్నో ఉన్నాయి. సతీసహగమనం అనేది భర్త చనిపోతే భార్య కూడా చితిలో భర్తతో పాటు కాలిపోవాలని నీచమైనటువంటి ఆచారం మనధర్మం లోనిది. మనుధర్మంలో ఎవరైనా శుద్ర జాతి వారు దొంగతనం చేస్తే ఒక మలమల మసిలే నూనెలో ఒక రింగు వేసి ఆ రింగును చేయి కాలకుండా తీస్తే అతను దొంగ కాదని తేల్చేస్తారు అగ్రవర్ణాల వాళ్ళు. ఒకవేళ చేయి కాలితే అతను దొంగ అని చెపుతారు. అదేవిధంగా దొంగతనం చేశాడా లేదా అని తెలుసుకోవడానికి ఒక చిన్న రూమ్‌లో నాగుపాములను వేసి అందులో ఉంచుతారు. పాములు కరిస్తే దొంగ అని కరవకపోతే దొంగ కాదని తేలుస్తారు. ఇటువంటి మూర్ఖమైన చట్టాలను మరుధర్మశాస్త్రంలోనివే ప్రధానంగా ఇప్పుడు స్త్రీలు ఎదుర్కొంటున్నటువంటి సామాజిక సమస్యలు లైంగిక దాడులు, దోపిడీ, హింస, పీడన, అనేక రకాల సమస్యలకు మూలాలు మనుధర్మ శాస్త్రంలోనివే అనడానికి ప్రత్యేకమైనటువంటి సాక్ష్యాలుగా మనం చెప్పొచ్చు. శూద్రజాతి వ్యక్తి అగ్రవర్ణ అమ్మాయిని ప్రేమిస్తే అతని మర్మాంగాన్ని కోసేయడం, తలను తీసేయడం ధర్మశాస్త్రంలోనివే.



ఈ దుర్మార్గపు విధానాలన్నీ సనాతన ధర్మంలో ఉన్నాయి కనుక ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలు చారిత్రక నేపథ్యంతో వచ్చినవే. ఈ చట్టాలను మొదలు చార్వాకులు లోకాయుత్తులు బుద్ధుడు, సంత్ రవిదాస్, కబీర్దాస్, జ్యోతిరావు పూలే, సాహు మహారాజ్, బాబా సాహెబ్ అంబేద్కర్, నారాయణ గురు, అయ్యాంకాళి, పెరియార్ నాయక్, కరుణానిధి, ఇంకా ఎందరో మహానుభావులు సనాతన ధర్మంలో ఉండే అసమాన వ్యవస్థను తిరస్కరిస్తూ నూతన సమాజం కోసం తమ జీవితాలను ధారపోశారు. అటువంటి ప్రభావ స్ఫూర్తితో ఉదయనిధి స్టాలిన్ ఆవ్యాఖ్యలు చేయడం మంచి విషయలే. పైన చెప్పిన మహానుభావులంతా దోపిడీ, పీడన, కుల ఆధిపత్యం లేని నూతన సమాజం సమానత్వంగా ఉండాలని ప్రకటించారు. కానీ ప్రస్తుత బీజేపీ పాలకులు గద్దెనెక్కిన తర్వాత మతోన్మాదాన్ని, కులోన్మాదాన్ని పెంచి పోషిస్తూ తమ రాజకీయ అస్తిత్వం ద్వారా పాలన కొనసాగిస్తున్న విధానం మనం చూస్తున్నాం. ప్రశ్నిస్తే దేశద్రోహులని, ముస్లింలంతా పరాయి దేశాలకు వెళ్లిపోవాలని, బుల్డోజర్లు పెట్టి ఇండ్లు కులగొట్టడం, కరోనా విపత్తు సంభవిస్తే మూఢనమ్మకాలు పెంచి పోషించడం, దళితులపై అత్యంత పాశవికంగా రేప్ చేసి హత్యచేయడం లాంటి ఘటనలు నిత్యకృత్యంగా మారాయి. తినే తిండి మీద, కట్టుకునే బట్ట మీద, మాట్లాడే స్వేచ్ఛ మీద, నిర్బంధాన్ని ప్రయోగిస్తూ దేశద్రోహపు చట్టాలు ఉపయోగించి భావ ప్రకటన స్వేచ్ఛను నిర్బంధిస్తున్న సందర్భాలు మనం చూస్తున్నాం. మణిపూర్ రాష్ట్రంలో 70రోజులుగా జరుగుతున్న హింసోన్మాదం, దాని వెనుక ఉన్న మతోన్మాదం ఏ రకంగా పెంచి పోషించబడుతున్న దాని ప్రత్యేకమైన సాక్ష్యం ఆ రాష్ట్రంలో ఇద్దరు మహిళలని నగ్నంగా ఊరేగించడం. అలాగే హర్యానా రాష్ట్రంలో మత ఘర్షణలు చూసాం. మతోన్మాదాన్ని పెంచి పోషిస్తూ మానవత్వాన్ని చంపేస్తూ మనుషుల మధ్య విభజన చేస్తూ మత రాజకీయం చేస్తున్నటువంటి విధానాలు ప్రస్తుత బీజేపీ పాలనలో కోకొల్లలు. వీరు అధికారంలోకి వచ్చిన తర్వాత సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని, ఇంటికి రూ.15లక్షలు తెచ్చి ఇస్తామని, దేశంలో సుస్థిర పాలన తీసుకొచ్చి దేశ ప్రజలకు సంక్షేమం, భద్రత ఇస్తామని గొప్ప ప్రగల్భాలు పలికారు. కానీ వీళ్ల గాంధీలను చంపిన గాడ్సేలను మొక్కడం, రాష్ట్రపతి ముర్ము, లాంటి వారిని నూతన పార్లమెంట్ ప్రారంభోత్సవానికి పిలవకపోవడం కనిపిస్తున్నవే.

ముఖ్యంగా నర హంతకులే దేశ అధినేతలై పాలిస్తున్న కాలంలో మనం బతుకుతున్నాం. ప్రియమైన ఈ దేశ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్న సందర్భమిది. ఉదయనిది స్టాలిన్ వ్యాఖ్యలు సమాజంలో మనుషులందరూ సమానంగా ఉండాలని కుల, మత రహిత, సమాజంగా మనిషిని మనిషి ప్రేమించే ఉన్నత సమాజం కావాలనే ఒక గొప్ప మార్గదర్శకత్వం లోనివే. అటువంటి వ్యాఖ్యలు కోట్లాదిమంది ప్రజల హృదయాల్లో ప్రభావంతంగా బయటికి రావాలి. ఈ బుల్డోజర్ సంస్కృతి కలిగిన బీజేపీ మతోన్మాదానికి వ్యతిరేకంగా అందరూ ఐక్యమత్యమే మహాబలంగా ఏర్పడాలి. భారత రాజ్యాంగాన్ని కాపాడుకుంటూ ఆ రాజ్యాంగంలో ఉండేటువంటి ప్రతి హక్కు ద్వారా కాషాయపు ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు ప్రశ్నించాలి. ప్రజా సంక్షేమం,ప్రజా భద్రత ప్రజా సమానత్వాన్ని ఒక ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా మనం కూడగట్టకపోతే జర్మనీలో హిట్లర్ ఎలాగైతే అతని విధానాల ద్వారా కోట్లాదిమంది మరణాలకు కారకుడయ్యాడో మన దేశం కూడా అటువంటి దుస్థితికి రావడానికి అవకాశం లేకపోలేదు. ఈ దేశంలో ప్రగతిశీల, శాస్త్రీయ భావజాలం కలిగిన నాయకులు, విద్యార్థులు, మేధావు లంతా సమాజాన్ని నిత్యం చైతన్యపరిచే దిశగా కృషి చేయాలి. దేశాన్ని సనాతన ధర్మం వైపు నెడుతున్న మతోన్మాదులను, కులోన్మాదులకు వ్యతిరేకంగా పోరు సల్పాలి. లక్షలాదిమంది ఉదయనిది స్టాలిన్‌లుగా పుట్టుకొచ్చి రాబోయే ఎన్నికలలో ఓటు ద్వారా బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి.

కామ్రేడ్ సునీల్ మైత్రా అమర్‌రహే!

ఇన్సూరెన్స్ ఉద్యోగుల ప్రియతమ నాయకుడు కామ్రేడ్ సునీల్‌మైత్రా వర్ధంతిని ప్రతియేటా సెప్టెంబర్ 18న దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆయన భౌతికంగా దూరమై ఈ ఏడాదికి 27 సంవత్సరాలు కావస్తున్నా బీమా ఉద్యోగులకు ఆయన చేసిన సేవలు ప్రతి ఒక్కరికీ నిత్యం గుర్తుండేవే. ఇన్సూరెన్స్ ఉద్యోగుల సంఘం, ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎఐఐఇఎ) నాయకుడిగా ప్రారంభమైన ఉద్యమ ప్రస్థానం, పశ్చిమ బెంగాల్ లెఫ్ట్ ఫ్రంట్ బలపరిచిన సీపీఐ(ఎం) పార్లమెంట్ సభ్యునిగా కలకత్తా నార్త్ ఈస్ట్ నియోజక వర్గం నుండి ఎన్నికల బరిలో నిలిచి గెలిచి విజయం సాధించారు. పార్లమెంట్ 7వ లోక్‌సభలో రెండుసార్లు పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించే స్థాయివరకు చేరిన కామ్రేడ్ సునీల్ మైత్రా ఉద్యమ ప్రస్థానానికి, సైద్ధాంతిక నిబద్ధతకు జోహార్లు.


జి. కిషోర్ కుమార్
9440905501

పశ్చిమ బెంగాల్ నాదియా జిల్లా కృష్ణనగర్‌లో 1927లో జన్మించిన సునీల్‌మైత్రా చిన్న వయస్సులోనే స్వాతంత్ర్యోద్యమంవైపు ఆకర్షితులై, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న కారణంగా అరెస్ట్ అయ్యి ఒక ఏడాదిపాటు జైలు జీవితాన్ని అనుభవించారు. 1946లో హిందుస్తాన్ కో-ఆపరేటివ్ ఇన్సూరెన్స్ కంపెనీలో ఉద్యోగంలో చేరిన నాటినుండి బెంగాల్ నందు ఇన్సూరెన్స్ ఉద్యోగులను ట్రేడ్ యూనియన్ కార్యక్రమాలలో పాల్గొనేలా నిర్మాణాత్మకంగా చైతన్య పరిచినందుకుగాను, ఆనాటి ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపెనీ యాజమాన్యం సునీల్ మైత్రాను మొదట కోయంబత్తూర్‌కు అనంతరం నాగపూర్‌కు బదిలీ చేసింది. యాజమాన్యం బలవంతపు బదిలీలకు భయపడకుండా శిక్షలను, అవమానాలను, వేధింపులను ఎదుర్కొని సవాళ్ళను అవకాశాలుగా మలుచుకుని బదిలీ అయిన ప్రతిచోటా యూనియన్‌ను చైతన్యవంతంగా నిర్మించారు. 1951లో ఆవిర్భవించిన ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎఐఐఇఎ) వ్యవస్థాప కులలో ముఖ్యులుగా ఉండి, ముందుపీఠిన నిలబడి యూనియన్‌ను నిర్మాణాత్మకంగా తీర్చిదిద్దారు. కలకత్తా డివిజన్‌కు ప్రధాన కార్యదర్శిగా, ఈస్టర్న్ జోన్ యూనిట్‌కు జనరల్ సెక్రటరీగా, ఎఐఐఇఎకు అఖిల భారత సహాయ కార్యదర్శిగా, ఉపాధ్యక్షునిగా దక్షతతో బాధ్యతలు నిర్వహించారు. బెంగాలీ, ఆంగ్ల భాషల మీద మంచి పట్టువున్న సునీల్ మైత్రా పరిణతితో కూడిన ఆలోచనతో, భవిష్యత్ దార్శనికతో దిశానిర్దేశం చేసే ప్రసంగాలు ఆసాంతం ఉద్యోగులను ఆకర్షించేవి. భవిష్యత్ ఉపాధి అవకాశాలను దెబ్బతీసే ఆటోమేషన్‌కు వ్యతిరేకంగా జరిగిన చారిత్రాత్మక పోరాట సంక్లిష్ట సమయంలో, కలకత్తా ఎల్ఐసీ కార్యాలయంలో సూపర్ కంప్యూటర్ ప్రవేశాన్ని నిలువరించే మహోద్యమ నేపథ్యంలో పరిణతితో కూడిన ఆలోచనతో సంక్షోభ సమయంలో యూనియన్‌ను సైద్ధాంతిక ప్రాతిపదికతో ముందుకు నడిపిన సుశిక్షిత కార్మికోద్యమ సైనికుడాయన.

సునీల్ మైత్రా ఉద్యమపథం కేవలం ఇన్సూరెన్స్ ఉద్యోగుల ఉద్యమానికే పరిమితం కాదు. విశాల కార్మికోద్యమ నిర్మాణంలో ఐక్య ఉద్యమ, సంఘీభావ కార్యాచరణలో సునీల్ మైత్రా భాగస్వాములయ్యారు. 1952లోనే అప్పటి అవిభక్త కమ్యూనిస్ట్ పార్టీలో చేరారు. 1964లో కమ్యూనిస్ట్ పార్టీలో ఏర్పడిన చీలిక అనంతరం సీపీఐ(ఎం)లో ఉండి అనేక క్రియాశీలక బాధ్యతలను నిర్వహించారు. రిటైర్‌మెంట్‌కు ఏడేండ్లకు ముందుగానే ఉద్యోగానికి రాజీనామా చేశారు. 1980లో కలకత్తా నార్త్ ఈస్ట్ పార్లమెంటరీ నియోజక వర్గం నుండి లెఫ్ట్‌ఫ్రంట్ బల పరిచిన సిపిఐ(ఎం) అభ్యర్థిగా ఎన్నికలలో పోటీచేసి పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికై ప్రజలకు సేవలందించారు. 1980-84 మధ్య సమయంలో అప్పటి 7వ లోక్‌సభలో, ఎల్ఐసిని ఐదు ప్రాంతీయ కార్పొరేషన్లుగా విభజించాలనే బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. ఎల్ఐసి విభజన బిల్లుకు సంబంధించి అధ్యయనం చేయడానికి ఏర్పాటుచేసిన జాయింట్ పార్లమెంటరీ కమిటీలో సభ్యునిగా ఉన్న సునీల్ మైత్రా తన అద్భుతమైన వాదనలతో ఈ బిల్లును ప్రతిఘటించారు. ఇందిరా గాంధీ హత్యానంతరం 7వ లోక్‌సభ రద్దయి 8వ లోక్‌సభ కొలువుతీరి రాజీవ్‌గాంధీ ప్రధాని అయిన నేపథ్యంలో, సునీల్ మైత్రా ఆనాటి ప్రధానమంత్రి రాజీవ్ గాంధీకి, ఎల్ఐసిను ఐదు రీజినల్ కార్పొరేషన్లుగా విభజన చేయాలని ప్రతిపాదించిన బిల్లువలన కలిగే అనర్థాలను లేఖ రాశారు. అందులో దీనివలన ఖర్చులు పెరుగుతాయని యాక్చురియల్, వివిధ ప్రొఫెషనల్ సంస్థలు ఇచ్చిన నివేదికలను, పెరుగుతున్న ప్రాంతీయ వాద పోకడల ప్రమాదాన్ని వివరిస్తూ, ఎల్ఐసి విభజన బిల్లును ఉపసంహరించుకోవాలని కోరారు.



రాజ్యాంగం ప్రసాదించిన హక్కులపై ముప్పేట దాడి జరుగుతున్న నేటి తరుణంలో వాటిలో అంతర్భాగమైన ట్రేడ్ యూనియన్ హక్కులను కాపాడుకోవడం, ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణే ప్రభుత్వ విధానంగా కొనసాగుతున్న ప్రస్తుత నేపథ్యంలో జాతీయ ఇన్సూరెన్స్ రంగాన్ని పరిరక్షించుకోవడం, అందుకు అవసరమైన సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావటమే ఇన్సూరెన్స్ ఉద్యోగులు సునీల్ మైత్రాకు అర్పించే నిజమైన నివాళి!

ఆనాటి ప్రధాని 7వ లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఎల్ఐసి విభజన బిల్లును ప్రభుత్వం పునఃపరిశీలించిందని, ఎల్ఐసిని ఐదు ముక్కలుగా చేసే ఈ బిల్లును ముందుకు తీసువెళ్ళబోమని హామీనిచ్చారు. 7వ లోక్‌సభలో ఎల్ఐసి విభజన బిల్లును ప్రవేశపెట్టారని, ఆసభ రద్దు అయ్యిందని, 8వ లోక్‌సభలో ఎల్ఐసి విభజన బిల్లును ప్రవేశపెట్ట బోమని ప్రధాని రాజీవ్‌గాంధీ రాతపూర్వకంగా సునీల్ మైత్రాకు తెలియజేశారు. నేడు ఎల్ఐసి దేశం గర్వించే అతిపెద్ద ప్రభుత్వరంగ ఆర్థిక సంస్థగా రూపొందడానికి ఇటువంటి పోరాటాలే ప్రాతిపదిక అనేది నిర్వివాదాంశం. 1992లో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులుగా బాధ్యతలు చేపట్టారు. పార్టీ సైద్ధాంతిక వార పత్రిక 'పీపుల్స్ డెమోక్రసీ'కి ఎడిటర్‌గా కూడా వ్యవహరించారు. ఆయన సతీమణి కామ్రేడ్ నీలిమా మైత్రా కూడా విశాల కార్మికోద్యమంలో భాగస్వాములై అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్‌కు అఖిలభారత స్థాయిలో నాయకత్వం వహించటం అభినందనీయం. అద్భుతమైన నిర్వహణాదక్షుడిగా, పోరాట కార్యాచరణ సంధానకర్తగా, ఉద్యమకారుడిగా, చర్చల సందర్భంగా నైపుణ్యం ప్రదర్శించే నాయకుడిగా, కార్మికోద్యమ విజయాలకు వ్యూహకర్తగా, విశాల కార్మికవర్గ పక్షపాతిగా, ఇన్సూరెన్స్ ఉద్యోగుల హృదయాలలో చిరస్మర ణీయులుగా నిలిచిన కామ్రేడ్ సునీల్ మైత్రాకు 27వ వర్ధంతి సందర్భంగా అరుణాంజలి!

రాజ్యాంగం ప్రసాదించిన హక్కులపై ముప్పేట దాడి జరుగుతున్న నేటి తరుణంలో వాటిలో అంతర్భాగమైన ట్రేడ్ యూనియన్ హక్కులను కాపాడుకోవడం, ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణే ప్రభుత్వ విధానంగా కొనసాగుతున్న ప్రస్తుత నేపథ్యంలో జాతీయ ఇన్సూరెన్స్ రంగాన్ని పరిరక్షించుకోవడం, అందుకు అవసరమైన సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావటమే ఇన్సూరెన్స్ ఉద్యోగులు సునీల్ మైత్రాకు అర్పించే నిజమైన నివాళి!

తొలి సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎవరు..?

1.1773 చట్టం ప్రకారం బెంగాల్ గవర్నర్ జనరల్‌కు సహాయసహకారాలు అందించడానికి కొంత మంది సభ్యులతో కూడిన కార్యనిర్వాహక మండలిని ఏర్పాటు చేశారు. అయితే క్రింది వాటిలో మండలి సభ్యులను గుర్తించండి.

ఎ. బార్‌వెల్ బి. చాంబర్లిన్
సి. క్లావరింగ్ డి. ఫిలిప్ ఫ్రాన్సిస్
1. బి,ఎ,డి 2. ఎ,సి,డి
3. సి,డి,బి 4. ఎ,బి,సి,డి

2. క్రింది ఏ చట్టం ప్రకారం భారతదేశంలో వ్యాపారం చేసే ఈస్టిండియా కంపెనీ గుత్తాధిపత్యాన్ని రద్దు చేసి కేవలం పరిపాలన సంస్థగా మార్చారు.

1. 1858 చార్టర్ చట్టం 2. 1883 చార్టర్ చట్టం
3. 1813 చార్టర్ చట్టం 4. పై ఏది కాదు.

3. 1861 భారత కౌన్సిల్ చట్టం ప్రకారం అత్యవసర పరిస్థితుల్లో వైశ్రాయ్‌కి ఆర్డినెన్సులు జారీ చేసే అధికారం కల్పించారు. అయితే ఈ ఆర్డినెన్సుల కాల పరిమితి ఎంత?

1. 1 నెల 2. 14 రోజులు
3. 6 నెలలు 4. 3 నెలలు

4. భారతదేశంలో క్రింది ఏ చట్టం ద్వారా పరోక్ష ఎన్నిక ప్రవేశపెట్టారు?

1. 1909 కౌన్సిల్ చట్టం
2. 1935 భారత ప్రభుత్వ చట్టం
3. 1892 కౌన్సిల్ చట్టం
4. 1919 భారత ప్రభుత్వ చట్టం

5.క్రింది ఏ చట్టం ప్రకారం భారతదేశంలో తొలిసారిగా రాష్ట్రములకు స్వతంత్ర్య ప్రతిపత్తిని అందించారు?

1. 1935 భారత ప్రభుత్వ చట్టం
2. 1919 భారత ప్రభుత్వ చట్టం
3. 1947 భారత ప్రభుత్వ చట్టం
4. 1858 భారత ప్రభుత్వ చట్టం

6. భారత ప్రభుత్వ చట్టం 1935 ప్రకారం క్రింది వాక్యాలను పరిశీలించుము.

ఎ. రాష్ట్రములలో ద్విసభ విధానాన్ని ప్రవేశపెట్టారు.
బి. కేంద్ర బడ్జెట్ నుండి రాష్ట్ర బడ్జెట్ ను వేరు చేశారు.
సి. కేంద్రంలో తొలిసారిగా ద్వంద్వ ప్రభుత్వ విధానాన్ని ప్రవేశపెట్టారు.
డి. భారత రాజ్యాంగానికి నకలు / మాతృక అంటారు.
పై వాక్యాలలో సరైనది / సరైనవి గుర్తించండి.
1. ఎ,బి,సి 2. బి,సి,డి
3. ఎ,సి,డి 4. ఎ,బి,సి,డి

7. 1813 చార్టర్ చట్టం సంబంధించి క్రింది వాక్యాలలో సరైనది గుర్తించండి.

1. క్రిష్టియన్ మిషనరీల రాకను ఆహ్వానించింది.
2. విద్యా వ్యాప్తికి సం.నకు ఒక లక్ష రూ. కేటాయించారు.
3. 1,2 4. ఏది కాదు.

8. బెంగాల్ గవర్నర్ జనరల్ అనే పదవిని రద్దు చేసి ఆ పదవీ స్థానంలో 'భారతదేశ గవర్నర్ జనరల్' అనే పదవిని ఏ చట్టం ద్వారా ఏర్పాటు చేశారు?

1. 1833 చార్టర్ చట్టం 2. 1773 రెగ్యులేటింగ్ చట్టం
3. 1813 చార్టర్ చట్టం 4. 1853 చార్టర్ చట్టం

9.స్వతంత్ర భారతదేశానికి మొదటి లా కమీషన్ చైర్మన్ ఎవరు?

1. గజేంద్ర గట్కర్ 2. యం.సి.సెటల్వాడ్
3. జె.ఎల్. కపూర్ 4. లార్డ్ మెకాలే

10. భారత ప్రభుత్వ చట్టం 1935 అనేది బానిసత్వానికి నూతన పత్రం అని విమర్శించినవారు.

1.నెహ్రూ 2. సుభాష్‌చంద్రబోస్
3. గాంధీ 4. జిన్నా

11. నవంబరు 26ను న్యాయ దినోత్సవానికి బదులుగా రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఏ సం.లో ప్రకటించింది?

1. 2010 2. 2005
3. 2015 4. 2012



12. జతపరుచుము.

ఎ. అట్లీ ప్రకటన	1. 1946
బి. క్యాబినెట్ మిషన్	2. 1942
సి. క్రిప్స్ రాయబారం	3. 1947
డి. లా కమీషన్	4. 1833

1. ఎ3,బి4,సి2,డి1 2. ఎ1,బి2,సి3,డి4
3. ఎ3,బి1,సి4,డి2 4. ఎ3,బి1,సి2,డి4

13. క్రింది వాటిలో సరైనవి గుర్తించండి.

1. దేశం స్వాతంత్ర్యం పొందిన సమయంలో బ్రిటన్ రాజు కింగ్ జార్జి (4)
2. హైదరాబాదు పోలీసు చర్య ద్వారా భారత్‌లో విలీనం.
3. ట్రావెంకోర్ ప్లెబిసైట్ ద్వారా భారత్‌లో విలీనం.
4. 1 మరియు 2

14. గవర్నర్ జనరల్ కార్య నిర్వాహక మండలిలో న్యాయసభ్యుడిగా చేరిన తొలి భారతీయుడు ఎవరు?

1. ఫిరోజ్ షా మెహతా 2. సురేంద్రనాథ్ బెనర్జీ
3. సత్యేంద్ర ప్రసాద్ సిన్హా 4. దాదాబాయ్ నౌరోజీ

15. క్రింది ఏ చట్టం ప్రకారం కేంద్ర శాసన నిర్మాణ శాఖను ఇంపీరియల్ లెజిస్లేచర్ అని పిలిచారు?

1. 1909 భారత కౌన్సిల్ చట్టం
2. 1919 భారత కౌన్సిల్ చట్టం
3. 1861 భారత కౌన్సిల్ చట్టం
4. 1892 భారత కౌన్సిల్ చట్టం

16. జతపరుచుము.

ఎ. మొదటి గవర్నర్ జనరల్	1. వారెన్ హేస్టింగ్స్
బి. మొదటి లా కమీషన్ చైర్మన్	2. సర్ చార్లెస్ వుడ్
సి. మొదటి బెంగాల్ గవర్నర్ జనరల్	3. విలియం బెంటింగ్
డి. మొదటి భారత రాజ్యకార్యదర్శి	4. లార్డ్ మెకాలే

1. ఎ3,బి4,సి2,డి1 2. ఎ4,బి2,సి1,డి3
3. ఎ1,బి2,సి3,డి4 4. ఎ3,బి4,సి1,డి2

17. సివిల్ సర్వీసెస్ పితామహుడు అని ఎవరిని అంటారు?

1. లార్డ్ మెకాలే 2. కారన్ వాలీస్
3. వారన్ హేస్టింగ్స్ 4. విలియంబెంటింగ్

18. క్రింది వారిలో తొలి సుప్రీంకోర్టు న్యాయమూర్తి / న్యాయమూర్తులకు గుర్తించండి.

డాక్టర్ అలీ సార్, 9494228002
భారత రాజ్యాంగ నిపుణులు



ఎ. లెమియోస్టార్
బి. ఫిలిప్ ఫ్రాన్సిస్
సి. హైడ్ డి. బార్‌వెల్
1. బి మాత్రమే 2. ఎ మరియు డి
3. ఎ మరియు సి 4. ఎ,బి,సి,డి

19. క్రింది ఏ చట్టాన్ని మార్క్స్ ఏంగిల్స్‌లు భారత దేశంలో కొల్లగొట్టిన ధనాన్ని పంచుకోవడానికి చేయబడింది అని అభివర్ణించారు?

1. 1793 చార్టర్ చట్టం 2. 1833 చార్టర్ చట్టం
3. 1853 చార్టర్ చట్టం 4. 1784 పిట్స్ ఇండియా చట్టం

20. మహిళలకు ప్రపంచంలోనే తొలిసారి ఓటు హక్కు అందించిన దేశం?

1. భారత్ 2. కువైట్
3. న్యూజిలాండ్ 4. సౌది అరేబియా

21. క్రింది వాటిలో సరైన అంశం / అంశాలు గుర్తించండి.

ఎ. 1833 చార్టర్ చట్టం ప్రకారం గవర్నర్ జనరల్ సాధారణ అధికారాలు శాసన నిర్మాణ విధులు, కార్య నిర్వాహక విధులుగా విభజన.
బి. భారతదేశంలో సివిల్ సర్వీస్ పితామహుడిగా సర్దార్ వల్లభాయ్ పటేల్ ను గాంధీ సంబోధించారు.
1. బి మాత్రమే 2. ఎ,బి
3. ఎ మాత్రమే 4. పై ఏది కాదు.

22. ఏ చట్టం ప్రకారం భారతదేశంలో తొలిసారిగా సివిల్ సర్వీస్‌లలో భారతీయులకు పోటీ పరీక్షల విధానాన్ని ప్రవేశపెట్టారు?

1. 1833 చార్టర్ చట్టం
2. 1947 చార్టర్ చట్టం
3. 1853 చార్టర్ చట్టం
4. 1935 భారత ప్రభుత్వ చట్టం

23. భారత ప్రభుత్వ చట్టం 1935 భూస్వామ్య వ్యవస్థను పటిష్టం చేయడానికి బ్రిటిష్ పాలకులు ఆడిన నాటకం అని విమర్శించిన వారు?

1. గాంధీ 2. జిన్నా
3. సుభాష్ చంద్రబోస్ 4. అంబేద్కర్

24. అట్లీ ప్రకటన.

1.15 జులై 1947 2. 4 జులై 1947
3. 3 జనవరి 1947 4. 20 ఫిబ్రవరి 1947

25. ఏ చట్టం మహిళలకు ఓటు హక్కు కల్పించింది.

1. 1935 భారత ప్రభుత్వ చట్టం
2. 1947 భారత ప్రభుత్వ చట్టం
3. 1919 భారత ప్రభుత్వ చట్టం
4. ఏది కాదు.

సమాధానాలు

1.2	2.3	3.3	4.3	5.1
6.3	7.3	8.1	9.2	10.1
11.3	12.4	13.4	14.3	15.1
16.4	17.2	18.3	19.4	20.3
21.1	22.3	23.3	24.4	25.3


- కె. నాగార్జున
కరెంట్ ఎఫైర్స్ సీనియర్ ఫ్యాకల్టీ
9490352545



కరెంట్ అఫైర్స్

అడోబ్ తో అవగాహన ఒప్పందం : అడోబ్ ఎక్స్‌ప్రెస్ అప్లికేషన్ ను ఉపయోగించి తరగతి గదులలో సృజనాత్మక వ్యక్తీకరణను అభివృద్ధి చేయడంలో పిల్లలకు సహాయ పడడానికి కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ దర్మేంద్ర ప్రదాన్. గ్లోబల్ సాఫ్ట్‌వేర్ మేజర్ అడోబ్‌తో ఎమ్.ఒ.యు పై సంతకం చేశారు. అడోబ్ ఎక్స్‌ప్రెస్ ప్రీమియం అధ్యాపకులు వృత్తి పరమైన అభివృద్ధికి డిజిటలైజేషన్, కొత్త ఆలోచనలు, కొత్త ఆవిష్కరణల సమయంలో విద్యార్థులు భాగస్వామ్యం కావడం మొదలైన అంశాలకు ఉపయోగకారిగా వుంటుంది.


కొత్త రకం ఆక్సిజన్‌ను గుర్తించిన జపాన్ : అంతర్జాతీయ శాస్త్రవేత్తల బృందం ప్రకృతిలో కొత్త రకం ఆక్సిజన్‌ను గుర్తించింది. జపాన్‌లోని టోక్యో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన యుషుకే కొండో అనే అణు భౌతిక శాస్త్రవేత్త ఆధ్వర్యంలో భౌతిక శాస్త్రవేత్తల బృందం 'ఆక్సిజన్ 28' అనే కొత్త రకం ప్రాణవాయువును గుర్తించింది. ఈ ఆక్సిజన్ 28 ఐసోటోప్ 20 న్యూట్రాన్లు, 8 ప్రోటాన్లను కలిగి వుంటుందని సమాచారం. ప్రకృతిలో ఇది అసాధారణమైన ఆక్సిజన్ అని శాస్త్రవేత్తలు అభివర్ణించారు.





భారత్‌కు త్వరలో శివాజీ ఆయుధం : ఛత్రపతి శివాజీ మహరాజ్ వినియోగించిన ఆయుధం బాఘ్ నఖ్ (పులిగోరు) వందల ఏళ్ల తరువాత తిరిగి భారత్‌కు చేరుకోనుంది. శివాజీ 1659 లో బీజాపూర్ సుల్తానేట్ కమాండర్ అఫ్జల్ ఖాన్‌ను అంతమొందించడానికి ఈ ఆయుధాన్ని వినియోగించారు. తరువాత కాలంలో బ్రిటీష్ అధికారి దానిని బహుమతిగా బ్రిటన్‌కు తీసుకెళ్లారు. ఇప్పుడు ఆ ఆయుధాన్ని తిరిగి ఇచ్చేందుకు బ్రిటన్ అంగీకరించింది. మహరాష్ట్ర సాంస్కృతిక వ్యవహారాల శాఖామంత్రి ముంగటివార్ మీడియాలో మాట్లాడుతూ ఛత్రపతి శివాజీకి చెందిన 'వాఘ్‌నఖ్' ను తిరిగి ఇవ్వడానికి బ్రిటీష్ అధికారులు అంగీకరించారని తెలిపారు.

దాడి నుంచి విద్యను రక్షించే అంతర్జాతీయ దినోత్సవం 2023 : దాడి నుంచి విద్యను రక్షించే అంతర్జాతీయ దినోత్సవాన్ని ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లి ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 9 న నిర్వహిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా పాఠశాలలు విద్యాసంస్థలపై పెరుగుతున్న దాడులకు ప్రతిస్పందనగా దీనిని ఏర్పాటు చేశారు. ఈ సంవత్సరం థీమ్... 'విద్యను పరిరక్షించాలి, బాధితులకు న్యాయం చేయాలి'.



అజయ్ టు యోగి ఆదిత్యనాద్ - శంతను గుప్తా : ఇటీవల విడుదలైన గ్రాఫిక్ నవల 'అజయ్ టు యోగి ఆదిత్యనాథ్' 67 అత్యధిక పుస్తకావిష్కరణలను సాధించి ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్‌లో స్థానం సంపాదించి చరిత్ర సృష్టించింది. ప్రఖ్యాత రచయిత శంతను గుప్తా రచించిన ఈ అద్భుత నవల ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ జీవితాన్ని లోతుగా పరిశోధిస్తుంది. సాధారణ ప్రారంభ జీవితం నుంచి రాజకీయ నాయకత్వ శిఖరాగ్రానికి ఆయన ప్రయాణాన్ని ఈ నవల వివరిస్తుంది.

ఉమెన్స్ ఫ్యాషన్ బ్రాండ్ డబ్యు బ్రాండ్ అంబాసిడర్ - అనుష్క శర్మ : ఉమెన్స్ ఫ్యాషన్ బ్రాండ్ డబ్యు తన బ్రాండ్ అంబాసిడర్‌గా అనుష్క శర్మను నియమించింది. ఈ భాగస్వామ్యంతో ఆధునిక స్ఫూర్తితో పండుగ ప్రచారాన్ని ప్రారంభించడానికి బ్రాండ్ డబ్యు సిద్ధమవుతుంది. ప్రతిపండుగలకు, వేడుకలకు మహిళలే కేంద్ర బిందువులుగా వుంటారని తన ప్రచారంలో తెలుపుతుంది.





ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీకి పెన్షన్, ఒ.బి.సి స్టేటస్ : సామాజిక సమ్మిళితను పెంపొందించడానికి జార్ఖండ్ ప్రభుత్వం తన సార్వత్రిక పెన్షన్ పథకంలో ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీని చేర్చి ఒక ప్రగతిశీల చర్య తీసుకుంది. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ విషయం ప్రకటించడం జరిగింది. ట్రాన్స్‌జెండర్స్ కోసం ముఖ్యమంత్రి రాజ్య సమాజిక్ సురక్ష పెన్షన్ యోజన ప్రతిపాదనకు మంత్రి వర్గం ఆమోదం తెల్పింది. అర్హులైన లబ్దిదారులకు నెలకు వెయ్యి రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తారు.

మొరాకోలో భారీ భూకంపం : ఆఫ్రికన్ దేశం మొరాకోలో శుక్రవరాం రాత్రి భారీ భూకంపం సంభవించింది. కనీసం 820 మంది మృతి చెంది వుంటారని అధికారులు భావిస్తున్నారు. శుక్రవారం రాత్రి 11.11 సమయంలో మొరాకో మర్రకేచ్ నగరం కేంద్రంగా రిక్టర్ స్కేలు పై 6.8 తీవ్రతతో భూకంపం సంభవించింది. 300 మంది వరకు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. భారీ సంఖ్యలో భవనాలు కూలిపోవడంతో మృతుల సంఖ్యపై నిర్ధారణకు రాలేమని ప్రభుత్వం చెబుతుంది. 1960 లో మొరాకోలో వచ్చిన భూకంపం (5.8 తీవ్రత) లో వేలమంది చనిపోయారు.



బ్రెజిల్‌లో ఘోరం

- విమాన ప్రమాదంలో 14మంది మృతి



బ్రెజిల్ : బ్రెజిల్‌లో ఘోర విమాన ప్రమాదం జరిగింది. ఉత్తర అమెజాన్‌లోని బార్సిలోస్ ప్రావిన్స్‌లో శనివారం విమానం కూలి 14 మంది ప్రాణాలు కోల్పోయారు. పర్యాటక కేంద్రమైన బార్సెలోస్ ఉత్తర పట్టణంలోని బ్రెజిలియన్ అమెజాన్ రెయిన్ ఫారెస్ట్‌లో చిన్న విమానం కూలిపోవడంతో 14 మంది మరణించినట్లు అమెజోనాస్ రాష్ట్ర గవర్నర్ విల్సన్ లిమా ట్విట్టర్ (ఎక్స్) వేదికగా వెల్లడించారు. మతుల్లో 12 మంది ప్రయాణికులు, ఇద్దరు సిబ్బంది ఉన్నారు. మరణించిన వారిలో అమెరికా పౌరులు ఉన్నారని స్థానిక మీడియా సంస్థలు తెలిపాయి. భారీ వర్షం కురవడంతో విమానం ల్యాండ్ అయ్యేందుకు ప్రయత్నించిందని, ఆ సమయంలోనే కూలిపోయిందని పేర్కొంది. స్పోర్ట్ ఫిషింగ్ కోసం రాష్ట్ర రాజధాని మనౌస్ నుంచి బార్సిలోస్‌కు విమానంలో వెళుతుండగా ఈ ప్రమాదం జరిగిందని బ్రెజిలియన్ రాష్ట్ర భద్రతా కార్యదర్శి వినిసియస్ అల్మేడా తెలిపారు.

ఆకతాయిలపై పోలీసుల కాల్పులు

- చున్నీ లాగి విద్యార్థిని మరణానికి కారణమైన నిందితులు

లక్నో : విద్యార్థిని వేధించి, చున్నీ లాగి ఆమె మరణానికి కారణమైన ఆకతాయిలు పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు ఆదివారం కాల్పులు జరిపారు. దీంతో, నిందితుల కాళ్లకు బుల్లెట్ గాయాలయ్యాయి. ఉత్తరప్రదేశ్‌లోని అంబేద్కర్ నగర్‌లో ఈ సంఘటన జరిగింది. వారాహి గ్రామానికి చెందిన 17 ఏళ్ల యువతి యువి హీరాపూర్ బజార్‌లోని ఒక కాలేజీలో ఇంటర్ చదువుతోంది. శుక్రవారం కాలేజీ ముగిసిన తర్వాత సైకిల్‌పై ఇంటికి వెళ్తోంది. కొందరు ఆకతాయిలు రెండు బైకులపై ఆమెను వెంబడించి వేధించారు. ఒక బైక్ వెనుక కూర్చొన యువకుడు యువతి చున్నీ లాగాడు. దీంతో ఆమె సైకిల్ అదుపుతప్పింది. వెనుక వస్తున్న మరో బైక్‌తోపాటు ఎదురుగా వచ్చిన బైక్ ఆమె సైకిల్‌ను ఢీకొట్టాయి. దీంతో, రోడ్డుపై పడిన ఆ విద్యార్థిని తీవ్రంగా గాయపడింది. ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆ యువతి చనిపోయినట్లు డాక్టర్లు తెలిపారు. మరణించిన విద్యార్థిని తండ్రి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ముగ్గురు నిందితులను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వారిని ఆదివారం వైద్య పరీక్షల నిమిత్తం తీసుకెళ్తుండగా పోలీసుల రైఫిల్ లాక్కుని పారిపోయేందుకు ప్రయత్నించారు. పోలీసులు కాల్పులు జరపడంతో షాబాజ్, అతని సోదరుడు అర్బాజ్, మరో నిందితుడు మహ్మద్ ఫైసల్ కాలికి గాయాలయ్యాయి. 20 ఏళ్ల వయసున్న ముగ్గురు నిందితులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విద్యార్థిని మృతికి సంబంధించిన వీడియో క్లిప్‌తోపాటు పోలీస్ కాల్పుల్లో గాయపడిన నిందితుల వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

మణిపూర్ మహిళా కార్యకర్తలపై అమిత్‌షా వ్యాఖ్యలు తగవు

- ఖండించిన ఒక్రమ్ ఇబోబి



ఇంఫాల్ : మణిపూర్ మహిళా కార్యకర్తలపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలపై ఆదివారం కాంగ్రెస్ నేత ఒక్రమ్ ఇబోబి ఖండించారు. మాదకద్రవ్యాలు, ఇతర సామాజిక దురాచారలపై పోరాడటం, నిషేధాన్ని అమలు చేయడంలో మహిళల పాత్ర గురించి హోం మంత్రి అమిత్‌షా, ఇతర బీజేపీ నేతలకు తెలియదని ఈ వ్యాఖ్యల ద్వారా స్పష్టమైందని అన్నారు. ప్రస్తుత అంశాతి సమయంలోనూ శాంతి భద్రతలను పరిరక్షించడంలో మహిళలు ముందంజలో ఉన్నారని అన్నారు. మహిళల సహాయం లేకుండా మత ఘర్షణలను పరిష్కరించలేమని స్పష్టం చేశారు. మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలంటూ పలువురు మహిళా కార్యకర్తలు ఢిల్లీలో నెలల తరబడి ఆందోళనలు చేపట్టిన సంగతి తెలిసిందే. ప్రధాని మోడీతో పాటు కేంద్ర మంత్రులను కలిసేందుకు యత్నించారు.మణిపూర్‌లో మహిళా కార్యకర్తలను అదుపులో పెడితే.. రాష్ట్రంలో నెలకొన్న అశాంతిని పది రోజుల్లో పరిష్కరించగలమని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా బీజేపీ నేతలతో పేర్కొన్నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. మహిళా కార్యకర్తలు భద్రతా బలగాల విధులకు ఆటంకం కలిగిస్తున్నారని షా పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై ప్రజలతో పాటు పలువురు నేతల నుండి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమైంది. అవినీతి, ఇతర అన్యాయాలకు వ్యతిరేకంగా మణిపూర్ మహిళా కార్యకర్తల పోరాటం నుంచి బీజేపీ నేతలు విలువైన పాఠాలు నేర్చుకోలేదని పలువురు నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

మహిళల పోరాటాలు

నిర్బంధపు పనిని వ్యతిరేకిస్తూ.. 1904 మార్చి 15 మహిళలు గొప్ప పోరాటాన్ని చేశారు. నిరసనకారులు బ్రిటీష్ అధికారుల బంగ్లాలను తగుల బెట్టారు. దీంతో నేరస్తుల గురించి సమాచారం ఇచ్చిన వారికిరూ. 500 బహుమతి ఇస్తామని బ్రిటీష్ వారు ప్రకటించినప్పటికీ.. ఎవరూ ముందుకు రాలేదు. చివరికి నిర్బంధ పనిని తొలగించారు.

అధిక పన్నులను వ్యతిరేకిస్తూ 1934 లో రెండో పోరాటం చేపట్టారు. రాజుతో కుమ్మక్కై బ్రిటీష్ అధికారులు పలు అక్రమ పన్నులు వసూలు చేస్తూ ప్రజలను దోచుకోవడాన్ని మహిళలు వ్యతిరేకించారు. ఒక గిరిజనుడు మూడు రూపాయలు ఇంటి పన్ను చెల్లించాల్సి వుండగా, లోయలో ఉండే వారు రెండు రూపాయలు చెల్లించాల్సి వుండేది. అలాగే బియ్యం ఉచితంగా ఎగుమతి చేయడం వల్ల కృత్రిమ కొరతను సష్టించడంతో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. క్వింటా బియ్యాని ఒక్క రూపాయి లేదా 12 అణాలకు విక్రయించాలని మహిళలు వ్యాపారులను డిమాండ్ చేశారు. కొన్ని నెలల పాటు ఈ ఆందోళన కొనసాగింది. దీంతో ఇంఫాల్ నగరంలోని ఖ్వైరాంబంద్ మార్కెట్‌ను మూసివేయాల్సి వచ్చింది. ఇప్పటికీ పలు అన్యాయాలకు, క్రూరమైన చర్యలకు వ్యతిరేకంగా ఈ మార్కెట్‌లోనే మహిళలు ఆందోళనలు చేపడుతుంటారు.

కేసులపై కేంద్ర శాఖల గోప్యత

- ఐదేండ్లుగా వీడని మొద్దు నిద్ర

న్యూఢిల్లీ : కేంద్రానికి చెందిన పలు మంత్రిత్వ శాఖలు తమపై దేశంలోని వివిధ న్యాయస్థానాలు, ట్రిబ్యునల్స్‌లో దాఖలైన కేసుల వివరాలను సంబంధిత పోర్టల్‌లో ఎప్పటికప్పుడు పొందుపరచడం లేదు. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన చట్టపరమైన అంశాలలో పురోగతిని వివరించేందుకు కేంద్ర ప్రభుత్వం లీగల్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ అండ్ బ్రీఫింగ్ సిస్టమ్ (ఎల్ఐఎంబీఎస్) పేరుతో ఓ పోర్టల్‌ను ఏర్పాటు చేసింది. ఈ పోర్టల్‌లో గత ఐదు సంవత్సరాలుగా కొన్ని మంత్రిత్వ శాఖలు తమపై న్యాయస్థానాలలో ఉన్న కేసుల పరిస్థితిని తాజా పరచడం లేదని న్యాయ శాఖ తెలిపింది. పోర్టల్‌లో ఉన్న సమాచారాన్నే నిటి ఆయోగ్, క్యాబినెట్ సచివాలయం ఉపయోగించుకుంటాయి. నలభై ఎనిమిది మంత్రిత్వ శాఖలు, ఇతర శాఖలకు సంబంధించిన 76 వేలకు పైగా కేసుల వివరాలను 2018 నుంచి పోర్టల్‌లో తాజా పరచడం లేదు.

వీటిలో రైల్వే శాఖదే ప్రథమ స్థానం. ఈ శాఖ 31,502 కేసుల వివరాలను తాజా పరచలేదు. ఆర్థిక, కార్మిక, ఉపాధి శాఖ 12,436 కేసులు, విద్యా శాఖ 3,706, హోం వ్యవహారాలు 3,000 కేసుల వివరాలను తాజా పరచలేదు. మొత్తం పెండింగులో ఉన్న కేసుల వివరాలలో ఈ మూడు మంత్రిత్వ శాఖలవే 80% ఉన్నాయి. వివిధ మంత్రిత్వ శాఖలు, వాటి అనుబంధ శాఖలకు సంబంధించి ప్రస్తుతం న్యాయస్థానాలలో 5.72 లక్షల వ్యాజ్యాలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేసుల తాజా పరిస్థితిని ఎప్పటికప్పుడు పోర్టల్‌లో ఉంచేలా సంబంధిత వ్యక్తులను ఆదేశించాలని కోరుతూ కేంద్ర న్యాయ శాఖ ఇటీవలే వివిధ మంత్రిత్వ శాఖలకు సమాచారం పంపింది.

ఎన్నికల కమిషనర్ స్థాయిని తగ్గిస్తారా ?

- సీనియర్ అధికారి హోదాకే పరిమితమా?
- మాజీ సీఈసీల ఆవేదన
- ప్రధానికి లేఖ రాయాలని నిర్ణయం



న్యూఢిల్లీ : ఎన్నికల కమిషనర్ల హోదాను సుప్రీంకోర్టు న్యాయమూర్తి స్థాయి నుండి ఓ సీనియర్ అధికారి స్థాయికి తగ్గిస్తూ ప్రభుత్వం తీసుకొస్తున్న బిల్లుపై మాజీ ఎన్నికల ప్రధానాధికారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన విధివిధానాలలో మార్పులు చేస్తూ రాబోయే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలలో బిల్లును ప్రతిపాదించాలని మోడీ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను, ఇతర కమిషనర్లను నియమించే విషయంలో ప్రభుత్వానికి విశేషాధికారాలు కట్టబెట్టడాన్ని గతంలో సుప్రీంకోర్టు తప్పుపట్టిన విషయం తెలిసిందే. అయితే దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పును నీరుకార్చేలా, కాలరాసేలా ప్రభుత్వం ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెడుతోంది. దీని ప్రకారం ముగ్గురు ఎన్నికల కమిషనర్ల సర్వీసు నిబంధనలను సుప్రీంకోర్టు న్యాయమూర్తి స్థాయి నుండి క్యాబినెట్ కార్యదర్శి స్థాయికి కుదించారు. ఇకపై వారికి క్యాబినెట్ కార్యదర్శి జీతభత్యాలే లభిస్తాయి.

కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై ఆవేదన వ్యక్తం చేసిన మాజీ ఎన్నికల ప్రధానాధికారులు ఈ విషయంలో ప్రధాని మోడీకి లేఖ రాయాలని నిర్ణయించారు. నూతన బిల్లు ఎన్నికల కమిషన్ స్థాయిని, దానిలోని అధికారుల స్థాయిని దిగజార్చిందని మాజీ సీఈసీ ఎస్‌వై ఖురేషీ తెలిపారు. ఎన్నికల కమిషనర్లకు ఓ సీనియర్ అధికారితో సమానంగా జీతభత్యాలు ఇస్తే ఆయన హోదా సహాయ మంత్రి స్థాయి కంటే తగ్గిపోతుందని చెప్పారు. దీనివల్ల వారు రాజకీయ నాయకులపై చర్య తీసుకోవడానికి వెనుకంజ వేస్తారని అన్నారు. అనేక దేశాలలో ఎన్నికల కమిషనర్లే న్యాయమూర్తులని గుర్తు చేశారు.

ఎన్నికల కమిషనర్ల హోదా విషయంలో ఎలాంటి మార్పులు చేయవద్దని, దానిని ప్రస్తుతం ఉన్న విధంగానే కొనసాగించాలని సలహా ఇస్తూ ప్రధానికి లేఖ రాయాలని మాజీ సీఈసీలు నిర్ణయించారు. అయితే వీరి అభిప్రాయాలతో ప్రభుత్వం ఏకీభవించడం లేదు. ప్రోటోకాల్ జాబితాను సవరించాలని భావించడం లేదని, సీఈసీకి ప్రస్తుతమున్న హోదా, ప్రతిపత్తి కొనసాగుతాయని వివరించింది. వర్షాకాల సమావేశాల సందర్భంగా ప్రభుత్వం రాజ్యసభలో ఈ బిల్లును ప్రతిపాదించింది. దీని ప్రకారం... ప్రధాన ఎన్నికల అధికారి, ఇతర ఎన్నికల అధికారుల నియామక ప్రక్రియ నుండి భారత ప్రధాన న్యాయమూర్తిని తప్పించారు. నియామక కమిటీలో ప్రధాని, కేంద్ర మంత్రి, ప్రతిపక్ష నేత మాత్రమే సభ్యులుగా ఉంటారు. ఎన్నికల అధికారుల జీతాలు, ఇతర అలవెన్సులలో కూడా మార్పులు ప్రతిపాదించారు. ఈ బిల్లుపై ప్రతిపక్ష పార్టీలు మండిపడ్డాయి. ఇది రాజ్యాంగం, న్యాయ వ్యవస్థ, ప్రజల హక్కుల పైన జరిగిన దాడిగా అభివర్ణించాయి.

మహిళా హెడ్‌కానిస్టేబుల్‌పై దారుణ దాడి

- యూపీలో రైలులో ఘాతుకం
- రెండు వారాలైనా దొరకని నిందితుల ఆచూకీ

లక్నో : బీజేపీ ప్రభుత్వ పాలనలోని ఉత్తరప్రదేశ్‌లో మహిళల భద్రత అత్యంత ప్రశ్నార్థకంగా మారింది. ఒక మహిళా హెడ్ కానిస్టేబుల్‌పై రైలులో దారుణంగా దాడికి పాల్పడిన ఘటన జరిగి రెండు వారాలైనా నిందితులను గుర్తించకోలేకపోవడంతో రాష్ట్రంలో, రైల్వేల్లో మహిళల భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. యూపీ పోలీసులు, రైల్వే పోలీసులు, యూపీ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఈ కేసును దర్యాప్తు చేస్తున్నా ఎలాంటి పురోగతి లేదు. ఈ దాడి నుంచి బాధితురాలు ప్రాణాలతో బయటపడినా జ్ఞాపక శక్తి కోల్పోయి, ఎవరినీ గుర్తుపట్టలేని స్థితిలో ఉందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తాన్‌పూర్ జిల్లాలోని ఒక పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న 47 ఏండ్ల రోష్ని (గోప్యత కోసం పేరు మార్చారు) అయోధ్యలోని హనుమాన్ గాడి సావన్ మేళాలో డ్యూటీ వేయడంతో ఆగస్టు 30న సరయూ ఎక్స్‌ప్రెస్‌లో అక్కడకి బయలుదేరారు. ఆమె అయోధ్య రైల్వే స్టేషన్‌లో దిగకుండా.. సరయూ ఎక్స్‌ప్రెస్ చివరి స్టాప్ మాన్కాపూర్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడ నుంచి మళ్లీ అయోధ్య వైపు బయలుదేరారు. ఈ క్రమంలోనే అంటే మాన్కాపూర్ - అయోధ్య స్టేషన్ల మధ్య ఆమెపై గుర్తుతెలియని వ్యక్తులు పదునైన ఆయుధంతో దారుణంగా దాడి చేశారు. ముఖం, ఇతర శరీర భాగాలపై దాడి చేయడంతో ఆమె తీవ్రంగా గాయపడి రక్తం ఓడుతూ కోచ్‌లోని బెర్త్ కింద అపస్మారక స్థితిలో పడిపోయారు. ఆగస్టు 30, 31 తేదీల మధ్య రాత్రి ఈ దారుణం జరిగింది. ఆమె సోదరుడి ఫిర్యాదుతో అయోధ్యలోని గవర్నమెంట్ రైల్వే పోలీస్ స్టేషన్, కంటోన్మెంట్ పోలీస్ స్టేషన్లలో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. హత్యాయత్నం, దాడి చేయడం, ఆమె దుస్తులు ధరించాలనే ఉద్దేశం వంటి అభియోగాల కింద గుర్తు తెలియని వ్యక్తులపై ఈ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

సుమోటోగా స్వీకరించిన లక్నో హైకోర్టు

లక్నో హైకోర్టు ఈ కేసును ఈ నెల 3న సుమోటోగా స్వీకరించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేయాలని కోర్టు తన రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ కేసును విచారించడానికి ప్రధాన న్యాయమూర్తి దివాకర్ ప్రత్యేక బెంచ్‌ను ఏర్పాటు చేశారు. దీంతో ఈ నెల 4న రాష్ట్ర డీజీపీ విజయ్‌కుమార్, ప్రత్యేక డీజీ (శాంతి భద్రతలు) ప్రశాంత్ కుమార్ ఈ కేసును త్వరలోనే ఛేదిస్తామని, అసలు నిందితులను పట్టుకుంటామని ప్రకటించారు. లక్నోలోని కింగ్ జార్జ్ మెడికల్ యూనివర్శిటీలోని ట్రామా సెంటర్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలిని పరామర్శించారు. అప్పటి నుంచి విచారణ ముందుకు సాగలేదు. అనుమానితుల్ని పట్టుకుంటున్నా.. ఎవరనీ నిందితులుగా ప్రకటించలేదు. ఈ నెల 16న అంటే శనివారం నిందితుల ఆచూకీ, లేదా సమాచారం చెబితే లక్ష రూపాయల నగదు బహుమతి ఇస్తామని యూపీ పోలీసులు ప్రకటించారు.

తలకు గాయమైన కారణంగా బాధితురాలు దాడి వివరాలను స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. ఇప్పటి వరకూ బాధితురాలి స్టేట్‌మెంట్‌ను ఇంకా నమోదు చేయలేదు. బాధితురాలి స్వస్థలం ప్రయాగ్‌రాజ్ జిల్లా. ఆమెకు ఎవరితోనూ శత్రుత్వం లేదని, తెలిసినవారు ఎవరైనా ఆమె దినచర్యను ట్రాక్‌చేసి ఈ దాడికి పాల్పడి ఉంటారని బాధితురాలి సోదరుడు తెలిపారు. స్పృహలోకి వచ్చిన దగ్గర నుంచి తమ ముఖాలను గుర్తు పడుతున్నా, తమ పేర్లను కూడా చెప్పలేకపోతుందని సోదరుడు ఆవేదన వ్యక్తం చేశారు.

చక్కెర వివాదం పరిష్కార మయ్యేనా?

- భారత్-బ్రెజిల్ చర్చలు ప్రారంభం



జెనీవా : పంచదారకు సంబంధించిన వాణిజ్య వివాదాన్ని పరిష్కరించుకోవడం కోసం భారత్-బ్రెజిల్ పరస్పర చర్చలను ప్రారంభించాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటిఒ)లో ఈ చర్చలు ప్రారంభమయ్యాయని, ఇథనాల్ ఉత్పత్తి సాంకేతితను బ్రెజిల్ భారత్‌తో పంచుకునే అవకాశం ఉందని సంబంధిత అధికారి ఒకరు తెలిపారు. పంచదార, ఇథనాల్ ఉత్పత్తిలో ప్రపంచంలోనే బ్రెజిల్ అగ్రస్థానంలో ఉంది. అలాగే ఇథనాల్ ఉత్పత్తికి సంబంధించిన సాంకేతికత విషయంలోనూ బ్రెజిల్ ముందు ఉంది. ఇప్పటికే కొన్ని రౌండ్ల చర్చలు జరిగాయని, ఇథనాల్ సాంకేతికతను భారత్‌తో పంచుకోవడానికి బ్రెజిల్ సిద్ధంగానే ఉందని అధికారి చెప్పారు. వాహనాలకు ఉపయోగించే పెట్రోల్‌లో ఇథనాల్ కలపడం ద్వారా చమురు దిగుమతులను తగ్గించుకోవాలని భారత్ భావిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే లీటర్ పెట్రోల్‌లో 20 శాతం వరకూ ఇథనాల్ కలపడానికి కొన్ని వాహనాలకు కేంద్రం అనుమతి ఇచ్చింది. 2025 నాటికి అన్ని వాహనాలకు 20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్‌ను ఉపయోగించాలని లక్ష్యాన్ని నిర్దేశించింది. కాగా, ఇథనాల్ సాంకేతికతను బ్రెజిల్ అందిస్తే, అందుకు ప్రతిగా భారత్ ఏదైనా ఆఫర్ ఇవ్వాల్సి ఉంటుంది. ఇతర దేశాలతో ఉన్న పంచదారకు సంబంధించిన వివాదాలను పరిష్కరించుకోవడానికి బ్రెజిల్ తరహా విధానాన్ని అనుసరించాలని భారత్ భావిస్తున్నట్లు సమాచారం. భారత్‌లో చెరుకు రైతులకు ఇస్తున్న సబ్సిడీలు ప్రపంచ వాణిజ్య నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్నాయని బ్రెజిల్, ఆస్ట్రేలియా, గ్వాటెమాల వంటి దేశాలు ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. భారత్ ఇస్తున్న మద్దతు చర్యలు ప్రపంచ వాణిజ్య నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని 2021 డిసెంబరు 14న డబ్ల్యూటిఒ వివాద పరిష్కార ప్యానెల్ కూడా తీర్పు ఇచ్చింది. ఈ తీర్పుపై గత ఏడాది జనవరిలో డబ్ల్యూటిఒ అప్పీలేట్ బాడీ వద్ద భారత్ అప్పీల్‌కు వెళ్లింది. అయితే ఈ అప్పీలేట్ బాడీలో సభ్యుల నియామకంలో వివాదం ఏర్పడ్డంతో ఈ తీర్పు పెండింగ్‌లో ఉండిపోయింది. డబ్ల్యూటిఒలో సభ్య దేశాల మధ్య ఏర్పడిన వివాదాలను పరస్పర చర్చల ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉంది. తరువాత ఈ విషయాన్ని సంస్థకు తెలియజేయవచ్చు.

కొత్త కేసులు లేవు : నిఫాపై కేరళ ఆరోగ్య మంత్రి వీణా జార్జ్



కోజికోడ్ : కేరళలో శనివారం కొత్త నిఫా పాజిటివ్ కేసులేవీ నమోదు కాలేదని ఆ రాష్ట్ర ఆరోగ్యమంత్రి వీణా జార్జ్ తెలిపారు. పరిస్థితి అదుపులోనే ఉందని, వ్యాధి ఇంకా రెండో దశకు రాలేదని మంత్రి తెలిపారు. అధికారులతో సమీక్షా సమావేశం అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం మరో ఐదుగురిని ఐసోలేషన్‌లో ఉంచినట్లు మంత్రి తెలిపారు. వీరి నమూనాల పరీక్ష ఫలితాలు వెల్లడికానున్నాయి. చికిత్స పొందుతున్న వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వెంటిలేటర్‌పై ఉన్న తొమ్మిదేండ్ల చిన్నారి ఆరోగ్య పరిస్థితి కూడా స్వల్పంగా మెరుగుపడిందని మంత్రి తెలిపారు. ప్రయివేటు ఆస్పత్రుల్లో నిఫా చికిత్సకు అయ్యే ఖర్చును ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయిస్తామని మంత్రి చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటి వరకూ 5 నిఫా కేసులు వెలుగు చూశాయి. 1192 మందిని కాంటాక్ట్ లిస్ట్‌లో చేర్చారు. శనివారం కొత్తగా మరో 97 మందిని చేర్చారు. ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తితో తాను మాట్లాడానని, ఆయన ఆరోగ్యంపై ఎలాంటి ఆందోళన లేదని మంత్రి తెలిపారు. నిఫా వైరస్ గురించి సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు మంత్రి చెప్పారు. అనంతరం మంత్రి మహ్మద్ రియాజ్ మాట్లాడుతూ నిఫా వార్తలకు సంబంధించి ఏవైనా సందేహాలుంటే అధికారులను సంప్రదించి కచ్చితమైన సమాచారం మాత్రమే తెలియజేయాలని కోరారు.

కనీస వేతనాల అమలులో పాలకులు విఫలం

ఎఐఆర్‌టిఎఫ్ రాష్ట్ర వర్క్‌షాప్ ముగింపులో ఎం.ఎ.గఫూర్



కర్నూలు : ట్రాన్స్‌పోర్టు రంగంలో కనీస వేతనాలు అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఎ.గఫూర్ అన్నారు. కర్నూలులోని పాతబస్తీ శ్రీలక్ష్మి నరసింహస్వామీ కళ్యాణ మండపంలో ఆల్ ఇండియా రోడ్‌ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐఆర్‌టిఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల16, 17 తేదీల్లో రాష్ట్ర వర్క్‌షాప్ ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు రాష్ట్ర అధ్యక్షులు శివాజీ అధ్యక్షతన జరిగింది. రెండవ రోజు ఆదివారం వర్క్‌షాప్ ముగింపులో ఎం.ఎ.గఫూర్, ఎఐఆర్‌టిఎఫ్ కార్యదర్శి ముజఫర్ అహమ్మద్, కోశాధికారి శ్రీనివాసులు, కమిటీ ముఖ్య నాయకులు దుర్గారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా గఫూర్ మాట్లాడుతూ ట్రాన్స్‌పోర్ట్ రంగం అత్యంత ప్రాముఖ్యత కలిగిన రంగమని అన్నారు. అలాంటి రంగంలో కనీస వేతనాలు అమలు కావడంలేదని తెలిపారు. పని గంటలు సైతం పట్టించుకునే నాథుడే లేరన్నారు. ఆటో, ట్రాన్స్‌పోర్ట్ వర్కర్లకు, ప్రమాదంలో మృతి చెందిన కార్మికులకు ఆర్థిక సహకారం అందించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. రవాణా రంగాన్ని విస్మరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఉచిత ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, పెట్రోల్, డీజిల్‌ను జీఎస్‌టి పరిధిలోకి తేవాలని, ఈ చలానా విధానాన్ని రద్దు చేయాలని తదితర సమస్యలపై పోరాటాలు ఉధృతం చేయాలని కోరారు. ఈ వర్క్‌షాప్‌నకు ఆయా జిల్లాల నుంచి రవాణా రంగ ప్రతినిధులు హాజరయ్యారు.

జాహ్నవి మృతిపై సీటెల్‌లో ఆందోళన

- పోలీసులపై చర్య తీసుకోకపోతే ఆందోళన ఉధృతి

వాషింగ్టన్ : భారతీయ విద్యార్థి జాహ్నవి కందుల మృతిపై సియాటిల్ ప్రాంతంలోని సౌత్ ఏషియా కమ్యూనిటీ సభ్యులు ఆందోళన నిర్వహించారు. 'సీటెల్ పోలీస్ డిపార్ట్‌మెంట్ కంటే జాహ్నవికే ఎక్కువ విలువ, జాహ్నవికి న్యాయం చేయండి, కిల్లర్ పోలీసులను జైలుకు పంపండి' అంటూ ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. నగరంలో శనివారం ర్యాలీ నిర్వహించిన వందమందికిపైగా సభ్యులు డెన్నీ పార్క్ వద్ద ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ్ సంస్థ ప్రతినిధులు వందనా స్లాటర్, డి.బెల్లేవ్ మాట్లాడుతూ పోలీసు అధికారులు ఆడరర్, డేవ్‌లపై పోలీసులు చర్య తీసుకోకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సీటెల్ మేయర్ క్షమాపణ

సీటెల్ నగర మేయర్ బ్రూస్ హారెల్ క్షమాపణలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కందుల జాహ్నవి ఈ ఏడాది జనవరి 23న సీటెల్‌లో పోలీస్ పెట్రోలింగ్ వాహనం ఢీకొని మరణించిన సంగతి తెలిసిందే. ఆమె మరణంపై సీటెల్ పోలీస్ అధికారి డానియల్ ఆర్డర్ చులకనగా మాట్లాడిన ఘటన ఈ నెల 14న వెలుగులోకి వచ్చింది. ఈ వ్యాఖ్యలపై భారత్ ఆగ్రహం వ్యక్తం చేసింది. తాజాగా జాహ్నవి మరణంపై సీటెల్ నగర మేయర్ తన ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్ అధికారి డానియల్ ఆర్డర్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఆయన భారత సమాజానికి క్షమాపణ చెప్పారు. నగర అధికారులు భారత కమ్యూనిటీకి, జాహ్నవి మరణానికి తమ సంతాపాన్ని తెలియజేస్తున్నామని బ్రూస్ హారెల్ తెలిపారు. సీటెల్ పోలీస్ చీఫ్ ఆడ్రియన్ డియాజ్ కూడా జాహ్నవి మృతికి సంతాపం తెలిపారు. ఇండియన్ కమ్యూనిటీకి చెందిన 20 మంది ప్రముఖులతో సీటెల్ మేయర్, పోలీస్ చీఫ్ శనివారం సమావేశమయ్యారు. పౌరుగువారిని రక్షించే, గౌరవించే సీటెల్ నగరాన్ని రూపొందిస్తామని వారు హామీ ఇచ్చారు. జాహ్నవి కందుల మరణంపై త్వరితగతిన న్యాయవిచారణ జరిపిస్తామని అమెరికా ప్రభుత్వం భారతదేశానికి హామీ ఇచ్చింది.

ఇడి సమన్లపై సుప్రీంకు జార్ఖండ్ సిఎం

రాంచీ : ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) సమన్లపై జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ఆదివారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సోమవారం ఆయన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించనుంది. తనకు జారీ చేసిన సమన్లను ఉపసంహరించుకోవాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటానని గతంలో ఇడిని ముఖ్యమంత్రి హెచ్చరించిన సంగతి తెలసిందే. జార్ఖండ్‌లోని సాహెబ్‌గంజ్ జిల్లాలో అక్రమ మైనింగ్ కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై హేమంత్ సోరెన్ విచారణకు హాజరుకావాలని ఇడి గత నెలలో సమన్లు జారీ చేసింది. తాను ఎటువంటి తప్పు చేయలేదని, ఒక గిరిజన నేతను కేసు పేరుతో వేధించేందుకు కేంద్రం పెద్ద కుట్ర పన్నిందని సోరెన్ మండిపడ్డారు. గతేడాది నవంబర్‌లో విచారణకు హాజరుకావాలని ఇడి సమన్లు జారీ చేయగా, ముందుగా నిర్ణయించుకున్న షెడ్యూల్ ప్రకారం ఓ వేడుకలో పాల్గొనేందుకు ఆయన ఛత్తీస్‌గఢ్ వెళ్లారు. 2020లో తన తండ్రి శిబుసోరెన్‌పై లోక్‌పాల్ ఆదేశాలకు అనుగుణంగా చేపట్టిన విచారణలో తన స్థిర, ఆస్తుల వివరాలను సిబిఐకు అందజేశానని సోరెన్ గుర్తు చేశారు. ఇడి ఆయా వివరాలను సిబిఐ నుంచి పొందవచ్చునని పేర్కొన్నారు.


ప్రముఖ రచయిత్రి, నవీన్ పట్నాయక్ సోదరి గీతా మెహతా కన్నుమూత



న్యూఢిల్లీ: ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సోదరి, ప్రముఖ రచయిత్రి గీతా మెహతా శనివారం కన్నుమూశారు. వృద్ధాప్యం కారణంగా వచ్చిన ఆరోగ్య సమస్యలతో ఆమె ఢిల్లీలోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆమె వయస్సు 80 సంవత్సరాలు. ఆమెకు ఓ కుమారుడు ఉన్నారు. ఆమె భర్త, ప్రముఖ పబ్లిషర్ సోని మెహతా 2019లోనే మరణించారు.ప్రముఖ రచయిత్రి, లఘుచిత్ర నిర్మాత, జర్నలిస్టుగా గీతా మెహతా సుపరిచితురాలు. 1943లో బిజూ పట్నాయక్, జ్ఞాన్ పట్నాయక్ దంపతులకు ఆమె జన్మించారు. ఆమె తండ్రి దివంగత బిజూ పట్నాయక్ ఒడిశాకు ముఖ్యమంత్రిగా చేసిన విషయం తెలిసిందే. ఆమె ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు, ప్రేమ్ పట్నాయక్‌కు సొంత అక్క.ఆమె 'కర్మా కోలా', 'స్నేక్ అండ్ ల్యాడర్స్', 'ఏ రివర్ సూత్ర', 'రాజ్', 'ది ఎటర్నల్ గణేష' పుస్తకాలను రాశారు. ఆమె తన సోదరుడు నవీన్ పట్నాయక్ అంటే ఆమెకు అమితమైన ప్రేమ. ఇటీవల భువనేశ్వర్‌ను సందర్శించినప్పుడు మాట్లాడుతూ.."నవీన్ పట్నాయక్ వంటి సీఎం లభించడం ఒడిశా ప్రజల అదృష్టం" అని వ్యాఖ్యానించారు. గీతా మృతి పట్ల ప్రధాని మోడీ సంతాపం వ్యక్తం చేశారు. ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, గీతా కుటుంబం పట్ల సానుభూతి వ్యక్తం చేశారు

ఒడిశాను వణికిస్తున్న స్క్రబ్ టైఫస్..

- తాజాగా 11 కేసులు నమోదు



భువనేశ్వర్ : ఓ వైపు కేరళ రాష్ట్రంలో నిఫా కలవరపాటుకు గురి చేస్తోంది. మరో వైపు ఒడిశా రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. తాజాగా సుందర్‌గఢ్ జిల్లాలో 11 పాజిటివ్ కేసులు వెలుగుచూశాయి. దాంతో కేసుల సంఖ్య 180కి చేరిందని ఆరోగ్యశాఖ అధికారులు ప్రకటించారు. వ్యాధి లక్షణాలతో బాధపడుతున్న 59 మంది శాంపిళ్లను పరీక్షించగా అందులో 11 మందికి వ్యాధి నిర్ధారణ అయిందని వెల్లడించారు. మొత్తం 180 కేసుల్లో 10 మంది బాధితులు ఒడిశా రాష్ట్రేతరులు కాగా.. 9 మంది ఇతర జిల్లాల నుంచి ఉన్నారని సుందర్‌గఢ్ జిల్లా చీఫ్ మెడికల్ ఆఫీసర్ కన్హు చరణ్ నాయక్ తెలిపారు. ఈ జిల్లాలో శనివారం ఏడు కేసులు నమోదయ్యాయి.

ఎవరికైనా నాలుగు లేదా ఐదు రోజులు జ్వరం ఉంటే వారు వెంటనే పరీక్షలు చేయించుకోవాలని కన్హు చరణ్ నాయక్ కోరారు. రూర్కెలా ప్రభుత్వ ఆస్పత్రి, సుందర్‌గఢ్ జిల్లా ఆరోగ్య కేంద్రంలో ఉచితంగానే పరీక్షలు నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. వ్యాధి ప్రబలుతున్న నేపథ్యంలో తగినంత మంది ఆశా కార్యకర్తలు, నర్సులకు శిక్షణ ఇచ్చి వారిని సన్నద్ధం చేశారు. ఒడిశాలో ఇప్పటి వరకు స్క్రబ్ టైఫస్ వ్యాధి బారినపడి ఏడుగురు చనిపోయారు. దాంతో అప్రమత్తమైన వైద్యారోగ్యశాఖ వ్యాధిని అధ్యయనం చేయడానికి వీర్ సురేంద్ర సాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (వీఐఎంఎస్ఏఆర్) నుంచి ముగ్గురు నిపుణులను బర్గఢ్ జిల్లాకు పంపించింది. ప్రస్తుతం బర్గఢ్ జిల్లాలో 11 యాక్టివ్ కేసులున్నాయి. స్క్రబ్ టైఫస్ వ్యాధి తరచూ పొలాలు, అటవీ ప్రాంతాల్లో పనిచేసే ప్రజలకు సోకుతుంది. ఒక రకమైన లార్వా పురుగులు కుట్టడంతో శరీరంపై 'ఎస్చర్' అనే మచ్చ పడుతుంది. ఈ కీటకాలు కుట్టిన చోట చర్మకణాలు మృతి చెందుతాయి. వెంటనే చికిత్స చేయించుకోకపోతే ప్రాణాలకు అపాయం ఏర్పడుతుంది.

ముస్సోరిలోని హోటల్‌లో అగ్నిప్రమాదం



డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన ముస్సోరిలోని ఓ హోటల్‌లో ఆదివారం అగ్నిప్రమాదం జరిగింది. హోటల్ మరమ్మత్తు చేస్తుండగా షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు. హిల్‌స్టేషన్‌లోని హోటల్‌కి సంబంధించిన అగ్నిప్రమాద దృశ్యాలు సోషల్‌మీడియాలో వైరలయ్యాయి. ఈ ఘటనలో మరో రెండు వాహనాలు దగ్ధమైనట్టు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు. ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి వుంది.